సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 47

గురువారం 9-5-2024

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అవగాహనే ప్రథమ చికిత్స

సేవ

బెంగళూరులోని శాంతి నగర్‌లో ఉన్న 'అనాహత్' క్లినిక్‌కు వెళితే ఒక బోర్డు మీద ఐదారు రకాల భోజనం ప్లేట్ల ఫొటోలు ఉంటాయి. వాటిలో రొట్టె, కూర, అన్నం, ఇతర కూరలు ఉంటాయి. ప్రతి ప్లేట్ కింద స్టార్లు ఇచ్చి ఉంటారు. ఐదు స్టార్లు ఇచ్చిన భోజనం ప్లేట్‌ను ఆహారంగా తీసుకోవాలని బీపీ, షుగర్ ఉన్న పేషెంట్లకు సులభంగా అర్థమయ్యేలా చెప్తారు. మీ ప్లేట్‌లో ఏముంది అనేదే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని ఈ క్లినిక్‌లో వారానికి రెండుసార్లు జరిగే అవగాహన సదస్సుల్లో తెలియచేస్తారు. ఇలాంటి అవగాహన దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీల తీవ్రతను తగ్గిస్తాయని అంటారు ప్రియా దేశాయ్. ఆమె ఈ క్లినిక్ నిర్వాహకురాలు.

ఈ ఫొటోను చూడండి. ఇందులో ఉన్నది షుగర్ పేషెంట్లు. ఒకరితో ఒకరు షుగర్ వ్యాధి గురించి మాట్లాడుకుంటూ అవగాహన కల్పించుకుంటున్నారు. 'చికిత్స కంటే అవగాహన ముఖ్యం' అంటారు ప్రియా దేశాయ్. బెంగళూరులో ఆమె పేదవారి కోసం ఉచిత క్లినిక్‌లు నడుపుతున్నారు. డయాబెటిస్, బి.పి ఉన్న వారికి సదస్సులు నిర్వహిస్తూ ఉచిత మందులు అందేలా చూస్తున్నారు. ప్రతి ఉదయం ఈ క్లినిక్‌ల ముందు క్యూ కట్టే పేషెంట్లను చూస్తే ప్రియా సేవ తెలుస్తుంది.





ప్రియా దేశాయ్

10 వేల మందికి ఒక క్లినిక్

బెంగళూరు జనాభా కోటీ ముప్పై లక్షలకి పైనే. కాని ఇక్కడ మొత్తం 147 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రే ఉన్నాయి. అంటే దాదాపు 80 వేల మందికి ఒక క్లినిక్. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా 30 వేల మందికి ఒక క్లినిక్ ఉండాలి. ఆదర్శవంతమైన పాలనా నిర్వహణ అంటే 10 వేల మందికి ఒక క్లినిక్. ఇలాంటి స్థితిలో పేదలకు ఎలా మంచి వైద్యం అందుతుంది అని అడుగుతారు ప్రియా



దేశాయ్. జర్నలిజం అభ్యసించిన ప్రియ తన తల్లి రాణీదేశాయ్ స్ఫూర్తితో వైద్య సేవారంగంలోకి వచ్చారు. అనేక స్వచ్ఛంద సంస్థల్లో పని చేసిన రాణీ దేశాయ్ తన కుమార్తెతో కలిసి 'అనాహత్ క్లినిక్'కు అంకురార్పణ చేశారు. బెంగళూరులో ఉన్న పేదలకు వైద్యం అందించాలనేది అనాహత్ సంకల్పం. నేరుగా క్లినిక్‌కు వచ్చేవారికి వైద్యం అందిస్తూనే హెల్త్ క్యాంప్స్ ద్వారా స్లమ్స్‌లో వైద్య చికిత్స అందించడం అనాహత్ లక్ష్యం. ఇప్పటికి 3 లక్షల మందికి హెల్త్ క్యాంప్స్ ద్వారా వైద్యం అందించారు ప్రియ తన తల్లి రాణీదేశాయ్ చేయూతతో.

బీపీ, షుగర్ బాధితులు

'నగరాల్లో పని చేసే దిగువ ఆదాయ వర్గాల వారు సమయానికి భోజనం చేయరు. ఆహార అలవాట్లు, నిద్రలో క్రమశిక్షణ ఉండదు. శరీరాన్ని పట్టించుకోరు. దానివల్ల బీపీ బారిన పడుతున్నారు. షుగర్ వచ్చిన వారికి షుగర్ వచ్చిన సంగతి కూడా తెలియడం లేదు. మా క్లినిక్‌కు రోజుకు వంద మంది వస్తారు. ఎక్కువ మందికి ఇవే సమస్యలు. మా కౌన్సిలింగ్స్ వల్ల ఎక్కడ ఏ పనిలో ఉన్నా రాత్రి ఎనిమిదికి భోజనం చేయడం నేర్చుకున్నారు చాలామంది' అంటారు ప్రియా దేశాయ్. మిత్రుల దాతల సహాయంతో ఈ క్లినిక్‌ను నడుపుతున్న ప్రియ తగిన సహాయం దొరికితే సేవను విస్తరించవచ్చు అని తపన పడుతుంటారు.

70 రకాల పరీక్షలు

అనాహత్ క్లినిక్‌లో 70 రకాల టెస్ట్‌లు ఉచితంగా చేస్తారు. 100 రకాల మందులు ఉచితంగా ఇస్తారు. వైద్యుల పరీక్ష ఉంటుంది. వీరే కాకుండా ఫిజియోథెరపిస్ట్‌లూ సేవలు అందిస్తారు. 'ఆనంద' అనే కార్యక్రమం ద్వారా సైకియాట్రీ కౌన్సెలింగ్ కూడా ఉంటుంది. 'అన్నింటికంటే ముఖ్యం మేము పేషెంట్స్‌ను ఒక కమ్యూనిటీగా మారుస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని ఒక గ్రూప్‌గా చేసి వారే ఒకరితో మరొకరు మాట్లాడుకుని తామంతా ఈ వ్యాధులను ఎదిరించవచ్చు అనే ధైర్యం పొందేలా చేస్తాం' అన్నారు ప్రియ. చికిత్స అందించడం ఎంత ముఖ్యమో వ్యాధి పట్ల అవగాహన, నివారణ అంతే ముఖ్యమని భావిస్తారు ఈ క్లినిక్‌లో. అందుకే బెంగళూరు పేదలు అనాహత్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రియను, ఆమె తల్లి రాణి దేశాయ్‌ను అభిమానిస్తున్నారు.

'స్లమ్స్‌లో ఉన్నవారు క్లినిక్స్‌కు రారు. స్లమ్స్‌లో హెల్త్ క్యాంప్స్ విస్తృతంగా... క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి చికిత్స మొదలవుతుంది. లేకుంటే అనవసర మరణాలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే అందరూ ఈ విషయమై ముందుకు రావాలి' అని కోరుతున్నారు ప్రియ.

నైపుణ్యమే పెట్టుబడి


సెరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ కష్టమైనదిగా భావిస్తూ మహిళలు ఈ కళను ఎంచుకోవడానికి వెనుకంజ వేస్తుంటారు. అలాంటి ఈ కళను ఎంతో ఇష్టంగా ఎంచుకొని, అందులో రాణిస్తోంది తిరువనంతపుర వాసి రోసా శ్రుతి అబ్రహాం. సాధారణంగా పెద్ద పెద్ద కర్మాగారాల నుంచి భారీగా ఉత్పత్తి అయ్యే సిరామిక్ వస్తువుల గురించి మనకు తెలిసిందే. అత్యంత వేగవంతమైన ప్రపంచంలో ప్రాచీన కళారూపాల వెనక దాగి ఉన్న నైపుణ్యాన్ని ఈ తరానికి పరిచయం చేస్తోంది రోసా శ్రుతి.



రోసా శ్రుతి అబ్రహాం

"మురికి పట్టిన ఏప్రాన్, మట్టితో నిండిన చేతులు, చిక్కుబడిపోయినట్టు చిందర వందరగా ఉండే జుట్టు.. రోజులో ఎక్కువ పనిగంటలు ఇలాగే కనిపిస్తాను. అయితే, కొంతకాలంగా వరసగా ఆర్డర్లు పొందుతున్నాను. అందుకే రోజులో ఎక్కువ గంటలు స్టూడియోలోనే ఉండిపోతున్నాను.





అందుకు ఎంతో ఆనందంగా ఉన్నాను. నేను ఓ స్టూడియో ఓనర్ అనేకంటే నా స్టూడియోలో నిరంతరం పనిచేసే ఒక శ్రామికురాలిని అని చెప్పుకోవడానికే ఇష్టపడతాను. స్టూడియో అంటే పెద్దదేమీ కాదు ఒక గది. అయితే, బయట పచ్చదనం ఉంటుంది. నాదైన ఈ ప్రపంచంలో అందమైన సిరామిక్స్, గ్లాస్ డిజైన్స్ రూపొందిస్తుంటాను.

మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ఏడేళ్లుగా ఈ తయారీని చేపడుతూనే ఉన్నాను. నిజానికి ఇది ప్రతిరోజూ ఒక కొత్త పాఠమే. నా స్టూడియోలో గడిపే ప్రతి క్షణం ఎంతో విలువైనది.

యజ్ఞంలా .. కళారూపాలు

సిరామిక్స్ అండ్ గ్లాస్ డిజైనింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాక కొన్ని కంపెనీలలో వర్క్ చేశాను. ఏడేళ్లపాటు వివిధ కంపెనీలలో చేసిన ఉద్యోగాలు నాకు అంతగా సంతృప్తినివ్వలేదు. దీంతో ఉద్యోగంలో సంపాదించిన కొద్ది మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఇంటి దగ్గరే 'కొసావో' పేరుతో ఓ స్టూడియోను ఏర్పాటు చేశాను. ఇప్పుడు







ఇదే నాకు జీవనాధారం అయ్యింది. కళాకారిణి నుంచి వ్యవస్థాపకురాలిగా ఎదగడం, నేర్చుకోవడం ... నా ప్రయాణం ఇలాగే కొనసాగించాలనుకుంటున్నాను. ఐదేళ్లుగా ఈ పని ఓ యజ్ఞంలా కొనసాగుతూనే ఉంది. కళారూపాల సృష్టిలోనే కాదు ఇతరులకు బోధించడంలోనూ ఆనందాన్ని, ఆదాయాన్నీ పొందుతున్నాను. అందుకే నా స్టూడియోలో ప్రతిరోజూ అన్ని సీజన్లలోనూ క్లాసులు ఉంటూనే ఉంటాయి. 'ఐదేళ్ల కిందటి వరకు మీరెక్కడ ఉంటారో మాకు తెలియదు, ఇప్పుడు ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు' అని క్లాసులకు వచ్చినవారు అంటుంటే చిరునవ్వే నా సమాధానంగా ఉంటుంది.

దేనికదే ప్రత్యేకం..

బయట మనకు ఎన్నో రకాల మిషన్ మేడ్ కళారూపాలు లభించవచ్చు. కానీ, వాటిలో ఒక ఆత్మ అంటూ ఉండదు. ఈ కళను ఏ డిజిటల్ పరికరాలతోనూ భర్తీ చేయలేం. వీటి తయారీలో ఓర్పు, పట్టుదల అవసరం. అందుకు మంచి ప్రతిఫలం కూడా లభిస్తుంది. ఉద్యోగంలో మరొకరి కోసం పనిచేస్తున్నప్పుడు మనకు పరిమితులు ఉంటాయి. సొంతంగా ఏదైనా ప్రారంభించాలంటే అందులో నైపుణ్యం అవసరం. వివిధచోట్ల పనిచేసిన అనుభవం కూడా నాకు చాలా సహాయపడింది. అలాగే, విభిన్న వ్యక్తుల నుంచి వారి ప్రవర్తనల నుండి రకరకాల పద్ధతులు, మార్గాలను అర్థం చేసుకోగలిగాను. ఇవన్నీ నన్ను నేను కొత్తగా మలుచుకోవడానికి సహాయపడ్డాయి.



వస్తువుల తయారీని ఫొటోలుగా తీసి, వాటిని ఆన్‌లైన్ ద్వారా కస్టమర్లకు షేర్ చేస్తుంటాను. ఆ తర్వాత రకరకాల పద్ధతుల్లో అనుకున్న రూపానికి తీసుకువస్తాను. ముఖ్యంగా పాత సినిమాలు, డైలాగ్‌ల నుండి ప్రేరణ పొందిన థీమ్‌లతోనూ వస్తువుల తయారీకి ప్లాన్ చేస్తుంటాను. ఇవి చాలామందిని ఆకట్టుకుంటున్నాయి. సిరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను' అని వివరిస్తుంది రోసా శ్రుతి.

విజయపథం

'మోనా'ర్క్

* ఆత్మవిశ్వాసమే రాజసం
* సాధారణ స్థాయి నుంచి బిలియనీర్ వరకు

వరల్డ్స్ మోస్ట్ ప్రిస్టీజియస్, గ్లామరస్ ఫ్యాషన్ ఈవెంట్ 'మెట్ గాలా–2024'లో బ్రేక్‌ఔట్ స్టార్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది మోనా పటేల్. 'ఎవరీ మోనా?' అని సెర్చ్ చేసేలా చేసింది. వడోదర నుంచి అమెరికా వరకు ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మోనా ఎదిగిన వైనం స్ఫూర్తిదాయకం. ఫిలాంత్రపిస్ట్‌గా ఎన్నో రకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది...



మోడల్‌గా మోనా పటేల్

గుజరాత్‌లోని వడోదరలో పుట్టి పెరిగిన మోనా పటేల్ చాలామంది అమ్మాయిలలాగే స్కూల్, కాలేజీ రోజుల్లో రకరకాల వివక్షలు, సవాళ్లు ఎదుర్కొంది. 'ఆటలు మగవారి కోసమే','ఆడవారు ఇంట్లోనే క్షేమంగా ఉంటారు' 'లక్ష్యాలు అనేవి మగవారి కోసమే' ఇలాంటి ఎన్నో పురుషాధిక్య భావజాల ధోరణులకు సంబంధించిన మాటలు విన్నది మోనా.

అయితే అలాంటి మాటలకు ఎప్పుడూ విలువ ఇవ్వలేదు.

సవాలుకు సై అనడం తప్ప వెనక్కి తిరిగి చూసింది లేదు.

పన్నెండు సంవత్సరాల వయసు నుంచి బాయ్స్–స్టైల్ హెయిర్ కట్‌తో కనిపించడం ప్రారంభించింది. వస్త్రధారణ కూడా అచ్చం అబ్బాయిలలాగే ఉండేది.

'ఏమిటీ వేషం'లాంటి వెక్కిరింపులకు ముఖం మీదే సమాధానం చెప్పి నోరు మూయించేది.

'హెయిర్ కట్ అనేది రెబిలియన్ యాక్ట్. సెల్ఫ్–ఎంపవర్‌మెంట్‌కు సింబల్' అంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటుంది మోనా.

ఇంటి నుంచి బయటి వెళ్లడమే సాహసంగా భావించే రోజుల నుంచి చదువు కోసం గుజరాత్ యూనివర్శిటీలో అడుగు పెట్టింది. హోమ్ టౌన్ తప్ప మరో టౌన్ తెలియని మోనా పైచదువుల కోసం న్యూజెర్సీలోని రాత్‌గర్స్ యూనివర్శిటీకి వెళ్లింది.

'ఔట్‌సైడ్ ఇండియా లైఫ్ గురించి ఎప్పటి నుంచో ఆసక్తి ఉండేది. చదువుల రూపంలో అది నెరవేరింది. ఒంటరిగా బయలుదేరినప్పటికీ ఆ ఒంటరితనమే ధైర్యాన్ని ఇచ్చింది. కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది' అంటుంది మోనా.

అమెరికాకు వెళ్లిన కొత్తలో అక్కడి వేషధారణ, ఆచార వ్యవహారాలు తనకు కొత్తగా అనిపించేవి.

'ఈ ప్రపంచంలో నేను ఇమడగలనా!' అని కూడా సందేహించేది.

అయితే ఆ ప్రపంచంలోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయధ్వజం ఎగరేసింది మోనా పటేల్.

ఒక్కో మెట్టు ఎక్కుతూ హెల్త్‌కేర్, టెక్, రియల్ ఎస్టేట్... మొదలైన రంగాలలో ఎనిమిది కంపెనీలను నెలకొల్పింది.

వ్యాపార విజయాలే కాదు సామాజిక సేవాకార్యక్రమాలు కూడా మోనాకు ఇష్టం. జెండర్ ఈక్వాలిటీ, అమ్మాయిల చదువు, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకొని 'కొచర్ ఫర్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

'మూడు పెద్ద సూట్‌కేస్‌లతో తొలిసారిగా ఇండియా నుంచి డల్లాస్‌కు బయలుదేరాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మోనా.

ఆ సూటుకేసులలో విలువైన వస్తువులు ఉండచ్చు. అయితే వాటి అన్నిటికంటే అత్యంత విలువైనది... ఆమెలోని ఆత్మవిశ్వాసం. ఆ ఆత్మవిశ్వాసమే మోనా పటేల్‌ను తిరుగులేని ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. ఎంతోమందికి స్ఫూర్తి ఇచ్చేలా చేస్తోంది.

బంగారు రెక్కల సీతాకోకచిలుక

ప్రతిష్ఠాత్మకమైన మెట్‌గాలా 2024 ఎడిషన్‌ను న్యూయార్క్‌లోని 'మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్'లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెన్నిఫర్ లోపెజ్, సారా జెస్సికా, ఆలియా భట్, ఇషా అంబానీ, నటాషా పూనావాలా... మొదలైన ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు. మెట్ గాలా రెడ్ కార్పెట్‌పై కనిపించాలనేది ఎంతోమంది అమ్మాయిల కల. అయితే తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకులు 'వావ్' అనుకునేలా చేసి, మెట్ గాలాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పటేల్. 'ది గార్డెన్ ఆఫ్ టైమ్' థీమ్‌తో రూపొందించిన సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న గౌనుకు ఎంతోమంది ఫిదా అయ్యారు. 'నా వారసత్వాన్ని సెలబ్రేట్ చేసుకునేలా నా డెబ్యూ లుక్ ఉండాలనుకున్నాను' అంటుంది పటేల్. రెడ్ కార్పెట్‌పై పటేల్ బ్యూటీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మారింది.

బ్యూటిప్స్

కనురెప్పల సోయగం...

- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్‌తో కళ్లను మీనాల్లా మెరిపించవచ్చని తెలిసినాకూడా వాటిని ఎలా అమర్చుకోవాలో అర్థం కాక ఇబ్బంది పడుతుంటే... ఒకసారి ఇలా ట్రై చేయండి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ (సౌందర్య సాధనాల మార్కెట్‌లో దొరుకుతాయి) ఒక సెట్, వాటిని అమర్చడానికి ఐలాష్ గ్లూ తీసుకోవాలి. వీటితోపాటు కత్తెర, ట్వీజర్, ఐ లాష్ కర్లర్, ఐ లైనర్, మస్కారా తీసుకోవాలి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ మరీ పొడవుగా ఉన్నట్లనిపిస్తే తగినంత మేరట్రిమ్ చేయాలి.
- ట్వీజర్ సహాయంతో లాషెస్‌కు గ్లూ పట్టించాలి. ఇప్పుడు వాటిని జాగ్రత్తగా కనురెప్ప మీద అమర్చాలి. గ్లూ ఆరి లాషెస్ సెట్ అయ్యే వరకు ఆగాలి. స్కిన్‌కు అంటుకోకుండా గ్లూవిడిగా ఆరిపోతున్నట్లు అనిపించినా, ఆరాక ఊడి వచ్చేటట్లు అనిపించినా కనురెప్పల మీద ఆర్టిఫీషియల్ లాషెస్ కరెక్ట్‌గా సెట్ అయ్యేటట్లు మెల్లగా నొక్కాలి.



- గ్లూ ఆరిన తర్వాత లాషెస్‌కు డార్క్‌షేడ్ ఐ లైనర్ అప్లయ్ చేయాలి. ఇలా చేయడం వల్ల అసలు కనురెప్పలకు, ఆర్టిఫీషియల్ లాషెస్‌కు మధ్య తేడా కనిపించకుండా అంతా ఒకేలా ఉంటాయి.
- చివరగా ఐలాష్ కర్లర్‌తో వంపు తిప్పాలి. అవసరమనిపిస్తే (మరింతడార్క్‌గా కనిపించాలనుకుంటే) మస్కారా అప్లయ్ చేయాలి.

కోమలమైన పెదవుల కోసం...

- రోజూ ఉదయాన్నే బ్రష్ చేసిన తరువాత.. బ్రష్ మీద కొద్దిగా తేనె వేసి రెండు పెదవులపైన గుండ్రంగా ఐదు నిమిషాలపాటు రుద్దాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదవులపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. మర్దన వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదవులు మృదువుగా మారతాయి.



- ఉదయం బ్రష్‌తో మర్దన చేసాక, రాత్రి పడుకునేముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా రాయాలి. ఇందుకోసం.. కొద్దిగా బీట్‌రూట్ రసాన్ని వేడి చేయాలి. వేడిచేసిన రసంలో అర టీస్పూను కార్న్‌ఫ్లోర్ వేసి ఐదు నిమిషాలపాటు బాగా కలిపి దించేయాలి. తరువాత ఈ మిశ్రమంలో అర టీస్పూను గ్లిజరిన్, పావు టీస్పూను కొబ్బరి నూనె కలిపి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేయాలి. ఈ మిశ్రమం గట్టిపడిన తరువాత పెదవులకు రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయం నీటితో కడిగేయాలి
- ఈ రెండింటిని ఒకదాని తరువాత ఒకటి క్రమం తప్పకుండా పాటిస్తే పెదవులు గులాబి రేకుల్లా కోమలంగా పింక్ కలర్‌లో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 47

గురువారం 9-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్ విధ్వంసం..

లక్నోతో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 166 పరుగుల లక్ష్యాన్ని కేవలం 58 బంతుల్లోనే ఛేదించి 10 వికెట్లతో గెలిచింది. హెడ్ (30 బంతుల్లో 89 నాటౌట్; 8 ఫోర్లు, 8 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (28 బంతుల్లో 75 నాటౌట్; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించారు. -16లో



బీజేపీ మళ్లీ వస్తే.. హైదరాబాద్ యూటీనే!

ఢిల్లీ నుంచి హైదరాబాద్‌ను పాలించే కుట్ర అమలు చేస్తారు..

'సాక్షి' ఇంటర్వ్యూలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- రిజర్వేషన్ల అమలు బీజేపీకి ఇష్టం లేదు
- అందుకే కులగణనకు ఒప్పుకోవట్లేదు.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లూ తొలగిస్తారు
- బీఆర్ఎస్ పని అయిపోయింది.. అందుకే కేసీఆర్ దిగజారిపోయారు
- కరెంటు ఉందో లేదో వైర్లను పట్టుకుని చూస్తే అర్థమవుతుందని వ్యాఖ్య - 3లో

దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లలా కనిపిస్తారు

- ఈశాన్య ప్రాంతాల ప్రజలు చైనీయుల్లా ఉంటారు
- పశ్చిమ ప్రాంతాల జనం అరబ్బుల్లాగా, ఉత్తరాది ప్రజలు శ్వేతజాతీయుల్లాగా ఉంటారు
- ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు

6లో

'ఆర్‌ఆర్' ట్యాక్స్ వెయ్యికోట్లు!

సగం రాష్ట్రంలోని 'ఆర్'కు.. సగం ఢిల్లీలోని 'ఆర్'కు పంపకం.. వేములవాడ, వరంగల్ బీజేపీ సభల్లో ప్రధాని మోదీ ఆరోపణ

- ట్రిపుల్ ఆర్ సినిమా వసూళ్లను దాటిన కాంగ్రెస్ 'ఆర్‌ఆర్ ట్యాక్స్'
- అమరుల కుటుంబాలకు పెన్షన్, భూమి ఏవి?
- మహిళల ఖాతాల్లో నెలకు రూ.2,500 అమలు ఏది?
- ఏడాదికో ప్రధాని అంటూ ఇండియా కూటమిలో ఒప్పందం
- అలా అయితే దేశం భవిష్యత్తు ఏం కావాలి
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ తోడు దొంగలే!
- ఓటుకు నోటు, కాళేశ్వరం కేసుల్లో దర్యాప్తు లేకపోవడమే దీనికి నిదర్శనమని వ్యాఖ్య
- చర్మం రంగు నల్లగా ఉన్నవారంతా ఆఫ్రికన్లలా ఉంటారని రాహుల్ ఫ్రెండ్ పిట్రోడా అన్నారు.. చర్మం రంగును బట్టి యోగ్యత ఉంటుందా? అంటూ ధ్వజం

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు చీల్చి ముస్లింలకు పంచుతుంది

సాక్షి, వరంగల్/ సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ వేములవాడ: ''కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అభివృద్ధి పూర్తిగా ఆగి, ప్రభుత్వ ఖజానా ఖాళీగా మారింది, కాంగ్రెస్ వాళ్లు.. ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నారు. అందులో సగం హైదరాబాద్‌లోని 'ఆర్'కు వెళ్తే.. రెండో సగం మరో 'ఆర్' కోసం ఢిల్లీకి వెళ్తుంది. ఈ ఆర్‌ఆర్ ట్యాక్స్.. ట్రిపుల్ ఆర్ సినిమా రూ.వెయ్యికోట్ల వసూళ్లను అనతికాలంలోనే దాటడం ఇక్కడి అవినీతికి నిదర్శనం..'' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ ఎంత అబద్ధాల కోరు అన్నది తెలంగాణ ప్రజలకు తెలిసినంతగా మరెవరికీ తెలియదన్నారు. రైతుల రుణమాఫీపై మిగతా 2వ పేజీలో ▶

రుణమాఫీపై చేతులెత్తేస్తారు!

''కాంగ్రెస్ అతిపెద్ద నాయకురాలు (సోనియా) పుట్టినరోజు డిసెంబర్ 9న రైతుల రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ నేతలు చెప్పారు. ఇప్పుడు ఆగస్టు 15 వరకు వాయిదా వేసి ఆ వాగ్దానాన్ని వెనక్కి తోశారు. లోక్‌సభ ఎన్నికలు అయ్యేదాకా ఆగి ఆ తర్వాత చేతులెత్తేయబోతున్నారు. ఇది మిమ్మల్ని మోసం చేయడమే.. మీ మనోభావాలను దెబ్బతీయడమే.. వాళ్లు ఒకవైపు వేములవాడ రాజన్న మీద ఒట్టు పెడుతున్నారు. మరోవైపు సనాతన ధర్మాన్ని తిడుతున్నారు. సనాతన ధర్మాన్ని తిడుతూ, ఒట్లు పెట్టేవారిని ఎవరు నమ్ముతారు..'' – మోదీ



బుధవారం వేములవాడ సభలో ప్రధాని మోదీ అభివాదం. చిత్రంలో బండి సంజయ్



ప్రతి స్కీంలో కొండి..తొండి



బుధవారం రాత్రి నర్సాపూర్ రోడ్ షోకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేసీఆర్

కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ సీఎం కేసీఆర్ ఫైర్

హామీల అమల్లో పూర్తిగా విఫలమైంది

అబద్ధాలు చెప్పడం ఆ పార్టీకి పరిపాటిగా మారింది

- రూ.2,500 ఆర్థిక సాయంపై రాహుల్ కూడా అబద్ధాలు చెప్పారు
- ప్రధాని మోదీతో తెలంగాణకు పైసా కూడా లాభం కాలేదు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి మేలు జరుగుతుంది
- ఈ దేశం, ఈ రాష్ట్రం మనది.. అందరం ఏకమై కాపాడుకోవాలి
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణ హక్కుల సాధన సాధ్యమవుతుంది
- నర్సాపూర్, పటాన్‌చెరు, దుండిగల్‌లో ఎన్నికల ప్రచారం

7లో

గోడ కూలి ఏడుగురు దుర్మరణం

- హైదరాబాద్ బాచుపల్లిలో విషాదం
- మృతులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందినవారిగా గుర్తింపు
- రైజ్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీని అరెస్టు చేసిన పోలీసులు - 8లో

రెండ్రోజులు మోస్తరు వానలు!

- వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్
- బుధవారం సగటున 1.24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

18లో

బీజేపీ గెలిస్తే.. నియంత పాలనే!



ఆర్మూర్ రోడ్ షోలో ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

- నిజామాబాద్, ఆర్మూర్ రోడ్ షోలలో సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- రాజ్యాంగంలో మార్పులు, రిజర్వేషన్ల రద్దుకు మోదీ ప్రభుత్వ కుట్ర
- బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే!
- బిడ్డ బెయిల్ కోసం ప్రజల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ బీజేపీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు
- 69 లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము వేశాం.. ఆగస్టు 15 నాటికి రైతుల రుణాల మాఫీ కూడా చేసి చూపిస్తాం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాజ్యాంగాన్ని మార్చి.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్లను రద్దు చేయాలన్నది మోదీ ప్రభుత్వ కుట్ర అని టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ గెలిచి రాజ్యాంగాన్ని మారిస్తే.. దేశం నియంత పాలనలోకి వెళుతుందని వ్యాఖ్యానించారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేడీ ఒక్కటేనని.. బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్లేనని పేర్కొన్నారు. కేసీఆర్ తన బిడ్డ కవిత బెయిల్ కోసం ప్రజల ఆత్మగౌరవాన్ని బీజేపీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు. బుధవారం నిజామాబాద్, ఆర్మూర్‌లలో నిర్వహించిన రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''రైతు భరోసా ఇస్తే అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాస్తానన్న కేసీఆర్‌కు సిగ్గులేదు. 69 లక్షల మంది రైతుల ఖాతాలు చూస్తే డబ్బులు జమ అయిన మిగతా 5వ పేజీలో ▶



శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలోని నందికి నమస్కరిస్తున్న ప్రధాని



వేములవాడలో శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో కోడెకు పూజచేస్తున్న మోదీ



బుధవారం వేములవాడ జనసభకు హాజరైన ప్రజలు, పార్టీ కార్యకర్తలు



వరంగల్ జిల్లా మామునూరు సమీపంలోని లక్ష్మీపురం మైదానంలో బుధవారం జరిగిన ఓరుగల్లు జనసభకు హాజరైన జనం

'ఆర్‌ఆర్' ట్యాక్స్ వెయ్యి కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ చేతులెత్తేయబోతోందని.. లోక్‌సభ ఎన్నికల వరకు ఆగి మోసగిస్తుందని వ్యాఖ్యానించారు. బుధవారం వేములవాడ, వరంగల్‌లలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ అమరుల కుటుంబాలకు పెన్షన్ ఇస్తామని, 250 గజాల భూమి ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఇవ్వలేదు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి, మోసం చేసింది. తెలంగాణలో విద్యుత్ కోతలు పెరిగాయి. ప్రజలకు గంట గడవడం కష్టమవుతోంది. అలాంటి నమ్మక ద్రోహి కాంగ్రెస్ ప్రజలకు ఎలా మేలు చేస్తుంది? ఒక్కసారి ఆలోచించాలి. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రజలు కాంగ్రెస్‌ను అధికారమిస్తే.. కుటుంబానికే పెద్దపీట వేసి, జాతి ప్రయోజనాలకు గంగలో ముంచింది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావును అవమానించింది. అదే పీవీని బీజేపీ సర్కారు భారతరత్నతో గౌరవించింది.



ఓరుగల్లు జనసభలో నాయకులు బహూకరించిన గదతో ప్రధాని నరేంద్ర మోదీ

బీసీలకు కోత వేసి ముస్లింలకు ఇస్తుంది

కాంగ్రెస్ దృష్టిలో రాజ్యాంగానికి విలువ లేదు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదని అంబేడ్కర్ స్పష్టంగా చెప్పారు. కానీ కాంగ్రెస్ కర్ణాటకలో బీసీల రిజర్వేషన్లు కత్తిరించి ముస్లింలకు ఇచ్చింది. ఉమ్మడి ఏపీలో అదే ప్రయత్నం జరిగినా హైకోర్టు నిలిపివేసింది. దీన్ని కాంగ్రెస్ సహించలేకపోతోంది. అందుకే చట్టం చేసి అయినా.. ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీల రిజర్వేషన్లు తొలగించి ముస్లింలకు ఇవ్వాలనుకుంటోంది. బీఆర్ఎస్ కూడా బుజ్జగింపు రాజకీయాలు చేస్తోంది. కేవలం ముస్లింల కోసం ఐటీ పార్కులను ఏర్పాటు చేస్తామని గతంలో ప్రకటించింది. 2014లో అధికారంలోకి వస్తే దళితుడ్ని సీఎం చేస్తామని మోసం చేసింది. దళిత బంధు పేరిట మోసం చేసింది. కాళేశ్వరం కుంభకోణానికి పాల్పడింది.

ఎస్సీ వర్గీకరణ చేస్తాం..

మాదిగ సోదరులకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ వెనుకడుగు వేస్తోంది. ఎస్సీ వర్గీకరణ కోసం నా చిన్న తమ్ముడు మంద కృష్ణ చాలాకాలం నుంచి పోరాడుతున్నారు. ఇప్పటివరకు న్యాయం జరగలేదు. నేను వారికి న్యాయం చేస్తానని వాగ్దానం చేశాను. అమలు చేసి చూపిస్తా.

కాంగ్రెస్ సీట్లను భూతద్దంలో చూసుకోవాల్సిందే

ప్రపంచమంతా అస్థిరత, అశాంతి, విపత్తులు నెలకొని ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో దేశ కార్యభారాన్ని, శక్తిని తప్పుడు చేతుల్లో పెట్టొద్దు. పదేళ్ల క్రితం వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏరకమైన పాపాలు చేసిందో అందరికీ తెలుసు. నాలుగు రోజులకో కుంభకోణం, అవినీతి బయటపడుతుండేవి. దేశంలోని పెద్ద పట్టణాల్లో బాంబు పేలుళ్లు సంభవించేవి. ఇప్పుడు ఎన్డీయే విజయరథం వేగంగా ప్రయాణం చేస్తోంది. ఇప్పటివరకు జరిగిన మూడు దశల పోలింగ్‌లో ముందు నిలిచింది. కాంగ్రెస్ ఎక్కడెక్కడ సీట్లు గెలుస్తుందా అని భూతద్దం పెట్టి చూసే పరిస్థితి ఏర్పడింది. నాలుగో దశ పూర్తయ్యే సరికి భూతద్దంతోనూ దొరకవు. మైక్రోస్కోప్ కావాల్సి వస్తుంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ తోడు దొంగలే!

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ తోడుదొంగలే. పైకి తిట్టుకున్నా అవినీతి అనే వారధి వారిని తెరవెనుక కలుపుతోంది. అందుకే ఓటుకు నోటు కేసులో కాంగ్రెస్ నేతను, కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్ నేతలను రెండు పార్టీలు పరస్పరం కాపాడుకుంటున్నాయి. హైదరాబాద్‌లో ఎంఐఎం విషయంలో బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉంది. కానీ బీజేపీ రంగంలోకి దిగేసరికి వారిలో ఆందోళన మొదలైంది. కాంగ్రెస్-బీఆర్ఎస్‌లకు కుటుంబ రాజకీయాలే తొలి ప్రాధాన్యం. బీజేపీకి దేశమే తొలిప్రాధాన్యం. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అడ్రస్ గల్లంతే. తెలంగాణ ప్రజలంతా ఏకమై మే 13న ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలి..'' అని మోదీ పిలుపునిచ్చారు. ఓరుగల్లు సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొన్నారు.

చర్మం రంగును బట్టి యోగ్యత ఉంటుందా..?

మేం 2014లో తొలిసారి అధికారంలోకి రాగానే దళితుడైన రాంనాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేశాం. 2019లో ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేశాం. కాంగ్రెస్ ఈ ఇద్దరిని వ్యతిరేకించింది. ముఖ్యంగా ద్రౌపదీ ముర్మును కాంగ్రెస్ ఎందుకు అంతగా వ్యతిరేకించిందా? అని ఎంతగా ఆలోచించినా ఇన్నాళ్లా అర్థం కాలేదు. ఇప్పుడు అర్థమవుతోంది. ద్రౌపదీ ముర్ము గారి చర్మం రంగు నలుపు. ఇక్కడున్న రాజ కుమారుడి (రాహుల్ గాంధీ)కి అమెరికాలో ఓ ఫ్రెండ్ ఫిలాసఫర్, మార్గదర్శి (సామ్ పిట్రోడా) ఉన్నారు. చర్మం రంగు నల్లగా ఉన్నవాళ్లందరూ ఆఫ్రికన్లలా ఉంటారని ఆయన ఈ మధ్య అన్నారు. చర్మం రంగును బట్టి ద్రౌపదీ ముర్ము గారిని కూడా ఆఫ్రికన్ అని ఆయన భావించారు. అందుకే ఓడించాలని చెప్పి రాజకుమారుడికి బోధించారు. నలుపు చర్మం ఈ దేశంలో చాలా మందికి ఉంటుంది. శ్రీకృష్ణుడి రంగు కూడా నలుపే. మరి అలాంటిది చర్మం రంగును బట్టి యోగ్యతను నిర్ధారిస్తారా? ఇందుకే ఆ రాజ కుమారుడి మీద నాకు కోపం వస్తోంది. నన్ను తిడితే నాకు కోపం రాదు. కానీ నా దేశ ప్రజలను చర్మం రంగు పేరిట రాజ కుమారుడి మార్గదర్శకుడు లండన్‌లో కూర్చొని , అమెరికాలో కూర్చొని తిట్టడం నాకు కోపం తెప్పిస్తోంది.

రాజన్నను దర్శించుకున్న ప్రధాని మోదీ

బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రధాని మోదీ వేములవాడకు చేరుకున్నారు. నేరుగా శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. తర్వాత ప్రత్యేక కాన్వాయ్‌లో ప్రజలకు అభివాదం చేస్తూ.. బాలానగర్‌లోని సభాస్థలికి చేరుకున్నారు. సభ ముగిశాక హెలికాప్టర్‌లో వరంగల్ పయనమయ్యారు.

'ఒక్కొక్కరి పొలంలో పది మీటర్లు..' కాంగ్రెస్‌పై మోదీ సెటైర్ లెక్క!

''ఈసారి ఇండియా కూటమి ఐదు సంవత్సరాల్లో ఐదుగురు ప్రధానులను తీసుకొస్తామని చెప్తోంది. ఇదీ అందరికీ స్పష్టంగా అర్థం కావాలంటే మరో పద్ధతిలో చెబుతా. పది మంది రైతులు పొలాల్లో బోరు వేయించాలనుకున్నారు. ఒక నిపుణుడిని తీసుకొచ్చారు. ఆ నిపుణుడు 100 మీటర్లు తవ్వితే నీళ్లు పడతాయని చెప్పారు. అప్పుడు ఈ రైతులు.. ఒకరి పొలంలో పది మీటర్లు, పక్క పొలంలో పది మీటర్లు, ఆ పక్కవాడి పొలంలో పది మీటర్లు.. ఇలా పది మంది పొలాల్లో తవ్వితే 100 మీటర్లు అయిపోతుందనుకున్నారు. అలా చేస్తే నీళ్లు వస్తాయా? ఇండియా కూటమి అంతే. పార్టీకో ప్రధాని ఉంటే దేశం భవిష్యత్ ఏమవుతుంది?''

మోదీ ఆరడుగుల బుల్లెట్: బండి సంజయ్



కాశీ విశ్వేశ్వరుడికి ప్రతిరూపమే మోదీ అని, ఆయన ఆరడుగుల బుల్లెట్ అని బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. హామీలు అమలు చేయాలని అడిగితే కాంగ్రెస్ ప్రజలకు గాడిద గుడ్డు చూపిస్తోందని విమర్శించారు. వేములవాడ ఆలయం గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని.. ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్ల చొప్పున రూ.400 కోట్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. తాను గెలిచిన వెంటనే వేములవాడ, కొండగట్టు ఆలయాలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు.



'నా యువ మిత్రుడిని కలిశా..'.. బాలుడిని ఎత్తుకున్న మోదీ

ఓరుగల్లు సభకు వచ్చిన సందర్భంగా ప్రధాని మోదీ కాసేపు ఓ బాలుడిని ఎత్తుకున్నారు. కారులో తన ఒడిలో కూర్చోబెట్టుకున్నారు. 'నా యువ మిత్రుడిని కలిశా.. మనసు ఎంతో ఉల్లాసంగా ఉంది..' అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

– ఖిలా వరంగల్

క్లుప్తంగా...

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికకు బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అభ్యర్థిగా నిలపాలని బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. ఇప్ప టికే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్, బీఆర్ఎస్ నుంచి ఏనుగు రాకేశ్‌రెడ్డి పోటీలో ఉన్నారు. మే 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుండగా.. జూన్ 5న కౌంటింగ్ ఉంటుంది. 2021లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరగ్గా, గతే డాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఈ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ ఉపఎన్నిక నిర్వహిస్తున్నారు.

రేవంత్ నోటిని ఫినాయిల్‌తో కడగాలి

మహిళలంటే సీఎంకు గౌరవం లేదు: డీకే అరుణ



కేశంపేట (మహబూబ్‌నగర్): మహిళలంటే గౌరవం లేకుండా వారిని కించపరిచేలా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటిని ఫినాయిల్‌తో కడగాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె మండల పరిధిలోని ఇప్పలపల్లి, వేములనర్వ, కేశంపేట, కొత్తపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మహిళలను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పాలనలో దేశం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. మహబూబ్‌నగర్‌లో తనను ఓడించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఏడుసార్లు పర్యటించారని తెలిపారు. దేశంలో శాంతిభద్రతలు, రామరాజ్యం కొనసాగాలన్నా కమలం పువ్వు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, రఘురాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావుకు ఇక జైలే

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



సాక్షి, సిద్దిపేట: 'మెదక్‌లో నేను ఎంపీగా గెలుపొందడం ఖాయం.. మిమ్మల్ని శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపడం పక్కా' అని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను ఉద్దేశించి అన్నారు. సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో డబ్బులు పంచి గెలుపొందలేదని కేసీఆర్, హరీశ్‌రావు, ప్రభాకర్ రెడ్డిలు తడిబట్టలతో సిద్దిపేటలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రమాణం చేస్తారా? అని ప్రశ్నించారు. ఒక వేళ ప్రమాణం చేస్తే తాను ఎంపీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని ఆయన సవాల్ విసిరారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నికలో తాను గెలుపొందినప్పుడు కేసీఆర్, హరీశ్‌రావులు ఎక్కడ ఉన్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు కాకుండా కేసీఆర్, హరీశ్‌రావులకు బినామీగా ఆస్తులు సంపాదించి పెట్టిన వెంకట్రామిరెడ్డికి టికెట్ ఇచ్చారని ఆరోపించారు. హరీశ్‌రావుకే మతి తప్పిందని అనుకున్నానని, ఇప్పుడు కేసీఆర్‌కు కూడా మతి తప్పిందని రఘునందన్‌రావు విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో తాను గెలుపొందడం ఖాయమని, మామ, అల్లుడిని శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపడం ఖాయమని అన్నారు.

డాక్టర్ రఘురామ్‌కు ప్రధాని ప్రశంస

- రొమ్ము కేన్సర్‌ను నయం చేయడంలో డాక్టర్ రఘురామ్ కృషి భేష్
- ఎక్స్‌లో పేర్కొన్న ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, హైదరాబాద్: పద్మశ్రీ అవార్డు గ్రహీత, కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ పిల్లారిశెట్టి, ఆయన సతీమణి డాక్టర్ వైజయంతిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రశంసించారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా వారిద్దరినీ హైదరాబాద్ రాజభవన్‌లో కలిసినట్లు ట్విటర్ (ఎక్స్)లో ప్రధాని మోదీ తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయడంలో డాక్టర్ రఘురామ్ కృషి మార్గదర్శకమని ప్రధాని కొనియాడారు. తాము దేశంలో ఆరోగ్యరంగంలో మౌలిక సదుపాయాల గురించి చర్చించినట్లు మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వ కృషిని డాక్టర్ రఘురామ్ అభినందించారని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం.

మోదీతో భేటీలో వైద్యరంగంపై చర్చలు: డాక్టర్ రఘురామ్

కాగా, ప్రధానిని మంగళవారం కలిసిన విషయంపై డాక్టర్ రఘురామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సీనియర్ సిటిజన్లకు ఆయుష్మాన్ భారత్ వసతులను వర్తింపజేసేందుకు తీసుకున్న నిర్ణయంపై ప్రధానిని అభినందించామని తెలిపారు. దేశంలో నానాటికీ పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించే విషయంలో ఆ నిర్ణయం 'గేమ్ ఛేంజర్'గా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలో మహిళలను వేధిస్తున్న రొమ్ము క్యాన్సర్ నుంచి సంరక్షణ, దాన్ని నియంత్రించే అంశాలపై చర్చించామని వెల్లడించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న జనాభా ఆధారిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం మరింత పకడ్బందీగా అమలు చేయాలని సూచించామని రఘురామ్ తెలిపారు. పదేళ్ల క్రితం 2014లో విడుదలైన 'పింక్ కనెక్షన్' తొలి త్రైమాసిక సంచిక ఎడిటోరియల్ పేజీపై ప్రధాని సంతకం చేశారనీ, ఇది దక్షిణాసియాలో మొట్ట మొదటి బ్రెస్ట్ హెల్త్ మ్యాగజైన్ అని రఘురామ్ వెల్లడించారు.



ప్రధానితో ముచ్చటిస్తున్న డాక్టర్ రఘురామ్, ఆయన సతీమణి వైజయంతి

కాంగ్రెస్ వెన్నులో వణుకు పుట్టింది: అరూరి రమేశ్



ఓరుగల్లు జన జాతర సభ చూసి కాంగ్రెస్ నాయకుల వెన్నులో వణుకు పుట్టిందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏం చేయాలో తోచక అవాస్తవాలను ప్రచారం చేస్తోందని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపిస్తే వరంగల్-హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్, ఐఐఎం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. కాకతీయ కళా సంపదకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తీసుకువస్తానన్నారు.

రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలుస్తాం: సీతారాం నాయక్



రాష్ట్రంలో అధిక ఎంపీ సీట్లను బీజేపీయే గెలుచుకుంటుందని.. కేంద్రంలో మరోసారి మోదీ ప్రధాని అవుతారని మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ చెప్పారు. జనమంతా మోదీ నామస్మరణ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మాటలను ఎవరూ నమ్మడం లేదన్నారు. తనకు ఎంపీగా పనిచేసిన అనుభవం ఉందని, మరోసారి గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తానని చెప్పారు.

'ఇందిరమ్మ'కు ఇంజినీర్లు ఏరీ?

- 4.16 లక్షల ఇళ్ల నిర్మాణానికి సర్కారు ఏర్పాట్లు
- పర్యవేక్షణకు 900 మంది ఇంజినీర్లు, ఇతర సిబ్బంది అవసరం!
- గతంలో ఇతర విభాగాల్లో విలీనమైన 435 మంది సిబ్బంది
- డిపార్టుమెంటులో ఉన్నది 40 మందే
- కొత్తగా 1,000 మందిని రిక్రూట్ చేసుకునేలా ప్రణాళికలు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు ముగిసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 4,16,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో గృహ నిర్మాణ శాఖలో సిబ్బంది అతి తక్కువ సంఖ్యలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. లక్షల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు ఇంజినీర్లు, ఇతర సిబ్బంది కలిపి దాదాపు 900 మంది అవసరమని అంచనా. కాగా ప్రస్తుతం గృహనిర్మాణ సంస్థలో ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులు కలిపి కేవలం 40 మంది మాత్రమే ఉండటం గమనార్హం.

వివిధ విభాగాల్లో విలీనం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో సీఐడీ విచారణకు ఆదేశించి కొన్ని రోజులు హడావుడి చేసింది. అదే క్రమంలో గృహనిర్మాణ శాఖలో పని చేస్తున్న ఇంజినీర్లను వివిధ విభాగాల్లో కలిపేసింది. అలా దాదాపు 475 మంది ఆయా విభాగాలకు వెళ్లి పనిచేస్తున్నారు. మరోవైపు గతంలో ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచటంతో కొంతకాలం నిలిచిపోయిన రిటైర్మెంట్లు తిరిగి మార్చిలో మొదలయ్యాయి. దీంతో ఆయా విభాగాల్లో ప్రస్తుతం నెలకు సగటున పది మంది చొప్పున రిటైర్ అవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక జరిగి ఇళ్ల నిర్మాణం గ్రౌండ్ అయ్యేసరికి ఐదారు నెలల సమయం పడుతుందని అంచనా. కాగా అప్పటివరకు ఈ ఉద్యోగుల సంఖ్య 400కు చేరుకుంటుంది. ప్రతి సంవత్సరం సగటున 120 మంది తగ్గిపోతూనే ఉంటారు.

రిక్రూట్‌మెంట్‌కు కసరత్తు

ఇళ్ల నిర్మాణానికి పూనుకుంటున్న నేపథ్యంలో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న ఇంజినీర్లు అందరినీ వెనక్కి తీసుకొచ్చినా, మరో ఐదారువందల మంది అవసరమవుతారు. మరోవైపు ప్రతి ఏటా రిటైర్ అయ్యే వారినీ భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కనీసం 1,000 మంది ఉద్యోగులను కొత్తగా రిక్రూట్ చేసుకునే దిశగా యోచిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించేందుకు గృహనిర్మాణ సంస్థ సిద్ధమవుతోంది. అయితే ఇంత పెద్ద సంఖ్యలో ఇంజినీర్ల రిక్రూట్‌మెంట్ వల్ల ప్రభుత్వ ఖజానాపై జీతాల భారం పడుతుందనే అభిప్రాయం ఉంది. దీంతో తాత్కాలిక పద్ధతిలో ఔట్ సోర్సింగ్‌పై నియమించుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా చేస్తున్నట్టు సమాచారం. అయితే గతంలో ఇలా ఔట్ సోర్సింగ్‌పై పనిచేసిన చాలామందిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. పైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జవాబుదారీతనం అంతగా ఉండదని, ఇది అవకతవకలు, అస్తవ్యస్త పరిస్థితులకు కారణమయ్యే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. కొత్తగా ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవడమే సరైన చర్యగా పేర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో ఉండే ఐదేళ్ల పాటు ఇళ్ల నిర్మాణం తప్పనిసరిగా కొనసాగే అవకాశం ఉంది. ఆ తర్వాత కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తే ఈ పథకం ముందుకెళ్లే వీలుంటుంది. ఒకవేళ ప్రభుత్వం మారినా ముందే మంజూరు చేసి గ్రౌండ్ చేసిన ఇళ్లను మాత్రం తప్పనిసరిగా కొనసాగించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇలా కనీసం ఏడెనిమిదేళ్ల పాటు పథకం కొనసాగే అవకాశం ఉండటంతో ఆ మేరకు అవసరమైన ఇంజినీర్లను పూర్తిస్థాయిలో రిక్రూట్ చేసుకోవడమే సమంజసమని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. అయితే దీనిపై ఎన్నికలయ్యాక ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఇదండీ జగత్



నన్ను నమ్మండీ! నేను ఇదివరకులా కాను!!



ప్రధాని మోదీని సత్కరించి పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి

మోదీతో ఎమ్మెల్సీ వాణీదేవి భేటీ

సనత్‌నగర్ (హైదరాబాద్): నగర పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని మంగళవారం సాయంత్రం వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ వాణీదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని అందజేసినందుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వావిలాల ఖాదీ కండువాతో ప్రధానిని సత్కరించారు. తాను రచించిన పుస్తకాలను ఆయనకు వాణీదేవి అందజేశారు.

క్లుప్తంగా...

ప్రధాని మోదీకి 3 ప్రశ్నలు సంధించిన జైరాంరమేష్



సాక్షి, న్యూఢిల్లీ : ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి జైరాంరమేష్ 'ఎక్స్'లో మూడు ప్రశ్నలు సంధించారు. తాను అడిగిన ప్రశ్నలకు జవాబు ఇవ్వాలని బుధవారం జైరాంరమేష్ సోషల్ మీడియా వేదికగా మోదీని డిమాండ్ చేశారు. కాజీపేటలో రైల్వే ప్లాంట్ నిర్మిస్తారా, బీజేపీ హయాంలో 'బయ్యారం స్టీల్‌ప్లాంట్, , ఐటీఐఆర్ పథకాలు' విఫలం అయ్యాయని, స్పష్టమైన గణాంకాలు లేకుండా మాదిగలకు సబ్‌కోటా హామీ ఎలా నెరవేరుతుంది' అని జైరాం రమేష్ ప్రధాని మోదీని ప్రశ్నించారు.

అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వండి

ఫేక్ వీడియో కేసులో హైకోర్టును ఆశ్రయించిన టీపీసీసీ



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ పోలీసులు తమ పార్టీ సోషల్ మీడియా కార్యదర్శుల అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేయకుండా వారి ఇళ్లకు వెళ్లి వ్యక్తిగత వివరాలను తెలుసు కోవడంతో పాటు పలు వస్తువులను సీజ్ చేస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారిని అరెస్టు చేస్తామని చెబుతూ మనోవేదనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె సతీశ్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వీరికి ట్రయల్ కోర్టు బెయిల్ కూడా మంజూరు చేసింది. అయితే ఇదే అంశంపై ఢిల్లీ పోలీసులు కూడా కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు నేడు (గురువారం) విచారణ చేపట్టనుంది.

బీజేపీ మళ్లీ వస్తే..

హైదరాబాద్ యూటీనే!

ఢిల్లీ నుంచి హైదరాబాద్‌ను పాలించే కుట్ర అమలు చేస్తారు

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

(మేకల కల్యాణ్ చక్రవర్తి)

ఇంటర్వ్యూ

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే తెలంగాణ చిన్నాభిన్నం అవుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీకి 400 స్థానాలు వచ్చి అధికారం చేపట్టిన మరుక్షణమే హైదరాబాద్‌ను ఢిల్లీ నుంచి పాలించే కుట్రను అమలు చేస్తారని.. తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం (యూటీ)గా చేస్తారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గమనించి లోక్‌సభ ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలో నిర్ణయించుకోవాలన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు ఉండటం లేదన్న మాజీ సీఎం కేసీఆర్.. ఒక్కసారి కరెంటు తీగలను పట్టుకుని చూస్తే కరెంటు ఉందో లేదో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. ఎవరు అసమర్థులో, దోపిడీదారులో ఓట్లు వేసేటప్పుడు ప్రజలు నిర్ధారిస్తారన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భట్టి విక్రమార్క బుధవారం ప్రజాభవన్‌లో 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూ సారాంశం ఆయన మాటల్లోనే..



"ఐదు నెలలుగా ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తుండటం సంతృప్తికరంగానే కాదు చాలెంజింగ్‌గా ఉంది. రాష్ట్ర ప్రజలకు రూ.500కే సిలిండర్, రూ.10లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షలు.. ఇలా సంక్షేమ కార్యక్రమాల అమలు సంతోషాన్నిస్తోంది. మరోవైపు అస్తవ్యస్తమైన ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టాల్సి రావడం, ఆదాయాన్ని సమకూర్చుకోలేని పరిస్థితుల్లో ఉండటం చాలెంజింగ్‌గా ఉన్నాయి.

ప్రజాభవన్‌కు ఎప్పుడైనా రావొచ్చు..

గతంలో ఉన్న ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చాం. వాస్తవానికి సీఎంకు కూడా ఇంత పెద్ద భవనం అవసరం లేదు. అందుకే ప్రజాభవన్ ద్వారాలు తెరిచిపెట్టాం. ప్రజలు ఎప్పుడైనా రావచ్చు. సమస్యలపై దరఖాస్తులు ఇవ్వొచ్చు. సీఎం, నేను ఇతర మంత్రివర్గ సహచరులమంతా రోజుకు 18 గంటలు పనిచేస్తున్నాం. మా ప్రభుత్వ పాలనకు 100కు 100 మార్కులు వేయొచ్చు. ప్రతి మంత్రి కార్యాలయాల డోర్లు తెరిచే ఉంటున్నాయి. ప్రజలు ఎప్పుడైనా వెళ్లి కలవచ్చు.

కేసీఆర్‌వన్నీ అబద్ధాలే..

ఐదు నెలల్లో తెలంగాణ ఇంత ఆగమైతదా అని కేసీఆర్ అంటున్న మాటలు వింటే నవ్వు వస్తోంది. అబద్ధాల పునాదులపై ఆయన బీఆర్ఎస్‌ను నడుపుతున్నారు. వాళ్లే కట్క బంద్ చేసుకుని కరెంటు కట్ అయిందంటారు. ఆ పెద్దమనిషి అంతగా దిగజారిపోయాడు. కరెంటుకు ఏం మాయరోగం వచ్చిందని అంటున్న కేసీఆర్.. ఒక్కసారి కరెంటు తీగలను పట్టుకుని చూస్తే కరెంటు ఉందో లేదో అర్థమవుతుంది. వాస్తవానికి వెలుగును చూడలేని మాయరోగం కేసీఆర్‌కే వచ్చింది. ఆయన ఎక్కువగా చీకట్లో, ఒంటరిగా ఉంటూ.. ప్రజల సొమ్మును ఎలా దోచుకోవాలో ఆలోచిస్తుంటారు.

చక్కదిద్దేందుకు పదేళ్లు పడుతుంది

తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల వలయంలోకి నెట్టారు. దీన్నుంచి రాష్ట్రాన్ని బయటపడేయడం ఒక్కరోజులోనో, ఒక్క ఏడాదిలోనో అయ్యేది కాదు. కనీసం పదేళ్లు పడుతుంది. తెచ్చిన అప్పులను కూడా నిరర్థక ఆస్తులపై పెట్టి.. అప్పు చేసి పప్పుకూడు అన్నట్టు వ్యవహరించారు. అప్పులు చేస్తే సాగర్, శ్రీశైలం, ఎస్సారెస్పీ, జూరాల వంటి ప్రాజెక్టులు కట్టాలి. బీహెచ్ఈఎల్ లాంటి సంస్థలు ఏర్పాటు చేయాలి. ఓఆర్ఆర్, మెట్రోరైలు, అంతర్జాతీయ విమానాశ్రయం లాంటి రవాణా వ్యవస్థలను నెలకొల్పాలి. కాళేశ్వరం లాంటి గుదిబండను కట్టడం కాదు.



పద్ధతి ప్రకారమే టికెట్లు ఇచ్చాం

బీజేపీ, బీఆర్ఎస్‌ల్లాగా నియంతృత్వ ధోరణుల్లో కాంగ్రెస్ టికెట్ల కేటాయింపు ఉండదు. పార్టీ రాజ్యాంగంలోని అన్ని పద్ధతులను పాటించి అభ్యర్థులను ఖరారు చేశాం. అందుకే జాప్యం జరిగింది. పార్టీ అధిష్టానం అన్నీ ఆలోచించాకే టికెట్లు ఇస్తుంది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

బీఆర్ఎస్ నుంచి చాలా మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు. బీఆర్ఎస్‌లో ఇమడలేకపోతున్నాం, ఉండలేకపోతున్నామని అంటున్నారు. చాలా మంది నాతో మాట్లాడారు కూడా. అయితే ఎందరు చేరతారు, ఎప్పుడు చేరతారనేది బయటికి చెప్పలేం. బీఆర్ఎస్‌కు ప్రజాదరణ పెరుగుతుందని ఎవరైనా అంటే నవ్వుకోవాల్సిందే. అది అయిపోయిన పార్టీ. ఈ విషయం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా అర్థమై పోయింది. అందుకే బయటకు వచ్చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

ప్రజా ప్రభుత్వం మాది. ఇందిరమ్మ రాజ్యం మాది. ప్రజలకోసమే పనిచేస్తాం.. మతతత్వ, నియంతృత్వ ధోరణులతో కూడిన బీఆర్ఎస్, బీజేపీలను దూరంగా పెట్టి కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో పట్టం కట్టాలి.." అని భట్టి పేర్కొన్నారు.

బీజేపీ రిజర్వేషన్లు ఎత్తేయడం ఖాయం

"దేశంలో రిజర్వేషన్లను అమలు చేయడం బీజేపీకి ఇష్టం లేదు. అందుకే దేశవ్యాప్తంగా కులగణన చేయాలంటూ రాహుల్ గాంధీ పదేళ్లుగా నినదిస్తున్నా పట్టించుకోవడం లేదు. బీసీలకు జనాభా దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎగ్గొట్టడంతోపాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఎత్తివేయాలనేది బీజేపీ వ్యూహం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే కులగణన చేస్తాం. ఓబీసీలకు రాజ్యాంగపరంగా వాటా ఇస్తాం. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పార్టీ కార్యకర్తలు, అభిమానులు మాత్రమే ఓట్లేశారు. ఇప్పుడు మా గ్రాఫ్ పెరిగింది. గతంలో ఓటేయని వారు కూడా మాకు ఓటేస్తామంటున్నారు."

Sakshi.com ఇప్పుడు సరికొత్తగా మీ ముందుకు

'గుడ్ మార్నింగ్.... ఇదొక అందమైన మార్నింగ్' అంటూ 16 ఏళ్ల క్రితం తెలుగు లోగిళ్లను.. తాకిన 'సాక్షి'ని తెలుగు ప్రజలందరూ అభిమానపూర్వకంగా మీ మనసుల్లో నిలుపుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ వార్తా ప్రపంచంలో ఒంటెత్తు పోకడకు ఫుల్‌స్టాప్ పెడుతూ నాణేనికి మరోవైపును చూపుతూనే ఉంది 'సాక్షి'. ఆల్‌కలర్ పేజీలు, ఏకకాలంలో 23 ఎడిషన్లతో మొదలైన సాక్షి తరువాతి కాలంలో దినదిన ప్రవర్ధమానమై శాటిలైట్ చానల్, డిజిటల్ మీడియాకూ విస్తరించింది. పాఠకుల అవసరాలు.. మనోభావాలకు తగ్గట్టుగా తనను తాను మలచుకోవడంలో సాక్షి ఎల్లప్పుడూ ముందు వరుసలోనే ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలు, డిజైన్లతో 'సాక్షి' చానల్ ఇటీవలే సరికొత్త రూపు సంతరించుకున్న విషయం మీకు తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు... "Sakshi.com"కు కూడా కొత్త సొబగులు అద్దుతున్నాం.

జర్నలిజం విలువలలో ఏమాత్రం రాజీ పడకుండా... డిజైనింగ్, నావిగేషన్ విషయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ మీకోసం మరింత అందంగా తయారైంది మీ వెబ్‌సైట్! కంటికి ఇంపుగా... వార్తలు చదివేందుకు మరింత సులభతరంగా ఉంటుంది ఇది. ఇంటర్నెట్ తాజా పోకడలను ప్రతిబింబించే లుక్ అండ్ ఫీల్, సులభంగా నావిగేట్ చేసుకునే యూజర్ ఇంటర్‌ఫేస్, ఏ డివైజ్‌కైనా అనుకూలంగా మారే రెస్పాన్సివ్ వెబ్‌సైట్, నచ్చిన కంటెంట్‌ను సిఫార్సు చేసే టూల్స్, అంతే కాదు.. వార్తలు చదువుకోవడంతోపాటు హాయిగా మల్టీ మీడియాలో ఫొటోలు, వీడియోలు చూడవచ్చు, గేమ్స్ ఆడుకోవచ్చు. వీటితోపాటే సాక్షి మొబైల్ అప్లికేషన్‌ను కూడా ఆధునీకరించాం. మీరు మొబైల్ యాప్‌లో సాక్షిని ఫాలో అవుతుంటే (ఆండ్రాయిడ్ లేదా iOS) యాప్‌ను ఒక్కసారి అప్‌డేట్ లేదా రీఇన్‌స్టాల్ చేసుకోవడమే తరువాయి. సరికొత్త డిజైన్, లుక్స్‌తో సాక్షి.కామ్ మీ ముందు ప్రత్యక్షమవుతుంది.

దశాబ్ద కాలంగా sakshi.comని ఆదరిస్తున్న పాఠకదేవుళ్ల మాపై ఉంచిన విశ్వాసాన్ని కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాము. డిజిటల్ ప్లాట్‌ఫాంల రీడర్‌షిప్‌ను లెక్కించే అధీకృత వ్యవస్థ comscore ప్రకారం.. తెలుగు న్యూస్ వెబ్‌సైట్లలో www.sakshi.com అత్యధిక యూనిక్ విజిటర్స్‌తో చాలాకాలంగా మొదటి స్థానంలో ఉంది. (··Source: comscore).

సాక్షి కుటుంబంలో మీరంతా సభ్యులైనందుకు గర్విస్తున్నాం. కొత్త రూపంలో మీ ముందుకొచ్చిన sakshi.comను ఆశీర్వదించండి.

– ఎడిటర్, సాక్షి మీడియా గ్రూప్

సుప్రీంలో పత్తిరెడ్డి కేవియెట్

సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి 2021లో జరిగిన ఎన్నికల్లో తన సంతకం ఫోర్జరీ చేశారన్న కేసులో తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ దండె విఠల్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తన వాదనలు వినాలని పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కేవియెట్ దాఖలు చేశారు. అప్పటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని పత్తి రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నివేదిక ఆధారంగా దండె విఠల్ ఎన్నిక చెల్లదంటూ పత్తిరెడ్డికి అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ విఠల్ సుప్రీంకోర్టును ఆశ్ర యించే అవకాశం ఉన్న నేపథ్యంలో పత్తిరెడ్డి కేవియెట్ దాఖలు చేశారు.

నేడు రాహుల్‌గాంధీ పర్యటన

- నర్సాపూర్, సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే జనజాతర సభలకు హాజరు
- ప్రియాంకాగాంధీ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నేడు తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నర్సాపూర్‌లో జరిగే జనజాతర సభకు హాజరుకానున్న ఆయన, ఆరు గంటలకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే జనజాతర సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రెడ్డి కూడా పాల్గొననున్నారు. ఈనెల 10వ తేదీన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించనున్న ఆయన సాయంత్రం 4 గంటలకు భువనగిరి నియోజకవర్గ పరిధిలోని నకిరేకల్‌లో జరిగే జనజాతర సభకు హాజరవుతారు. అదే రోజున సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 10 గంటలకు పటాన్‌చెరు, సాయంత్రం 4 గంటలకు మక్తల్, 6 గంటలకు షాద్‌నగర్ కార్నర్ మీటింగ్‌లకు హాజరవుతారు. కాగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఈనెల 11న ఎన్నికల ప్రచారానికి రానున్నారు. తొలుత నిర్ణయించిన విధంగా కాకుండా హైదరాబాద్ నగరంలో ఆమె పర్యటన రద్దయినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఉదయం 11 గంటలకు కామారెడ్డిలో, మధ్యాహ్నం ఒంటిగంటకు తాండూరు సభల్లో ఆమె పాల్గొంటారని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించాయి.

బంగారం ధర తగ్గాలంటే రాహుల్ ప్రధాని కావాలి


- గాంధీ కుటుంబ త్యాగాల ముందు మోదీ, అమిత్‌షా జీరో: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల క్రి తం తులం బంగారం రూ. 28 వేలు ఉండేదని, మోదీ ప్రధాన మంత్రిగా బాధ్య తలు స్వీకరించాక అది రూ. 76 వేలకు చేరిందని, మళ్లీ బంగారం ధరలు తగ్గాలంటే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడమొక్కటే మార్గమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి చెప్పారు. అందుకే తెలంగాణ మహిళలు ఆలోచించి వారి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్‌తో కలిసి ఆయన విలేక రులతో మాట్లాడుతూగాంధీ కుటుంబ త్యాగాల ముందు మోదీ, అమిత్‌షాల రాజకీయం జీరో అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ఇప్పుడు మాజీ ప్రధాని పీవీ ఇంటికి వెళ్లి ఏదో మాట్లాడుతున్నారని, సోనియా గాంధీ పీవీని ప్రధాని చేయకపోతే ఆయన ఇప్పుడు వారి ఇంటికి వెళ్లేవాడా అని ప్రశ్నించారు.

పదేళ్లలో మోదీ చేసిందేమీ లేదు

- మాజీ ఎంపీ హనుమంతరావు



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పడానికేమీ లేదని మాజీ ఎంపీ వి.హనుమంతరావు విమర్శించారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మరోసారి మోదీ వస్తే ఆదానీ, అంబానీలను కోటీశ్వరులను చేస్తారు తప్ప.. పేదలకు ఏం చేయరని విమర్శించారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న 25 లక్షల మందిని పైకి తీసుకొచ్చానని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ.. ఇంకా ఉచిత బియ్యం ఎందుకు ఇస్తున్నారో చెప్పాలని నిలదీశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకం వేతనాన్ని రూ.400లు చేస్తామని, రాహుల్‌గాంధీ కులగణన చేపడతారని హామీ ఇచ్చారు. దేశం సమష్టిగా ఉండాలంటే కాంగ్రెస్ రావాలని ఆకాంక్షించారు. అయితే కాంగ్రెస్ ఇప్పటి వరకు ఏం చేసిందో చెప్పుకోవడంలో విఫలమవుతున్నారని వీహెచ్ అభిప్రాయపడ్డారు.

కంటోన్మెంట్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఎన్నికల తర్వాత దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన రెజిమెంటల్‌బజార్‌లో కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి, కంటోన్మెంట్ అభ్యర్థి శ్రీగణేశ్ తరపున ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజవర్గానికి రాబోయే 4 ఏళ్ల ఏడు నెలల్లో ప్రతి ఏడాది 6 వేల ఇళ్ల చొప్పున కేటాయించి, ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అరెస్టై జైళ్లో ఉన్న బిడ్డను విడిపించుకునేందుకు, తాను జైలుకు వెళ్లకుండా ఉండేందుకు బీజేపీతో కేసీఆర్ కుమ్మక్కయ్యారని పొంగులేటి ఆరోపించారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ అభివృద్ధి చేయకుండా, ఇప్పుడు ప్రజలపై ప్రేమను కురిపిస్తూ కర్రపట్టుకుని ఉద్యమిస్తానంటున్నారని మండిపడ్డారు. తెలంగాణకు రూ.9 లక్షల కోట్ల నిధులు కేంద్రం నుంచి తెచ్చామని కిషన్‌రెడ్డి అంటున్నారని, కానీ రూ.27 లక్షల కోట్లు పన్నుల రూపంలో తెలంగాణ నుంచి తీసుకున్న కేంద్రం భిక్షం వేసినట్లు కేవలం రూ.9 లక్షల కోట్లు ఇచ్చిందని విమర్శించారు. రాహుల్‌గాంధీకి పదవి చేపట్టాలని ఆలోచన లేదన్నారు. సునీతా మహేందర్‌రెడ్డిని, శ్రీగణేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనంపల్లి హన్మంతరావు, సర్వే సత్యనారాయణ, శ్రీగణేశ్, సునీతా మహేందర్‌రెడ్డి, ముప్పిడి గోపాల్, బద్రీనాథ్ యాదవ్ స్థానిక నాయకులు బాబూరావు, గౌరీశంకర్, రవి, శ్రవణ్, జూడ్‌పాల్, మరియన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ అనేది శరీరాన్ని నడుపుతుంది.
తనను వ్యక్తం చేసుకోవడానికి అవయవాలను వాడుకుంటుంది.
– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 9 మే 2024

అన్నీ తెలిసినా అలసత్వమే!

సమస్య తెలుసు... దానికి పరిష్కారమూ తెలుసు... తక్షణమే అందుకు నడుము కట్టకపోతే మానవాళి జీవనానికే ప్రమాదమనీ తెలుసు. అన్నీ తెలిసినా ప్రపంచ దేశాలు ఇప్పటికీ ఒక్కతాటి మీదకు రాలేకపోతున్నాయంటే ఏమనాలి? ప్రపంచాన్ని పీడిస్తున్న ప్లాస్టిక్ కాలుష్యభూతంపై పరిస్థితి సరిగ్గా అదే! సరికొత్త అంతర్జాతీయ ఒడంబడిక నిమిత్తం గత వారం ఒట్టావాలో జరిగిన సమావేశం స్పష్టమైన నిర్ణయాలేమీ తీసుకోకుండానే చప్పగా ముగిసింది. అందరిలోనూ అసంతృప్తి మిగిల్చింది. 192 దేశాల ప్రతినిధులు వారం పాటు సమావేశమై చర్చలు జరిపినా, ఆఖరి రోజున సమావేశాన్ని అర్ధరాత్రి దాకా పొడిగించినా ఫలితం లేకపోయింది. ఒప్పందంపై ఒక నిర్ణయం కుదరలేదు. ప్లాస్టిక్ భూతాన్ని నిరోధించాల్సిన అవసరం ఉందని అధిక భాగం దేశాలు అంగీకరించినప్పటికీ, ఉత్పత్తిపై పరిమితులు విధించడం మీద ఒక్కతాటిపైకి రాలేకపోయాయి. ఇది నిరాశ కలిగించే పరిణామం.

పెట్రోలియమ్ ఉప ఉత్పత్తులైన ప్లాస్టిక్‌లపై దేశాల ఆలోచనలు వేర్వేరుగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన అనేక ధనిక దేశాల్లో ప్లాస్టిక్‌ల తయారీ, పంపిణీ పరిశ్రమ జోరుగా సాగుతోంది. సహజంగానే పెట్రోకెమికల్ పరిశ్రమ వృద్ధిచెందిన ఆ దేశాలు, పారిశ్రామిక గ్రూపులేమో ప్లాస్టిక్ ఉత్పత్తిపై పరిమితి విధించాలనే యోచనను వ్యతిరేకించాయి. ప్రస్తుతానికి వాటి మాటే పైచేయి కాగా, ఒడంబడికపై నిర్ణయం అక్కడికి ఆగింది. ప్లాస్టిక్‌పై అంతర్జాతీయ ఒడంబడిక ప్రక్రియ 2022లోనే మొదలైంది. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, వాటి ఉత్పత్తిని ఆపేయడానికి ఒక నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి. అందుకోసం ప్రభుత్వ ప్రతినిధులతో కూడిన అంతర్ ప్రభుత్వ చర్చల కమిటీని ఏర్పాటు చేశాయి. ఈ ఏడాది డిసెంబర్ కల్లా ఒడంబడికను ఖరారు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే తాజాగా ఒట్టావాలో నాలుగో విడత చర్చలు జరిగాయి.

ఇవాళ వివిధ రకాల ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయింది. అందుబాటు ధరల్లో ప్రత్యామ్నాయాలు లేని పరిస్థితి. ఇది పెద్ద ఇబ్బంది. గణాంకాలలో చెప్పాలంటే... ఏటా ప్లాస్టిక్ ఉత్పత్తి 1950లో 20 లక్షల టన్నులుండేది. 2019 నాటికి 4600 లక్షల టన్నులకు చేరింది. వచ్చే 2060 నాటికి అది అంతకు మూడింతలు అవుతుందని అంచనా. దానికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారింది. పైపెచ్చు, భూమిలో కలవని ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రస్తుతం ఏటా 740 టన్నులుండగా, రానున్న 2050 నాటికి అది ఏటా 1220 లక్షల టన్నులకు చేరనుంది. విధానపరమైన మార్పులు చేపట్టకుంటే ఇది పెను సమస్యే. అందుకే, వ్యర్థాల లోపభూయిష్ఠ నిర్వహణను వచ్చే 2040 కల్లా సున్నా స్థాయికి తేవాలనేది లక్ష్యంగా ఒడంబడిక ప్రక్రియకు రెండేళ్ళ క్రితమే శ్రీకారం చుట్టారు.

వ్యర్థాలే కాదు... అసలు ప్లాస్టిక్ ఉత్పత్తే పర్యావరణానికి పెను ప్రమాదం. ప్లాస్టిక్ భూమిలో కలసిపోదు గనక పర్యావరణానికీ, ప్రజారోగ్యానికీ పెద్ద దెబ్బ. ప్లాస్టిక్ ఉత్పత్తితో గ్రీన్ హౌస్ వాయువులు వెలువడి భూతాపం పెరుగుతుంది. ప్లాస్టిక్ ఉత్పత్తికి ఉపకరించే పెట్రోకెమికల్స్ తయారీకై శిలాజ ఇంధనాల వెలికితీత, రిఫైనింగ్‌తో ఒక్క 2019లోనే 2.24 గిగా టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి వదిలినట్టయిందట. పాత లెక్కల వంతున ఏటేటా 4 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తి పెరిగినా సరే, వచ్చే 2050 నాటికి ఇది మూడు రెట్లై ఈ గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణం 6.78 గిగా టన్నులకు చేరుతుంది. ఒడంబడికతో ఈ పరిమాణాన్ని 26 శాతం మేర తగ్గించాలని లక్షించారు. మనం వాడే ప్లాసిక్‌లలో 16వేల రకాల రసాయనాలుంటాయి. వాటిలో కనీసం 4200 విషపూరితమే. వాటి వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలతో 2015లో అమెరికాలో 9200 కోట్ల డాలర్ల పైగా ఖర్చయింది.

ఈ నేపథ్యంలోనే ప్లాస్టిక్‌ల వినియోగం తగ్గించాలనీ, వాటిని రీసైక్లింగ్ చేయాలనీ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కానీ, అవేవీ ఇప్పటి దాకా అనుకున్నంత విజయం సాధించలేదు. ఉత్పత్తిపై పరిమితులు విధించడం కన్నా, వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగంపై దృష్టి పెట్టాలని తాజా భేటీలోనూ ప్రధాన దేశాలు పట్టుబట్టాయి. అయితే, కేవలం వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్‌లతో ప్లాస్టిక్ సంక్షోభానికి ఫుల్‌స్టాప్ పెట్టడం జరగని పని. నిష్ఠురమైనా అది నిజం. ప్రపంచంలో పోగైన ప్లాస్టిక్ వ్యర్థాల్లో 10 శాతమే ఇప్పటి దాకా పునర్వినియోగమైంది. మిగతా వ్యర్థాలన్నీ సముద్రాలు, నేలల్లో మిగిలాయి. ప్లాస్టిక్ ఉత్పత్తి మాత్రం ఏటేటా పెరుగుతూ పోతోంది. అందుకే, ప్లాస్టిక్‌ల ఉత్పత్తిపై నియంత్రణకు ప్రపంచ దేశాలు వీలైనంత తొందరగా ఒక అంగీకారానికి రావాల్సి ఉంది. ఒట్టావా సమావేశంలో కొంత పురోగతి సాధించినట్టు ఐరాస అంటున్నా, అది వట్టి కంటి తుడుపే!

కొన్నేళ్ళుగా మైక్రో, నానో ప్లాస్టిక్‌లు మానవ రక్తంలో, చివరకు గర్భిణుల మావిలోనూ కనిపిస్తున్నాయని శాస్త్రవేత్తల మాట. ఇది ఆందోళనకర పరిణామం. అందుకే, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ చాలదు. ఉత్పత్తిని బాగా తగ్గించడమే దీర్ఘకాలంలో ఉపయోగం. మన దేశం 2022లోనే 'ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు' తీసుకొచ్చి, 19 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించింది. అయితే, ప్రాంతానికో రకం నిబంధనలున్నందున వాటి వినియోగం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. దీనిపై దృష్టి సారించాలి. ప్రపంచ దేశాలు ఈ ఏడాదిలోనే మరో విడత బుసాన్‌లో సమావేశం కానున్నాయి. అప్పటికైనా అవి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. మొదలైన వందేళ్ళ లోపలే మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్‌లపై పోరుకు ఒక్క మాట మీద నిలవాలి. ధనిక దేశాలు తమ వాణిజ్య ప్రయోజనాలకు పక్కనబెట్టి మరీ ప్లాస్టిక్ భూతాన్ని పారదోలే పనిలో మిగతా దేశాల చేయి పట్టుకొని ముందుకు నడవాలి. ప్రమాదం తెలుస్తున్నా పట్టించుకోకుండా, పరిష్కారంపై చర్చలను ప్లాస్టిక్ లాగా సాగదీస్తూ పోతే మనకే కష్టం, నష్టం.

బీద పిల్లల గురించి ఆలోచించండి!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ వాళ్లు గ్రామీణ విద్యా వ్యవస్థను ప్రాంతీయ భాషామయం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ పిల్లలు చదువుకునే ప్రభుత్వ యూనివర్సిటీలలో ఇంగ్లిష్‌ను క్రమంగా తీసేసి ప్రాంతీయ భాషను, ముఖ్యంగా హిందీని రుద్దుతున్నారు. కానీ పెట్టుబడిదారుల యూనివర్సిటీల్లో ఇంగ్లిష్ భాష, విదేశీ సిలబస్ ద్వారా చదువు చెప్పి తిరిగి దేశ నాయకత్వాన్ని మొత్తం వారి చేతికి అప్పజెప్పే కుట్ర జరుగుతోంది. జగన్ ప్రభుత్వం విద్యా సమానత్వం కోసం అన్ని రకాల కుట్రలకూ వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేసి స్కూలు విద్యను మార్చింది. తెలుగుకు ప్రాధాన్యమంటూ ఇంగ్లిష్ మీడియం తీసివేస్తే పూర్తిగా నష్టపోయేది బీసీ, ఎస్సీ, ఎస్టీలు. జాగ్రత్తగా ఆలోచించి ఓటెయ్యకపోతే, బీద పిల్లల భవిష్యత్ అంధకారమౌతుంది.

దేశంలో ఎన్నికలు మొదటిసారి ఓబీసీల (వెనుకబడిన తరగతుల) చుట్టూ తిరుగుతున్నాయి. ఓబీసీల్లో అన్ని శూద్ర కులాలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో కొన్ని శూద్ర వ్యవసాయ కులాలు రిజర్వేషన్లలో లేకపోవచ్చు. కొన్ని రాష్ట్రాల్లో ఉండొచ్చు. ఉదాహరణకు రెడ్డి, కమ్మ, కోస్తా కాపు కులాలు రిజర్వేషన్లలో లేవు. కర్ణాటకలో, తమిళనాడులో అన్ని శూద్ర కులాలు రిజర్వేషన్లలో ఉన్నాయి. లింగాయత్, వక్కళిగ, నాయకర్ (పెరియార్ కులం) కులాలు కూడా ఆ రాష్ట్రాల్లో రిజర్వేషన్లలో ఉన్నాయి.

చారిత్రకంగా వర్ణ వ్యవస్థలో నాలుగవ వర్ణం శూద్రులు. వేద కాలంలో వారు బానిసలు. తరువాత వ్యవసాయ, కుటీర పరిశ్రమ, పశుపోషణ వంటి అన్ని ఉత్పత్తి పనులు చేసి దేశాన్ని ఈ స్థితికి తెచ్చింది ఈ కులాలే. క్రమంగా వీరి నుండి విడగొట్టబడి అంటరాని వారుగా అణగదొక్కబడ్డవారు దళితులు. వీరు కాక అరణ్య జీవనం నుండి అందరిలో కలిసే ప్రయత్నం చేస్తున్నవారు ఆదివాసులు. ఇంగ్లిష్ మీడియం వంటి సమాన విద్యే ఈ కుల వ్యవస్థను కూల్చుతుందని మనకు ఈమధ్య కాలంలోనే అర్థమవుతోంది. అందుకు మంచి ఉదాహరణ ఈ సంవత్సరం 10వ తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్నవారు ఆంధ్రలో 91 శాతం పాస్ అయితే, తెలంగాణలో 93 శాతం పాసయ్యారు. తెలుగు మీడియంలో చదువుకున్నవారు 80 శాతంగానే పాసయ్యారు.

రిజర్వేషన్ల మాటేమిటి?

అయితే 2024 ఎన్నికల్లో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడం, అందులో ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లను క్రమంగా ఎత్తివేసే సవరణ చెయ్యడం గురించి చర్చ జరుగుతోంది. ఈ భయం బీజేపీ బయట ఉన్న వారికే కాదు, బీజేపీలో ఉన్నవారికి కూడా ఉన్నది. అయితే మరి మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయితే ఆయన బీసీ అని చెబుతున్నారు కనుక ఎలా తీసేస్తారు అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది? ఆరెస్సెస్ 1950లో రాజ్యాంగాన్ని డాక్టర్ అంబేడ్కర్ ఆనాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌కు అందించి అమలు చేసిన నాటి నుండి ఎస్సీ, ఎస్టీలకు అందులో పొందుపర్చిన రిజర్వేషన్ల పట్ల వ్యతిరేకతతో ఉంది. అంతకంటే ముఖ్యంగా 1955లో కాకా కాలేల్‌కర్ బీసీ రిజర్వేషన్ రిపోర్టును ఆనాటి నెహ్రూ ప్రభుత్వం తిరస్కరించినప్పుడు ఆరెస్సెస్ మంచి పని జరిగింది అనే ధోరణిలో ఉంది.

అయితే 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం బీపీ మండల్ రిపోర్టును అమలు చేసినప్పుడు ఆరెస్సెస్/బీజేపీ వ్యతిరేకించాయి. ఆనాడు కాంగ్రెస్ కూడా వ్యతిరేకించింది. కాంగ్రెస్‌లో ఉన్న బీసీ నాయకులు కొంతమందైనా బీసీ రిజర్వేషన్లను సపోర్టు చేశారు. కానీ బీజేపీలో ఉన్న బీసీల్లో ఒక్క ఉమాభారతి తప్ప వేరే ఏ ఒక్క బీసీ లీడర్ కూడా బీసీ రిజర్వేషన్లను సపోర్టు చెయ్యలేదు. నరేంద్ర మోదీ ఆనాడు రిజర్వేషన్లను సపోర్టు చెయ్యలేదు. ఆయన బీసీ అని కూడా ఎవ్వరికీ తెలియదు. గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాక మాత్రమే ఆయన బీసీగా ప్రచారం ప్రారంభించారు.



2014 ఎన్నికలకు ముందు ఆ ప్రచారాన్ని బాగా పెంచారు. ప్రధానంగా ఆనాడు బీసీల ఓట్లతో ఆయన గెలిచారు. అందుకు ఫలితంగా ఆయనగానీ, బీజేపీ/ఆరెస్సెస్ ప్రభుత్వంగానీ గత పదేండ్లలో బీసీలకు ఏమి ఇచ్చారు? మొత్తం శూద్ర సమాజం బతికేది వ్యవసాయ రంగం మీద. దాన్ని మొత్తంగా గుజరాత్–ముంబయి బడా పెట్టుబడిదారులకు అప్పగించేందుకు ఘోరమైన వ్యవసాయ వ్యతిరేక చట్టాలు తెచ్చారు. శూద్ర/బీసీలు ఇంతో అంతో బతికేది వ్యవసాయ ఉత్పత్తి, వ్యవసాయ మార్కెట్ల మీద. వాటిని బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పాలని చట్టాలు చేస్తే శూద్ర/బీసీ రైతులు ఎంత పోరాటం చేశారో వ్యవసాయదారులందరికీ తెలుసు. బీసీ, ఎస్సీ, ఎస్టీ పిల్లల స్కాలర్‌షిప్‌లు మొత్తం తగ్గించివేశారు. వీరు చదువుకునే ప్రభుత్వ యూనివర్సిటీలలో ఇంగ్లిష్‌ను క్రమంగా తీసేసి ప్రాంతీయ భాషను ముఖ్యంగా సెంట్రల్ యూనివర్సిటీల్లో హిందీని రుద్దుతున్నారు. కానీ పెట్టుబడిదారుల యూనివర్సిటీల్లో కేవలం ఇంగ్లిష్ భాష, విదేశీ సిలబస్ ద్వారా చదువు చెప్పి తిరిగి దేశ నాయకత్వాన్ని మొత్తం వారి చేతికి అప్పజెప్పే కుట్ర జరుగుతోంది.

చాలా విచిత్రంగా ఈ ఎన్నికల్లో ముస్లిం రిజర్వేషన్లను తీసేసి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామంటున్నారు. మోదీ, అమిత్ షా ఈ ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేస్తున్నారు. అసలు ముస్లింలకు రిజర్వేషన్లు యూపీఎస్సీలో ఉన్నాయా? కొన్ని రాష్ట్రాల్లో 4 శాతం లేదా అంతకంటే తక్కువ ఉన్నాయి. మొత్తం పారిశ్రామిక రంగాన్ని ప్రైవేటీకరిస్తూ, బీసీ, ఎస్సీ, ఎస్టీల పిల్లల్ని ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింలకు తగ్గించేది ఎక్కడ? బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చేది ఎక్కడ?

ప్రధానమంత్రి బీసీని అని చెబుతూ నా సిద్ధాంతం 'సనాతన ధర్మం' అంటే 'వర్ణధర్మం' అంటున్నారు. బీసీలు శూద్ర వర్ణం వారు కదా! సనాతన ధర్మం వారిని దైవ పాదాల నుండి పుట్టించింది కదా! అయినా మళ్ళీ ఈ రాజ్యాంగాన్ని మార్చకుండా శూద్రులందరినీ ఏ దేవుని పాదాల్లో పుట్టిస్తారు? ఈ రాజ్యాంగం ఆ పాదాల, తొడల, భుజాల, తల పుట్టుకను రద్దు చేసి అందరి పుట్టుకను సమానం చేసింది. బీసీ ప్రధానమంత్రి చిన్నప్పుడు చాయ్ అమ్మి ఉండవచ్చు. కానీ మట్టి మోసి, మనుషుల మలాన్ని ఎత్తివేసే పనులు చేసే పిల్లల్ని కనీసం చాయ్ వ్యాపారంలోకి కూడా రానియ్యలేదే! దళితులు చాయ్ చేస్తే ఈ దేశంలో పై కులాలు ఇప్పటికీ తాగడం లేదే! మానవ మనుగడకు మూలం వ్యవసాయం; ఆ పని చేసేవారంతా శూద్ర బీసీలు. వారికి బ్రాహ్మణులు, వైశ్యులు, క్షత్రియులు, ఖత్రీలు, కాయస్థులతో సమాన విద్య, సమాన పని హక్కు కల్పించే ఈ రాజ్యాంగాన్ని మార్చకుండా మళ్ళీ సనాతన ధర్మాన్ని స్థాపించడం సాధ్యం కాదు. ఇక్కడే బీసీలు జాగ్రత్తగా ఆలోచించాలి. మే 5న ఆంధ్రప్రదేశ్ బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ, తమ ప్రభుత్వం రాగానే తెలుగుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. తెలుగుకు ప్రాధాన్యమంటే, ఇంగ్లిష మీడియం తీసేయడమా? మరి అమిత్ షా తన కొడుకు జయ్ షాను గుజరాతీ మీడియంలో ఎందుకు చదివించలేదు? అదే అమిత్ షా... ధీరూబాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్లో మరాఠీ/గుజరాతీ మీడియం ఎందుకు పెట్టించలేదు? ఆంధ్రప్రదేశ్ బీసీ, ఎస్సీ, ఎస్టీలు జాగ్రత్తగా ఆలోచించి ఓటు వెయ్యకపోతే, బీద పిల్లల భవిష్యత్ అంధకార మౌతుంది.

ఓటు వేసే ముందు...

జగన్ ప్రభుత్వం విద్యా సమానత్వం కోసం అన్ని రకాల కుట్రలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేసి స్కూలు విద్యను మార్చింది. ఇంగ్లిష్ మీడియం తీసివేస్తే పూర్తిగా నష్టపోయేది బీసీ, ఎస్సీ, ఎస్టీలు. అమిత్ షా ప్రకటన చాలా ప్రమాదకర హెచ్చరిక. ఈ మధ్య కాలంలోనే మోదీ తమ ఎంపీ అభ్యర్థులందరికీ ఉత్తరాలు రాస్తూ అమిత్ షాను ఆకాశానికి ఎత్తారు. మోదీ తరువాత అమిత్ షానే ప్రధానమంత్రి అనే డైరెక్షన్ ఇచ్చారు. ఆయన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇంగ్లిష్ విద్య రానియ్యకూడదనే పట్టుదలతో ఉన్న వ్యక్తి.

ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాల్లో గ్రామీణ విద్యా వ్యవస్థను ప్రాంతీయ భాషామయం చేశారు. కానీ పెద్ద పెట్టుబడిదారులు వారి పిల్లల్ని ఇంగ్లిష్ తప్ప మరో భాష రాకుండా చూసుకుంటున్నారు. వీరి నేతృత్వంలో రేపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నడిస్తే, సమస్త భవిష్యత్ దెబ్బతింటుంది. గుజరాత్‌లో ఎప్పుడైనా ఆంధ్ర పాలకుల నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నడవగా చూశామా! ఆంధ్రప్రదేశ్‌లో కూటమికి ఓటు వేసే ముందు మొత్తం ప్రజలు ఆలోచించాల్సింది ఇదే.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకిలా మాట్లాడతారో!



మాటల్లేవు. బండగా చెప్పాలంటే: శామ్ పిట్రోడా మాట్లాడిన ప్రతిసారీ కాంగ్రెస్‌ను దెబ్బకొడుతున్నారు. కాంగ్రెస్ స్వీప్ చేయాలనుకుంటున్న దక్షిణ భారత జనాలు ఆఫ్రికన్లుగా కనబడుతున్నారా? తూర్పు భారతీయులు చైనీస్‌లా, పశ్చిమ భారతీయులు అరబ్బుల్లా ఉంటారా?

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

ఎందుకు సహిస్తావు?



అమెరికా విశ్వవిద్యాలయంలో ఒక యూదు విద్యార్థి అడిగాడు: 'ఒక స్నేహితుడితో సంబంధం తెంచుకోవడానికి ముందు ఎంత యూదు వ్యతిరేక నినాదాలను సహించాలి?' నేను అడిగాను: 'చనిపోయే ముందు ఎంత విషం తీసుకుంటావు?' యూదు వ్యతిరేకత, ముస్లిం బ్రదర్‌హుడ్‌లను ఎంత మాత్రం సహించని యూఏఈ దేశస్థుడిగా నేను గర్వపడతాను.

– అమ్జద్ తాహా, పశ్చిమాసియా రాజకీయాల వ్యాఖ్యాత

ఇండియాలో కొరియా



సంగీతం, సినిమాలు, భాష నుంచి ఆహారం వరకు కొరియా సంస్కృతిని భారతీయులు ఎలా అంగీకరించారో చూడటం ఆసక్తికరం. డెహ్రాడూన్‌లో ఒక కొరియన్ కెఫె ఉంటుందని నేనసలు ఊహించలేదు. కొరియా, ఉత్తరాఖండ్‌లకు చెందిన ఇద్దరు దీన్ని నడుపుతున్నారు. ఇలాంటివి మారుతున్న సంస్కృతినీ, స్థలాలనూ అర్థం చేయిస్తాయి.

– సదాఫ్ హుస్సేన్, షెఫ్

మాకు సంబంధం లేదు!



ఒక పాడ్‌కాస్ట్‌లో భారతదేశ వైవిధ్యాన్ని విశదపరచడానికి శామ్ పిట్రోడా చెప్పిన పోలికలు దురదృష్టకరమైనవి, అంగీకరించ లేనివి. భారత జాతీయ కాంగ్రెస్‌కు ఆ మాటలతో ఏ మాత్రం సంబంధం లేదు.

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ నేత

అసలు కారణం



'పరిణతి' సాధించేవరకు మాయావతి తన మేనల్లుడు 'ఆనంద్'ను పార్టీ పదవి నుంచి తొలగించారు. నిజమైన కారణం: నిజాయితీ గల దళిత నాయకుడిగా ఆయన బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడారు.

– షాహిద్ సిద్దిఖీ, ఆర్‌ఎల్‌డీ మాజీ నేత, సంపాదకుడు

ఒప్పుకున్నదే... తప్పంటున్నారు!

ఎన్నికల వేళ చంద్రబాబు, ఆయన ప్యాకేజీ బృందం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చేస్తున్న ప్రచారం అచ్చం 'ఒక బ్రాహ్మణుడు – నలుగురు దొంగల కథ'ను గుర్తు చేస్తోంది. ఈ బిల్లును జగన్ సర్కార్ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఈ బిల్లును స్వాగతించారు. రెండు వందల ఏళ్ల తర్వాత మొదటి సారి భూ సర్వే చేసి భూ యాజమాన్య హక్కులు కల్పించటం విప్లవాత్మక నిర్ణయం అని అభినందించారు. రామోజీ రావు తన ఈటీవీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ఉన్న ప్రయోజనాలపై ప్రత్యేక కథనాన్నే వెలువరించారు. ఇదంతా పక్కన పెట్టి కానీ ఎన్నికల సమయంలో ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయంగా లబ్ధి పొందడానికి భారీ కుట్రను సిద్ధం చేశారు టీడీపీ అధినేత చంద్రబాబు.



బాబు డైరెక్షన్‌తో ఆయన దత్త పుత్రుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కాదు జగన్ గ్రాబింగ్ యాక్ట్ అంటూ రెచ్చిపోతున్నారు. బాబు సొంత పుత్రుడు లోకేష్ ఇదే స్క్రిప్ట్ తన సభల్లో అప్పజెప్పటమే కాకుండా ఏకంగా తన వాయిస్‌తో రికార్డ్ చేసి ఐవీఆర్ విధానంలో ఓటర్ల ఫోన్లకు పంపిస్తున్నారు. రిటైర్ అయిన తన వర్గ ఐఏఎస్‌లు ట్వీట్ల రూపంలో అప్పజెప్పిన పని పూర్తి చేస్తున్నారు. సీపీఐ నారాయణ అయితే ఏకంగా ఓ పొలంలో కూర్చుని బాబు స్క్రిప్ట్‌ను అక్షరం పొల్లుపోకుండా చేతిలో పట్టాదారు పాసు పుస్తకం పట్టుకుని మరీ అప్పజెప్పారు. అది వీడియో తీసి మీడియాకు వదిలారు. వీటికి తోడు బాబు వర్గ ప్యాకేజీ మీడియా పుంఖానుపుంఖాలుగా పేపర్లు నింపేస్తోంది. టీవీల నిండా ఇవే డిబేట్లు, కథనాలు.

జగన్ వస్తే ఈ చట్టం పేరుతో మీకు సెంటు ఆస్తి ఉన్నా లాగేసుకుంటాడు అని బాబు బ్యాచ్ ప్రచారం చేస్తోంది. వాస్తవంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకుని రావాలన్న కసరత్తు 1989 నుంచే ప్రారంభం అయ్యింది. పలు ప్రయత్నాలు, కసరత్తుల తర్వాత 2019లో ఈ ప్రతిపాదన ఒక కొలిక్కి వచ్చింది. నీతి ఆయోగ్ బిల్లు డ్రాఫ్ట్ కాపీని ఉన్నతాధికారుల కమిటీ నేతృత్వంలో రూపొందించి దేశంలోని అన్ని రాష్ట్రాలకూ పంపించింది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం సివిల్ వివాదాల్లో 60 శాతానికి పైగా కేసులు భూ వివాదాలే. బ్రిటిష్ హయాంలో చేసిన భూ సర్వే ప్రకారమే ఇప్పటికీ రికార్డులు కొనసాగుతుండటం కూడా రికార్డుల నిర్వహణ మరింత సంక్లిష్టంగా మార్చింది. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం కోసం ఈ బిల్లును రూపొందించారు. కేంద్రం పంపించిన బిల్లును మన రాష్ట్రం అసెంబ్లీలో చర్చకు పెట్టింది. ప్రతిపక్ష టీడీపీ సభ్యులు చర్చలో పాల్గొని ఈ బిల్లుపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఇప్పుడేమో టీడీపీ అధినేత, ఆయన బృందం జగన్‌ను ఒక దోపిడీదారుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు.

వీరు ఇక్కడే కొన్ని కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంది. ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని అధికారంలో ఉన్న వాళ్లు ప్రజల ఆస్తులను దోచుకునే అవకాశం ఉంటే... ఇటువంటి బిల్లును కేంద్రం ఎందుకు రూపొందించింది? దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఎందుకు పంపించింది? మోదీ, అమిత్ షా కూడా దేశంలోని పేదల భూమిని కబ్జా చేయాలని కుట్ర పన్నారని చంద్రబాబు చెబుతున్నారా? కేంద్రం ముసాయిదా బిల్లు మాత్రమే పంపించిందనీ, అమలు చేయమని చెప్పలేదనీ పవన్ అంటున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా ఈ బిల్లు కేవలం అడ్వైజరీ మాత్రమేనని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. మరి వీరి భాషలో చెప్పాలంటే పేద ప్రజల ఆస్తులను లూటీ చేయమని, వాళ్ల భూములు లాక్కోమని కేంద్రం అన్ని రాష్ట్రాలకూ సూచించిందా? కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, ప్రధాని మోదీలతో కలిసి రెండు వేర్వేరు ప్రచార సభల్లో పాల్గొన్నప్పుడు వారిని ఎందుకు ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోమని చంద్రబాబు అడగలేదు? పవన్ కల్యాణ్ మోదీతో కలిసి రాజమండ్రిలో వేదిక పంచుకున్నప్పుడైనా ప్రధానిని ఈ విషయం అడగాలి కదా! ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ప్రజల్లో అపోహలు సృష్టించి, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం పట్ల ప్రజల్లో అపనమ్మకం కలిగేలా కుట్రలు పన్నటం రాజకీయాల్లోనే కాదు, మొత్తం సమాజానికి మంచిది కాదు. ఇది అడవి కాదు... చైతన్యవంతమైన సమాజం అని చంద్రబాబు, ఆయన ప్యాకేజీ బృందం అర్థం చేసుకుంటే మంచిది.

– ఆర్ఎస్

చావుతో దోబూచులాడిన విప్లవ యోధుడు!

సందర్భం



మల్లు కపోతం రెడ్డి


తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, గొప్ప ప్రజాప్రతినిధి భీమిరెడ్డి నరసింహారెడ్డి (బీఎన్). తుపాకిపట్టి సాయుధ దళాలకు నాయకత్వం వహించి నిజాం రాజును గడగడలాడించిన బీఎన్... ఆ తర్వాతి కాలంలో చట్టసభల్లో ప్రజావాణిని వినిపించడంలోనూ అంతే స్ఫూర్తిమంతమైన పాత్ర నిర్వహించారు. కమ్యూనిస్టు యోధులకు జన్మనిచ్చిన కర్మాగారంగా పేరుబడ్డ కర్విరాల కొత్తగూడెంలో ఓ భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. అయినా మధ్యతరగతి, పేద రైతులు, ప్రజల పక్షాన జీవితాంతం నిలబడ్డారు.

కమ్యూనిస్టు దిగ్గజం దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ) అత్తగారి ఊరు బీఎన్ స్వగ్రామానికి సమీప గ్రామం గోరంట్ల. ఆయన అక్కడికి వచ్చిన సందర్భాలలో వ్యవసాయ బావుల వద్ద తరచూ బీఎన్ కలుస్తుండేది. డీవీ ఇచ్చిన 'పల్లెటూరు పేదలు' అనే పుస్తకంతో పాటు ఇతర విప్లవ సాహిత్యం చదివిన ప్రభావం, డీవీ సాహచర్య ప్రభావం బీఎన్‌పై ఉండేది. దేవులపల్లి వెంకటేశ్వరరావును తన రాజకీయ గురువుగా ఆయన చెప్పుకునేవారు.

10వ తరగతి పూర్తి చేసేనాటికే బీఎన్ తండ్రి మరణించారు. దీంతో వ్యవసాయ చేసే బాధ్యత తీసుకోవలసి వచ్చింది. పాలేర్లతోపాటు పని కూడా చేసేవారు. తనకన్నా బలంగా ఉన్న మాటలు రాని పాలేరూ, తానూ... గూడ వేస్తున్నప్పుడు పాలేరు సొమ్మసిల్లి పడిపోయాడు. ఆకలి వల్ల అలా జరిగిందని ఆరా తీస్తే తెలిసింది. మూగ పాలేరు పస్తులకు మూలమెక్కడ అన్న ఆలోచన లోంచి ఆయన పోరాట ప్రస్థానం ప్రారంభం అయింది.

అప్పట్లో 'ఆంధ్ర మహాసభ'కు పరిసర ప్రాంతాల యువతరంతో పాటు తోబుట్టువులైన శశిరేఖ, స్వరాజ్యం, దాయం ప్రియంవదలను తీసుకెళ్లేవారు. ఈ పునాదే మల్లు స్వరాజ్యాన్ని విప్లవ వనితగా మార్చింది. బండ్ల ముందు బరువులెత్తుకొని పరిగెత్తే బానిసత్వాన్ని ధిక్కరించేందుకు కోసు దూరం బరువు మోస్తే వీసం పైసలు ఇవ్వాలన్న అప్పటి ప్రమాణం ప్రకారమే భూస్వాములను అడగమని స్వగ్రామస్థుడైన చాకలి పుల్లయ్యను ప్రేరేపించారు. పర్యవసానంగా బీఎస్‌ను జైలులో బంధించారు. తరువాత తన కేసును తానే వాదించుకొని విడుదలయ్యారు.

పాలకుర్తిలో ప్రఖ్యాత వీరనారి కొల్గూరు ఐలమ్మ పక్షాన కల్లం దగ్గర జరిగిన బువ్వ గింజల యుద్ధంలో... విస్నూరు దొర కిరాయి గుండాలను తరిమికొట్టిందీ, ఆ తరువాత వడ్ల బస్తాలను తమ భుజాలపై మోసుకెళ్లి ఐలమ్మ ఘర్షలో పోసిందీ ఆయన గుతప దళమే. ఐలమ్మ పక్షాన నిలబడినందుకు విస్నూరు దొర కిరాయి గుండాలూ, ఆయనకు తొత్తులుగా పని చేసిన అప్పటి పోలీసులూ బీఎన్‌కూ, ఆయన దళ సభ్యులకు ఆసనాల్లో కారంబోసి చితకబాది చిత్రహింసలకు గురి చేశారు. గాయాలపై మూత్రం పోసి పైశాచిక ఆనందం పొందారు. ఆ తర్వాతి కాలంలో కమ్యూనిస్టులు



ఆయుధాలను చేపట్టి దళాలుగా ఏర్పడ్డారు. బీఎన్ స్వయంగా ఒక దళానికి నాయకత్వం వహించారు. 'బండెనక బండికట్టి' విప్లవ గీత రచయిత బండి యాదగిరి బీఎన్ దళ సభ్యుడే.

1947లో కోటపాడు, 1948లో కొడకండ్ల, 1949లో ఎల్లంపేటలో రైఫిల్ కాల్పుల రణగొణధ్వనుల మధ్య సాగిన భీకర కొట్లాటల్లో పదిసార్లు పైచిలుకు చావు నుంచి తప్పించుకున్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావుల ప్రోత్సాహంతో బాల్య వితంతువైన సరోజినిని వివాహమాడి... 'ఆదర్శాలు వల్లించటానికి కాదు ఆచరించడానికి'ని నిరూపించారు. పోరాట తొలినాళ్లలో ఆయన మొదటి సంతానం అడవుల్లో సరైన ఆహారం లేక, వైద్య సదుపాయానికి నోచుకోక మరణించాడు. ఇటువంటి నష్టాలూ, త్యాగాలూ ఆయన జీవితంలో ఎన్నో ఉన్నాయి.

1957–62, 1967–71ల్లో ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యునిగా; 1971–77, 1984–89, 1991–96లలో లోక్ సభ సభ్యునిగా నేటి ప్రజాప్రతినిధులకు స్ఫూర్తినిచ్చేలా పని చేశారు. ఆయన చట్టసభల్లో చేసిన ప్రసంగాల ప్రభావంతో అనేక జన హిత చట్టాలు రూపొందాయి. సొంత కారు లేని వేళ్ల మీద లెక్కపెట్టగలిగే ఎంపీ, ఎమ్మెల్యేలలో ఆయన ఒకరు. ఎస్ఆర్ఎస్‌పీ రెండవ దశ సాధించటం ద్వారా తెలంగాణలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పడావు పడ్డ భూములకు మేలు చేశారు. బీబీనగర్ – నడిగూడ రైల్వే లైన్ నిర్మాణం బీఎన్ కృషి ఫలితమే. భూ సంస్కరణల కోసం, ఆకలి దప్పులు లేని రాజ్యం కోసం చట్టాలు చేయాలని పార్లమెంటులో తన గళం వినిపించారు. ప్రకాశం జిల్లాలో పత్తి రైతుల ఆత్మహత్యలనూ, మహబూబ్ నగర్ జిల్లాలో ఆకలి చావులనూ వెలుగులోకి తెచ్చింది ఆయనే. 1997 డిసెంబర్‌లో సామాజిక న్యాయం కోసం సూర్యాపేటలో అతిపెద్ద ర్యాలీ నిర్వహించారు. 'రాయితీల కోసం కాదు రాజ్యాధికారం కోసం కొట్లాట కొనసాగించాలి' అని పిలుపునిచ్చిన తొలి తరం కాకలు తీరిన కమ్యూనిస్టు బీఎన్. 'రెక్కలు కాపాడుకోలేని పక్షులు ఎగర లేవు. హక్కులు కాపాడుకోలేని వ్యక్తి ఎదగలేడు' అంటూ ప్రజలను బీఎన్ ఉద్యమాల వైపు నడిపారు.

బీఎన్ మంచి రచయిత కూడా. 1989లో 'ఆయువు పట్టు' నవల రాశారు. 2003లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ప్రత్యక్ష అనుభవాలకు అక్షర రూపం ఇస్తూ 'భూమిక' అనే పుస్తకం రచించారు. పోరాటాల తొలి రోజుల్లో రాలిన రత్నాల చరిత్రలు ఇందులో నిక్షిప్తం చేశారు.

ఒకప్పుడు వందలాది ఎకరాలు కలిగిన కుటుంబం నుంచి వచ్చిన బీఎన్‌కు... చివరి రోజులకు వచ్చే నాటికి కనీస ఫర్నిచర్ లేని పాత గోడల ఇల్లు, కుక్కి మంచం, రెండు జతల ముతక బట్టలు, ఒక జత చెప్పులే మిగిలాయంటే ఆశ్చర్యపడనవసరంలేదు. 2008 మే 9న అంతిమ శ్వాస విడిచిన బీఎన్ తరతరాలకూ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు.

వ్యాసకర్త ప్రముఖ న్యాయవాది
(నేడు భీమిరెడ్డి నరసింహా రెడ్డి వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.పాడ్యమి ఉ.7.10 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** కృత్తిక ప.1.07 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.4.15 నుండి 6.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.47 నుండి 10.38 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృత ఘడియలు:** ప.10.46 నుండి 12.10 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.17.


నిజామాబాద్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో షబ్బీర్ అలీ, జీవన్‌రెడ్డి

బీజేపీ గెలిస్తే నియంత పాలనే!

▶ మొదటి పేజీ తరువాయి

విషయం తెలుస్తుంది. మరి కేసీఆర్ ఏం చేస్తున్నారు? రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ చేశారు. ఆగస్టు 15లోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి.. సిద్దిపేటకు పట్టిన శని హరీశ్‌రావును వదిలిస్తా. రాజీనామా రాసిపెట్టుకో హరీశ్‌రావు.. రైతులకు ధాన్యానికి రూ.500 బోనస్‌తోపాటు ఎర్రజొన్నలు, మొక్కజొన్న, సోయాకు గిట్టుబాటు ధరలు ఇస్తాం.

షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశాం. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాం. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ఇప్పటికే ఉపసంఘం వేశాం. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే చెరుకు రైతులకు రూ.47 కోట్ల బకాయిలు విడుదల చేస్తాం. ఎంపీ అర్వింద్ చెప్పిన్న పసుపుబోర్డు కాగితాలకే పరిమితమైంది. నిజాం చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తానని మాటిచ్చి తప్పిన కవితను ప్రజలు ఓడించి అర్వింద్‌ను గెలిపించారు. పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్ తేలేకపోయారు. పైగా షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని ప్రధాని మోదీ మళ్లీ అబద్ధాలు చెప్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి. మేం తప్పకుండా పసుపు బోర్డు ఏర్పాటు చేస్తాం.

రాజ్యాంగాన్ని మార్చితే ప్రజలు ఊరుకోరు

2021లోనే చేయాల్సిన జనగణన చేపట్టకుండా ప్రధాని మోదీ కుట్ర చేశారు. బీసీల కులగణనకు మోదీ ఎందుకు అడ్డుపడుతున్నారో చెప్పాలి. రాజ్యాంగాన్ని మార్చి.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేయాలన్న మోదీ ప్రభుత్వ కుట్రలో భాగమే. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని నచ్చినట్టు మార్చాలని చూస్తే జనం చూస్తూ ఊరుకోరు. రాజ్యాంగాన్ని మారిస్తే దేశం నియంత పాలనలోకి వెళుతుంది. రిజర్వేషన్లను రద్దు చేసే ప్రమాదం మెడ మీద కత్తిలా వేలాడుతోంది. అందుకే దేశ ప్రజలు బీజేపీని గొయ్యి తీసి పాతిపెట్టాలి.

చక్కెర కర్మాగారం అడిగితే గాడిద గుడ్డు ఇచ్చారు

రాష్ట్ర విభజన సమయంలో బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్, నల్లగొండలో ఐఐటీ, మెదక్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చింది. కానీ మోదీ ప్రభుత్వం వాటిని అమలు చేయలేదు. చక్కెర కర్మాగారం అడిగితే గాడిద గుడ్డు ఇచ్చారు.

దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి..

దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. దేవుడి ఫొటోలు చూపించి ఓట్లడిగే వారిని బిచ్చగాళ్లు అంటారు. రామాలయం ప్రతిష్టకు 15 రోజుల ముందే అక్షింతలు ఎక్కడి నుంచి వచ్చాయి? అక్షింతలు ముందే పంపిణీ చేయడం హిందూ సంప్రదాయం కాదు. బీజేపీ నాయకులు దేవుడిని, ప్రజలను మోసం చేస్తున్నారు..'' అని రేవంత్ ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

గ్రూప్-1 పోస్టులన్నింటికీ సమాన వేతనాలు ఉండాలి

- పీఆర్సీ కమిటీకి గ్రూప్-1 అధికారుల సంఘం విజ్ఞప్తి


పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న గ్రూప్-1 అధికారుల సంఘం ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా భర్తీ చేస్తున్న గ్రూప్-1 ఉద్యోగాలకు ఒకేరకమైన వేతనాలను నిర్ణయించాలని తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. తాజాగా టీఎస్‌పీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్‌లోని గ్రూప్-1 ఉద్యోగాలకు 3 రకాల వేతనాలున్నాయని, ఈ వ్యత్యాసాన్ని తొలగించి సమాన వేతనాలుండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. బుధవారం గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హన్మంతు, ప్రతినిధులు వేణుమాధవరెడ్డి, మరికి షన్, రమేశ్, ప్రేమ్‌కుమార్, అనిత తదితరులు పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్, సభ్యులు రామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తరహాలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఏబీ వెంకటేశ్వరరావు పిటిషన్ అనుమతి

- ఆయన్ని విధుల్లోకి తీసుకోవాలని ఏపీ సీఎస్‌కు సూచన

సాక్షి, హైదరాబాద్: తనపై రెండోసారి విధించిన సస్పెన్షన్‌ను రద్దుచేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు వేసిన పిటిషన్‌ను క్యాట్ అనుమతించింది. ఆయన్ని విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్పష్టం చేసింది. సస్పెన్షన్ సమయంలోని అలవెన్సులు, జీతభత్యాలు అందజేయాలని సూచించింది. కేంద్రప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇజ్రాయిల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలు తెచ్చినట్లు, అందులోను అవినీతి ఆరోపణలు రావడంతో ఏపీ ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును తొలిసారి సస్పెండ్ చేసింది. అంతేగాకుండా ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది. రెండేళ్లకు మించి ఆలిండియా సర్వీసెస్ అధికారుల సస్పెన్షన్ వద్దంటూ సుప్రీంకోర్టు సూచించడంతో ఆయన్ని సర్కార్ విధుల్లోకి తీసుకుంది. విధుల్లో చేరిన తర్వాత తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రెస్‌మీట్ల ద్వారా ట్యాపింగ్ కేసులో సాక్షులను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు రావడంతో ప్రభుత్వం మరోసారి ఆయన్ని సస్పెండ్ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ వెంకటేశ్వరరావు గత ఏడాది ఏప్రిల్‌లో క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జ్యుడిషియల్ సభ్యురాలు లతా బస్వరాజ్ పట్నే, నాన్-జ్యుడిషియల్ సభ్యురాలు శాలినీ మిస్రా ధర్మాసనం బుధవారం తుది ఉత్తర్వులు వెలువరించింది.

వానాకాలానికి 24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు

- అందులో 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా
- ఎరువుల ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ శాఖ



సాక్షి, హైదరాబాద్: రానున్న వానాకాలం సీజన్‌కు 24.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమ ని వ్యవసాయశాఖ నిర్ణయించింది. అందులో యూ రియానే 10.40 లక్షల మెట్రిక్ టన్నులు ఉంది. ఈ మేరకు వానాకాలం సీజన్-2024 ఎరువుల ప్రణాళికను బుధవారం విడుదల చేసింది. ఎరువుల ప్రణాళికను కేంద్రం ఆమోదించిందని, ఆ ప్రకారం కేటాయింపులు జరుపుతుందని అధికారులు తెలిపారు. కాగా, ఇప్పటికే రాష్ట్రంలో గతేడాదికి సంబంధించిన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. అవసరానికి మించి ఎరువులు బఫర్‌స్టాక్ ఉన్నట్లు మార్క్ ఫెడ్ వర్గాలు వెల్లడించాయి. యూరియాతోపాటు డీఏపీ 2.40 లక్షల మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 10 లక్షల మె ట్రిక్ టన్నులు, ఎంఓపీ 60 వేల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ లక్ష టన్నులు రైతులకు ప్రభుత్వం అందుబాటులో ఉంచనుంది. అత్యధికంగా మే, జూన్ నెలల్లో 4.60 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున ఎరువులు కేటాయించారు. ఈ ఏడాది ఎరువుల కొరత ఉండదని రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉంచుతామని అధికారులు చెబుతున్నారు.

కేసీఆర్ భయంతోనే మళ్లీ రైతుబంధు

- బీఆర్ఎస్ నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ భయంతోనే రాష్ట్రంలో మళ్లీ రైతుబంధు మొదలుపెట్టారని బీఆర్ఎస్ నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రైతుబంధును ఎన్నికల కమిషన్ ఆపమని చెప్పిందని, రైతుబంధు విషయంలో బీఆర్ఎస్ ఏనాడూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీనే రైతుబంధును ఆపించిందని ఆరోపించారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పనిచేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ఉంటుందని ఊదరగొట్టారని, కానీ కేసీఆర్ బస్సుయాత్ర తర్వాత క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారడంతో కొత్త కుట్రలకు తెరలేపుతున్నారని శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఎందుకు ప్రమాణాలు చేస్తున్నారో చెప్పాలన్నారు.

ఏఎస్‌వోలకు సూపరింటెండెంట్ పేస్కేల్ కల్పించండి

- పీఆర్సీతో సచివాలయ ఉద్యోగుల భేటీలో వినతి


పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విధానాల రూపకల్పన, సచివాలయ పాలనలో కీలకపాత్ర పోషించే అసిస్టెంట్ సెక్షన్ అధికారులకు (ఏఎస్‌వోలకు) సూపరింటెండెంట్ పేస్కేల్ కల్పించాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) చైర్మన్ శివశంకర్‌తో భేటీ అయి చర్చించారు. సచివాలయ ఏఎస్‌వోలకు వివిధ ప్రభుత్వ శాఖల్లో సూపరింటెండెంట్‌లతో సమానమైన పని, హోదా ఉన్నప్పటికీ వేతనం తక్కువగా ఉందని, ఈ వ్యత్యాసాన్ని సరిచేయాలని కోరారు. గ్రాట్యుటీని రూ.25 లక్షలకు పెంచాలని, సచివాలయ ఉద్యోగులకు కాలుష్య భృతిని కల్పించాలని విజ్ఞప్తిచేశారు. సచివాలయంలో ప్రభుత్వ సహాయ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి వాహన సౌకర్యం కల్పించాలని, సెక్షన్ అధికారులకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి స్కేల్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు కందిమళ్ల చలపతిరెడ్డి, దిలీప్, భూపాల్‌రెడ్డి, రవీంద్ర, మీసాల రాజు, తిరుపతి, సింధూరి, గౌతమి, పావని, ప్రసన్న, శైలజ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్యపడొద్దు.. ఆగస్టు 15లోగా రుణమాఫీ పూర్తి
- బీమా ప్రీమియం బాధ్యత మాదే: తుమ్మల


ఖమ్మంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. పక్కన ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

ఖమ్మం వన్‌టౌన్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షంతో వరి ధాన్యం తడిసిపోయిన నేపథ్యంలో రైతులు అధైర్య పడొద్దని.. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కిసాన్ కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా కొంటున్నామని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ పూర్తిచేసి.. ఎంత మంది రైతులకు, ఎన్ని కోట్ల రుణమాఫీ చేశామనేది స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ప్రసంగంలో చెబుతామని తెలిపారు. కాగా, రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం కలిగేలా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తూ, ప్రీమియం సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి చెప్పారు. ఇక విత్తన కంపెనీలతో ఇబ్బందులు లేకుండా రైతులకు విత్తనాలు అందేలా ప్రభుత్వం సహాయకారిగా నిలుస్తుందన్నారు. కాగా, ఆయిల్‌పామ్‌తో లాభాలు గడించే అవకాశమున్నందున రైతులు ఆ దిశగా దృష్టి సారించాలని సూచించారు. ఇక పంట నష్టపరిహారం సైతం త్వరలో అందిస్తామని, వచ్చే ఖరీఫ్ నుంచి పెంచిన ఎకరాకు రూ.15వేల చొప్పున రైతు భరోసా పంపిణీ ప్రారంభిస్తామని తుమ్మల తెలిపారు. కాగా, నల్లగొండలో ఎంపీ అభ్యర్థికి 5 లక్షల మెజార్టీ ఇస్తామని అక్కడి నేతలు చెబుతున్నందున, ఆ మెజార్టీ దాటేలా ఖమ్మం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనంలో ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు

- ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

భూదాన్‌పోచంపల్లి: ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో జూలూరు, పెద్దగూడెం గ్రామాల రైతులు మెయిన్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. రోడ్డుకు అడ్డంగా కంపచెట్లను వేసి వాహనాలు వెళ్లకుండా 2 గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ లారీల కొరతతో 6 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు నిలిచిపోయాయని చెప్పారు. దీంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అకాల వర్షంతో ధాన్యం తడిసి నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. కాగా జూలూరు పీఏసీఎస్ చైర్మన్ అందెల లింగంయాదవ్ ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. రెండు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

'దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోండి'

సాక్షి, హైదరాబాద్: దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయంలో శాఖ ఉన్నతాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖ అధీ నంలో ఉన్న దేవాలయాల భూముల వివరాలను సేకరించి వాటిల్లో అన్యాక్రాంతం అయిన వాటి వివరాలు గుర్తించాలన్నారు. గతంలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో తాగునీరు, గ్రీ న్ మ్యాట్స్, కార్పెట్స్, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్

వడదెబ్బకు ఇద్దరు మృతి


మల్లారెడ్డి


రాములు

శంకరపట్నం, నేరడిగొండ: ఎండదెబ్బకు బుధవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి మల్లారెడ్డి(58) మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం వడూర్ గ్రామానికి పొలం కౌలు గురించి మాట్లాడేందుకు వచ్చిన సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామానికి చెందిన రైతు కందుకూరి రాములు(62) వడ్డదెబ్బకు గురై మృతిచెందారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పనిచేశా

- నాకెలాంటి ప్రత్యేక అధికారాలు లేవు
- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వెల్లడి
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కోర్టులో పిటిషన్
- అరెస్టు వారెంటు ఇవ్వొద్దని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం అమెరికాలో తలదాచుకున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు తొలిసారి అధికారికంగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు ఆరోపిస్తున్నట్లుగా తనకు ఎలాంటి ప్రత్యేకమైన అధికారాలు లేవని, అప్పటి డీజీపీ, నిఘా విభాగం అధిపతి పర్యవేక్షణలోనే తాను పని చేశానని చెప్పారు. పోలీసుల పిటిషన్ నేపథ్యంలో తనపై అరెస్టు వారెంట్ ఇవ్వొద్దని న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసు నమోదైన వెంటనే అమెరికా వెళ్లిన ప్రభాకర్‌రావు వైద్యం పేరుతో అక్కడే ఉన్నారు. కొంతమంది పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్లు చేసి మాట్లాడటం మినహా ఇప్పటివరకు దేనిపైనా స్పందించలేదు. అయితే పంజగుట్ట పోలీసులు ఆయనపై రెడ్ కార్నర్ నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభించడంతో పాటు కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చి అరెస్టు వారెంట్ కోసం పిటిషన్ వేయడంతో మౌనం వీడారు. ఆయనతో పాటు ఓ మీడియా సంస్థ అధినేత శ్రావణ్‌కుమార్‌పై అరెస్టు వారెంట్లు కోరుతూ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో అలా వారెంట్లు జారీ చేయవద్దని కోరుతూ ప్రభాకర్‌రావుతో పాటు శ్రావణ్‌కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన న్యాయవాది వి.సురేందర్‌రావు ద్వారా వేసిన పిటిషన్‌లో ప్రభాకర్‌రావు పలు అంశాలు ప్రస్తావించారు.

అనుభవం దృష్ట్యానే..

దర్యాప్తు అధికారులు ఆరోపిస్తున్నట్లు తాను ఎస్ఐబీ చీఫ్ కావడానికి సామాజిక వర్గం కారణం కాదని, తన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకునే నాటి డీజీపీ ఎంపిక చేశారని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. నల్లగొండ ఎస్పీగా పని చేస్తున్న తనను రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ముఖ్యమంత్రి హఠాత్తుగా బదిలీ చేసిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. తనకు డీఐజీ నుంచి ఐజీగా రావాల్సిన పదోన్నతి కూడా చాలా ఆలస్యమైందని తెలిపారు. తాను అమెరికా వెళ్లడానికి కారణం కేసుల భయం కాదని, వైద్యం కోసమే అని వివరించారు. అది పూర్తయిన తర్వాత స్వదేశానికి వస్తానని కోర్టుకు తెలిపారు. సోదరి అనారోగ్య కారణాల నేపథ్యంలో తాను అమెరికా వెళ్లినట్లు శ్రావణ్‌కుమార్ కూడా తన న్యాయవాది (సురేందర్‌రావు) ద్వారా కోర్టుకు తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు రిజర్వ్ చేసింది.

ఆర్ఎంపీ డాక్టర్లపై దాడులను ఖండిస్తున్నాం

- సీఎంకు రాపోలు రామస్వామి లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆర్ఎంపీ డాక్టర్లపై దాడులు చేయడాన్ని తెలంగాణ స్టేట్ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఖండించింది. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ అసోసియేషన్ ప్రతినిధి రాపోలు రామస్వామి బహిరంగలేఖ రాశారు. ఆర్ఎంపీ డాక్టర్లపై ఇష్టానుసారంగా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ఐఎంసీ), ఎస్‌టీటీ, టీఎస్ఎంసీకి సంబంధించిన సిబ్బందితో నకిలీ డాక్టర్లు అంటూ దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉంటూ గ్రామాల్లో అన్ని వర్గాల వారికి సకాలంలో వైద్యం అందిస్తూ ఆదుకుంటున్నామని రామస్వామి తెలిపారు. శాశ్వత పరిష్కారాలు ఆలోచించకుండా తాత్కాలిక దాడులతో ప్రయోజనం లేదని, దీనిపై సరైన నిర్ణయం తీసుకుంటారనే నమ్మకం మాకు ఉందని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

అమిత్ షా ఫేక్ వీడియో కేసులో దర్యాప్తు వేగవంతం

- అరుణ్‌రెడ్డి నుంచి కీలక ఆధారాలు సేకరించిన ఢిల్లీ పోలీసులు
- మరికొందరు తెలంగాణ కాంగ్రెస్ నేతల అరెస్టుకు రంగంసిద్ధం
- ఎన్నికలకు ముందు లేదా తర్వాత అరెస్టు చేసే అవకాశం
- ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం వేచిచూస్తున్న అధికారులు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫేక్‌వీడియో కేసు దర్యాప్తును ఢిల్లీ పోలీసులు వేగవంతం చేశారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులుగా భావిస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను గుర్తించారు. ఫేక్‌వీడియో సృష్టికర్తగా భావిస్తున్న తెలంగాణకు చెందిన కాంగ్రెస్ సోషల్‌మీడియా జాతీయ కోఆర్డినేటర్ బి.అరుణ్‌రెడ్డిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా అయన ఫోన్, ల్యాప్‌టాప్ నుంచి కీలక సమాచారం సేకరించారు. అంతకుముందు..ఈ కేసు దర్యాప్తునకు ఢిల్లీకి చెందిన రెండు పోలీస్ బృందాలు ఏప్రిల్ 28 నుంచి హైదరాబాద్‌లోనే మకాం వేశాయి. అందుబాటులో ఉన్న పలువురు నేతలు, ఇతరులను విచారించి వారినుంచి కీలక సమాచారం రాబట్టారు. అరుణ్‌రెడ్డి నుంచి సేకరించిన డేటాను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు ఇంకా రావాల్సి ఉంది. రిపోర్టు వచ్చిన తర్వాత, ఎన్నికలకు ముందు లేదా ఎన్నికలు ముగిసిన వెంటనే మరికొందరి అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

అరుణ్‌రెడ్డికి మరో రెండురోజులు రిమాండ్

ఈ కేసులో ఇప్పటికే అరెస్టు చేసిన అరుణ్‌రెడ్డిని దర్యాప్తు అధికారులు మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి మరో రెండు రోజులపాటు రిమాండ్ విధించారు. ఎన్నికల్లో బీజేపీకి నష్టం కలిగించాలనే ఉద్దేశంతోనే ఫేక్‌వీడియో సృష్టించి సోషల్ మీడియాలో ప్రసారం చేశారని దర్యాప్తు బృందం భావిస్తోంది. ప్రాథమిక దర్యాప్తు తర్వాత ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ (ఐఎఫ్ఎస్ఓ) స్పెషల్ సెల్ పోలీసులు.. కుట్రకోణంలో కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ కేసులో గతంలో తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కొంతమంది నేతలను విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేసినా, వారు హాజరు కాలేదు. తాజాగా మరోసారి వారందరికీ నోటీసులు జారీ చేయాలని కూడా ఢిల్లీ పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు



ఇంటర్వ్యూ

అబద్ధాలు, మోసపూరిత విధానాలతో దేశ ప్రజలు విసుగెత్తిపోయారు

ప్రధాని నరేంద్ర మోదీకి ధైర్యం ఉంటే ప్రజల సమస్యలపై మాట్లాడాలి

ఇంటర్వ్యూలో ప్రియాంక గాంధీ

రాయ్‌బరేలీ: కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్న అబద్ధాలు, మోసపూరిత విధానాలతో దేశ ప్రజలు విసుగెత్తిపోయారని, వారంతా మార్పును కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజల సమస్యలు, రైతన్నలు వెతలు, నిరుద్యోగుల దుర్భర బతుకుల గురించి మాట్లాడకుండా, కేవలం అనవసర విషయాలు మాత్రమే మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో జరిగిన పరిణామాలపై వాస్తవాల ఆధారంగా కాకుండా కేవలం సొంత ఊహలపై ఆధారపడి ఎన్నికల ప్రసంగాలు చేస్తున్నారని, ప్రజలంటే ఆయనకు గౌరవం లేదని తప్పుపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గంలో తన సోదరుడు రాహుల్ గాంధీ విజయం కోసం శ్రమిస్తూ ఎన్నికల ప్రచారంలో తీరికలేకుండా ఉన్న ప్రియాంక గాంధీ బుధవారం పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రధాని మోదీకి నిజంగా ధైర్యం ఉంటే దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతాంగం కష్టాలపై మాట్లాడాలని సవాలు విసిరారు. ప్రియాంక ఇంకా ఏం చెప్పారంటే..

బీజేపీ అంచనాలు తల్లకిందులే..

మీడియాలో గానీ, రాజకీయ ప్రచార వేదికలపై గానీ ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదు. తమ కష్టనష్టాలపై చర్చ జరగాలని, పరిష్కార మార్గాలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. నిరుద్యోగాన్ని రూపుమాపడానికి, ధరలు తగ్గించడానికి, రైతులు, కార్మికుల సంక్షేమానికి, తమ కష్టాలు కడతేర్చడానికి ప్రభుత్వం ఏం చేసిందో తెలుసుకోవాలని వారు ఆశిస్తున్నారు. దేశంలో 'మార్పు' గాలులు బలంగా వీస్తున్నాయి. ఎన్డీయేకు 400 సీట్లు, బీజేపీకి సొంతంగా 370 వస్తాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. చివరకు వారి అంచనాలన్నీ తల్లకిందులవుతాయి.

మోదీ సమాధానం చెప్పగలరా?

దేశంలో నిరుద్యోగం గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. ప్రధాని మోదీ ఈ సమస్యను పట్టించుకోకుండా, కాంగ్రెస్ వస్తే ప్రజల ఆస్తులు లాక్కుంటారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం ఏయే సంస్థలను నిర్మించిందో, ఏయే పథకాలను సొంతంగా ప్రారంభించిందో నరేంద్ర మోదీ చెప్పగలరా? కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన పథకాల పేర్లు మార్చడం తప్ప ఆయన చేసిందేముంది?

రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం..

ఈ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలే ప్రకటిస్తున్నారు. వారి ఆటలు సాగనివ్వం. రాజ్యాంగాన్ని కచ్చితంగా కాపాడుకుంటాం. మనకు ఓటు హక్కు రాజ్యాంగమే ఇచ్చింది. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు రాజ్యాంగమే ఇచ్చింది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగమే బలోపేతం చేసింది. రాజ్యాంగాన్ని మార్చేసి, ప్రజల హక్కులు కాలరాస్తామంటే మేము సహించబోము.

ప్రధానమంత్రి కాబట్టి నవ్వలేకపోతున్నాం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఇళ్లు, బంగారం, భూములు, గేదెలు దోచుకుంటారని ప్రధాన మంత్రి అంటున్నారు. నిజంగా ప్రధానమంత్రి కాకుండా ఇంకెవరైనా ఇలాంటి మాటలు మాట్లాడితే బిగ్గరగా నవ్వుకునేవాళ్లం. ప్రధానమంత్రి పదవికి గౌరవం ఇవ్వాలి కాబట్టి దురదృష్టవశాత్తూ నవ్వుకోలేకపోతున్నాం. అబద్ధాలను కూడా నిజాలుగా ప్రజలను నమ్మించడంలో నరేంద్ర మోదీ ఆరితేరిపోయారు.



ఎన్నికల విచిత్రం

ముంబై నార్త్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ బుధవారం స్థానికంగా రోడ్ షో చేపట్టారు. ఆయనకు మద్దతుగా ప్రధాని మోదీ మాస్క్ ధరించి పాల్గొన్న ఓ అభిమాని.

శామ్ పిట్రోడా మరో దుమారం



- దక్షిణ భారతీయులు ఆఫ్రికన్లలా కనిపిస్తారు
- ఈశాన్య ప్రాంతాల ప్రజలు చైనీయుల్లా ఉంటారు
- పశ్చిమ ప్రాంతాల జనం అరబ్బుల్లాగా, ఉత్తరాది ప్రజలు శ్వేతజాతీయుల్లాగా ఉంటారు
- ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్మన్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అమెరికాలో అమల్లో ఉన్న వారసత్వ పన్ను తనకు బాగా నచ్చిందని, అది న్యాయంగా ఉందని వ్యాఖ్యానించి రాజకీయ వివాదానికి తెరతీసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శామ్ పిట్రోడా ఆ గొడవ సద్దుమణగ ముందే మరో దుమారం సృష్టించారు. దక్షిణ భారతదేశ ప్రజలు ఆఫ్రికన్లలా ఉంటారని ఆయన చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పిట్రోడాను సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తప్పుపట్టారు. తాజాగా ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శామ్ పిట్రోడా మాట్లాడుతూ... భారత్ విభిన్నమైన దేశం అని అభివర్ణిస్తూ కొన్ని పోలికలను ప్రస్తావించారు. అవే ఆయనను ఇప్పుడు ఇరకాటంలోకి నెట్టేశాయి. ''మనది లౌకిక దేశం. బ్రిటిష్ పాలకులపై మన స్వాతంత్ర్య సమరయోధులు సాగించిన పోరాటాల వల్ల భారత్ లౌకిక దేశంగా ఆవిర్భవించింది. ప్రపంచవ్యాప్తంగా మనది ఉత్తమమైన ప్రజాస్వామ్య దేశం. 75 ఏళ్లుగా ప్రజలు సంతోషకరమైన వాతావరణంలో కలిసిమెలిసి జీవిస్తున్నారు. అక్కడక్కడా జరిగిన చిన్నపాటి గొడవలను పక్కనపెడితే ఇక్కడెంతో వైవిధ్యం, భిన్నత్వం కనిపిస్తాయి. భారత్‌లో ఈశాన్య ప్రాంతాల ప్రజలు చైనీయుల్లా, పశ్చిమ ప్రాంతాల జనం అరబ్బుల్లాగా, ఉత్తరాది ప్రజలు శ్వేత జాతీయుల్లాగా, దక్షిణాది ప్రజలు ఆఫ్రికన్లలా కనిపిస్తారు. అది పెద్ద విషయం కాదు. ఏది ఎలా ఉన్నప్పటికీ మనమంతా సోదర సోదరీమణులం. దేశంలోని విభిన్నమైన భాషలు, మతాలు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను మనం పరస్పరం గౌరవించుకుంటున్నాం. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మన మూలాల్లోనే ఉన్నాయి'' అని శామ్ పిట్రోడా చెప్పారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. మరోవైపు పిట్రోడా వ్యాఖ్యలతో తమ పార్టీకి సంబంధం లేదని కాంగ్రెస్ వివరణ ఇచ్చింది.

పిట్రోడా రాజీనామా.. ఆమోదించిన అధిష్టానం

తన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో శామ్ పిట్రోడా ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్మన్ పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను కాంగ్రెస్ అధిష్టానం వెంటనే ఆమోదించింది. రాజీనామా చేయాలన్నది పిట్రోడా సొంత నిర్ణయమని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ చెప్పారు.

'ఇండియా' కూటమి సిగ్గు పడాలి

నిర్మల ధ్వజం

న్యూఢిల్లీ: పిట్రోడా వ్యాఖ్యలను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఖండించారు. ''నేను దక్షిణ భారతదేశం నుంచి వచ్చా. నేను భారతీయురాలిగా కనిపిస్తా. నా బృందంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారు సైతం సభ్యులుగా ఉన్నారు. వారంతా భారతీయులుగానే కనిపిస్తారు. నా సహచరులైన పశ్చిమ ప్రాంతాల ప్రజలు కూడా భారతీయులుగానే కనిపిస్తారు. రాహుల్ గాంధీకి గురువైన ఓ జాత్యహంకారికి మాత్రం భారతీయులు ఆఫ్రికన్లు, చైనీయులు, అరబ్బులు, శ్వేతజాతీయులుగా కనిపిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల అసలు రంగు బయటపడింది. అందుకు వారికి కృతజ్ఞతలు చెప్పాలి. విపక్ష 'ఇండియా' కూటమి సిగ్గు పడాలి'' అని నిర్మలా సీతారామన్ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి

పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోనియా గాంధీ కుటుంబంతో పిట్రోడాకు దశాబ్దాలుగా అనుబంధం ఉందని చెప్పారు. పిట్రోడాను ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్మన్ పదవి నుంచి తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. దక్షిణ భారత ప్రజలను ఆఫ్రికన్లతో పోలుస్తూ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై నాలుగు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించాలని అన్నారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడు భారతదేశ ప్రజాస్వామ్యాన్ని, వ్యవస్థలను హేళన చేస్తూ మాట్లాడుతుంటారని, దీని వెనుక శామ్ పిట్రోడా సలహాలు ఉంటాయని రాజీవ్ చంద్రశేఖర్ ఆరోపించారు.

దురదృష్టకరం: జైరామ్ రమేశ్

శామ్ పిట్రోడా వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. ఇండియాలోని వైవిధ్యాన్ని వర్ణిస్తూ పిట్రోడా ప్రస్తావించిన పోలికలు దురదృష్టకరమని పేర్కొన్నారు. అవి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని చెప్పారు. పిట్రోడా అభిప్రాయాలతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

మూడోదశ పోలింగ్ 65.68 శాతం

న్యూఢిల్లీ: సవరించిన గణాంకాల ప్రకారం మూడోదశ లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ దాదాపు 65.68 శాతమని ఎన్నికల కమిషన్ తెలిపింది. బుధవారం రాత్రి 10 గంటల వరకు అందిన వివరాల మేరకు 65.68 శాతం వచ్చిందని, ఈ గణాంకాలను సిబ్బంది అప్‌డేట్ చేస్తూనే ఉంటారని వివరించింది. మూడోదశలో మంగళవారం 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 93 సీట్లకు పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే.

65 ఏళ్లలో 7.8 శాతం తగ్గిన హిందూ జనాభా

న్యూఢిల్లీ: భారత్‌లోని హిందువుల జనాభా తగ్గుతోందని, మైనార్టీల జనాభా క్రమంగా పెరుగుతోందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అధ్యయనంలో తేలింది. 1950 నుంచి 2015 మధ్య దేశంలోని మొత్తం జనాభాలో హిందువుల జనాభా 7.8 శాతం తగ్గినట్లు వెల్లడయ్యింది. 1950లో దేశ జనాభాలో హిందువులు 84 శాతం మంది ఉండగా, 2015 నాటికి దాదాపు 78 శాతానికి పడిపోయినట్లు అధ్యయనం వెల్లడించింది. ఇదే సమయంలో మొత్తం జనాభాలో ముస్లింల జనాభా 9.84 శాతం నుంచి 14.09 శాతానికి చేరింది.

ఏనుగు దాడిలో కెమెరామన్ మృతి

పాలక్కాడ్: జనావాసాలకు సమీపంలోకి వచ్చిన ఏనుగుల గుంపును చిత్రీకరిస్తున్న క్రమంలో బుధవారం కేరళకు చెందిన మాతృభూమి ఛానల్ కెమెరామన్ దుర్మరణం పాలయ్యాడు. మలంబుజా– కంజికోడ్‌ల మధ్య ఏనుగుల గుంపు నదిని దాటుతుండగా మాతృభూమి ఛానల్ బృందం వాటిని చిత్రీకరించే ప్రయత్నం చేసింది. ఏనుగుల గుంపు వీరి వాహనంపైకి దూసుకువచ్చింది. రిపోర్టర్, డ్రైవర్‌లు దూరంగా పరుగెత్తగా, కెమెరామన్ ఏవీ ముకేష్ (34) అక్కడే చిక్కుకుపోయాడు. ఓ ఏనుగు ముకేష్‌పై దాడి చేయగా తీవ్ర గాయాలతో చనిపోయాడు.

అస్ట్రాజెనెకా టీకాలు వెనక్కి

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా తాము సరఫరా చేసిన కోవిడ్ టీకాలను వెనక్కి తీసుకుంటున్నట్లు యూకేకు చెందిన ఫార్మా కంపెనీ అస్ట్రాజెనెకా వెల్లడించింది. కోవిడ్ అప్‌డేటెడ్ వ్యాక్సిన్లు పెద్ద సంఖ్యలో మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయని, అందుకే వాణిజ్య కారణాలతో తమ టీకాలను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలియజేసింది. అస్ట్రాజెనెకా కంపెనీ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో కోవిడ్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. అస్ట్రాజెనెకా టీకాతో దుష్ప్రభావాలు తలెత్తుతున్నట్లు కోర్టుల్లో కేసులు నమోదవడంతో న్యాయ విచారణ జరుగుతోంది.

'సూపర్ సీఎం' పాండియన్!

ఒడిశాలో చక్రం తిప్పుతున్న తమిళ తేజం

- నవీన్ వారసుడంటూ చర్చలు
- విపక్షాల లక్ష్యం ఆయనే

వి.కార్తికేయన్ పాండియన్. వయసు 49. వదులు చొక్కా, సాదాసీదా ప్యాంటు, కాళ్లకు చెప్పులు. అత్యంత నిరాడంబరమైన ఆహార్యం. కానీ ఒడిశా సీఎం, బిజూ జనతాదళ్ చీఫ్ నవీన్ పట్నాయక్ తర్వాత రాష్ట్రమంతటా ఆ స్థాయిలో మారుమోగుతున్న పేరు. నవీన్ వెనుక ఆయనే ప్రధాన చోదక శక్తి. అత్యంత నమ్మకస్తుడు కూడా. ఇటీవలే ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి బీజేడీలో చేరారు. ప్రభుత్వాధికారిగా 'సూపర్ సీఎం' అని, పార్టీలో చేరాక 'నంబర్ టూ'అని ముద్రపడ్డారు. పట్నాయక్ సలహాదారుగా, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ 5టీ చైర్మన్‌గా కేబినెట్ హోదాలో ఉన్నారు. బీజేడీ ప్రధాన ప్రచారకర్తగా దూసుకుపోతున్నారు. ప్రధాని మోదీ మొదలుకుని రాహుల్ గాంధీ దాకా పాండియన్‌నే లక్ష్యం చేసుకుని విమర్శలు చేస్తున్నారంటే ఒడిశా ఎన్నికలను ఆయన ఎంతగా ప్రభావితం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు! పట్నాయక్ రాజకీయ వారసునిగా కూడా పాండియన్ పేరు మారుమోగుతోంది...

పాండియన్‌ది తమిళనాడులోని మదురై. 2000 బ్యాచ్ పంజాబ్ కేడర్ ఐఏఎస్ అధికారి. ఒడిశాకు చెందిన ఐఏఎస్ అధికారి సుజాత రౌత్‌ను పెళ్లాడారు. అలా 2002లో ఒడిశా కేడర్‌కు మారడం ఆయన కెరీర్‌లో కీలక మలుపు. ధర్మగఢ్ సబ్ కలెక్టర్‌గా ఒడిశాలో కెరీర్ ప్రారంభించారు. సీఎం సొంత జిల్లా మయూర్‌భంజ్, గంజాం కలెక్టర్‌గా చేశారు. 2011 నుంచి 12 ఏళ్ల పట్నాయక్ వ్యక్తిగత కార్యదర్శిగా చేశారు. ఆయనకు అత్యంత నమ్మకస్తునిగా మారారు. ఒడియా అనర్గళంగా మాట్లాడుతూ పలు కార్యక్రమాల ద్వారా ప్రజలకూ చేరువయ్యారు. 2023లో వీఆర్ఎస్ తీసుకుని బీజేడీలో చేరారు. నాటినుంచి పార్టీ నిర్ణయాలన్నింట్లోనూ ఆయనదే కీలక పాత్ర. 2014, 2019ల్లోనూ పట్నాయక్ ఎన్నికల వ్యూహాల్లో తెరవెనుక పాత్ర పాండియన్‌దే.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి

ఒడిశాలో నవీన్ ప్రజాదరణకు మూల కారణమైన ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలన్నింటి వెనకా ఉన్నది పాండియనే. సాధారణంగా యంత్రాంగంపై రాజకీయ ఆధిపత్యం దేశమంతటా ఉండే సమస్య. ఒడిశా మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం నుంచి వాటిపై స్పందన తెలుసుకునే దాకా అంతా ఐఏఎస్‌ల మయం. ఇందుకోసం పాండియన్ సారథ్యంలో ఐఏఎస్‌ల బృందమే పని చేసింది! ఒడిశాలో బజ్‌వర్డ్‌గా మారిన 5టీ (బృంద కృషి, సాంకేతికత, పారదర్శకత, పరివర్తన, సమయం) సూత్రధారి కూడా పాండియనే. 2019 నుంచి అధికారులకు, ప్రాజెక్టులకు ఇదే మార్గదర్శి! దీనిలో భాగంగా నాలుగేళ్లలో ఏకంగా 460 రకాల ప్రభుత్వ సేవలు ఆన్‌లైన్‌లోకి వచ్చాయి.



హెలికాప్టర్ వివాదం..

ప్రభుత్వ వ్యవహారాలతో పాటు రాజకీయంగానూ బీజేడీలో అడుగడుగునా పాండియన్‌దే జోక్యం. 2019 ఎన్నికల్లో పార్టీ వ్యూహాలు, ఎత్తుగడల నుంచి టికెట్ల పంపిణీ దాకా అన్నింటా ఆయనదే ప్రధాన భూమిక! అధికారిగా ఉంటూ ప్రభుత్వ హెలికాప్టర్‌లో 30 జిల్లాల్లోనూ పాండియన్ సుడిగాలి పర్యటన చేయడం తీవ్ర వివాదం రేపింది. ఇవి బీజేడీ ర్యాలీల్లా ఉన్నాయంటూ విపక్షాలు దుయ్యబట్టాయి. ఆలిండియా సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించారంటూ ఆయనపై కేంద్రానికి బీజేపీ ఫిర్యాదు కూడా చేసింది! పాండియన్ పెత్తనంపై బీజేడీలోనూ అసమ్మతి మొదలైంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన సీఎం పక్కనే ఉండటమే గాక ఒక్కరే సమావేశాలూ నిర్వహించడం, మంత్రులను కూడా పక్కకు పెట్టడం తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. అయినా పట్నాయక్ పట్టించుకోలేదు. పైగా పాండియన్‌ను విమర్శించినందుకు బీజేడీ ఉపాధ్యక్షురాలు, ఎమ్మెల్యే సౌమ్య రంజన్‌ను పదవి నుంచి తొలగించారు!

నవీన్ వారసుడు...?!

నవీన్ పూర్తిస్థాయిలో 'ఒడియా అస్తిత్వ' నినాదాన్ని ఎత్తుకునేలా చేసింది పాండియనే. దాంతో విపక్షాల విమర్శలకు ఆయనే లక్ష్యంగా మారారు. ''పాండియన్ వల్ల ఒడియా ఉనికే ప్రమాదంలో పడింది. సమీప భవిష్యత్తులో బయటి వ్యక్తి ఒడిశా పాలకుడుగా మారే ప్రమాదముంది'' అంటూ విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. బీజేపీ కూడా బీజేడీని ఎదుర్కోవాలంటే పాండియన్‌ను ఎదుర్కోవాలన్న ఆలోచనకు వచ్చింది. అందుకే ఆయన 'బయటి వ్యక్తి' అంటూ ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలంతా పదేపదే విమర్శిస్తున్నారు. ''ఒడియా అస్మిత (ఆత్మగౌరవం) ప్రమాదంలో పడింది. ప్రజలు దీన్ని ఎక్కువ కాలం సహించబోరు'' అని మోదీ ఇటీవల స్థానిక ప్రచార సభలో అన్నారు. పాండియన్ మాత్రం వీటిని తేలిగ్గా తోసిపుచ్చుతున్నారు. ''నవీన్ పట్నాయక్ విలువలకు నేను సహజ వారసుడిని. ఒడిశా నా కర్మభూమి. పాతికేళ్లుగా ఇక్కడే పని చేస్తున్నా. నా భార్య, పిల్లలూ ఇక్కడివాళ్లే. ఒడిశా ప్రజలు నన్ను తమ వ్యక్తిగా ప్రేమిస్తున్నారు'' అంటారు!

- సాక్షి, న్యూఢిల్లీ

ఎయిరిండియాలో ఆకస్మిక సమ్మె

- సిక్ లీవ్ పెట్టిన 200 మంది సిబ్బంది
- 100 విమాన సర్వీసులు రద్దు
- ప్రయాణికుల పడిగాపులు

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ యాజమాన్యంలోని విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సిబ్బంది మూకుమ్మడిగా సెలవు పెట్టడం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. యాజమాన్యం వైఖరికి నిరసనగా క్యాబిన్ క్రూలోని 200 మందికి పైగా సిబ్బంది మంగళవారం రాత్రి సిక్ లీవ్ పెట్టారు. హఠాత్తుగా చోటుచేసుకున్న పరిణామంతో ఎయిరిండియా 100 వరకు దేశీయ, అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఫలితంగా, కోచి, కాలికట్, ఢిల్లీ, బెంగళూరు తదితర విమానాశ్రయాల్లో సుమారు 15 వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. సర్వీసుల రద్దు విషయం కొందరికి సెక్యూరిటీ తనిఖీలు కూడా పూర్తయ్యాక ఆఖరి నిమిషంలో తెలిపారు. దీంతో, వారు ఎయిరిండియా తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన కొన్ని సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. వేసవి రద్దీ దృష్ట్యా మార్చి చివరి వారం నుంచి రోజూ 360 సర్వీసులను నడుపుతోంది. టాటా గ్రూప్‌నకే చెందిన విస్తారాను ఎయిరిండియాతో, అదేవిధంగా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ను ఏఐఎక్స్ కనెక్ట్‌తో విలీనం చేయాలన్న నిర్ణయం క్యాబిన్ క్రూలోని సీనియర్ల అసంతృప్తికి కారణమైందని భావిస్తున్నారు. నిర్వహణ లోపం సీనియర్ ఉద్యోగుల నైతికతను దెబ్బతీసిందని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ తెలిపింది. విమాన సర్వీసుల రద్దుపై బుధవారం కేంద్ర పౌరవిమాన యాన శాఖ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నుంచి వివరణ కోరింది. సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. రద్దయిన సర్వీసులకు టిక్కెట్ చార్జీలను వాపసు చేస్తామని, కోరిన పక్షంలో మరో తేదీకి ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తామని వివరించారు.



అధికారులు విడుదల చేసిన ముష్కరుల ఫొటోలు

ఐఏఎఫ్ కాన్వాయ్‌పై దాడి ఘటన..

ముగ్గురు ముష్కరుల గుర్తింపు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో ఈ నెల 4వ తేదీన భారత వైమానిక దళం కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన ముగ్గురు ముష్కరులను భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ ఘటనలో విక్కీ పహాడే అనే కార్పొరల్ మృత్యువాతపడగా ఆయన సహచరులు మరో నలుగురు గాయాలపాలయ్యారు. ఉగ్రవాదులను పాక్ ఆర్మీ మాజీ కమాండో ఇలియాస్, పాక్‌కే చెందిన ఉగ్రవాది హదూన్, లష్కరే తోయిబా కమాండర్ అబూ హమ్జా(30) అని తేలింది. కాల్పుల సమయంలో వీరివద్ద అత్యాధునిక అసాల్ట్ రైఫిళ్లయిన అమెరికా తయారీ ఎం4, రష్యా తయారీ ఏకే-47 ఉన్నట్లు తేలింది. స్థానికుల సమాచారం మేరకు ముగ్గురి పోలికలున్న చిత్రాలతో అధికారులు పోస్టర్లను విడుదల చేశారు. వీరిలో హమ్జా ఆచూకీ తెలిపిన వారికి రూ.10 లక్షల రివార్డు ప్రకటించారు.

ఎలక్షన్ బీట్

మోదీజీ... భయపడ్డారా?

- అంబానీ- అదానీలు టెంపోల్లో డబ్బు ఇస్తారని మీకు తెలుసంటే..
- ఇది మీకు వ్యక్తిగత అనుభవమా?
- ప్రధాని మోదీపై రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ: అంబానీ– అదానీలతో కాంగ్రెస్‌కు ఒప్పందం కుదిరిందని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తిప్పికొట్టారు. 'నమస్కారం మోదీజీ.. మీరు భయపడ్డారా?' అని రాహుల్ ఓ వీడియో సందేశంలో ప్రశ్నించారు. 'సాధారణంగా మీరు అంబానీ, అదానీల గురించి అంతర్గతంగా, తెరవెనుక మాట్లాడుతారు. కానీ మొదటిసారిగా ఇవాళ మీరు అంబానీ, అదానీల పేర్లను బహిరంగంగా తీసుకున్నారు' అని రాహుల్ అన్నారు. ఎన్ని టెంపో లోడ్ల నల్లధనం కాంగ్రెస్‌కు ముట్టింది? ఏం ఒప్పందం కుదిరింది? రాత్రికి రాత్రే అంబానీ– అదానీలపై ఆరోపణలు ఆగిపోయాయి' అని ప్రధాని మోదీ బుధవారం వేములవాడ సభలో ప్రశ్నించారు. ప్రధాని విమర్శలకు బదులిస్తూ 'వారు టెంపోల నిండా డబ్బులిస్తారని కూడా మీకు తెలుసు. అంటే మీకు వ్యక్తిగతంగా ఇది అనుభవమేనా?' అని రాహుల్ నిలదీశారు. ఒక పనిచేయండి.. అంబానీ, అదానీలపైకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని పంపాలని ప్రధాని మోదీని కోరారు. కాంగ్రెస్ పార్టీకి వారు నల్లధనమిచ్చారనే దానిపై సాధ్యమైనంత త్వరగా లోతైన దర్యాప్తు పూర్తయ్యేలా చూడాలన్నారు. వారిపైకి ఈడీని పంపడానికి భయపడొద్దన్నారను. బీజేపీ అవినీతి టెంపోకు డ్రైవర్ ఎవరో, హెల్పర్ ఎవరో మొత్తం దేశానికి తెలుసన్నారు.

దోస్త్ దోస్త్ న రహా!: ఖర్గే

న్యూఢిల్లీ: మూడు విడతల పోలింగ్ తర్వాత తన పీఠం కదులుతోందని ప్రధాని నరేంద్ర మోదీకి అర్థమైందని, అందుకే సొంత స్నేహితులపై దాడికి దిగారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. 'పరిస్థితులు మారుతున్నాయి. దోస్త్ దోస్త్ న రహా...! (స్నేహితులు స్నేహితులు కాకుండా పోయారు). లోక్‌సభ ఎన్నికల్లో మూడు దశల పోలింగ్ ముగిసిన తర్వాత ఈరోజు ప్రధాని తన సొంత స్నేహితులపైనే విమర్శలకు దిగారు. దీనిబట్టి స్పష్టంగా అర్థమవుతోంది ఏమిటంటే మోదీ పీఠం కదులుతోంది. ఫలితాలకు ఇదే అసలైన సంకేతం' అని ఖర్గే ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ యువరాజు ఐదేళ్లుగా అదానీ– అంబానీలపై ఆరోపణలు గుప్పించారు. ఇప్పుడు అకస్మాత్తుగా ఎందుకో వారి పేరెత్తడం లేదు. ఎన్ని లోడ్ల నల్లధనం మీరు వారి నుంచి తీసుకున్నారు. షెహజాదా సమాధానం చెప్పాలి అని ప్రధాని నరేంద్ర మోదీ వేములవాడ సభలో ప్రశ్నించారు. దీనికి ఖర్గే బదులిచ్చారు. 'హమ్ దో... హమారా దో' అనే మోదీ ఇప్పుడు సొంత బిడ్డలనే కాదంటున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు.

బీజేపీ ఓట్లు కొంటోంది: మమత

కోల్‌కతా: బీజేపీ ఓటర్లకు డబ్బులిచ్చి ఓట్లను కొంటోందని టీఎంసీ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఒక్కో ఓటుకు రూ.5 వేలు, రూ.10 వేలు, ఇంకా రూ.15 వేలు కూడా ఇస్తోందన్నారు. ఆరాంబాగ్‌లో బుధవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మమత మాట్లాడారు. 'గతంలో సీపీఎంకు చెందిన అసాంఘిక శక్తులే ప్రస్తుతం బీజేపీ నాయకులు. మళ్లీ అప్పటి అరాచకపాలన రాకూడదనుకుంటే బీజేపీకి ఓటేయకుండా ఉంటే చాలు. ఢిల్లీలో అధికార సమీకరణాలు మారాలి. మార్పు రావాలి'అని ఆమె వ్యాఖ్యానించారు.

రక్షకులు, భక్షకుల మధ్యే పోటీ: అఖిలేశ్

షాజహాన్‌పూర్: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలను రాజ్యాంగ మథనంగా సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అఖిలేశ్ యాదవ్ అభివర్ణించారు. ఇందులో ఒకవైపు రాజ్యాంగ రక్షకులు, మరోవైపు రాజ్యాంగ భక్షకులు ఉన్నారని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పేదలకు రిజర్వేషన్ల రక్షణ కోసం జరుగుతున్న ఎన్నికలని ఆయన తెలిపారు. అఖిలేశ్ బుధవారం షాజహాన్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు.

రాహుల్ మజిలీ ఇక ఇటలీయే: షా

లఖీంపూర్ ఖేరి/హర్దోయి/కన్నౌజ్: పాకిస్తాన్ ఎజెండాతో వస్తున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి రాయ్‌బరేలీలో ఓటమి ఖాయమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆయన తదుపరి మజిలీ ఇటలీ మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు. యూపీలోని లఖీంపూర్ ఖేరి, హర్దోయి, కన్నౌజ్‌లలో బుధవారం జరిగిన ఎన్నికల ర్యాలీల్లో మంత్రి మాట్లాడారు. 'అమేథీ నుంచి వయనాడ్‌కు వెళ్లారు. ప్రస్తుతం బరిలో ఉన్న రాయ్‌బరేలీలో ఆయన పరాజయం ఖాయం. ఆయన ఎక్కడికి వెళ్లినా ఓటమి తప్పదు. ఇక రాహుల్‌కు మిగిలింది ఇటలీయే. ఆయన సెటిల్ కావాల్సిందిక అక్కడే'అని అమిత్ షా ఎద్దేవా చేశారు.

పంజాబ్‌లో బీఎస్పీకి షాక్

చండీగఢ్: పంజాబ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ హోషియార్‌పూర్ లోక్‌సభ స్థానం అభ్యర్థి రాకేశ్ సోమన్ బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లో చేరిపోయారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. మాన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆకర్షితుడై పార్టీ మారుతున్నట్లు ప్రకటించారు.

ఐదో విడత బరిలో..695 మంది

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 సీట్లకు ఈ నెల 20వ తేదీన ఐదో విడతలో పోలింగ్ జరగనుంది. మొత్తం 49 సీట్లకుగాను 1,586 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 3వ తేదీతో నామినేషన్ల పరిశీలన పూర్తికాగా 749 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించామని ఈసీ తెలిపింది. బరిలో మొత్తం 695 మంది అభ్యర్థులున్నట్లు బుధవారం వెల్లడించింది. ఒక్కో నియోజకవర్గానికి సరాసరిన 14 మంది పోటీలో ఉన్నారు.

- హామీల అమల్లో పూర్తిగా విఫలమయ్యింది
- అబద్ధాలు చెప్పడం ఆ పార్టీకి పరిపాటిగా మారింది
- రూ.2,500 ఆర్థిక సాయంపై రాహుల్ కూడా అబద్ధాలు చెప్పారు
- ప్రధాని మోదీతో తెలంగాణకు పైసా కూడా లాభం కాలేదు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి మేలు జరుగుతుంది
- ఈ దేశం, ఈ రాష్ట్రం మనది.. అందరం ఏకమై కాపాడుకోవాలి
- బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ హక్కుల సాధన సాధ్యమవుతుంది
- నర్సాపూర్, పటాన్‌చెరు, దుండిగల్‌లో ఎన్నికల ప్రచారం



పటాన్‌చెరు బీఆర్‌ఎస్ రోడ్ షోకు భారీగా హాజరైన జనం

ప్రతి పథకంలో కొండి.. తొండి

కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ సీఎం కేసీఆర్ ఫైర్



బుధవారం పటాన్‌చెరులో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో వెంకట్రామిరెడ్డి, సునీత లక్ష్మారెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/దుండిగల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు విమర్శించారు. ప్రతి పథకంలో కొండి పెట్టడం.. తొండి పెట్టడం.. అబద్ధాలు చెప్పడం ఆ పార్టీకి పరిపాటిగా మారిందని అన్నారు. రైతుబంధు ఆర్థిక సాయం తాము అందరికీ ఇస్తే.. కాంగ్రెస్ వ్యవసాయం చేసిన వారికే ఇస్తామంటోందని చెప్పారు. వరి నాట్లు వేసేటప్పుడు ఇవ్వాల్సిన ఆర్థిక సాయం.. కోతలు, కల్లాలైనా కూడా ఇవ్వడం లేదన్నారు. వడ్లు కొనడం లేదని, వడ్లకు బోనస్ బోగస్ అయిందని ఎద్దేవా చేశారు. రూ.రెండు లక్షల రుణ మాఫీ జరగలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్, పటాన్‌చెరు, మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని దుండిగల్‌లో జరిగిన రోడ్ షోల్లో కేసీఆర్ మాట్లాడారు.

కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కింది

'నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ గద్దెనెక్కింది. ఆరు గ్యారెంటీలు, 420 హామీలిచ్చిన కాంగ్రెస్ ఉచితబస్సు హామీ తప్ప ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు. పేదల సంక్షేమం కాంగ్రెస్‌కు పట్టడం లేదు. రైతుబంధు సాయం అందలేదు. ఫ్రీబస్సు పథకం పెట్టి ఆటో కార్మికుల నోళ్లు కొట్టారు. మేము మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా ఇస్తే.. ఇప్పుడు ఆ నీళ్లు మాయమైపోయాయి. మా ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్లు బ్రహ్మాండంగా వచ్చిన కరెంట్.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎక్కడికి పోయింది? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇస్తలేరు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌లను నిలిపివేశారు. కల్యాణలక్ష్మికి అదనంగా ఇస్తామన్న తులం బంగారం ఇవ్వలేదు. రూ.4 వేల పింఛను ఇస్తారనే నమ్మకం ప్రజల్లో లేదు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం హామీ నెరవేర్చామని రాహుల్ గాంధీ ఇటీవల బహిరంగ సభలో అబద్ధాలు చెప్పారు..'అని కేసీఆర్ విమర్శించారు.

ఏ వర్గాన్నీ పట్టించుకోవడం లేదు

'టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 నియామకాల్లో గిరిజన రిజర్వేషన్లపై హైకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే, దానిపై సరైన, గట్టి వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమవుతోంది. మా ప్రభుత్వ హయాంలో గిరిజనుల పోడు భూములకు కూడా రైతుబంధు ఆర్థిక సాయం అందించాం. కానీ ఇప్పుడు రావడం లేదు. నేను 58 ఏండ్లుగా మొత్తుకున్నా ఏ ఒక్క సీఎం కూడా తండాలను గ్రామ పంచాయతీలుగా చేయలేదు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే తండాలను పంచాయతీలుగా చేసి నేరుగా నిధులు ఇచ్చాం. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవేవీ రాకుండా చేసింది. ఏ ఒక్క వర్గం కోసం కూడా కాంగ్రెస్ పని చేయడం లేదు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్ప కూలిపోవడానికి ఆ పార్టీ విధానాలే కారణం. కాంగ్రెస్ విధానాల కారణంగా పారిశ్రామిక వేత్తలు ఇక్కడి నుంచి తరలిపోతున్నరు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి ఆర్‌ఆర్ ట్యాక్స్ చెల్లిస్తున్నాడని స్వయంగా మోదీయే ప్రకటించారు..'అని మాజీ సీఎం చెప్పారు.

పాకిస్తాన్ పేరిట బీజేపీ ఎమోషనల్ బ్లాక్‌మెయిల్

'పాకిస్తాన్‌తో పంచాయతీ అంటూ బీజేపీ ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తోంది. 'బుట్కంత దేశం పాకిస్తాన్.. జాడిచ్చి కొడితే 25 ఏండ్లు మన దిక్కు చూడదు.. ప్రతిసారి పాకిస్తాన్ అని చెప్పుడు.. ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేయడం.. ఓట్లు దండుకోవడం. ప్రధాని మోదీతో తెలంగాణకు పైసా కూడా లాభం కాలేదు. 150 స్లోగన్లు చెప్పిన మోదీ.. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ అయిందంటున్నరు.. అది కాలేదు కానీ.. దేశం సత్తెనాస్ అయింది.. మోదీ హయాంలో రూపాయి విలువ ఏ ప్రధాని హయాంలో దిగజారనంతగా పడిపోయింది. పెట్టుబడులు పోయాయి. అంతర్జాతీయంగా భారతదేశ విలువలు మంట గలిసిపోతున్నాయి. విశ్వ గురువుగా ప్రకటించుకున్న మోదీ దేశ ప్రతిష్ఠను దిగజారుస్తున్నాడు. ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవిత అరెస్టులపై అమెరికా దేశం సైతం తమ నిరసన తెలిపింది. మోదీ ఎజెండాలో పేదల బాధలుండవు. ఢిల్లీలో ధర్నా చేస్తే 750 మంది రైతులను చంపిన మోదీ.. తర్వాత జరిగిన యూపీ ఎన్నికల్లో క్షమాపణలు చెప్పిండు.

కాంగ్రెస్‌ది మూడో స్థానమే..

ఈ దేశం, ఈ రాష్ట్రం మనది. అందరం ఏకమై తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. యువత, మేధావులు ఆలోచన చేసి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలే తప్ప.. ఒక ఒరవడిలో పిచ్చిపిచ్చిగా కొట్టుకుని పోవద్దు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మూడో స్థానంలో ఉంటుంది. అలాంటి కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి మేలు జరుగుతుంది. బీఆర్‌ఎస్ 12 స్థానాలు గెలిస్తే పార్లమెంట్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. కృష్ణా, గోదావరి జలాలను తమిళనాడుకు తీసుకెళ్లే ప్రయత్నం మోదీ చేస్తున్నారు. సీఎం రేవంత్ ఒక్క మాట మాట్లాడటం లేదు. ఈ నీళ్లను కాపాడు కోవాలంటే తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించాలి. అలా అయితే తెలంగాణ హక్కుల సాధన సాధ్యమవుతుందని' కేసీఆర్ పేర్కొన్నారు.

మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఎందుకు చేరిండు?

నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఎందుకు చేరిండని కేసీఆర్ ప్రశ్నించారు. పైసల కోసం చేరిండా? ఎవరిని ఉద్ధరించేందుకు ఆయన కాంగ్రెస్‌లో చేరిండో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. పోలీసులు చాలా అతిగా ప్రవర్తిస్తున్నారని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనే అని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మెదక్, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థులు వెంకట్రామ్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పిఠాపురంలో ఓటమి తప్పదని తెలిసిపోయింది..

పవన్‌పై కాపు ఉద్యమనేత ముద్రగడ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: పిఠాపురంలో 3 లక్షల మెజార్టీతో గెలుస్తామని పదేపదే చెప్పుకున్న పవన్‌కు ఇప్పుడు చిన్నాచితకా నటీనటులతో ప్రచారం చేయించుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. పవన్‌కు పిఠాపురంలో ఓటమి తప్పదని తెలిసిపోయిందని.. ఈ తరుణంలో వాళ్లని, వీళ్లని ఎందుకు ఇబ్బంది పెట్టాలని నిలదీశారు. బుధవారం కిర్లంపూడిలో మీడియాతో మాట్లాడుతూ.. కాపు ఉద్యమం వైఎస్సార్‌సీపీ ఒత్తిడితోనే చేశామనడం దుర్మార్గమన్నారు. 20 ఏళ్ల క్రితం ఉద్యమాన్ని వదిలేసిన తరువాత ఇద్దరు పెద్దమనుషులు వచ్చి చంద్రబాబు మన కులానికి రిజర్వేషన్ ఇస్తానన్నాడని, పునరుద్ధరిస్తానని చెప్పడమేకాక.. ఈ విషయాలు మేనిఫెస్టోలో పెట్టాడని, అందువల్ల రిజర్వేషన్ల కోసం అడగాలని తనను రోడ్డు మీదకు లాగారన్నారు. ఉద్యమం కోసం తనను రోడ్డు మీదకు జగన్‌మోహన్‌రెడ్డి లాగలేదన్నారు.

చంద్రబాబు ట్రాప్‌లో షర్మిల, సునీత

- 2021 నుంచి మానసికంగా ఇబ్బందిపాల్జేశారు... సభ్యత, సంస్కారంవల్ల నేను విమర్శించను
- వైఎస్సార్, వివేకా మరణాల వెనుక కుట్రలు బయటపడతాయి: అవినాశ్

పులివెందుల/లింగాల: తన అక్కలైన షర్మిల, సునీతలు చంద్రబాబు ట్రాప్‌లోపడి తమపై తీవ్ర విమర్శలు చేస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి చెప్పారు. 2021 నుంచి వారిద్దరూ తనను మానసికంగా ఎంతో ఇబ్బందిపాల్జేశారన్నారు. చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణ, ఎల్లో మీడియా ఏ స్క్రిప్ట్ ఇస్తే అది చదివి ఇష్టమొచ్చినట్లు నన్ను, జగనన్నను తిడుతున్నారని.. అయినా, వారిపట్ల తనకెలాంటి కోపంలేదని చెప్పారు. వైఎస్ వివేకాను హత్యచేశానన్న వ్యక్తిని వారు ప్రోత్సహిస్తున్నారని, అతడు పులివెందుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నా.. అతడిని ఓడించాలని ఒక్కమాట కూడా అనడంలేదన్నారు. హంతకుడు అప్రూవర్‌గా మారడంతో అతడినే సోదరుడిగా భావిస్తున్నారన్నారు. వైఎస్సార్ జిల్లా లింగాల మండల కేంద్రంలో అవినాశ్‌రెడ్డి రోడ్ షో, బస్టాండులో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..



ప్రజలతో మమేకమైన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సభ్యతతో ప్రతి విమర్శలు చేయడంలేదు..

వారిద్దరూ తనను ఎన్ని విమర్శలు చేసినా అదే రీతిలో తాను చేయగలను. కానీ, సభ్యత, సంస్కారాలవల్ల చేయడంలేదు. మా నాన్నను తప్పుడు ఆరోపణలతో 385 రోజులు జైల్లో పెట్టారు. ఎవరికీ ద్రోహం చేయలేదు, మనకెందుకీ శిక్ష అని అంటూ ఆయన బాధపడ్డారు. దేవుడి దయ, మీ ఆశీస్సులు ఉన్నంతవరకు మేం ఎప్పటికీ ప్రజల మధ్యనే ఉంటాం. ఇక దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిల మరణాలకు కారణం ఎవరు? ఎక్కడ కుట్ర జరిగింది? ఎవరికి మేలు చేసేందుకు ఇలాంటివి చేశారన్న నిజాలను ఎన్నివేల అడుగుల లోతున దాచిపెట్టి ఉన్నా బయటికి వస్తాయి.

వారికి కడప కోర్టు జరిమానా..

వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చి టీడీపీకి లబ్ధిచేకూర్చాలని చంద్రబాబు కాంగ్రెస్ పార్టీకి టార్గెట్ ఇచ్చారు. ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఏమీచేయలేరు. ఇక కొద్ది గంటలముందే కడప కోర్టు వీరుచేసే దుష్ప్రచారాలకు జరిమాన విధించింది. కేసు ట్రయిల్‌కు రాకముందే మీరెలా మాట్లాడతారని షర్మిలక్కకు, సునీతక్కకు, వారి సోదరుడు బీటెక్ రవికి రూ.10 వేలు జరిమాన విధించింది. న్యాయస్థానాలు కూడా వీరు చేసేది తప్పని చెబుతున్నాయి. వీరి టార్గెట్ కేవలం వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకును చీల్చడమేం. నా నిజాయితీని నూరు శాతం నిరూపించుకుంటా. ఇక ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లువేసి, వేయించి ఎమ్మెల్యే అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థినైన నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి.

రెండోసారి మోసపోతే మనదే తప్పు

- గుంపుమేస్త్రీ ఇంటికి పయనం అవుతారు
- కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాల రోడ్‌షోల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



గద్వాలలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన జనం

సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలకు ఆశపడి మొన్నటి ఎన్నికల్లో మోసపోయామని..రెండోసారి కూడా మోసపోతే తప్పు మనదే అవుతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాల పట్టణాల్లో నిర్వహించిన రోడ్ షోల్లో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో 12 ఎంపీ సీట్లు గెలిస్తే ఆరు నెలల్లోనే కేసీఆర్ తిరిగి రాష్ట్రాన్ని శాసిస్తారని.. ఆ తర్వాత గుంపుమేస్త్రీ రేవంత్‌రెడ్డి ఇంటికి పయనం కావడం తప్పదని చెప్పారు.

కాంగ్రెస్ రాగానే కన్నీళ్లు వచ్చాయి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రైతులకు కన్నీళ్లు వచ్చాయని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వాన్ని నడపడం పాన్‌డబ్బా నడిపినట్టు కాదని, అందుకు పరిపాలనాదక్షత, దమ్మూధైర్యం ఉండాలని చెప్పారు. అరచేతిలో వైకుంఠం చూపి, మోసపు డైలాగులతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డికి గ్యారంటీలు అమలు చేయడం చేతకాక కేసీఆర్‌పై, తిట్లు.. దేవుడిపై ఓట్లు పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో వృద్ధులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులకు రాసిచ్చిన బాండ్లు బౌన్స్ అయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరెంటు, నీటి కష్టాలు మొదలయ్యాయని చెప్పారు.

నమో అంటే నమ్మించే మోసగాడు

పదేళ్లలో ప్రధాని మోదీ తెలంగాణకు చేసిందేమిటని ప్రశ్నించారు. కృష్ణాజలాల్లో వాటా తేల్చాలని అడిగితే ఒక్క ఉత్తరానికి సమాధానం చెప్పలేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయహోదా ఇవ్వని మోదీకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రాముడి గుడి కట్టినందుకే మోదీ ఓట్లు అడిగితే.. యాదాద్రి దేవాలయంతో పాటు ఆధునిక దేవాలయాలైన కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను కట్టిన కేసీఆర్‌ను మనం కాపాడుకోవాలని చెప్పారు. నమో అంటే నమ్మించి మోసం చేసే వాడని అన్నారు. ఐపీఎస్ అధికారిగా ఉండి అద్భుతాలు సృష్టించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఇలాంటి వ్యక్తి మళ్లీ దొరకరని చెప్పారు. ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపితే తెలంగాణ గొంతు అక్కడ వినిపిస్తారని, ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అని, ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తే అన్ని పనులు అవుతాయని పేర్కొన్నారు. ఆయా రోడ్‌షోల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అచ్చంపేట, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ప్రొటీన్ పౌడర్లు వాడొద్దు

- ఆహారంలో 45 శాతమే కార్బొహైడ్రేట్స్ ఉండాలి
- పిల్లలు, గర్భిణిలే మాంసం, గుడ్లు ఎక్కువగా తినాలి
- సగటున రోజుకు 1200 గ్రాముల ఆహారం తీసుకోవాలి
- డ్రైఫిష్‌లో కాల్షియం, ఐరన్‌లు ఎక్కువగా ఉంటాయి
- ఇండియన్ డైటరీ గైడ్‌లైన్స్ విడుదల చేసిన ఐసీఎంఆర్, ఎన్ఐఎన్



సాక్షి, హైదరాబాద్: అథ్లెట్లు అయినా.. ఎవరైనా సరే.. ప్రొటీన్ పౌడర్లు వాడకూడదని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్)లు హెచ్చరించాయి. జిమ్‌కు వెళ్లే వారు, స్పోర్ట్స్ ఆడేవారు ప్రొటీన్ పౌడర్లు వాడుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక కనువిప్పు అవుతుందని నిపుణులు అంటున్నారు. అంతేకాదు మనకు కావాల్సిన శక్తిలో 45 శాతాన్ని కార్బొహైడ్రేట్స్ ద్వారానే అంటే రైస్, చపాతి వంటి వాటి ద్వారానే తీసుకోవాలి. 15 శాతం ప్రొటీన్ల ద్వారా, మిగిలిన 30 శాతం ఫ్యాట్ ద్వారా తీసుకోవాలి. మిగిలిన పది శాతం పాల పదార్థాలు, గింజలు వంటి వాటి ద్వారా తీసుకోవాలి. అయితే మన దేశంలో సగటున 50 నుంచి 70 శాతం కార్బొహైడ్రేట్స్ రూపంలోనే తీసుకుంటున్నారు. ప్రొటీన్ల ద్వారా అత్యంత తక్కువగా 6-9 శాతం తీసుకుంటున్నారు. మిగిలినది ఇతర పదార్థాల తీసుకుంటున్నారని ఐసీఎంఆర్, ఎన్ఐఎన్‌లో పేర్కొన్నాయి. ఈ మేరకు ఆ సంస్థలు బుధవారం 'ఇండియన్ డైటరీ గైడ్‌లైన్స్'ను విడుదల చేశాయి. మనం ఎలాంటి ఆహారం తీసుకోవాలి... ఎంత తీసుకోవాలి... విటమిన్లు ఏమేం తీసుకోవాలి... శారీరక శ్రమ ఏమేరకు చేయాలన్న దానిపై ఈ గైడ్‌లైన్స్‌ను రూపొందించాయి.

ఎంత తినాలి...

- ఆఫీసుల్లో పనిచేసే పురుషుడికి 2,080 కేలరీలు కావాలి. మధ్యస్థంగా శారీరక శ్రమచేసే పురుషునికి 2,680 కిలో కేలరీలు కావాలి. మహిళలైతే ఆఫీసులో పని చేసే వారికి 1,650 కిలో కేలరీలు కావాలి. మధ్యస్థంగా శారీరకంగా పనిచేసే మహిళలకు 2,125 కిలోకేలరీలు కావాలి.
- గర్భిణీ స్త్రీకి 2,020, పాలిచ్చే తల్లులకు 2,245 కిలో కేలరీలు కావాలి.
- 60 ఏళ్లు పైబడిన పురుషులు 1740, మహిళలైతే 1530 కేలరీలు తినాలి.
- సగటున ప్రతి ఒక్కరు 1200 గ్రాముల ఫుడ్‌ను తీసుకోవాలి...
- మాంసం, పాలు, గుడ్లు అధికంగా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, పిల్లలు, ఎదిగే పిల్లల ఆహారంలో చేర్చాలి.



ఏవేవి తినొద్దు... ఏం చేయొద్దంటే...

- గర్భిణీలు తిన్న తర్వాత పడుకోవద్దు...
- టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్... ఆహారంతోకానీ, ఆహారం తర్వాత కానీ తీసుకోవద్దు
- పిల్లలకు ఆరు నెలలు తల్లిపాలే పట్టాలి. వారికి ఆ వయస్సులో వాటర్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు... ఎంత వేడి ఉన్నా కూడా అవసరం లేదు. గ్లూకోజ్ వాటర్ కూడా ఇవ్వొద్దు.
- తల్లిపాలు తీసుకోకపోతే పిల్లలకు బాల్యంలో ఊబకాయం, షుగర్, పెద్దయిన తర్వాత బ్లడ్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుంది.
- పాలు ఇవ్వని తల్లులకు రొమ్ము క్యాన్సర్, ఓవరీ క్యాన్సర్, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది.
- ఆరు నెలలు దాటిన పిల్లలకు తల్లిపాలు ఇస్తూ... ఉదయం రైస్, దాల్... మధ్యాహ్నం అరటి, యాపిల్... సాయంత్రం కిచిడి వంటివి ఇవ్వాలి.



బరువు నిదానంగా తగ్గాలి. వేగంగా తగ్గడానికి ప్రయత్నాలు చేయొద్దు..

- రోజుకు 7-8 గంటలు పడుకోవాలి
- రోజుకు కనీసం 35-40 నిముషాలు బ్రిస్క్ వాక్ చేయాలి
- చిన్న పిల్లలు 60 నిముషాలు శారీరక శ్రమ చేయాలి
- చిన్నప్పటి నుంచే తక్కువ ఉప్పుతో తినడాన్ని అలవాటు చేయాలి
- వాడిన నూనెలను ఎక్కువగా వాడకూడదు. వాడిన నూనెలో ఫ్రెష్ ఆయిల్‌ను కలపొద్దు

అనారోగ్యకరమైన ఆహారం వల్లే అధిక జబ్బులు



ఇండియాలో 56.4 శాతం జబ్బులు అనారోగ్యకరమైన ఆహారం వల్లే వస్తున్నాయని ఐసీఎంఆర్, ఎన్ఐఎన్ విడుదల చేసిన డైటరీ గైడ్‌లైన్స్ నివేదిక తెలిపింది. దాని ప్రకారం దేశంలో 1-4 ఏళ్ల మధ్య వయస్సువారు ఎనీమియాతో బాధపడుతున్నారు. 10-19 ఏళ్ల వయస్సువారిలో 24 శాతం విటమిన్ డీ లోపం ఉంది. 10-19 ఏళ్లలోపు వారిలో చెడు కొలెస్ట్రాల్ 28.2 శాతం ఉంది. 5-19 ఏళ్ల మధ్య వయస్సు వారిలో ప్రీ డయాబెటిక్ 10 శాతం ఉంది.

– డాక్టర్ కిరణ్ మాదల, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నిజామాబాద్

బీజేపీ, కాంగ్రెస్‌లవి దొంగ డ్రామాలు

- జిల్లాలు తగ్గించేందుకు రేవంత్ కుట్ర
- రాజకీయాల కోసం బీజేపీ దేవుడిని వాడుకుంటోంది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ఎంపీ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొంగ డ్రామాలు ఆడుతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, తెలంగాణలో కొత్త జిల్లాలు ఎక్కువ అయ్యాయని, పార్లమెంటు పరిధిలో ఒకే జిల్లా ఉండాలని, అందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారన్నారు. ఇది దుర్మార్గపు చర్య అని, మొదట సిద్దిపేట జిల్లా రద్దు చేసే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. ప్రాణం పోయినా సరే జిల్లా పోనివ్వమని, దేనికైనా సిద్ధమని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వం మీద బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను ఎగ్గొట్టడానికి రాష్ట్రం అప్పుల్లో ఉందని, ఖజానా దివాళా అని రాష్ట్రం పరువు తీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ రాష్టానికి ఇచ్చింది గాడిద గుడ్డేనని అన్నారు. రాజకీయాల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ దేవుడిని, దేశాన్ని వాడుకుంటోందని ఆరోపించారు. ప్రధానులుగా పనిచేసిన పీవీ, వీపీసింగ్, దేవెగౌడ హయాంలో దేశం ఎక్కడికీ పోలేదని, ఏదో జరిగిపోతున్నట్టుగా బీజేపీ ఇప్పుడు కొత్త నాటకం ఆడుతోందని విమర్శించారు. రిజర్వేషన్లు, ముస్లిం ఆస్తులు కూడా ఎక్కడికి పోవని, ఇదంతా ఓట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆడుతున్న డ్రామా అని, ఇద్దరూ దొంగలేనని ఆరోపించారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫేక్ వీడియో ప్రచారం ద్వారా బీజేపీ లబ్ధి పొందిందని, ఇప్పుడు కూడా పోలింగ్ ముందు మూడు రోజుల్లో ఫేక్ వీడియోలు వచ్చేలా చూస్తారని ఓటర్లు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు.

పదేళ్లపాలనలో మోదీ ప్రజల చెవిలో పువ్వులు పెట్టారు

మైనారిటీల సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మల్కాజిగిరి/చంచల్‌గూడ: పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ ప్రజల చెవిలో పువ్వులు పెట్టారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం మౌలాలి బంజార ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మైనారిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ జన్‌ధన్ ఖాతాలు ప్రారంభించి నల్లధనం తీసుకొచ్చి పదిహేనులక్షల రూపాయలు వేస్తానన్న మోదీ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ నాయకులైన క్రేజీవాల్, హేమంత్‌సోరన్‌తోపాటు కవితను కూడా అరెస్ట్ చేశారన్నారు. రాష్ట్రంలో పదేళ్లుగా నిరంతర విద్యుత్, మంచినీటి కొరతలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోతలు, నీటిఎద్దడి మొదలైందని చెప్పారు. మైనారిటీల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కోట్ల రూపాయలు ఖర్చు చేసింది కేసీఆర్ ఒక్కరేనన్నారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎంబీసీ మాజీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు సునీతాయాదవ్, విజయశాంతి, సబిత, మురుగేష్ పాల్గొన్నారు.

సర్క్యులర్‌పై స్పష్టత లేదు

క్రిశాంక్‌ను ములాఖత్‌లో కలిసేందుకు కేటీఆర్ బుధవారం చంచల్‌గూడ జైలుకు వచ్చారు. క్రిశాంక్ పరామర్శించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసిన సర్క్యులర్, క్రిశాంక్ విడుదల చేసిన సర్క్యులర్‌లను నిపుణులతో పరీక్షించాలని సీఎంకు సవాల్ విసిరారు. ఒరిజినల్ ఏదో..ఫోర్జరీ ఏదో తెలుస్తుందని, ఇద్దరిలో ఎవరు జైలులో ఉండాలో, ఎవరు బయట ఉండాలో తేలిపోతుందన్నారు.

క్లుప్తంగా...

అక్రమ నిర్మాణాల తొలగింపులో లోకాయుక్త జోక్యం చేసుకోలేదు

- తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాల తొలగింపులో జోక్యం చేసుకునే అధికారం లోకాయుక్తకు లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. అంతకుముందు లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. లోకాయుక్త చట్టం 1983లోని సెక్షన్ 29(ఏ)..అక్రమ నిర్మాణాల తొలగింపునకు సంబంధించి చర్యలు తీసుకునే, జోక్యం చేసుకునే అధికారం ఇవ్వలేదని ఓ కేసు విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. నిర్మాణాలను తొలగించాలంటూ 2015లో లోకాయుక్త జారీ చేసిన ఆదేశాలను హైదరాబాద్‌కు చెందిన హనుమంతరావు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పునిచ్చింది. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలు చెల్లవని నొక్కిచెప్పింది.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్‌గా కవిత తొలగింపు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ కమిషనర్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు.. ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కవితపై పలు అభియోగాల ఆధారంగా ఈ నెల 3 నుంచి ఆమెను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. 2021లో పదవీ బాధ్యతలు చేపట్టిన కవిత ఏప్రిల్ 2026 వరకు కొనసాగాల్సి ఉండగా మధ్యలోనే తప్పించారు.

10న నాలుగు వేల డప్పులతో ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ రక్షణ పేరుతో ఈనెల 10న సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు నాలుగు వేల డప్పులతో ర్యాలీ ఉంటుందని కాంగ్రెస్ నేతలు గజ్జెల కాంతం, సతీశ్‌మాదిగ తెలిపారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. బీజేపీకి 400 సీట్లు ఇస్తే దేశాన్ని మోదీ రాజ్యంగా మార్చుతారని ఆరోపించారు. రాజ్యాంగం, రిజర్వేషన్లను కాపాడేది కాంగ్రెస్ ఒక్కటేనని ఆయన స్పష్టం చేశారు.

గోడ కూలి ఏడుగురు దుర్మరణం

హైదరాబాద్ బాచుపల్లిలో విషాదం ... మృతులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందినవారిగా గుర్తింపు



ప్రమాదం జరిగిన ప్రాంతం



కూలిన గోడ

నిజాంపేట్ (హైదరాబాద్): ఓ నిర్మాణ సంస్థ నిర్లక్ష్యానికి ఏడుగురు కూలీల జీవితాలు గాల్లో కలిసిపోయాయి. అపార్ట్‌మెంట్ చుట్టూ నిర్మించిన రిటైనింగ్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలి పక్కనే ఉన్న రేకుల షెడ్లపై పడటంతో, వాటిల్లో నివాసం ఉంటున్న కూలీల కుటుంబాలకు చెందిన ఏడుగురు మృతి చెందారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ శివారు బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో మంగళవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. అయితే రాత్రి వరకు ఒక మృతదేహమే బయటపడింది. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము వరకు వర్షంలోనే సహాయక చర్యలు కొనసాగించిన అధికారులు శిథిలాల నుంచి మొత్తం ఏడు మృతదేహాలను వెలికితీశారు. మృతులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు చెందినవారని తెలిసింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

జోరు వానలో హాహాకారాలు

బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీ సర్వే నంబర్ 345 పీ, 406 పీ, 403ల్లోని 4,232 గజాల విస్తీర్ణంలో రైజ్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. అపార్ట్‌మెంట్ చుట్టూ నిర్మించిన రిటైనింగ్ వాల్ ఆనుకుని ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లలో కూలీల కుటుంబాలు నివసిస్తున్నాయి. మంగళవారం సాయంత్రం జోరున వాన కురుస్తుండగా.. సుమారు 6 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ గోడ కూలిపోయింది. రేకుల షెడ్లలో ఉన్నవారు గోడ శిథిలాల కింద చిక్కుకుపోవడంతో ఆ ప్రాంతం అరుపులు, కేకలతో దద్దరిల్లిపోయింది. సమాచారం అందుకున్న బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్.. ఎస్‌ఐలు సత్యనారాయణ, మహేశ్, సంధ్య ఇతర సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దంపతులు రామ్‌యాదవ్ (44), గీతా బాల్ (40), వారి కుమారుడు హిమాన్షు (4), మహారాష్ట్రకు చెందిన దంపతులు బిద్రేష్ (30), ఖుషి (20), అదే రాష్ట్రానికి చెందిన శంకట్‌గౌడ్ (18), శ్రీపా మాజీ (23)ల మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సాగర్ మార్వి, సుపీందర్ దుని, హెడ్మస్, మోతీ, తంగబట్టి, అమీర్ హుస్సేన్, దామ్‌సోమ్రీలకు గాయాలు కాగా స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణారావు, ఆర్డీఓ శ్యాం ప్రసాద్, తహసీల్దార్ పూల్‌సింగ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ. 80 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసినట్లు కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ చతుర్వేది తెలిపారు.

ఎత్తైన గోడ..తక్కువ మందం!

రిటైనింగ్ వాల్ ఎత్తు సుమారు 25 అడుగుల వరకు ఉండగా, వెడల్పు (మందం) చాలా తక్కువగా ఉండటంతో కొన్ని గంటల పాటు కురిసిన భారీ వర్షానికి కూలిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గోడ నిర్మాణంలో నాణ్యత కూడా లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రమాదం నేపథ్యంలో రైజ్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ అరవింద్‌రెడ్డిపై 304 పీ2 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. అదే విధంగా రైజ్ నిర్మాణ సంస్థకు అనుమతులు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని కోరుతూ హెచ్‌ఎండీఏకు నోటీసులు జారీ చేశారు.

తాగునీటికి 2.25 టీఎంసీల నీళ్లు

- విడుదల చేసిన కర్ణాటక ప్రభుత్వం
- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్



సాక్షి, హైదరాబాద్: తాగునీటి కోసం కర్ణాటక ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాయని, 2.25 టీఎంసీల కృష్ణానీటిని మంగళవారం రాత్రి నుంచి విడుదల చేసిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నీటివిడుదల విషయమై తనతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడినట్టు తెలిపారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోయారన్నారు. అయితే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. మిల్లర్లు తరుగు ఎక్కువ తీసుకుంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలా తరుగు తీసేవారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర నిజమే

మోదీతో అదానీ, అంబానీలకు మధ్య ఉన్న సంబంధం దేశ ప్రజలందరికీ తెలుసని ఉత్తమ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై మోదీ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అదానీ, అంబానీలపై తాము చేసే విమర్శలు మోదీకి కనిపించవని, ఆయన చెప్పే పచ్చి అబద్ధాలను ఎన్నికల కమిషన్ చూసీచూడనట్టు వదిలేస్తుందని చెప్పారు. మోదీ, అమిత్ షా ప్రసంగాలు చూస్తుంటే ఓటమి భయం కనిపిస్తుందని, రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందన్నది నిజమేనని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

కాళేశ్వరంపై వారం రోజుల్లో పూర్తి నివేదిక

కాళేశ్వరంపై వారంరోజుల్లో పూర్తిస్థాయి నివేదిక వస్తుందని ఉత్తమ్ చెప్పారు. 2019లోనే బ్యారేజీలో డ్యామేజ్ కనపడిందని ఎన్‌డీఎస్‌ఏ వారు చెప్పారని, అప్పుడే నీళ్లు తీసి బాగు చేస్తే బాగుండేది వారి నివేదికలో పేర్కొన్నట్టు తెలిపారు. ఇప్పుడు బ్యారేజీలో నీళ్లు ఉంచకూడదని నివేదిక ఇచ్చారని, బ్యారేజీ సేఫ్టీపై గ్యారంటీ లేదని, కొంత సందిగ్ధత ఉందన్నారు. బ్యారేజీకి సంబంధించిన అన్ని టెస్టులు చేస్తున్నారని, వారంరోజుల్లో నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు అందజేయనున్నట్టు తెలిపారు. బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు రాదని, బీజేపీకి పోయినసారి కన్నా తగ్గుతాయని, ఇండియాలోనే కాంగ్రెస్‌కు నల్లగొండలో ఎక్కువ మెజారిటీ వస్తుందని ఉత్తమ్ తెలిపారు.

ఇప్పట్లో మరమ్మతులు కష్టమే!

కాళేశ్వరం బ్యారేజీల విషయంలో సర్కార్ పునరాలోచన

- అయ్యర్ కమిటీ నివేదికపై అధ్యయనానికి ఇంజనీర్లతో మరో కమిటీ వేయాలని నిర్ణయం
- ఆ కమిటీ సూచనల తర్వాతే ముందడుగు
- మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేసినా గ్యారంటీ లేదన్న అయ్యర్ కమిటీ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నిర్వహించాల్సిన అత్యవసర మరమ్మతులను సూచిస్తూ కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ తాజాగా మధ్యంతర నివేదిక సమర్పించినా.. మరమ్మతులు తక్షణమే ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు. వానాకాలం ప్రారంభానికి నెల రోజులే మిగిలి ఉండగా, ఆలోగా అయ్యర్ కమిటీ సిఫారసు చేసిన తాత్కాలిక మరమ్మతులను పూర్తి చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మేడిగడ్డ బ్యారేజీలోని 7వ నంబర్ బ్లాక్‌కు నిర్వహించే మరమ్మతులు తాత్కాలికమేనని, మళ్లీ ఏదైనా జరగదని గ్యారెంటీ ఇవ్వలేమని అయ్యర్ కమిటీ తేల్చిచెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఈ నేపథ్యంలో కమిటీ నివేదికపై అధ్యయనం కోసం నీటిపారుదల శాఖలోని ఇంజనీర్లతో ఓ కమిటీని వేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీలకు మరమ్మతుల విషయంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. అయ్యర్ కమిటీ చేసిన సిఫారసుల్లో కొన్నింటిని మాత్రమే వానాకాలం ప్రారంభానికి ముందు అమలు చేసేందుకు అవకాశముందని అధికారవర్గాలు తెలిపాయి. కమిటీ సూచించిన పనులకు సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్స్‌ను తయారు చేసి ఆమోదం తీసుకోవడానికి చాలా సమయం పడుతుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆలోగా వర్షాకాలం ప్రారంభం అవుతుందని చెపుతున్నాయి. అయ్యర్ కమిటీ మధ్యంతర నివేదిక సమర్పించిన తర్వాతే బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులను నిర్వహిస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ భవితవ్యంపై అయ్యర్ కమిటీ ప్రశ్నలు లేకెత్తించిన నేపథ్యంలో మరమ్మతులు చేపట్టిన తర్వాత ఏదైనా అనుకోని సంఘటన జరిగితే దానికి బాధ్యత వహించాల్సి వస్తుందనే భావనతో ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. కాగా, మరో వారం రోజులు గడిచిన తర్వాతే మరమ్మతులు చేపట్టే అంశంపై కొంత స్పష్టత వచ్చే అవకాశముందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

నేటి నుంచి ఇంజనీరింగ్ సెట్

- ముగిసిన అగ్రి, ఫార్మా సెట్
- వర్షంతో విద్యుత్ అంతరాయం
- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు
- అనేక చోట్ల కొద్ది సేపు మొరాయించిన సర్వర్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి జేఎన్‌టీయూహెచ్ నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్‌ఈఏపీ సెట్) బుధవారం ప్రశాంతంగానే ముగిసింది. అయితే, మంగళవారం కురిసిన అకాల వర్షం కారణంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పరీక్ష కేంద్రాల్లో అనేక చోట్ల విద్యుత్ లేకపోవడం, ఇంటర్నెట్ సదుపాయం గంటల తరబడి అందుబాటులోకి రాకపోవడంతో సెట్‌కు సమస్యలు తలెత్తాయి. హైదరాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాల్లో కొద్దిసేపు కంప్యూటర్లు మొరాయించినట్టు విద్యార్థులు తెలిపారు. కానీ తక్షణమే అధికారులు స్పందించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే అదనంగా జనరేటర్లను సిద్ధం చేశారు. నెట్‌వర్క్ సమస్యలను కొన్ని నిమిషాల వ్యవధిలోనే పరిష్కరించినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం మొదలైన ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగానికి చెందిన సెట్ రెండో రోజు కూడా జరిగింది. ఈ రెండు రోజులకు కలిపి 1,00,254 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 90 శాతం విద్యార్థులు పరీక్ష రాసినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

ఇంజనీరింగ్ సెట్‌కు పక్కా ఏర్పాట్లు

రాష్ట్రంలోని దాదాపు 175 కాలేజీల్లో ఉన్న 1.06 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి జేఎన్‌టీయూహెచ్ నిర్వహించే సెట్ గురువారం మొదలవుతుంది. ఈ పరీక్షకు ఏపీ, తెలంగాణ నుంచి 2,54,532 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. సగం మందికిపైగా విద్యార్థులు హైదరాబాద్ కేంద్రం నుంచే పరీక్ష రాస్తున్నారు. దీంతో హైదరాబాద్‌లో 4 జోన్లు ఏర్పాటు చేశారు. వర్షం, గాలి దుమారం అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ జనరేటర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నెట్‌వర్క్ సమస్య రాకుండా కూడా అదనపు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

---

10 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు పెంపు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ మరో రెండు రోజులు గడువు పెంచిందని హైదరాబాద్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఈ నెల 8వ తేదీ వరకు గడువు ఉండగా, ఎన్నికల కమిషన్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు అందరూ వినియోగించుకోవాలని సూచించారు.

విధులకు హాజరు కాని 40 మంది సస్పెన్షన్

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విధులకు గైర్హాజరైన 40 మంది పీఓ, ఏపీఓలను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ విధుల నిర్వహణ డ్యూటీలు కేటాయించిన వివిధ శాఖలకు చెందిన 40 మంది శిక్షణ తరగతులకు గైర్హాజరవడంతో పాటు కనీసం ఎస్ఎంఎస్, రిమైండర్లకు స్పందించలేదన్నారు. వారిని ప్రజా ప్రాతినిధ్య చట్టం(ఆర్‌పీ యాక్ట్)1951 ఉల్లంఘన కింద సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా శాఖలకు సిఫారసు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 9, 10వ తేదీల్లో మూడవ దశ శిక్షణ తరగతులకు కూడా హాజరుకానీ వారిపై సైతం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అంధకారంలో కాలనీలు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాలు అంధకారంలో మగ్గుతున్నాయి. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తారకానగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 26 గంటలుగా, ఎస్ఎస్‌కాలనీ, ధర్మారెడ్డి ఫేస్–2లో 26 గంటలు, కూకట్‌పల్లి, బాలజీనగర్ పరిధిలో 22 గంటలు, మియాపూర్ అంబేడ్కర్ నగర్ పరిధిలో 15 గంటలపాటు, ఉప్పల్ రామంతాపూర్ పరిధిలో 16 గంటలుగా విద్యుత్ సరఫరా లేక అంధకారం నెలకొంది. అధికారుల వైఖరికి నిరసనగా చందానగర్ సబ్‌స్టేషన్ ఎదుట స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కాగా దీనిపై సైబర్ సిటీ ఎస్ఈ వెంకన్న స్పందిస్తూ ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన సరఫరాను పునరుద్ధరించామన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అన్ని ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను ప్రారంభించినట్లు తెలిపారు.

నగర వార్తలు

ధరలు.. 'విమానం' మోత!

ఎన్నికలు, వేసవి సెలవుల నేపథ్యంలో పెరిగిన విమాన చార్జీలు

- ఈ నెల 10 నుంచి 13 వరకు భారీ డిమాండ్
- విశాఖకు రూ.5,426 నుంచి రూ.6,791 వరకు పెరిగిన చార్జీలు
- విజయవాడకు రూ.3,692 నుంచి రూ.5,531 వరకు డిమాండ్



సాక్షి, సిటీబ్యూరో: విమాన చార్జీలు మోత మోగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పలు ఎయిర్‌లైన్స్ అనూహ్యంగా చార్జీలను పెంచాయి. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పెరిగిన రద్దీ, వేసవి సెలవుల కారణంగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల డిమాండ్ మేరకు విమాన చార్జీలు బాగా పెరిగాయి. కొన్ని రూట్లలో సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు కాగా, మరి కొన్ని మార్గాల్లో చార్జీల పెంపు మరింత భారంగా మారింది.మరోవైపు ప్రయాణికుల రద్దీ మేరకు ప్రైవేట్ బస్సుల్లోనూ చార్జీలను రెట్టింపు చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ మధ్య డిమాండ్ ఎక్కువగా ఉంది. వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్య వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. కానీ కొద్ది రోజులుగా రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లలోనూ రద్దీ పెరిగింది.

ఈ నెల 12వ తేదీన హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు విమాన చార్జీలు కింది విధంగా ఉన్నాయి..

డెస్టినేషన్	చార్జీలు (రూపాయలలో)
విశాఖపట్టణం	6,791
విజయవాడ	5,531
బెంగళూరు	3,514
జైపూర్	5,406
న్యూఢిల్లీ	6,469

పెరిగిన విమాన ప్రయాణాలు...

కొద్ది రోజులుగా హైదరాబాద్ నుంచి వివిధ నగరాలకు విమాన ప్రయాణికులు పెరిగారు. సాధారణంగా రోజుకు 50 వేల మంది వరకు దేశీయ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా ప్రస్తుతం 55000 నుంచి 60 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. హైదరాబాద్ నుంచి జైపూర్, గోవా, కాశ్మీర్, బెంగళూరు, చెన్నై, కొచ్చి తదితర ప్రాంతాల్లో పర్యటనలకు వెళ్లే వారి రద్దీ పెరిగింది. ఇదే సమయంలో ఎన్నికల దృష్ట్యా హైదరాబాద్ నుంచి ఢిల్లీ మధ్య రాజకీయ నాయకుల రాకపోకలు సైతం భారీగా పెరిగాయి. ఈ డిమాండ్ మేరకు పలు ఎయిర్‌లైన్స్ చార్జీలను పెంచాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు ఈ నెల 10వ తేదీన రూ.5,426 ఉంటే, ఎన్నికలకు ఒక రోజు ముందు అంటే మే 12వ తేదీన హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.6,791 వరకు చార్జీలు పెరిగాయి. అలాగే విజయవాడకు ఈ నెల 10వ తేదీన రూ.3,692 ఉండగా, 12వ తేదీ నాటికి రూ.5,531 వరకు చేరింది. బెంగళూరుకు రూ.3,514 వరకు చార్జీలు ఉన్నాయి. ఇక ఎక్కువ మంది రాకపోకలు సాగించే హైదరాబాద్–న్యూఢిల్లీ మధ్య ఈ నెల 10న రూ.7930 వరకు చార్జీలు పెరిగాయి. 11వ తేదీన కూడా రూ.6,469 వరకు డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఉన్న చార్జీలు ఇవి. కాగా, ప్రయాణికుల డిమాండ్ మేరకు ఈ చార్జీలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పలు ట్రావెల్స్ సంస్థల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

గ్రేటర్‌కు స్వర్ణయుగం తెస్తా

కేంద్రం నుంచి నిధులు రప్పిస్తా
మహిళలు నీరాజనాలు పడుతున్నారు
లక్ష ఓట్ల మెజార్టీతో నా గెలుపు ఖాయం
సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్



Interview

బంజారాహిల్స్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో 2004 నుంచి 2009 వరకు, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌కు స్వర్ణయుగంగా ఉండేది. ఇప్పుడు మళ్లీ గ్రేటర్‌లో స్వర్ణ యుగం తీసుకువస్తామని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఒకవైపు గ్రేటర్‌లో అభివృద్ధి, మరోవైపు కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంగా సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి గెలుపే ప్రధానంగా ప్రచారం ముమ్మరం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. తాను లక్ష ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నానని, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు రెండో స్థానం కోసం పోటీపడాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో ఇంకా ఏమన్నారంటే..

స్పందన బాగుంది...

గత మూడు వారాల నుంచి సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నమ్మకం, గ్రేటర్‌లో తనకున్న పరిచయాలు ఓటర్లను రోజురోజుకూ మరింత దగ్గర చేస్తున్నాయి.

మహిళల స్పందన అపూర్వం..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో అయిదు విజయవంతంగా అమలవుతుండగా.. ఇందులో ఉచిత బస్సు, రూ.500కే గ్యాస్, గృహజ్యోతి పథకాలు మహిళలను బాగా ఆకట్టుకున్నాయి. అందుకే నా ప్రచారానికి మహిళలు భారీగా తరలివస్తున్నారు. హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్నారు.

కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదు..

అయిదేళ్లు కేంద్ర మంత్రిగా ఉన్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదు. నేను పర్యటించిన ప్రతిచోటా ప్రజలే ఈ విషయాన్ని చెబుతున్నారు. పార్లమెంట్ పరిధిలో కిషన్‌రెడ్డి చేసిన ఒక్క అభివృద్ధి పని కూడా కనిపించడం లేదు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి కార్యకర్తనూ కలుస్తున్నారు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి కార్యకర్తనూ కలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నేను బీఆర్‌ఎస్‌లో చేరిన తరువాత అప్పటి సీఎం కేసీఆర్‌ను పదిహేను సార్లు కూడా కలవలేకపోయాను. కార్యకర్తలను కూడా కలిపించలేకపోయాను. సీఎం రేవంత్‌ను మాత్రం ఈ నెల రోజుల్లో నేనే పదిహేను సార్లు కలిశాను. ఈ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అనడానికి ఇంతకంటే మంచి నిదర్శనం ఇంకొకటి లేదు.

గళం వినిపిస్తా..

సికింద్రాబాద్‌లో నా గెలుపు ఖాయమైంది. ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారు. ఒకప్పుడు గ్రేటర్‌లో మిగులు బడ్జెట్ ఉండగా ఇప్పుడు లోటు బడ్జెట్‌తో అభివృద్ధి పనులు ముందుకుసాగడం లేదు. గెలిచాక పార్లమెంట్‌లో నా గొంతును వినిపిస్తా. మూసీ, ఇతర అభివృద్ధి పనులకు భారీగా నిధులు తెప్పిస్తా. ఆ నమ్మకం నాకుంది. సికింద్రాబాద్‌తో పాటు హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడానికి కృషి చేస్తాను.

హైదరాబాద్‌ను మరో పాకిస్తాన్ కాకుండా అడ్డుకుంటాం

బీజేపీ ఎంపీ నవనీత్ కౌర్



యువమోర్చా సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ నవనీత్ కౌర్

సైదాబాద్: హైదరాబాద్ మరో పాకిస్తాన్‌లా మారకుండా అడ్డుకుంటామని, అందుకు ఈ ఎన్నికల్లో పాతబస్తీ వాసులు బీజేపీ అభ్యర్థి మాధవీలతను గెలిపించాలని ఆ పార్టీ మహారాష్ట్ర ఎంపీ నవనీత్ కౌర్ అన్నారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ యువమోర్చా సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో ఎంఐఎంకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని బరిలోకి దింపిందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ అభ్యర్థి గెలుపు తథ్యమని నవనీత్ కౌర్ ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార సరళిపై కేటీఆర్ ఆరా

కాప్రా: మౌలాలి బీఆర్‌ఎస్ సమావేశానికి హాజరైన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆహ్వానం మేరకు మధ్యాహ్నం ఆయన నివాసంలో భోజనం చేశారు. అనంతరం నియోజకవర్గంలోని ఎన్నికల ప్రచార సరళిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేష్, మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోదీతోనే దేశంలో సుస్థిర పాలన

గుడిమల్కాపూర్ రోడ్ షోలో కిషన్‌రెడ్డి



రోడ్ షోలో బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో దేవర వంశీ తదితరులు

గోల్కొండ: సుస్థిర పాలనతో పాటు దేశాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా తీర్చిదిద్దడం ప్రధాని మోడీకే సాధ్యమని సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్‌లో ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతిని పూర్తిగా అంతమొందించి దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసింది ప్రధాని నరేంద్రమోదీ పాలన అని ఆయన అన్నారు. చిల్లర రాజకీయాలు చేయడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకే చెల్లిందన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ 400కు పైగా స్థానాలతో అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలను, ఇతర పాలిత రాష్ట్రాలను నేడు ప్రజలు బేరీజు వేస్తున్నారని ఆయన అన్నారు. అయితే బీజేపీ పాలిత రాష్ట్రాల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారని డబుల్ ఇంజన్ సర్కార్‌కు ప్రజలు ఇష్టపడుతున్నారని ఆయన అన్నారు. సికింద్రాబాద్ నుంచి ఈసారి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.





సాక్షి హైదరాబాద్

గురువారం । 9 । మే । 2024

అదే జోష్

ఉప్పల్ స్టేడియంలో బుధవారం ఈ ఐపీఎల్ సీజన్‌లో జరిగిన ఐదో మ్యాచ్‌లోనూ అభిమానం వెల్లువెత్తింది. దాదాపు 35 వేల మంది ఫ్యాన్స్ సన్‌రైజర్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన పోరును ఎంజాయ్ చేశారు. ఎప్పటిలాగే మైదానమంతా ఆరెంజ్ రంగుతో మెరిసిపోయింది. గత మ్యాచ్‌లతో పోలిస్తే ఎక్కడా ప్రత్యర్థి జట్టు అభిమానులు, జెండాలు పెద్దగా కనిపించలేదు. ముందుగా లక్నో బ్యాటింగ్‌లో పెద్దగా దూకుడు కనిపించలేదు కానీ తమ అభిమాన రైజర్స్ ఆటగాళ్లను మైదానంలో ప్రేక్షకులు ప్రోత్సహిస్తూ వచ్చారు. సన్‌రైజర్స్ గెలుపుతో జోష్ మరింత పెరిగింది. –సాక్షి, హైదరాబాద్

ఈ వానకే..

బయటపడ్డ విశ్వనగర వరద దృశ్యాలు

పూర్తికాని పూడికతీత.. ఎస్ఎన్‌డీపీకి నిధుల కొరత

ప్రచారంలో 'సేఫ్టీ'.. ప్రాణాలకు లేదు 'ఆడిట్'

నిర్మాణాల నిబంధనలు కాగితాల్లో..ప్రజల ప్రాణాలు గాల్లో

జోన్ల వారీగా పూడికతీత పనుల వివరాలిలా..

జోన్	లక్ష్యం (కి.మీ)	జరిగిన పని(కి.మీ)
ఎల్‌బీనగర్	119.99	67.09
చార్మినార్	384.61	211.77
ఖైరతాబాద్	171.26	57.68
శేరిలింగంపల్లి	71.82	35.82
కూకట్‌పల్లి	100.83	48.81
సికింద్రాబాద్	104.20	45.44
మొత్తం	952.71	466.61

జీహెచ్ఎంసీ పరిధిలోని పనులు జోన్ల వారీగా ..

జోన్	మొత్తం పనులు (కి.మీ)	పూర్తయిన పనులు (కి.మీ.)	ఇంకా జరగాల్సిన పనులు(కి.మీ.)
సికింద్రాబాద్	8 (9.31)	6 (5.83)	2 (1.42)
కూకట్‌పల్లి	3 (7.97)	3 (7.97)	- (-)
ఎల్‌బీనగర్	10 (12.04)	8 (10.10)	2 (0.52)
చార్మినార్	7 (5.71)	6 (2.76)	1 (0.74)
ఖైరతాబాద్	7 (9.18)	4 (4.36)	2 (0.37)
శేరిలింగంపల్లి	2 (3.11)	2 (3.11)	- (-)
మొత్తం	37 (47.32)	29 (34.13)	7 (3.05)

వీటి అంచనా వ్యయం: రూ. 747.45 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో:

- ఈ వేసవిలో మండుతున్న ఎండల భగభగలతో అల్లాడుతున్న నగర ప్రజలకు మంగళవారం కురిసిన వర్షం ఎంతో ఉపశమనం కలిగించింది. కొత్త ఉత్సాహాన్నిచ్చింది.
- తెల్లారేసరికి నాలాలో కొట్టుకు వచ్చిన రెండు మృతదేహాలు, ప్రహరీ కూలి ఏడుగురు కార్మికుల ప్రాణాలు పోయాయన్న వార్తలు మనసుల్ని కలచి వేశాయి.

వర్షం.. ఎవరికైనా హర్షమే. వర్షపు చినుకుల్లో తడిస్తే చాలామందికి థ్రిల్లింగే. కొత్త ఉత్సాహం వస్తుంది. హైదరాబాద్ మహానగరంలో మాత్రం ఉత్పాతంగా కనిపిస్తోంది. విశ్వనగరంగా ఎదుగుతూ ఎన్నో రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నప్పటికీ ప్రజలకు వాన భయం మాత్రం పోవడం లేదు. ఎప్పుడు వాన కురిసినా నోళ్లు తెరచుకుంటున్న నాలాలు, నీట మునుగుతున్న కాలనీలు, అపార్టుమెంట్ల సెల్లార్లలోకి నీళ్లు ..నీళ్లలో కార్లు, బైకులు రెండు పుష్కరాలుగా కనిపిస్తున్న దృశ్యాలు. 2000 సంవత్సరం ఆగస్టులో కురిసిన భీకర వర్షం తాలూకు భయాలు వానొచ్చిందంటే ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి.

పరిష్కారమెప్పటికో ?

వానలొస్తే ప్రాణాలు పోకుండా ఉండేందుకు అప్పటి నుంచీ ఇప్పటి వరకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటున్నా శాశ్వత పరిష్కారం ఇంకా లభించలేదు. గత ప్రభుత్వాల కాలంలో ప్రారంభమైన పనుల్లో మార్పులు జరిగాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020, 2021లలో కురిసిన వర్షాలతో శాశ్వత పరిష్కార దిశగా కాలనీలు నీట మునగకుండా ఉండేందుకు నాలాల ఆధునీకరణ, తదితర పనుల కోసం వ్యూహాత్మక నాలా నిర్మాణం పథకం(ఎస్ఎన్‌డీపీ) చేపట్టింది. తొలిదశలో భాగంగా నగరం, శివార్లలోని పురపాలికల్లో మొత్తం 58 పనులకు శ్రీకారం చుట్టారు. వీటి అంచనా వ్యయం రూ.985.45 కోట్లు. వాటిల్లో 37 పనులు మాత్రం పూర్తయ్యాయి. రూ.581.29 కోట్లు ఇందుకు ఖర్చయ్యాయి. మిగతావి పూర్తి కాలేదు.

- శివార్లలోని పురపాలికల్లో 21 పనులకుగాను 8 పనులు మాత్రం పూర్తయ్యాయి. వీటికి రూ.6.89 కోట్లు ఖర్చు చేశారు.
- జీహెచ్ఎంసీ పరిధిలోని పనులకు అవసరమైన రూ.747.45 కోట్లకుగాను ఎస్‌బీఐ నుంచి 515.96 కోట్లు రుణంగా తీసుకున్నారు. మిగతావి జీహెచ్ఎంసీ సమకూర్చింది.
- శివారు పురపాలికలు తమ వాటాగా చెల్లించాల్సిన మొత్తంలో ఇంకా రూ.115.66 కోట్లు చెల్లించాల్సి ఉండగా, చేతులెత్తేశాయి. జీహెచ్ఎంసీయే భరించాల్సిందిగా కోరాయి. కానీ జీహెచ్ఎంసీ ఈ నిధుల్ని సమకూర్చే పరిస్థితి లేదు.
- వరద ముంపునకు ప్రధాన కారణం నాలాలు, నాలాల్లోంచి వరదనీరు సాఫీగా వెళ్లే మార్గం లేక కాలనీలు, బస్తీలు మునుగుతున్నాయి. నాలాలకు తగిన రక్షణచర్యలు లేక వాటిల్లో పడి మరణాలు చోటు చేసుకుంటున్నాయి.

నాలా 'సేఫ్టీ' ఏదీ ?

నాలాల వెంబడి ఎక్కడా ప్రమాదకర పరిస్థితులుండకుండా ఉండేందుకు థర్డ్‌పార్టీ ఏజెన్సీలతో వేసవికి ముందే గత రెండేళ్లుగా నాలా సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. నాలాలకు ఎక్కడైనా పైకప్పులు లేకున్నా, పెద్ద నాలాలకు జాలీలు లేకున్నా, రిటైనింగ్ వాల్స్ లేకున్నా, దెబ్బతిన్నా , నాలాలో ఎక్కడైనా మనుషులు పడేందుకు వీలున్నా గుర్తించి తగిన చర్యల కోసం ఈ సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. నివేదిక అనంతరం సంబంధిత ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడా ప్రమాదకర పరిస్థితి లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. నాలా ఉందని తెలిసేలా హెచ్చరిక బోర్డులు కూడా పెట్టాలి. సేఫ్టీ ఆడిట్ కోసం లక్షలాది రూపాయలు, పనుల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రమాదాలు ఆగడం లేదు. తాజాగా, బేగంపేట నాలాలో ఇద్దరు మరణించారు. రైలు పట్టాలు దాటే క్రమంలో వారు పట్టాల కింద ఉన్న నాలాలోకి ప్రమాదవశాత్తు పడి ఉంటారని భావిస్తున్నారు. నాలాలు ఓపెన్‌గా ఉండకుండా, చెత్త కూడా వేయకుండా కూడా పటిష్టమైన చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ పనులు జరగడం లేదు. ప్రతియేటా నాలాల్లో మృతదేహాలు కొట్టుకువస్తున్నాయి.

పూడికతీత పనులు సగమే !

ప్రతియేటా నాలాల్లో పూడికతీత పనులు వేసవిలోగానే పూర్తి కాకపోవడం వల్ల కూడా నాలాలు పొంగిపొర్లుతున్నాయి. ఈ సంవత్సరం కూడా ఇంకా సగం పనులు మాత్రమే జరిగాయి. నగర వ్యాప్తంగా 952.71 కి.మీ. పొడవున ఉన్న నాలాల్లో పూడికతీతకు గాను రూ.57 కోట్ల అంచనా వ్యయంతో 201 పనులుగా టెండర్లు పిలిచారు. ఇప్పటి వరకు దాదాపు 470 కి.మీల మేర మాత్రమే పనులు జరిగాయి.

నిబంధనలు కాగితాల్లో..

టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి సైతం నిబంధనలు పక్కాగా ఉంటున్నా అమలులో లోపాల వల్ల అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఎత్తయిన ప్రాంతాలకు దిగువన నివాసాలు ఉండరాదనేది కూడా ఒక నిబంధన. కానీ బాచుపల్లిలో ప్రహరీ కూలి దాని దిగువనున్న కార్మికుల నివాస షెడ్లపై పడటం వల్లే ఏడుగురు మృతి చెందారు

సిద్ధం కాని యంత్రాంగం

అటు టౌన్‌ప్లానింగ్ విభాగాలు కానీ, ఇటు ఇంజినీరింగ్ విభాగాలు కానీ ఇంకా వర్ష ప్రమాదాల నివారణకు సిద్ధం కాలేదు. మేలో ఎండలు మండుతుండటంతో వర్షాల వల్ల ప్రమాదాలు జరుగుతాయని ఊహించలేదు. కానీ కురిసిన ఒక్కవానకే సంసిద్ధత ఎంతో బట్టబయలైంది. మరో నాలుగైదు రోజులు కూడా వర్షాలు కురియనున్నట్లు వాతావరణశాఖ సమాచారంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

వర్షాకాల సంసిద్ధతపై కమిషనర్ సమావేశం

వర్షాలు కురుస్తుండటంతో వర్షాకాల సన్నద్ధతపై జీహెచ్ఎంసీ కమిషనర్ జోనల్ సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిళ్ల వారీగా శిథిల భవనాలను, ప్రహరీలను, సెల్లార్ల తవ్వకాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. గుర్తించిన అంశాలు, తీసుకోబోయే చర్యలతో ఈనెల 18వ తేదీ లోగా తనకు నివేదిక అందజేయాలన్నారు.

98 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగానికి వర్షానికి సంబంధించి బుధవారం 98 ఫిర్యాదులు రాగా, 78 పరిష్కరించినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. చెట్లు కూలిన ఫిర్యాదులు 94 రాగా 75 మధ్యాహ్నం వరకే పరిష్కరించినట్లు తెలిపారు. నీటినిల్వలకు సంబంధించి రెండు ఫిర్యాదులు, మృతదేహాలకు సంబంధించి రెండు ఫిర్యాదులందినట్లు పేర్కొన్నారు.





దుండిగల్‌లో బుధవారం రాత్రి బీఆర్ఎస్ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా రోడ్ షోలో పాల్గొన్న మాజీ సీఎం కేసీఆర్, హాజరైన జనం

- వివరాలు 10లో▸



వలస కార్మికుల విషాదాంతం

నాలాలో పడి ఇద్దరు మృతి

- వరద ఉధృతికి కొట్టుకువచ్చిన మృతదేహాలు
- బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ వద్ద నాలాలో వెలికితీత..
- రైలు పట్టాలు దాటుతూ నాలాలో పడి ఉంటారని అనుమానం

సనత్‌నగర్: పొట్టకూటి కోసం ఒడిశా నుంచి నగరానికి వలస వచ్చిన ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు నాలాలో పడి మృతి చెందడం స్థానికంగా విషాదం నింపింది. మంగళవారం రాత్రి కుండపోతగా కురిసిన వర్షానికి అమీర్‌పేట నుంచి బేగంపేట వైపు వచ్చే నాలాలో వరదనీరు చేరి ఉధృతంగా ప్రవహించగా..ఇరువురు కార్మికులు కొట్టుకువచ్చినట్లు తెలుస్తోంది. బుధవారం తెల్లవారుజామున వరద తీవ్రత తగ్గడంతో బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీ వద్ద నాలాలో వీరి మృతదేహాలు బయటపడ్డాయి. బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన చంద్రపాండా (38), మనోజ్‌దాస్ (45) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. వివిధ చోట్ల తిరుగుతూ దొరికిన కూలి పనులను చేస్తుంటారు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం వీరు బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ఉండే తమ సహచరుడి గదిలోకి మకాం మార్చారు. ముగ్గురూ అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో కార్మికులుగా పని చేస్తూ పొట్టపోసుకుంటున్నారు. రోజుమాదిరిగా మంగళవారం సాయంత్రం విధులు ముగించుకున్న ముగ్గురు స్నేహితులు..గ్రీన్‌ల్యాండ్స్ సమీపంలో ఉన్న ఓ బార్‌కు వెళ్లారు. ముగ్గురూ కలిసి మద్యం తాగారు. అయితే ఒకవైపు భారీ వర్షం కురుస్తుండడంతో భోజనం పార్శిల్ తీసుకువెళ్ళాల్సిందిగా తోటి స్నేహితులు పురమాయించడంతో ప్రభాకర్ అక్కడి నుంచి వెళ్లి పోయాడు. భోజనం తీసుకుని ఇంటికి వెళ్ళిన ప్రభాకర్ రాత్రి పొద్దుపోయేవరకు రూమ్‌మేట్స్ కోసం వేచి చూసి నిద్రపోయాడు. ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున చంద్రపాండా, మనోజ్‌దాస్‌ల మృతదేహాలు కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను నాలాలో నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.



నాలాలో కొట్టుకువచ్చిన చంద్రపాండా, మనోజ్‌దాస్ మృతదేహాలు

రైలు పట్టాల వద్దనే నాలాలో పడ్డారా..?

అమీర్‌పేట లీలానగర్ నుంచి రైలు పట్టాల కిందుగా నాలా బేగంపేట వైపు సాగుతోంది. పాదచారులు పట్టాలను నేరుగా దాటకుండా ఓల్డ్ కస్టమ్స్ బస్తీ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ఉంది. అయితే భారీ వర్షంతో మంగళవారం రాత్రి నీరు భారీగా వచ్చి చేరింది. మద్యం సేవించి ఇంటికి పయనయమైన చంద్రపాండా, మనోజ్‌దాస్‌లు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదనీటిని చూసి రైలు పట్టాల పైనుంచి వెళ్ళే ప్రయత్నం చేశారు. పట్టాల కింద నుంచి నాలా వెళ్తుండగా వీరు పట్టాలు దాటే క్రమంలో ప్రమాదవశాత్తూ జారి నాలాలో పడి కొట్టుకువచ్చినట్లుగా భావిస్తున్నారు. ఈ మేరకు మనోజ్‌దాస్ సోదరుడు సుక్రదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రాత్రంతా జాగారమే!

భారీ వర్షం..ఈదురు గాలుల ఎఫెక్ట్

- 1500 ఫీడర్ల పరిధిలో నిలిచిన విద్యుత్ సరఫరా
- ఇంట్లో ఉక్క పోత.. బయట దోమల మోత
- కంటిమీద కునుకు లేకుండా చేసిన వర్షం



సాక్షి, సిటీబ్యూరో: ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సానికి విద్యుత్ సరఫరా వ్యవస్థ కుప్పకూలింది. ఒకదాని తర్వాత మరొక ఫీడర్ టప్..టప్ మంటూ పడిపోవడంతో గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో రాత్రంతా సరఫరా నిలిచిపోయింది. కొన్ని చోట్ల బుధవారం తెల్లవారుజామున సరఫరా పునరుద్ధరించినప్పటికీ..మరికొన్ని నివాసాల్లో ఇప్పటికీ అంధకారమే నెలకొంది. ఉక్క పోతకు తోడు..దోమలు జనానికి కంటిమీద కునుకు లేకుండా చేశాయి. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి కొన్ని చోట్ల ఫ్లెక్సీలు ఎగిరి లైన్లపై పడగా..మరికొన్న చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. వైర్లు తెగిపడ్డాయి. ఫలితంగా గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 1500కిపైగా ఫీడర్ల పరిధిలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 20కిపైగా ఎల్‌టీ పోల్స్ పడిపోగా, 11 కేవీ పోల్స్ ఎనిమిది పడిపోయాయి. రెండు డీటీఆర్ నేలకూలాయి. కొన్ని చోట్ల అరువై నిమిషాల్లోనే పున రుద్ధరించినప్పటికీ..మెజార్టీ ప్రాంతాల్లో రాత్రంతా జాగారం తప్పలేదు. అత్యవసర పరిస్థితిలో 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే అదే పనిగా లైను బిజీగా ఉండటంతో వినియోగదారులు ఒకింత అసహనానికి గురి కావాల్సి వచ్చింది.

విద్యుత్ లైన్లకు ఫ్లెక్సీల షాక్

కేపీహెచ్‌బీ–వికాస్‌నగర్‌కు వెళ్లే 33 కేవీ ఫీడర్(బొల్లారం వద్ద)పై ఫ్లెక్సీ పడింది. దీంతో ఈ ఫీడర్‌పై ఆధారపడిన నాలుగు 11 కేవీ ఫీడర్లకు ఇన్‌కమింగ్ ఆగిపోయింది. పోలెపల్లి - కడ్తాల్ 33 కేవీ ఫీడర్ లైన్‌పై హోర్డింగ్ పడటంతో శంషాబాద్, చిన్న గోల్కొండ సహా పలు ప్రాంతాల్లోని 11 కేవీ ఫీడర్లకు సరఫరా నిలిచిపోయింది. గన్‌రాక్ - ఎయిర్‌పోర్ట్ 33కేవీ ఫీడర్ లైన్‌పై ఫ్లెక్సీ పడటంతో ఆయా ప్రాంతాల్లోని 11 కేవీ ఫీడర్లకు సరఫరా నిలిచిపోయింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో గాయిత్రినగర్, సాగర్ సొసైటీ, జూబ్లీహిల్స్, కొండాపూర్, సహా పలు కీలక ప్రాంతాల్లో బుధవారం తెల్లవారు జాము వరకు సరఫరా నిలిచిపోయింది. అయ్యప్ప సొసైటీ 33 కేవీ ఫీడర్‌పై ఆ పక్కనే నిర్మాణంలో ఉన్న ఇంటి తడకలు, రక్షణ కోసం చుట్టిన పరదాపడి సరఫరా నిలిచిపోయింది. వినియోగదారులే కాదు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజనీర్లు సైతం రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. ఉరుములు, మెరుపులను సైతం లెక్క చేయకుండా రాత్రంతా లైన్ల పునరుద్ధరణ పనుల్లోనే నిమగ్నమయ్యారు. 1371 ఫీడర్ల పరిధిలో రాత్రి 12 వరకు సరఫరాను పునరుద్ధరించారు.

వదిలేశారు!


హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో విచిత్ర పరిస్థితి

- కన్నెత్తి చూడని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు
- అభ్యర్థుల ప్రచారం కూడా అంతంతే
- ప్రచారానికి మిగిలింది మూడు రోజులే..
- మజ్లిస్, బీజేపీ మధ్యే హోరాహోరీ పోటీ
- విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తున్న ఆ రెండు పార్టీల అభ్యర్థులు

సాక్షి, సిటీబ్యూరో: 'ఊరంతా ఒక దారయితే ఉలిపి కట్టెది మరో దారి' అన్నట్లు ఉంది హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ రాజకీయ పరిస్థితి. అధికార పక్షం కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పార్టీ కూడా హైదరాబాద్ సెగ్మెంట్‌ను గాలికి వదిలేశాయి. ప్రతీ లోక్‌సభ సీటును ప్రతిష్టాత్మకంగా భావించి..విజయబావుటా కోసం రాష్ట్ర రాజధాని నుంచి మారుమూల ఆదిలాబాద్ వరకు వెళ్లి ర్యాలీలు, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, బహిరంగ సభలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పక్షాల ముఖ్య నేతలు మహానగరం నడిమధ్య ఉన్న హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ వైపు మాత్రం కన్నెత్తి చూడటంలేదు. ఎన్నికల ప్రచార గడువు ముగింపు మూడు రోజులున్నా.. ఆ రెండు పక్షాల అభ్యర్థుల ప్రచారం కూడా అంతంత మాత్రం గానే ఉంది. వాస్తవంగా హైదరాబాద్ అంటే మజ్లిస్ కంచుకోట. ఇక్కడ గత పది పర్యాయాలుగా మజ్లిస్ వరుస విజయాలతో ఎదురులేని శక్తిగా తయారైంది. ఫలితంగా ప్రతి ఎన్నికల్లో అధికార, ప్రతిపక్షాల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు డిపాజిట్ కూడా దక్కని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా పక్షాలు హైదరాబాద్‌పై ఆశలు వదులుకున్నాయి..







పట్టని బీఆర్‌ఎస్

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ కనీసం పార్లమెంట్ ఎన్నికల్లోనైనా సత్తా చాటేందుకు అన్ని జిల్లాల్లోనూ బస్సు యాత్రలు, రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తిస్తోంది. కానీ హైదరాబాద్ సెగ్మెంట్‌ను మాత్రం గాలికి వదిలేసింది. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు వంటి అగ్రనేతలు కనీసం కన్నెత్తి చూడక పోగా, లోక్‌సభ పరిధిలోనే నివాసం ఉండే మాజీ హోం మంత్రి మహమూద్ అలీ తదితరులు సైతం ప్రచారంపై పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కూడా ముందుకు రాకపోవడంతో ప్రచారం మొక్కుబడిగా తయారైంది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఇక్కడ గడ్డం శ్రీనివాస్ యాదవ్ నిలబడగా.. ఆయనే తన అనుచరులు, లోకల్ లీడర్లతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బరిలో ఉన్న మిగతా చిన్నా చితక పార్టీలు, ఇండిపెండెంట్ల పరిస్థితి కూడా అదేవిధంగా మారింది.

రెండు పక్షాలదే జోరు..

హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మజ్లిస్, బీజేపీ పక్షాలదే జోరు సాగుతోంది. వాస్తవంగా మూడున్నర దశాబ్దాలుగా ఇక్కడ కేవలం ముస్లిం- హిందూ సామాజిక ఎజెండాలు మాత్రమే పనిచేస్తుండటంతో మజ్లిస్-బీజేపీ మధ్య పోరు కొనసాగుతూ వస్తోంది. ఎప్పటి మాదిరి గానే ఎన్నికల ప్రచారంలో మజ్లిస్, బీజేపీలు పోటాపోటీగా దూకుడు ప్రదర్శిస్తున్నాయి. మజ్లిస్ పక్షాన సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఆయన సోదరుడు, పార్టీ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, పార్టీ ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహిస్తుండగా, బీజేపీ పక్షాన ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పలువురు అగ్రనేతలు రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి మాధవీలత గల్లీ గల్లీ తిరుగుతూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు

అధికారంలో ఉన్నా...

రాష్ట్రంలో అధికారంలో ఉన్నా.. ఎప్పటి మాదిరి గానే ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో వెనకబడినట్లే కన్పిస్తోంది. లోక్‌సభ స్థానాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ అధిష్టానం సైతం హైదరాబాద్‌ను పరిగణనలోకి తీసుకున్నట్లు కన్పించడం లేదు. మొక్కుబడిగా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లాను రంగంలోకి దింపి చేతులు దులుపుకొంది. నామినేషన్ కార్యక్రమం సైతం సాదాసీదాగా సాగింది. కేవలం మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాత్రమే పాల్గొన్నారు. ఇక ప్రచారం పర్వంలో అభ్యర్థి సమీర్ వలీవుల్లాతో పాటు స్థానిక నేతలకే పరిమితమైంది. ఇప్పటి వరకు పార్టీ అగ్ర నేతలు ఎవరూ ప్రచారంలో పాల్గొనలేదు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు సైతం అంతంత మాత్రంగానే కనిపించడం విస్మయానికి గురిచేస్తోంది. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో కార్వాన్ నియోజకవర్గంలో ప్రచారం అంశంపై ఇరు వర్గాలు పరస్పరం దాడులకు దిగారు. వాస్తవంగా ఈ లోక్‌సభ నియోజకవర్గంలో ఆదిలో వరుసగా కాంగ్రెస్ హవా కొనసాగినా.. మజ్లిస్ శకం ప్రారంభంతో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ కనుమరుగైంది. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మైత్రి బంధం కారణంగా మొక్కుబడిగా బరిలో దిగే అభ్యర్థికి కనీసం డిపాజిట్ దక్కని పరిస్థితి నెలకొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థులకు ఇదే పరిస్థితి ఎదురైంది. ఈసారి ఎంపీ ఎన్నికల్లో సైతం అదే సీన్ పునరావృతమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

శంషాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన అయిదుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శంషాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు

శంషాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శంషాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మాజీ మంత్రి కేటీఆర్ రోడ్‌షో సక్సెస్ అయిందన్న సంతోషంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు మరుసటి రోజే కౌన్సిలర్లు షాకిచ్చారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో 2వ వార్డు కౌన్సిలర్ భద్రునాయక్, 22 కౌన్సిలర్ ఎం.శ్రీకాంత్‌యాదవ్, 23వ వార్డు కౌన్సిలర్ శ్రవంత్‌శ్రీకాంత్‌రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ బండి భాగ్యలక్ష్మి, 5వ వార్డు కౌన్సిలర్ మస్రత్ జాతాజ్‌బా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షోలో 15వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ పాల్గొన్నారు.

కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం

ఏఐసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కా లాంబ



మహిళలతో అల్కా లాంబ సెల్ఫీ

బంజారాహిల్స్: రానున్న ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లలోపే వస్తాయని, కేంద్రంలోకి వచ్చేది ఇండియా కూటమి ప్రభుత్వమేనని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కా లాంబ అన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన నారీ సమ్మేళన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గడిచిన పదేళ్లలో దేశంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందని మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి కంటే దేశానికి జరిగిన నష్టమే ఎక్కువుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ గవర్నర్ తమిళిసైపై ఫిర్యాదు

బంజారాహిల్స్: 'బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో మంగళవారం జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ మహిళలకు రామాలయ నమూనాలను పంపిణీ చేశారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధం. ఆమెపై చర్యలు తీసుకోవాలి' అని బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదును పోలీసులు స్వీకరించారు.

ఓటేస్తేనే వేతనంతో కూడిన సెలవు

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సూచన

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 13న జరగనున్న లోకసభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని అధికారులు భావిస్తున్నప్పటికీ.. వరుస సెలవుల టెన్షన్ నెలకొంది. అందుకే పోలింగ్ రోజును సెలవు దినంగా కాకుండా ఓటు హక్కు వినియోగించుకునే బాధ్యతగా భావించేలా ఉద్యోగులకు అవగాహన కల్పించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం పద్మనాభ రెడ్డి తెలిపారు. ఓటింగ్ వేశారో లేదో పరిశీలించాకే ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు లేదా లాస్ ఆఫ్ పేగా ప్రకటించాలని సూచించారు. ఓటింగ్ తర్వాత రోజున (మే 14న) ప్రతి ఉద్యోగి తన చూపుడు వేలుపై సిరా చుక్క చూపిస్తేనే వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలని పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల్లో, షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లల్లో వేలిపై సిరా చుక్క చూపిస్తే రిబేటు ఇచ్చేలా సంబంధిత యాజమాన్యాలకు ఎన్నికల సంఘం సూచించాలని కోరారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో యువత ఓటింగ్‌లో పాల్గొన అవకాశాలు మెండుగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలోనూ ఉత్తరాది ఫలితాలు

రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ



భజన్‌లాల్ శర్మను సన్మానిస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం గగన్‌పహాడ్‌లోని సెలబ్రిటీ కన్వెన్షన్‌లో చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 'ప్రవాసీ సమ్మేళన్' పేరిట చాయ్ పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలో నివసించే ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భజన్ లాల్ శర్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సూచించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో దేశం సుభిక్షంగా ఉందని భజన్‌లాల్ శర్మ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందని చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాజస్థాన్‌కు చెందిన రాజ్యసభ మాజీ సభ్యులు, చీఫ్ విప్ నారాయణ్ లాల్ పంచారియా, రాజస్థాన్‌లోని అహోర్ ఎమ్మెల్యే ఛగన్ సింగ్ రాజ్ పోతిహి పాల్గొన్నారు.

ఫైనల్ టచ్

- నేడు రాహుల్.. రేపు మోదీ.. ఎల్లుండి ప్రియాంక
- గ్రేటర్ బాట పట్టనున్న జాతీయ నేతలు
- ప్రచారానికి మిగిలింది ఇక రెండు రోజులే

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరడంతో జాతీయ నేతలు భాగ్యనగరానికి క్యూ కట్టారు. ఇప్పటికే పలువురు ప్రచారంతో హోరెత్తించగా.. చివరి మూడు రోజుల్లో ఫైనల్ టచ్ ఇచ్చేందుకు అతిరథ మహారథులు నగరానికి రానున్నారు. గురువారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, శుక్రవారం ప్రధాని మోదీ, శనివారం కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, బీఆర్‌ఎస్ సారథి కేసీఆర్ హైదరాబాద్‌లో జరిగే ప్రచార సభల్లో పాల్గొననున్నారు.

ఇదీ వరుస..

- గురువారం సాయంత్రం 6 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే జనజాతర సభకు రాహుల్‌గాంధీ హాజరు కానున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎల్‌బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు పటాన్‌చెరులో నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకా గాంధీ హాజరు కానున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సైతం చివరి రోజు నగరంలో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు..

గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్ సభ స్థానాలు ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. అధికార కాంగ్రెస్ సిటింగ్ స్థానమైన మల్కాజిగిరితో పాటు గతంలో చేజారిన సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాలను దక్కించుకునేందుకు ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తోంది. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆయా లోక్‌సభ స్థానాల పరిధిలో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఆ పార్టీ జాతీయ నేతలు సైతం అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. తాజాగా రాహుల్, ప్రియాంకలు రానుండటంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

- ఇక బీజేపీ.. తన సిటింగ్ స్థానమైన సికింద్రాబాద్‌తో పాటు మల్కాజిగిరి, హైదరాబాద్, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సైతం నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. తాజాగా ఈ నెల 10న ప్రధాని మోదీ మళ్లీ నగరానికి రానున్నారు. బీఆర్‌ఎస్ సిటింగ్ స్థానమైన చేవెళ్లతో పాటు మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలను ఆ పార్టీ కీలకంగా తీసుకుంది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే చేవెళ్ల నుంచి బస్సు యాత్రను ప్రారంభించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నగరంలో వరుస కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో చివరి రోజైన శనివారం సాయంత్రానికే కేసీఆర్ మల్కాజిగిరి, సికింద్రాబాద్‌లలో రోడ్ షోలు నిర్వహించనున్నారు.

వేసవి తాపం.. కాలుష్యం

- నగర వాసి ఉక్కిరిబిక్కిరి
- ఎన్‌ఐటీ తిరుచ్చి అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: ఒకవైపు ఎండ.. మరో వైపు కాలుష్యంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాలమేదైనా 80 శాతం పట్టణ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అర్బన్ హీట్ ఐల్యాండ్స్ (యూహెచ్‌ఐ)గా పేర్కొన్న ఈ ప్రాంతాల్లోని గాలిలో కార్బన్ మోనాక్సైడ్ (సీఓ), నైట్రోజన్ డయాక్సైడ్ (ఎన్‌ఓ2), ఓజోన్ (ఓ3), ఫార్మాల్డిహైడ్ (హెచ్‌సీహెచ్‌ఓ), ఏరో సోల్స్, సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్‌ఓ2) వంటి కాలుష్య కారకాలు అధిక మోతాదులో ఉన్నట్లు ఎన్‌ఐటీ తిరుచ్చి అధ్యయనంలో తేలింది. దీంతో పరిసర ప్రాంతాలతో పోలిస్తే యూహెచ్‌ఐ ప్రాంతాల్లో వేడి 2.6 డిగ్రీలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

ఏం చేయాలి?

యూహెచ్‌ఐ, కాలుష్య సవాళ్లను నియంత్రించాలంటే పట్టణ ప్రణాళిక విభాగం, విధానాల అమలు కీలకం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలతో పాటు పౌరుల సహకారం అత్యవసరం. భూ ఉపరితలాన్ని చల్లదనంగా ఉంచేందుకు గ్రీనరీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడం, పచ్చదనంతో కూడిన ఇంటి పైకప్పులు, భవన నిర్మాణాల్లో హరిత ఉత్పత్తుల వినియోగం తప్పనిసరి చేసేలా నిర్మాణ నిబంధనల సవరణలు వంటివి చేపట్టాలి. వీటితో పాటు కాలుష్యం వెదజల్లే కాలం చెల్లిన వాహనాలకు స్వస్తి పలకాలి. ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణ వ్యూహాలను అమలు చేయాలి. యూహెచ్‌ఐ ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.

సికింద్రాబాద్‌లో పద్మారావుగౌడ్ విజయం తథ్యం

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి తలసాని, అభ్యర్థి పద్మారావుగౌడ్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయం తథ్యమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార తీరుపై అభ్యర్థి పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు సమీక్షించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... అన్ని సర్వేల్లో పద్మారావుగౌడ్ ముందంజలో ఉన్నారని తేలిందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై ఆగ్రహంతో ఉన్నారని, కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదనే అభిప్రాయం ప్రజల్లో ఉన్న కారణంగా మంచి అభ్యర్థి పద్మారావుగౌడ్‌కే మద్దతు పలకాలని ఓటర్లు భావిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.ఎస్.శ్రీనివాస్, పార్టీ నేతలు విప్లవకుమార్, మన్నే గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు మన్నే కవిత, వెల్దండ వెంకటేష్, ప్రసన్నమూర్తి, హేమలత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు



మహిళా సదస్సులో మాట్లాడుతున్న దానం

బంజారాహిల్స్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోపు ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్ పథకాల పట్ల మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో మహిళలు తనకు అత్యధిక మెజార్టీ ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

హిమాయత్‌నగర్: పేద ప్రజల కష్టాలను తీర్చే సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్‌గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని జనార్ధన్ బాడా, దత్తానగర్, ఆదర్శ బస్తీలలో ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రామన్ గౌడ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు నయీమ్, సర్ఫరాజ్, ప్రభాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్ర తివాచీ పరిచి..

ఘన స్వాగతం పలకనున్న సిబ్బంది

అడుగడుగునా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

గులాబీ పూలు ఇచ్చి...

- రంగురంగుల బెలూన్లతో అలంకరణ
- ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం

రెడ్ కార్పెట్ పరిచి స్వాగతిస్తారు.. గులాబీ పూలు ఇచ్చి స్వాగతం పలుకుతారు.. సంప్రదాయ చీరకట్టులో మహిళా ఉద్యోగులు సాదర స్వాగతం పలుకుతూ రెండు చేతులు ఎత్తి నమస్కరించి సోఫాలో కూర్చొండబెడతారు. మంచినీళ్లు ఇచ్చి మర్యాద చేసి అతిథి సత్కారాలు చేస్తారు. వీరంతా ఎక్కడో అనుకుంటున్నారా..? ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆదర్శ పోలింగ్ స్టేషన్‌లలో ఆహ్లాద అనుభూతులను కల్పించే నమూనా పోలింగ్ కేంద్రాల్లో కనిపిస్తుంది.





బంజారాహిల్స్ స్టడీ సర్కిల్ పోలింగ్ బూత్‌లో మోడల్ పోలింగ్ స్టేషన్

బంజారాహిల్స్: ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వివిధ మార్గాలను ఎంచుకుని గత అసెంబ్లీ ఎన్నికల నుంచి అమలుచేస్తున్నది. ఇందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలోనూ ఆదర్శ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి అందులో రంగురంగుల బెలూన్లతో అలంకరణ.. ఓటరుకు అతిథి మర్యాదలు.. స్వాగత తోరణాలు.. చక్కని వాతావరణంతో ఈ ఆహ్లాద పోలింగ్ స్టేషన్‌ను తీర్చిదిద్దనున్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 245 పోలింగ్ స్టేషన్లు ఉండగా ఇందులో ఐదు మహిళా పోలింగ్ స్టేషన్లు, ఒకటి దివ్యాంగుల పోలింగ్ స్టేషన్, ఐదు నమూనా పోలింగ్ స్టేషన్లు, ఒక యువత పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటుచేశారు. ఓటు వేసేందుకు వచ్చేవారిని ఆకట్టుకునే ఈ నమూనా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నో ప్రత్యేకతలు కల్పించనున్నారు.
- మహిళలు, దివ్యాంగులు, యువత, ఆదర్శ విభాగాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మహిళా కేంద్రంలో సిబ్బంది అంతా మహిళలే ఉంటారు. యువత కేంద్రంలో పూర్తిగా యువతీయువకులు పోలింగ్ విధులు నిర్వహిస్తారు.
- దివ్యాంగుల విభాగంలో అందుబాటులో ఉన్న మేరకు దివ్యాంగులను పోలింగ్ సిబ్బందిగా నియమిస్తారు. ఎంపిక చేసిన కేంద్రాలను రంగురంగుల బెలూన్లు, పూలదండలు, కార్పెట్లు, సోఫాసెట్లు..ఇలా సుందరంగా అలంకరించనున్నారు.
- నమూనా కేంద్రాల్లో కూలర్లను కూడా ఏర్పాటుచేస్తున్నారు. ఓటర్లు కూర్చొనేందుకు వీలుగా కుర్చీలు, నీడ కోసం షామియానాలు, మంచి నీళ్లు, చక్రాల కుర్చీలు ఏర్పాటుచేస్తున్నారు.
- సెల్ఫీ పాయింట్లు కూడా చక్కగా తీర్చిదిద్దనున్నారు.
- వివాహ వేడుకల్లో చేసినట్లు ఓటు వేయడానికి వచ్చే ఓటర్లపై సుగంధద్రవ్యాలు చల్లుతూ గులాబీలు ఇచ్చి లోనికి ఆహ్వానిస్తారు. ఓటర్లతో వచ్చే పిల్లలు ఆడుకునేందుకు సదుపాయాలు కల్పించనున్నారు.

ఖైరతాబాద్‌లో మహిళా పోలింగ్ కేంద్రాలు 5..

పోలింగ్ బూత్ నెంబర్	పోలింగ్ బూత్ ప్రాంతం
1	భవన్స్ న్యూసైన్స్ కాలేజ్, కింగ్‌కోఠి
34	గౌతమ్ మోడల్ స్కూల్, హిమాయత్‌నగర్
97	రాజీవ్‌భవన్ శ్రీశ్రీ రవిశంకర్ విద్యామందిర్, సోమాజిగూడ
106	సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్, కుందన్‌బాగ్, బేగంపేట
191	బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14 డీపీఎస్ పబ్లిక్ స్కూల్

దివ్యాంగుల పోలింగ్ స్టేషన్ 1...

పోలింగ్ బూత్ నెంబర్	పోలింగ్ బూత్ ప్రాంతం
133	బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2, కమలాపురికాలనీ రిచ్‌మండ్స్ హైస్కూల్

ఆదర్శ పోలింగ్ స్టేషన్లు 5...

పోలింగ్ బూత్ నెంబర్	పోలింగ్ బూత్ ప్రాంతం
18	నారాయణగూడ కేశవమెమోరియల్ కాలేజ్
64	ఖైరతాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇనిస్టిట్యూట్
142	బంజారాహిల్స్ టీఎస్ స్టడీ సర్కిల్
162	ప్రశాసన్‌నగర్, తెలంగాణ సెరీకల్చర్ బిల్డింగ్
150	జూబ్లీహిల్స్ ఓబుల్‌రెడ్డి స్కూల్

యువత పోలింగ్ కేంద్రం 1

పోలింగ్ బూత్ నెంబర్	పోలింగ్ బూత్ ప్రాంతం
173	ఫిలింనగర్, ఎంఆర్‌సీ కాలనీ కమ్యూనిటీ హాల్

నేడు అంబేడ్కర్ వర్సిటీ 'టెలీకాన్ఫరెన్స్'

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అకడమిక్, అభివృద్ధి కార్యకలాపాలపై ఈ నెల 9న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం ఈఎంఆర్ అండ్ ఆర్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ యూ ట్యూబ్ చానల్, టీ-శాట్ నిపుణ ద్వారా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యయన కేంద్రాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని, టెలిఫోన్ నెంబర్ 040-2368 0456 ద్వారా సంప్రదించాలని సూచించారు. విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీ తారామారావు, అకడమిక్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఆర్ఎన్ రెడ్డి పాల్గొని అకడమిక్, విద్యాభివృద్ధి కార్యకలాపాలపై చర్చించి విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇస్తారని వెల్లడించారు. ఇక నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతి గురువారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నల్లాల్లో తాగు నీటి నాణ్యత పరిశీలన

బంజారాహిల్స్: ప్రజలకు నాణ్యమైన మంచినీటిని అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని జలమండలి జీఎం హరిశంకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం భారీ వానలు కురిసిన తర్వాత బుధవారం నీటి సరఫరా సమయంలో ఎక్కడైనా నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నాయా అనే అంశంపై జీఎం హరిశంకర్‌తో పాటు, తట్టికాన మేనేజర్ రాంబాబు బంజారాహిల్స్‌లోని సింగాడికుంట, ఉదయ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. నీటి సరఫరా వేళల్లో వస్తున్న నీటిని పరిశీలించి క్లోరిన్ లెవల్స్‌ను పరిశీలించారు. మంచినీరు వస్తున్నాయని ఎటువంటి కలుషిత నీరు రావడం లేదని అధికారులు తెలిపారు.

ఉర్రూతలూగించిన విల్లామేరీ విద్యార్థినులు

ఫేర్‌వెల్ పార్టీలో సందడే సందడి





పంజగుట్ట: విద్యార్థినుల ర్యాంప్ వాక్, డీజే పాటలకు స్టెప్పులతో సోమాజిగూడలోని విల్లామేరీ మహిళా కాలేజీలో సందడి నెలకొంది. కాలేజీలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు బుధవారం రాత్రి వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఫేర్‌వెల్ పార్టీ శుభం లీవింగ్ ఎ లెగసి పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు డీజే పాటలకు స్టెప్పులు వేస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఫ్యాషన్ షో విశేషంగా ఆకట్టుకుంది. మిస్ వివాసియస్, మిస్ రూపాంజెల్, మిస్ రైజింగ్ స్టార్, మిస్ గార్జియస్, మిస్ విల్లామేరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా ప్రముఖ మోడల్, నటి పాయల్ రాథోడ్ వ్యవహరించారు. కాలేజీ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ఫిల్లోమినా, సెక్రటరీ చిన్నమ్మ, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రావు, ప్రిన్సిపల్ రేవతి దేవి మాధుర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 21, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 40.

కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి: చింతల



నందినగర్‌లో ప్రచారం చేస్తున్న చింతల రామచంద్రారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన బంజారాహిల్స్‌లోని నందినగర్, వెంకటేశ్వరనగర్, ఉదయ్‌నగర్ బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పారదర్శక పాలనతో పాటు, కేంద్రంలో అవినీతి రహిత ప్రభుత్వం కొనసాగుతున్నదన్నారు. అటువంటి ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి మద్దతుగా ప్రతి ఒక్కరూ నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఓటింగ్ రోజూ ప్రతి ఒక్కరూ కదిలి వచ్చి కిషన్‌రెడ్డికి ఓటేసి మద్దతు తెలపాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదల సంక్షేమం



ప్రచారంలో నవీన్ యాదవ్ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ అని, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయాన్ని అందించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలుబస్తీల్లో పాదయాత్ర నిర్వహించి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎస్టీ సెల్ స్టేట్ కో ఆర్డినేటర్ రమేష్‌నాయక్, రవిగౌడ్, సలామ్, బాబీ పాల్గొన్నారు.

ఆకాశ్ విద్యార్థినికి టాప్ స్కోర్

సాక్షి, సిటీబ్యూరో: ఐసీఎస్ఈ బోర్డు తాజాగా వెల్లడించిన ఫలితాల్లో హిమాయత్‌నగర్‌కు చెందిన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) విద్యార్థిని పియా జాజు 10వ తరగతి ఐసీఎస్ఈ బోర్డు పరీక్షల్లో 99.6 శాతం స్కోర్ సాధించింది. పియా మూడు సబ్జెక్టుల్లో 100 శాతం మార్కులు సాధించింది. సైన్స్, సోషల్ స్టడీస్, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 100 శాతం, గణితం,ఆంగ్లంలో 99, హిందీలో 97 మార్కులతో మొత్తం 498 మార్కులు తమ విద్యార్థిని సాధించింది. ఈ సందర్భంగా పియాకు 'ఆకాశ్' చీఫ్ అకడమిక్ అండ్ బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు రమేశ్ మృతి



ఎల్‌కే రమేశ్ (ఫైల్)

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రహమత్‌నగర్ బస్తీ వ్యవస్థాపక సభ్యుడు ఎల్.కె.రమేశ్(74) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజహరుద్దీన్, తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ అసదుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్, కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి తదితరులు రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ... దివగంత పీజేఆర్ హయాం నుంచి కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతగా పనిచేసిన ఎల్‌కే రమేశ్ మృతి పార్టీకి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు.

అండగా ఉంటా.. ఆదరించండి: పద్మారావుగౌడ్



ఎన్నికల ప్రచారంలో పద్మారావుగౌడ్..

వెంకటేశ్వరకాలనీ: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు తనను ఆదరిస్తున్న తీరుకు వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానని బీఆర్‌ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని ప్రతాప్‌నగర్, దేవరకొండ బస్తీ, సుఖ్‌దేవ్‌నగర్, గౌరీ శంకర్ కాలనీ బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో, ప్రజా సంక్షేమంలో నాకు నిబద్ధత ఉంది కాబట్టే కేసీఆర్ తనను సికింద్రాబాద్ నుంచి నిలబెట్టాడని ప్రజలంతా తనకు అండగా నిలవాలని కోరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ఎం ఎస్. శ్రీనివాసరావు, వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హత్య

వెంగళరావునగర్: అనుమానాస్పద స్థితిలో సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీ హత్యకు గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా గంపలగూడెం ప్రాంతానికి చెందిన రవికుమార్ (45) నగరంలో సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీగా పనిచేస్తూ ఏడాదిన్నరగా ఇంజినీర్స్ కాలనీలోని ఫ్రిడ్జ్ రెసిడెన్సీలో తన భార్య, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం దాదాపు రవికుమార్ భార్య శ్రావణి(అశ్విని) తన కుమార్తెతో కలిసి వాకింగ్‌కు బయటకు వెళ్లింది. ఆమె ఐదు గంటల తర్వాత ఇంటికి వచ్చింది. తలుపు తెరిచి చూడగా తన భర్త మృతిచెంది ఉన్నాడు. గుర్తు తెలియని దుండగులు హత్య చేసి పారిపోయినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రవికుమార్‌ను రాడ్డుతో బలంగా కొట్టి హత్య చేసిన అనంతరం దుండగులు మృతదేహం, గదిలోని పలు ప్రాంతాల్లో పసుపు, కారం పొడి చల్లినట్టు పోలీసులు తెలియజేశారు. పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, డీఐ రవి కుమార్, క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

డీఆర్‌సీ బృందాలు సమర్థవంతంగా పనిచేయాలి

జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్



మాట్లాడుతున్న రొనాల్డ్‌రాస్

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో పని చేసే సంబంధిత డీఆర్‌సీ బృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసి భవన్‌లో డీఆర్‌సీ బృందాల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ... ప్రిసైడింగ్ అధికారులకు అందించాల్సిన పోలింగ్ మెటీరియల్ బ్యాగ్‌ను చెక్ లిస్ట్‌తో సహా ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈవీఎంలు, పోల్ మెటీరియల్‌ను డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి బస్సులోకి, అలాగే పోలింగ్ పూర్తయిన పిమ్మట వచ్చిన బస్సు నుంచి రిసెప్షన్ కేంద్రంలోకి తీసుకురావడానికి అవసరమైనంత మంది కూలీలను ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... ఈవీఎం, స్ట్రాంగ్ రూమ్, తదితర ప్రతి ముఖ్యమైన అంశానికి సంబంధించి పొలిటికల్ పార్టీల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, సీఈఓ మధుకర్ నాయక్, జిల్లా ఎన్నికల శిక్షణ తరగతుల నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.



రూ. 10 లక్షల కోట్ల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలి: దానం నాగేందర్

బంజారాహిల్స్: తెలంగాణకు రూ.10 లక్షల కోట్లు కేంద్రం నుంచి తెచ్చానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెబుతున్నారు. కానీ.. ఆ డబ్బులు ఎక్కడ ఖర్చుపెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ డిమాండ్ చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ. 10 లక్షల కోట్లు తెస్తే సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ భూసేకరణకు ఖర్చు పెట్టవచ్చు కదా? అని నిలదీశారు. మెట్రోరైల్ విస్తరణకు నిధులు ఎందుకు తేలేదన్నారు. మూసీ ప్రక్షాళనకు ఎందుకు ముందుకురావడం లేదన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్ ఎందుకు తేలేదన్నారు. ఆయన ఏనాడూ పేదలతో మమేకం కాలేదని, వారి సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు.

దానంను గెలిపించాలని విజయారెడ్డి ప్రచారం



ఉదయ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌ను ప్రజలు ఓటు వేసి భారీ గెలిపించాలంటూ టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఉదయ్‌నగర్, సింగాడికుంట బస్తీల్లో ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి పట్ల ప్రజలు విశ్వాసంగా ఉన్నారన్నారు. కచ్చితంగా సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని భారీ మెజార్టీతో కైవసం చేసుకోబుతున్నట్లు ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ధన్‌రాజ్ రాథోడ్, నజీర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



దుస్తులు ఇస్త్రీ చేస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బుధవారం జిల్లా కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇస్త్రీ షాపునకు వెళ్లిన ఆయన అక్కడ యజమాని రాచకొండ వెంకన్నతో మాట్లాడి బీఆర్ఎస్ పాలనలో అమలుచేసిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ఆరా తీశారు. అనంతరం కాసేపు దుస్తులు ఇస్త్రీ చేసిన వద్దిరాజు... కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని స్థానికులను కోరారు.

ఈటల మార్ఫింగ్ వీడియోపై డీజీపీకి బీజేపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ మార్ఫింగ్ వీడియోతో కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి ప్రమేయముందని ఆరోపిస్తూ డీజీపీకి బీజేపీ నేతలు, కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. మల్కాజిగిరి ఓటర్లను కించపరిచేలా ఈటల వ్యాఖ్యలు చేసినట్లుగా మార్ఫింగ్ వీడియోను సృష్టించి పలు న్యూస్ చానెళ్లు, సోషల్ మీడియా మాధ్యమాల్లో ప్రచారం చేసి ఆయనపై దుష్ప్రచారం చేస్తున్నారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మార్ఫింగ్ వీడియో వివిధ ప్రసార మాధ్యమాలతో పాటు పట్నం రితీశ్‌రెడ్డి 'ఎక్స్' ఫ్యాన్ పేజీలోనూ ప్రసారమైందని తెలిపారు. దీనిపై విచారణ జరిపి వీడియోను రూపొందించిన వారిపై, వెనక ఉండి ప్రోత్స హించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం డీజీపీకి బీజేపీ లీగల్ సెల్ నాయకులు ఎం.రాజుయాదవ్, విజ యకాంత్ వి.శ్రవణ్, శ్రీకాంత్ వినతిపత్రం అందించారు.

నాంపల్లిలో వర్షానికి తడిసిన ఎన్నికల సామగ్రి



ఆర్ట్ గ్యాలరీలో ఆరబోసిన ఎన్నికల సామగ్రి

నాంపల్లి (హైదరాబాద్): మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఎఫ్ఏయూ కళాశాల ప్రాంగణంలో ఉన్న నాంపల్లి డీఆర్‌సీ సెంటర్‌లోకి వరదనీరు చేరి అక్కడ భద్రపరిచిన ఎన్నికల సామగ్రి తడిసిపోవడంతో అధికారులు వెంటనే స్పందించి పక్కనే ఉన్న ఆర్ట్‌గ్యాలరీలో ఆరబెట్టారు. అనంతరం వాటిని మరో గదిలోకి తరలించడంతోపాటు మిగిలిన వాటికి కూడా కవర్లు కప్పి భద్రపరిచారు. ఈ ఎన్నికల సామగ్రిని మరో రెండు మూడు రోజుల్లో నాంపల్లి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పంపించనున్నారు.

ఓటర్లు, ఎన్నికల అధికారులకు సౌకర్యాలు కల్పించండి

సీఈఓకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈనెల 13న లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్‌కేంద్రాల వద్ద టెంట్లు, మందులు, నీళ్లు, ప్రథమ చికిత్స కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కి కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. ఓటింగ్ సందర్భంగా ఓటర్లు, ఎన్నికల అధికారుల ఆరోగ్య పరిరక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడినందున తగిన చర్యలు తీసుకోవాలని సీఈవోకు రాసిన లేఖలో కోరారు. మండువేసవిలో ఎన్నికలు జరుగుతున్నందున, అధిక ఉష్ణోగ్రతలు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లు వేచి ఉండేందుకు తాత్కాలిక టెంట్లు, షెల్టర్ల ఏర్పాట్లు, అధిక వేడి, డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి వాటికి అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సీఈవోకు కిషన్‌రెడ్డి సూచించారు.

సాక్షిప్రతినిధి, వరంగల్: తొలి నుంచి తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ. విప్లవ రాజకీయాలు, సామాజిక ఉద్యమాలకు నెలవు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ కేంద్రంగా ఉన్న ప్రాంతం. రాజకీయ చైతన్యానికి మారుపేరైన వరంగల్ సెగ్మెంట్‌ను బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్..ఆ తర్వాత టీడీపీకి కంచుకోటగా ఉన్న వరంగల్ (హనుమకొండ) పార్లమెంట్ నియోజకవర్గంపై టీఆర్ఎస్ పట్టు బిగించింది. 2009 పునర్విభజనలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంగా ఏర్పడింది. 1952 నుంచి 2019 వరకు మూడు ఉపఎన్నికలు కలుపుకొని మొత్తం 20 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఏడుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు కాంగ్రెస్(ఐ) అభ్యర్థులు విజయం సాధించగా, టీడీపీ ఐదు, టీఆర్ఎస్ నాలుగు, టీపీఎస్, పీడీఎఫ్ పార్టీలు ఒక్కోసారి గెలుపొందాయి. జనరల్ స్థానంగా ఉన్నప్పుడు సైతం మూడుసార్లు ఇక్కడ ఎస్టీ అభ్యర్థులు విజయం సాధించారు.



వరంగల్.. ట్రయాంగిల్

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూడు పార్టీలు

కాకతీయుల కోటలో ఏ జెండా ఎగిరేనో..

ముగ్గురిదీ బీఆర్ఎస్ బ్యాక్‌గ్రౌండే.. అందరూ మొదటిసారే

వరంగల్ నుంచి పోటీ చేసేందుకు అన్ని పార్టీలకన్నా ముందు బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా కడియం శ్రీహరి కూతురు కావ్యను ప్రకటించింది. తర్వాత ఆమె హస్తం గూటికి చేరడంతో జరిగిన పరిణామాలతో బీఆర్ఎస్‌కు అభ్యరి ఎంపిక కత్తిమీద సాములా మారింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తొలుత తాను బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపి.. ఆ తర్వాత బీజేపీలో చేరి బరిలో నిలిచారు. కాంగ్రెస్‌లో చేరిన కావ్యకు పోటీచేసే అవకాశం దక్కడంతో ఇక బీఆర్ఎస్ నుంచి హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్‌ను పోటీలోకి దింపారు. కాగా డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ ఆయుర్వేద వైద్యుడు కాగా, కడియం కావ్య సైతం వైద్యురాలే. బీఆర్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న ఈ ముగ్గురు కూడా ఎంపీ ఎన్నికల బరిలో నిలవడం మొదటిసారి.



కడియం కావ్య (కాంగ్రెస్)



అరూరి రమేశ్ (బీజేపీ)



సుధీర్ కుమార్ (బీఆర్ఎస్)

నాన్న తోడు.. పార్టీ బలమే గెలిపిస్తుందన్న ధీమా

లోక్‌సభ ఎన్నికల ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన కడియం కావ్య.. తండ్రి కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీకున్న బలాన్ని నమ్ముకున్నారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఘన విజయం ఇచ్చారు. ఈ పార్లమెంట్ పరిధిలోని వచ్చే ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గెలుపొందిన కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరడం, ఆయన కూతురు కావ్యనే అభ్యర్థి కావడం అనుకూలంగా మారింది. డాక్టర్‌గా, స్వచ్ఛంద సంస్థల ఏర్పాటు ద్వారా చేసిన ప్రజాసేవకుతోడు కాంగ్రెస్ పార్టీ బలం, యువ నాయకురాలిగా ప్రజలు ఆదరిస్తారనే ధీమాలో కడియం కావ్య ఉన్నారు. అయితే కడియం కావ్య స్థానికేతరురాలని, ఆంధ్రా ప్రాంతానికి చెందిన ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకుందన్న ప్రత్యర్థుల ఆరోపణలు ఇబ్బందికరంగా మారాయి. ఎన్నికల షెడ్యూల్ సమయాన బీఆర్ఎస్‌లో ఉన్న కావ్య.. ఆ తర్వాత తండ్రితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరి అభ్యర్థి అయ్యారు. పార్టీ ఫిరాయింపులతో పాటు వీటన్నింటిపై ప్రతిపక్షాలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి.

మోదీ చరిష్మా.. పాలకుల వైఫల్యాలే కలిసి వస్తాయంటూ..

2014, 2018 ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ సాధించిన అరూరి రమేశ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అదే సెగ్మెంట్ నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీచేసి ఓడిపోయారు. తర్వాత బీజేపీలో చేరిన ఆయనకు ప్రధాని నరేంద్రమోదీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారన్న సానుభూతికితోడు జాతీయస్థాయిలో మోదీ అనుకూల పవనాలు తనకు కలిసివస్తాయని భావిస్తున్నారు. గతంలో వరంగల్(హనుమకొండ)లో ఒకసారి బీజేపీ అభ్యర్థి ఎంపీగా గెలిచారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందన్న ప్రచారం కూడా అనుకూలమే. మామునూరు ఎయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, మెట్రోరైలు సహా అనేక పథకాలకు మోక్షం కలుగుతుందని చెబుతున్నారు. బీజేపీ శ్రేణులు అరూరి రమేశ్ గెలుపులో ఏమేరకు పాలు పంచుకుంటారన్న చర్చ ఓ వైపు జరుగుతుండగా.. ప్రధాని మోదీ వరంగల్ పర్యటన విజయవంతం, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న ప్రచారంతో పాటు ప్రజలతో తనకున్న సంబంధాలతో గెలుస్తానని చెబుతున్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధే గెలిపిస్తుందన్న ఆశ

తెలంగాణరాష్ట్ర సమితి ఏర్పాటు నుంచి ఆ పార్టీలో పనిచేస్తున్న డాక్టర్ మారెపెల్లి సుధీర్‌కుమార్ మొదటిసారి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీ ఆవిర్భావం నుంచి ఎంపీటీసీగా, ఎంపీపీగా, జెడ్పీ వైస్ చైర్మన్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ వరకు అనేక పదవులు చేపట్టారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఓరుగల్లుకు చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్యనేతలు పార్టీ మారారు. ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్‌లో చేరగా, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలో చేరి ఎంపీ అభ్యర్థి కాగా, మేయర్ గుండు సుధారాణి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు తదితరులు సైతం బీఆర్ఎస్‌ను వీడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, డా.టి.రాజయ్యలతో పాటు పలువురు పనిచేస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటు, తొలి సీఎంగా కేసీఆర్ ఈ రాష్ట్రానికి చేసిన మేలును చూసి ప్రజలు గెలిపిస్తారన్న ధీమాలో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ ఉన్నారు.

ప్రభావితం చూపే అంశాలు

- ఎంపీ సెగ్మెంట్‌లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువ. వారి మొగ్గు ఎటువైపు ఉంటుందో..
- దళితుల ఓట్లూ కీలకమే
- నగర ఓటర్లు, విద్యావంతులూ ఎక్కువే
- బలమైన తెలంగాణవాదం

ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు
స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ)	1,25,210	1,28,898
పాలకుర్తి	1,26,411	1,29,090
పరకాల	1,08,076	1,14,305
వరంగల్ పశ్చిమ	1,39,322	1,44,108
వరంగల్ తూర్పు	1,25,638	1,32,518
వర్ధన్నపేట(ఎస్సీ)	1,34,257	1,39,491
భూపాలపల్లి	1,36,507	1,40,238
మొత్తం	8,95,421	9,28,648

2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఇలా..

పసునూరి దయాకర్ (టీఆర్ఎస్) 6,12,498

దొమ్మాటి సాంబయ్య (కాంగ్రెస్) 2,62,200

చింతా సాంబమూర్తి (బీజేపీ) 83,777

పదేళ్లు పీఎంగా చేసినా ఓట్లకు రాముడే దిక్కా?



ప్రధాని మోదీపై మంత్రి కోమటిరెడ్డి ధ్వజం

- ఏపీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాదు
- మరో 20 ఏళ్ల వరకు అక్కడ కాంగ్రెస్ గెలవదు
- సీఎంగా పదేళ్లు రేవంత్‌రెడ్డినే ఉంటాడు
- జూన్ 5న 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి
- మీట్ ది ప్రెస్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల ప్రధానిగా పనిచేసిన నరేంద్ర మోదీకి ఈసారి ఎన్నికల్లో చెప్పుకునేందుకు ఏమీ లేక రాముడే దిక్కయ్యాడని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. ఈసారి మోదీ గెలిస్తే దేశంలో ఇకఎన్నికలు ఉండవని, చైనా, రష్యా తరహాలో నియంతృత్వ రాజరిక పాలన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో 20 ఏళ్ల వరకు కాంగ్రెస్ కోలుకునే పరిస్థితి లేదని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏపీలో ఒక్కసీటు కూడా రాదన్నారు. అందరి ఆమోదంతోనే సీఎంగా రేవంత్‌రెడ్డి కొనసాగుతున్నారని, ఈ ఐదేళ్లే గాక మరో ఐదేళ్లు కూడా రేవంత్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి ఏమన్నారో ఆయన మాటల్లోనే...

ప్రధానిగా ఉండి ఒక మతాన్ని టార్గెట్ చేస్తారా?

దేశ జనాభాలో 25 కోట్ల మంది ఉన్న ముస్లిం జనాభాను ప్రధాని మోదీ టార్గెట్ చేశారు. ఈ ఎన్నికల్లో మోదీకి చెప్పుకునేందుకు ఏమీలేదు. అందుకే మతాన్ని, రామున్ని ముందుకు తెచ్చారు. మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామని భయపెడుతున్నారు. బీజేపీ ఓట్ల కోసం మతాల వారీగా జనాభాను విభజించి ఈ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోంది.

అక్కడ కాంగ్రెస్ నాశనమవుతుందని తెలిసినా

తెలంగాణ ఇస్తే ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ నాశనమవుతుందని తెలిసి కూడా ప్రజలకిచ్చిన మాట ప్రకారం సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. అనుకున్నట్టే ఆంధ్రలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. 20 ఏళ్ల వరకు అక్కడ కాంగ్రెస్ కోలుకోదు. 2014, 2019లో ఒక్కసీటు రాలేదు. ఈ సారి కూడా ఒక్కసీటూ అక్కడ కాంగ్రెస్ గెలవదు.

నేను సీఎం పదవి అడగలేదు

నేను సీఎం పదవి అడగలేదు. నన్ను ఎమ్మెల్యేల క్యాంపులో ఉండమంటే మూడు రోజులు రూం నుంచి కూడా బయటకు రాలేదు. సీఎం రేవంత్.. ఉత్తమ్‌కుమార్ రెడ్డి వంటి సీనియర్లతో పాటు అందరి అభిప్రాయాలను గౌరవిస్తున్నారు. అందరం కలిసి అధ్వానంగా మారిన రాష్ట్రాన్ని బాగు చేసే పనిలో ఉన్నాం. ఈ ఎన్నికల్లో 15 సీట్లు మా టార్గెట్. 14 సీట్లు అయినా గెలుచుకుంటాం.

జూన్ 4 తర్వాత బీఆర్ఎస్ ఉండదు

జూన్ 4 తరువాత తెలంగాణ భవన్ మూతపడుతుంది. జూన్ 5న 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారు. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గ పునర్విభజనలో రాష్ట్రంలో 154 సీట్లు ఉండబోతున్నాయి. అందులో 125 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుంది. ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం.

ఇండియా కూటమికి బీసీల మద్దతు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం వెల్లడి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఖైరతాబాద్ (హైదరాబాద్): కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి బీసీలు మద్దతివ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో జరిగిన సమావేశంలో కరప త్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి కరపత్రాలను బీసీలందరికీ చేరేలా చేస్తామని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఇండియా కూటమికి బీసీల మద్దతివ్వాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. సమావేశంలో ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ చైర్మన్, పూర్వ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇండియా కూటమికి మనం ఈ పర్యాయం మద్దతు ఇవ్వాలన్నారు. విద్యతోనే సమాజం మారుతుందని పూలే చెప్పారని, రిజర్వేషన్లు భిక్షం కాదు మన హక్కు–మన భాగస్వామ్యమని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల డిమాండ్లు నెరవేర్చకుండా దేశం అగ్రదేశం కాదని, రాహుల్‌గాంధీ ప్రతి సమావేశంలో బీసీ డిమాండ్లపై ప్రస్తావించారన్నారు.

మోదీ మత వైషమ్యాలు రెచ్చగొడుతున్నారు

బీజేపీకి ఓటేస్తే ప్రజలు హక్కులు కోల్పోయినట్లే

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో దీపాదాస్ మున్షీ

నిర్మల్ చైన్‌గేట్: ఓటమి భయంతో ప్రధాని మోదీ మత వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. బుధవారం ఆయన నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ బీజేపీకి ఓటేస్తే ప్రజలు హక్కులు కోల్పోయినట్లేనని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని, రైతు భరోసా అందకుండా కుట్ర చేస్తున్న రైతు వ్యతిరేక పార్టీలని విమర్శించారు. ప్రాణహిత ప్రాజెక్టు కట్టి ఆదిలాబాద్ రైతులకు సాగునీరు అందిస్తామని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. దేశ సంపదను బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేయాలనే దురాలోచనతో మోదీ మూడోసారి ప్రధాని కావాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులు, దేశ సంపద, రాజ్యాధికారంలో వాటా దక్కాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆత్రం సుగుణను పార్లమెంటు సభ్యురాలిగా గెలిపించుకుంటే అమాయక గిరిజన, ఆదివాసీ ప్రజల గళాన్ని పార్లమెంటులో వినిపించి వారి హక్కుల సాధనకై పోరాటం చేస్తారని తెలిపారు. మంత్రి సీతక్క, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



ఇక్కడ బీజేపీకి డబుల్ డిజిట్ పక్కా

- రిజర్వేషన్ల రద్దు ప్రచారంతో ఆ పార్టీలకే నష్టం
- ఆ ఫలాల లబ్ధిదారులకు బీజేపీ పట్ల విశ్వాసం
- కాంగ్రెస్ డబ్బులు పంచినా ఓట్లు వేసేది మాకే
- ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లు తప్ప రేవంత్‌కేమీ తెలియదు
- శామ్ పిట్రోడావి జాత్యహంకార వ్యాఖ్యలు

మీడియాతో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ సీట్లు సాధించడం ఖాయమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందనే సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర విపక్షాల వ్యతిరేక ప్రచారాన్ని ప్రజలు నమ్మకపోవడంతో అది తమకు అనుకూలంగా మారిందని వ్యాఖ్యానించారు. బీజేపీని ఇరుకున పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ చేసిన 'రిజర్వేషన్' ప్రచారం విఫలమైందన్నారు. ఆ ఫలాల లబ్ధిదారులే బీజేపీపై విశ్వాసంతో మద్దతు పలుకుతున్నారని ఆయన చెప్పారు. దీంతో రేవంత్‌రెడ్డిలో అభద్రతాభావం, అసహనం పెరగగా, కాంగ్రెస్ పార్టీలో మరింత కలవరం పెరిగిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని డబ్బులు పంచినా.. ప్రజలు ఓట్లు మాత్రం బీజేపీకే వేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... రైతు భరోసాను కేంద్ర ఎన్నికల సంఘం ఆపితే బీజేపీ నిలిపేసిందని రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు వస్తాయని ముందే తెలిసి నా.. రైతుభరోసా ఎందుకివ్వలేదో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధాల ప్రచారంలో కల్వకుంట్ల కుటుంబానికి, రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చునని ఎద్దేవాచేశారు.

ఆర్ఆర్ టాక్స్ వసూళ్లు తప్ప రేవంత్‌కేమీ తెలియదు

'రేవంత్‌రెడ్డి బాధ్యతారహిత విమర్శలు చేస్తున్నారు. బూతులు మాట్లాడటం, కోతలు కోయడం తప్ప హామీల అమలు చేతల్లో చూపించే సోయి లేదు. ఆర్ఆర్ టాక్స్ వసూలు చేయడం తప్ప వేరే విషయం తెలియదు. రీసెర్చ్ టీం పెట్టుకుని.. ఏ తిట్లు తిట్టాలి, ఏ వీడియో ఫేక్ చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నారు. కేంద్రంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు.' అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ''కేంద్రంతో బీఆర్ఎస్ ఘర్షణ పడ్డందుకే తెలంగాణకు అన్యాయం జరిగిందని గతంలో రేవంత్ అన్నారు... కేంద్రంతో సఖ్యతతో ఉంటా అని చెప్పి ఇప్పుడు గాడిద గుడ్డు పెట్టుకొని తిరుగుతున్నారు. ఎన్నికలు రాగానే ఏం రోగం పుట్టిందో.. స్వార్థం కోసం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారు' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పదేళ్లలో కేంద్రం చేసిన దానిపై సీఎం రేవంత్‌రెడ్డితో ఎన్నికల తరవాత కూడా తాను చర్చకు సిద్ధమని చెప్పారు. 'ఎక్కడ ప్రచారా నికి వెళ్ళినా ఆ అభ్యర్థిని కేంద్ర మంత్రి చేస్తా అని సీఎం అంటున్నారు... పోర్ట్‌ఫోలియోలు కూడా ఇస్తున్నారు. అసలు కాంగ్రెస్ ఎన్ని సీట్లలో పోటీ చేస్తోంది... ప్రధాని ఎవరు ?' అని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ తప్పిదాలతో తెలంగాణకు నష్టం

'మాజీ సీఎం కేసీఆర్ తప్పు వల్లనే కృష్ణా జలాల్లో తెలంగాణ నష్టం పోయింది. కేటీఆర్ చిల్లర గాని లెక్క మాట్లాడుతున్నారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు కేంద్రం ఎంత ఇచ్చిందో చర్చకు నేను సిద్ధం. హైదరాబాద్ డబ్బులు అదిలాబాద్‌లో ఖర్చు పెట్టొద్దా? అలాంటి వారికి ఏమి చెపుతాము' అని వ్యాఖ్యానించారు. 'కోమటిరెడ్డి వెంకటరెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. భువనగిరి కోట అభివృద్ధికి కేంద్రం ఏం చేసిందో టూరిజం శాఖను అడిగి తెలుసుకో లేదంటే మంత్రి జూపల్లి కృష్ణారావును అడిగి తెలుసుకోవాలి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి వారి మాటలకు నేను సమాధానం చెప్పను. మా పార్టీ అధికారప్రతినిధులు మాట్లాడుతారు' అని విలేకరుల ప్రశ్నలకు కిషన్‌రెడ్డి బదులిచ్చారు. ''రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు శామ్ పిట్రోడావి జాత్యంహకార వ్యాఖ్యలు. దేశ ప్రజల పట్ల కాంగ్రెస్ దురహంకార వైఖరికి ఈ వ్యాఖ్యలు అద్దం పడతాయి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల చరిత్రలో ఏకగ్రీవాలు

సూరత్ ఏకగ్రీవంతో సర్వత్రా చర్చ

బీజేపీ కుట్రేనంటున్న ప్రతిపక్షాలు ● లోక్‌సభ చరిత్రలో 29 ఏకగ్రీవాలు



గుజరాత్‌లో అన్ని లోక్‌సభ స్థానాలకూ మే 7న మూడో విడతలో భాగంగా పోలింగ్ జరిగింది. అయితే అంతకుముందే ఒక సీటు అధికార బీజేపీ ఖాతాలో పడింది! సూరత్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ 'తిరస్కరణ'కు గురవడం, ఆ వెంటనే పోటీలో ఉన్న మిగతా 8 మంది అభ్యర్థులూ నామినేషన్లు ఉపసంహరించుకోవడమే అందుకు కారణం. దాంతో పోలింగ్‌తో పని లేకుండా బీజేపీ అభ్యర్థి ముఖేశ్ దలాల్ ఏకగ్రీవ ఎంపీగా ఎన్నికైపోయారు! అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభానీ మీడియాకు ముఖం చాటేయడంతో ఇదంతా బీజేపీ స్క్రిప్టేనంటూ ఆరోపణలొచ్చాయి. లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఏకగ్రీవాలను ఓసారి చూస్తే...

- సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికవడం అసాధారణమైన విషయం. తొలి లోక్‌సభ ఎన్నికలు జరిగిన 1952 నుంచి ఇప్పటిదాకా ఇలా పోటీ లేకుండా గెలిచిన 29వ ఎంపీ దలాల్. బీజేపీ నుంచైతే ఏకగ్రీవంగా ఎన్నికై న తొలి ఎంపీ ఆయనే. 1952, 1957, 1967 ఎన్నికల్లో ఐదేసి మంది చొప్పున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1952లో ఏకగ్రీవమైన ఐదుగురు ఎంపీల్లో ఒక్క జమ్మూ కశ్మీర్ నుంచే నలుగురుండటం విశేషం! ఆంధ్రప్రదేశ్, అసోం, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ సహా ఎనిమిది రాష్ట్రాలు ఒకరికంటే ఎక్కువ మంది ఎంపీలను పోటీ లేకుండా లోక్‌సభకు పంపాయి. పార్టీలపరంగా చూస్తే ఏకంగా 20 మంది ఏకగ్రీవ ఎంపీలతో ఈ జాబితాలో కాంగ్రెస్ అగ్ర స్థానంలో ఉంది. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)ల నుంచి ఇద్దరేసి ఏకగ్రీవమయ్యారు. లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఇప్పటిదాకా ఒకే ఒక్క స్వతంత్ర అభ్యర్థి ఏకగ్రీవంగా నెగ్గారు. సిక్కిం, శ్రీనగర్ లోక్‌సభ స్థానాలకు ఒకటి కంటే ఎక్కువసార్లు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవ ప్రముఖులు..

ఏకగ్రీవంగా గెలుపొందిన ఎంపీల్లో పలువురు ప్రముఖులున్నారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైబీ చవాన్, జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, నాగాలాండ్ మాజీ సీఎం, మాజీ గవర్నర్ ఎస్సీ జమీర్, ఒడిశా తొలి సీఎం హరేకృష్ణ మహతాబ్, రాజ్యాంగ పరిషత్ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు టీటీ కృష్ణమాచారి, కేంద్ర మాజీ మంత్రులు పీఎం సయీద్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే విజయవాడ నుంచి కేఎల్ రావు పోటీ లేకుండా గెలిచారు.

రాజ కుటుంబీకుల నుంచి మొదలు...

లోక్‌సభకు ఏకగ్రీవాలు రాజ కుటుంబీకుల నుంచి మొదలయ్యాయి. 1952 తొలి ఎన్నికల్లో లోక్‌సభకు ఏకగ్రీవంగా ఎన్నికైన మొదటి నాయకునిగా ఆనంద్ చంద్ రికార్డులకెక్కారు. అంతేగాక ఏకగ్రీవమైన ఏకైక స్వతంత్ర అభ్యర్థి కూడా ఆయనే! బిలాస్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన గెలుపొందారు. నిధుల కొరతను కారణంగా చూపుతూ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకోవడమే అందుకు కారణం. ఆయనకు చంద్ లంచం ఇచ్చినట్టు కాంగ్రెస్ ఆరోపించింది. చంద్ ఎన్నికను కోర్టులో సవాలు కూడా చేసింది. అయితే తీర్పు చాంద్‌కే అనుకూలంగా వచ్చింది. ఇక ఒడిశా తొలి సీఎం హరేకృష్ణ మహతాబ్ 1962లో అంగుల్ నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనపై బరిలో ఉన్న గణతంత్ర పరిషత్ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకోవడమే అందుకు కారణం. అదే ఏడాది తెహ్రీ గఢ్వాల్ నుంచి మానవేంద్ర షా కాంగ్రెస్ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో లద్దాఖ్ కాంగ్రెస్ అభ్యర్థి, బౌద్ధ ఆధ్యాత్మిక నాయకుడు చోగ్నోర్ పోటీ లేకుండా గెలుపొందారు. 1971లోనూ ఆయన విజయం సాధించారు. 1977లో సిక్కిం స్థానంలో ఏకంగా ఏడుగురు అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చెల్లకపోవడంతో ఛత్ర బహదూర్ ఛెత్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అరుణాచల్ వెస్ట్ స్థానంలో రించిన్ ఖండూ క్రీమే ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయనా పోటీ లేకుండా నెగ్గారు. 1989లో కశ్మీర్లో మూడు లోక్‌సభ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో కేవలం 5 శాతం ఓటింగ్ నమోదైంది. కాశ్మీర్ లోయలో తిరుగుబాట్లు, ఉగ్రవాదం పెచ్చరిల్లుతున్న నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన మహమ్మద్ షఫీ భట్ శ్రీనగర్ నుంచి పోటీ లేకుండా గెలిచారు!

కన్నౌజ్ నుంచి డింపుల్

దలాల్‌కు ముందు చివరిసారిగా ఏకగ్రీవంగా గెలిచిన ఎంపీ సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలు డింపుల్ యాదవ్. కన్నౌజ్ ఎంపీగా ఉన్న ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ 2012లో యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీఎం అయ్యారు. దాంతో ఖాళీ అయిన కన్నౌజ్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన భార్య డింపుల్ బరిలో దిగారు. కాంగ్రెస్, బీఎస్పీ, రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ)తో సహా ప్రధాన పార్టీలు ఉప ఎన్నికకు దూరంగా ఉన్నాయి. కొందరు స్వతంత్రులతో పాటు బీజేపీ, పలు చిన్న పార్టీలు బరిలో దిగాయి. కానీ అంతా నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో డింపుల్ ఏకగ్రీవంగా నెగ్గారు. తమ అభ్యర్థులు నామినేషన్ వేయకుండా ఎస్పీ అడ్డుకుందని బీజేపీ, పీస్ పార్టీ వంటివి ఆరోపించడం విశేషం!

చివరి నిమిషం ఉపసంహరణలు...

1985 సిక్కిం లోక్‌సభ స్థానం సిట్టింగ్ ఎంపీ నార్ బహదూర్ భండారీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. దాంతో లోక్‌సభకు రాజీనామా చేశారు. ఉప ఎన్నికలో ఆయన భార్య దిల్ కుమారి భండారీ సిక్కిం సంగ్రామ్ పరిషత్ నుంచి ఏకగ్రీవంగా నెగ్గారు. కాంగ్రెస్‌తో సహా ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడమే అందుకు కారణం. అధికార పార్టీ వారిపై బెదిరింపులకు పాల్పడిందంటూ ఆరోపణలొచ్చాయి!

ఓట్ల 'బ్యాండ్' బాజా!

ఎన్నికల ప్రచారంలో ఎవరి గోల వారిదే! అభ్యర్థులు ఎడాపెడా హామీలతో ఓటర్లకు గాలం వేస్తుంటే, ఎన్నికల అధికారులేమో పోలింగ్ శాతం పెంచేందుకు 'బ్యాండ్' బాజా మోగిస్తున్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు, ముఖ్యంగా యువ ఓటర్లను బూత్‌లకు రప్పించేందుకు హర్యానా ఎన్నికల అధికారులు వినూత్నంగా మ్యూజికల్ బ్యాండ్లను రంగంలోకి దించుతున్నారు. ఎన్నికల థీమ్ సాంగ్స్‌తో మాంచి సంగీత విభావరుల ద్వారా వారిలో చైతన్యం పెంచే పనిలో పడ్డారు. ఈ బ్యాండ్‌లు ఓటర్లను, ముఖ్యంగా యువత ఓటేసేలా జోష్ నింపడంతో పాటు ఎన్నికలకు సంబంధించి ఓటర్లలో అవగాహన కూడా పెంచుతాయని హర్యానా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనురాగ్ అగర్వాల్ చెబుతున్నారు. పంచ్‌కులలో తొలి ఎలక్షన్ థీమ్ మ్యూజిక్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. తర్వాత యువ ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రతి జిల్లాలో ఇలాంటి మ్యూజిక్ బ్యాండ్స్ అలరిస్తాయని పేర్కొన్నారు. హర్యానాలో మొత్తం 10 లోక్‌సభ స్థానాలకు మే 25న ఆరో విడతలో పోలింగ్ జరగనుంది.



దాదాపు రెండు కోట్ల మంది ఓటర్లు ఈవీఎం బటన్ నొక్కనున్నారు. ఇక్కడ 18–19 ఏళ్ల ఓటర్లు 3.65 లక్షల మంది ఉండగా 20–29 వయస్సున్న ఓటర్ల సంఖ్య 39 లక్షలు. మ్యూజిక్ అంటే ఫిదా అయిపోయే యువతను లక్ష్యంగా చేసుకునే ఈసీ బ్యాండ్ మోగిస్తోంది. లోక్‌సభ ఎన్నికల కోసం భారత ఎన్నికల సంఘం 'చునావ్ కా పర్వ్ – దేశ్ కా గర్వ్' (ఓట్ల సంబరం – దేశానికి గర్వకారణం) నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోందని అగర్వాల్ చెప్పారు. ప్రజాస్వామ్యానికున్న పవర్‌ను, ఓటు ప్రాధాన్యాన్ని తెలుసుకోవడానికి యువత, ముఖ్యంగా తొలిసారి ఓటేసే యువతరం పోలింగ్ కేంద్రాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో హర్యానాలో 70 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కనీసం 75 శాతాన్ని టార్గెట్‌గా పెట్టుకున్నారట!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇస్తినమ్మా తాంబూలం.. వస్తినమ్మా ఓటింగ్‌కు!

ఛత్తీస్‌గఢ్‌లో వినూత్న కార్యక్రమం | అదే బాటన జార్ఖండ్, ఒడిశా!

లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు దేశవ్యాప్తంగా వినూత్నమైన కార్యక్రమాలెన్నో జరుగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో బలరామ్‌పూర్ జిల్లా స్వయం సహాయక మహిళా సంఘాలు చేసిన 'సంప్రదాయ' కృషి వీటన్నింట్లో ఎంతో ఆసక్తికరం. మూడో దశలో భాగంగా ఈ నెల 7న రాష్ట్రంలో ఏడు లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. బలరామ్‌పూర్ జిల్లాలోని సర్గుజా లోక్‌సభ స్థానంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు చింతాకులు, అక్షితలు అందించారు. తప్పకుండా ఓటేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. స్థానిక సంప్రదాయాలను ఇలా వినూత్నంగా వాడుకున్న తీరు అందరినీ ఆకర్షించింది. 'చింతాకులు, అక్షితలు అందించడం మా సంస్కృతిలో భాగం. పెళ్లిళ్లకు, మా సంఘం కార్యక్రమానికి ఇలాగే ఆహ్వానిస్తాం. అదే పద్ధతిలో విధిగా ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాం. దీనికి స్పందన కూడా చాలా బాగా వచ్చింది'' అని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యురాలు విమలా సింగ్ హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించినట్టు జిల్లా నోడల్ అధికారి రైనా జమీల్ పేర్కొన్నారు. ఓటర్లను ఇలా వినూత్నంగా పోలింగ్ బూత్‌లకు తరలాల్సిందిగా కోరిన తీరు పొరుగు రాష్ట్రాలైన జార్ఖండ్, ఒడిశాలను కూడా ఆకట్టుకుంది. ఆ రాష్ట్రాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం మే 13న నాలుగు విడతలో మొదలై జూన్ 1న ఏడో విడత దాకా కొనసాగనుంది. అక్కడ కూడా ఇలా ఓటర్లను సంప్రదాయ పద్ధతిలో ఓటేసేందుకు ఆహ్వానించాలని పలు జిల్లాల ఎన్నికల అధికారులు భావిస్తున్నారు. అందుకోసం ఇప్పటినుంచే ఏర్పాట్లు కూడా చేస్తున్నారట!



- సాక్షి, నేషనల్ డెస్క్


బీజేపీకి సవాళ్లు

మధ్యప్రదేశ్‌లో 8 స్థానాలకు 13న పోలింగ్
అన్నీ బీజేపీ సిట్టింగ్ స్థానాలే
ఇండోర్‌లో కాంగ్రెస్‌కు షాక్

నాలుగో విడతలో భాగంగా మధ్యప్రదేశ్‌లో ఎనిమిది లోక్‌సభ స్థానాలకు ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. దీంతో రాష్ట్రంలో పోలింగ్ ప్రక్రియ ముగియనుంది. 29 స్థానాల్లో మూడు విడతల్లో 21 సీట్లకు ఎన్నిక ముగిసింది. 2019లో బీజేపీ ఏకంగా 28 సీట్లు సొంతం చేసుకోగా కాంగ్రెస్ ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. ఈసారి మాత్రం బీజేపీకి గట్టి పోటీ ఇస్తోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇండోర్



శంకర్ లల్వానీ

పోలింగ్‌కు ముందే ఇక్కడ కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. పార్టీ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ నామినేషన్ ఉపసంహరించుకుని బీజేపీలో చేరిపోయారు! దాంతో బీజేపీ సిట్టింగ్ ఎంపీ శంకర్ లల్వానీ విజయం ఖాయమైపోయింది. కంగుతిన్న కాంగ్రెస్ ఇక్కడ నోటాకు ఓటేయాలంటూ ప్రజలకు పిలుపునిస్తోంది! ఎందుకంటే ఇక్కడ బరిలో ఉన్న 14 మంది అభ్యర్థుల్లో కాంగ్రెస్ మద్దతివ్వడానికి స్వతంత్రులెవరూ లేరు. మధ్యప్రదేశ్ వాణిజ్య రాజధాని అయిన ఇండోర్ బీజేపీ కంచుకోట. 35 ఏళ్ల నుంచి ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. 1989 నుంచి 2014 దాకా లోక్‌సభ మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్ గెలుస్తూ వచ్చారు. ఎన్నికల వేళ ముగ్గురు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలతో పాటు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు కూడా బీజేపీలో చేరారు. ఇక్కడ ఫలితం యువత చేతుల్లోనే ఉంది. 30–39 ఏళ్ల ఓటర్లు 6.71 లక్షలు, 20–29 వయసు వారు 5.26 లక్షల మంది, తొలిసారి ఓటర్లు 62,000 మంది ఉన్నారు.

ఉజ్జయిని



మహేశ్ పర్మార్

ఈ ఎస్సీ స్థానంలో గత రెండు ఎన్నికల నుంచి బీజేపీదే విజయం. 2014లో ప్రొఫెసర్ చింతామణి మాలవీయ, అనంతరం 2019లో అనిల్ ఫిరోజియా మూడున్నర లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచారు! ఫిరోజియాపై కాంగ్రెస్ నుంచి మహేశ్ పర్మార్ తలపడుతున్నారు. బీజేపీ ప్రధానంగా ఇంటింటి ప్రచారాన్నే నమ్ముకుంది. మరోవైపు పర్మార్ మాత్రం ప్రసిద్ధ క్షిప్రా నది కాలుష్యంపై వినూత్న తరహాలో నిరసన చేపట్టారు. నదిలో కలుస్తున్న మురుగునీటి ప్రవాహంలో కూర్చోవడమే గాక అందులో మునకలు వేశారు. కాలుష్యం నుంచి నదిని రక్షించేందుకు తుదికంటా పోరాడతానని ప్రకటించారు. ఇందుకు నియోజకవర్గ ప్రజల నుంచి మంచి స్పందన కూడా వస్తుండటం విశేషం.


ధార్



సావిత్రి ఠాకూర్

ఈ ఎస్టీ స్థానం నుంచి బీజేపీ తరఫున సావిత్రి ఠాకూర్ బరిలో ఉన్నారు. ఆమె 2014లోనూ బీజేపీ అభ్యర్థిగా ఇక్కడ గెలిచారు. కాంగ్రెస్ నుంచి రాధేశ్యామ్ మువెల్ పోటీ చేస్తున్నారు. మువెల్‌ను మార్చాలని ఓ దశలో పార్టీ భావించినా చివరికి ఆయన్నే కొనసాగించింది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో 8 అసెంబ్లీ స్థానాల్లో ఐదింట కాంగ్రెసే గెలిచింది. దాంతో ఈసారి బీజేపీ గెలుపు సునాయాసంగా కన్పించడం లేదు. అందుకే సిట్టింగ్ ఎంపీని కాదని సావిత్రికి బీజేపీ టికెటిచ్చింది. రాహుల్‌గాంధీ, ప్రధాని మోదీ ఇప్పటికే ఇక్కడ ప్రచారం చేశారు.

ఖాండ్వ



నరేంద్ర పటేల్

ఎన్నికల సంఘం రెడ్ అలెర్ట్ ప్రకటించిన స్థానమిది. 11 మంది అభ్యర్థుల్లో నలుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. వారిలో బీజేపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి నరేంద్ర పటేల్ కూడా ఉన్నారు! 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి నందకుమార్ సింగ్ చౌహాన్ విజయం సాధించారు. 2021లో ఆయన కరోనాతో మరణించారు. ఉప ఎన్నికలో బీజేపీ నేత జ్ఞానేశ్వర్ పాటిల్ గెలిచారు.

చరిత్ర సృష్టించిన బామ్మ

ధార్ నియోజకవర్గం పరిధిలోని 113 ఏళ్ల బామ్మ ఇంటి నుంచే తన ఓటు హక్కు వినియోగించుకుని చరిత్ర సృష్టించింది. ఏకల్‌దున గ్రామానికి చెందిన భవార్ బాయి ఇంటి నుంచే ఓటు వేసేందుకు ముందే దరఖాస్తు చేసుకోవడంతో.. అధికారులు ఆమె ఇంటికి వెళ్లి ఇందుకు అవకాశం కల్పించారు. ఈ నియోజకవర్గ పరిధిలో 85 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న 900 మంది ఓటర్లు, 343 మంది దివ్యాంగులు సైతం ఇంటి నుంచి ఓటేశారు. అంజేరా గ్రామానికి చెందిన సాఫియాన్ జుల్ఫికర్ హుస్సేన్ అనే 109 ఏళ్ల వృద్ధుడు కూడా ఈ జాబితాలో ఉన్నారు.

దేవాస్



రాజేంద్ర మాలవీయ

దేవాస్ లోక్‌సభ స్థానంలో ఈసారి భిన్నమైన రాజకీయ వాతావరణం నెలకొంది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ మహేంద్రసింగ్ సోలంకి (40) మరోసారి బరిలో ఉన్నారు. ఆయన సివిల్ జడ్జి పదవికి రాజీనామా చేసి మరీ 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి, పద్మశ్రీ గ్రహీత, ప్రముఖ జానపద గాయకుడు ప్రహ్లాద్ సింగ్ తిపానియా (65)పై ఘన విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్ నుంచి రాజేంద్ర మాలవీయ పోటీ చేస్తున్నారు. ఇక్కడ 2014లోనూ బీజేపీయే గెలిచింది. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు.

నికమ్ వర్సెస్ వర్షా

ముంబై నార్త్ సెంట్రల్‌లో టఫ్ ఫైట్ ● హ్యాట్రిక్ కోసం బీజేపీ, పట్టు కోసం కాంగ్రెస్

ముంబై నార్త్ సెంట్రల్. మినీ ముంబైగా పేరొందిన లోక్‌సభ స్థానం. ఆకాశాన్నంటే హర్మ్యాలతోపాటు మురికివాడలు ఇక్కడి ప్రత్యేకత. సెలబ్రిటీలతో పాటు వలస కార్మికులకూ నివాస స్థానం. మే 20న ఐదో విడతలో ఇక్కడ పోలింగ్ జరగనుంది. బీజేపీ నుంచి ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, కాంగ్రెస్ నుంచి పార్టీ ముంబై చీఫ్ వర్షా గైక్వాడ్ బరిలో ఉన్నారు. గత రెండుసార్లూ గెలిచిన బీజేపీ హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తుండగా, తిరిగి పట్టు సాధించేందుకు కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతోంది...



రాజ్యాంగ రక్షణ పోరాటం

ముంబై నార్త్ సెంట్రల్ కాంగ్రెస్ అభ్యర్థి వర్షా గైక్వాడ్ తండ్రి ఏక్‌నాథ్ గైక్వాడ్ గతంలో ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో కలిసి వర్ష ప్రచారం ప్రారంభించారు. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించిన శివసేన సభ్యులు పార్టీలో చీలిక తర్వాత ఉద్ధవ్ వెంటే ఉండటం కలిసొచ్చే అంశమని వర్షా అంటున్నారు. "ముంబై నార్త్ సెంట్రల్ తొలినుంచీ కాంగ్రెస్ కంచుకోట. ఈసారి నా విజయాన్ని పార్టీకి కానుకగా అందిస్తా" అని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వలస ప్రజల నిలయం...

ముంబై 'మినీ ఇండియా' అయితే ముంబై నార్త్ సెంట్రల్ లోక్‌సభ స్థానం 'మినీ ముంబై'. ఇందులో విలేపార్లే, చండీవలి, బాంద్రా, కలీనా, కుర్లా వంటి ప్రాంతాలున్నాయి. బాంద్రా, ఖర్‌లలో సినీ తారలు, ప్రముఖులు నివసిస్తారు. కుర్లాలో వలస కుటుంబాలు, కార్మికులు ఎక్కువ. సుమారు 3 లక్షలమంది ఉత్తరాది రాష్ట్రాలవారు, లక్ష మంది దక్షిణాది ప్రజలు, 1.9 లక్షల మంది గుజరాత్, రాజస్థాన్ వాసులు నివసిస్తున్నారు. 3 లక్షలకు పైగా ముస్లింలున్నారు. ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు, కాలుష్యం ఇక్కడి ప్రధాన సమస్యలు...

చట్టాలను సవరిస్తా..



ఇక బీజేపీ సిట్టింగ్ ఎంపీ పూనం మహాజన్‌ను పక్కన పెట్టిన మరీ ప్రఖ్యాత లాయర్ ఉజ్వల్ నికమ్‌కు టికెటిచ్చింది. పూనం తండ్రి, బీజేపీ దిగ్గజం ప్రమోద్ మహాజన్ హత్య కేసును వాదించింది ఉజ్వలే కావడం విశేషం! ''ఆ సమయంలో పూనంను దగ్గరగా చూశా. ఇక్కడ రెండుసార్లు గెలిచిన ఆమె ఈసారి నా విజయంలోనూ కీలక పాత్ర పోషిస్తారు'' అని నికమ్ చెబుతున్నారు. 1993 ముంబై వరుస పేలుళ్లు, 26/11 ముంబై దాడి వంటి హై ప్రొఫైల్ కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నికమ్ వాదించిన తీరును బీజేపీ ప్రచారంలో హైలైట్ చేస్తోంది. ''రాజకీయాలు నా సెకండ్ ఇన్నింగ్స్. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఎంతో పురోగతి సాధించింది. అదే నన్ను గెలిపిస్తుంది'' అని నికమ్ ధీమాతో ఉన్నారు. ''ప్రజల కోసం మేలైన చట్టాలను రూపొందించడానికి కృషి చేయాలనుకుంటున్నా. పారిపోయిన నేరగాళ్లను భారత్‌కు తీసుకువచ్చేలా అప్పగింత చట్టాలను సవరించాలనుకుంటున్నా'' అని చెబుతున్నారు. వంచిత్ బహుజన్ అగాడీ, మజ్లిస్ అభ్యర్థులు కూడా ముంబై నార్త్ సెంట్రల్‌లో పోటీలో ఉన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

జైత్రయాత్ర 2024

58.22 లక్షలు

ఇది రాష్ట్రంలో ఐదేళ్లలో ఉద్యోగాలు, ఉపాధి పొందిన వారి సంఖ్య

ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలోనే **2.31** లక్షల ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగాలు

తొలి 4 నెలల్లోనే **1.35** లక్షల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకం

- కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా **28.92** లక్షల ఉద్యోగాలు
- ఇందులో భారీ పరిశ్రమల ద్వారా **6.85** లక్షలు.. ఎంఎస్ఎంఈల ద్వారా **22.07** లక్షలు
- విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ద్వారా **4.51** లక్షల మందికి ఉద్యోగాలు
- 'వైఎస్సార్ చేయూత' ద్వారా **18.34** లక్షల మందికి స్వయం ఉపాధి
- సొంత రాష్ట్రంలోనే ఉద్యోగాలు, ఉపాధితో యువత సంతోషం



బాబు హయాంలో ఉద్యోగుల వివరాలు	
2014-19 మధ్య	32,108
బాబు దిగిపోయే మే 2019 నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య	3,97,128

వైఎస్ జగన్ హయాంలో..	
2019 జూన్ నుంచి ఇప్పటిదాకా శాశ్వత ఉద్యోగాల భర్తీ	2,31,003
కాంట్రాక్టు ఉద్యోగాలు	43,923
ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగాలు	3,73,161
మొత్తం ఉద్యోగాల సంఖ్య	6,48,087

సాక్షి, అమరావతి : రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి కల్పనలో రికార్డు సృష్టించింది. ఐదేళ్ల క్రితం వరకు చదువు పూర్తి చేసుకున్న యువత ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాల కేసి చూసే పరిస్థితి. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో 58.22 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడమే ఇందుకు నిదర్శనం. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా వైఎస్ జగన్ సీఎంగా పదవి చేపట్టిన కేవలం నాలుగు నెలల కాలంలోనే గ్రామ వార్డు సచివాలయాల్లో 1,35,110 శాశ్వత ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేసి రికార్డు సృష్టించారు. వైద్య ఆరోగ్య రంగంలో 54 వేల పోస్టులను భర్తీ చేశారు. చంద్రబాబు నాయుడు ఐదేళ్ల కాలంలో కేవలం 32,108 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తే, సీఎం జగన్ 2.31 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. అదే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, వలంటీర్లను కలుపుకుంటే ప్రభుత్వ రంగంలో 6,48,087 మందికి ఉద్యోగాలు కల్పించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో నుంచి దిగిపోయే నాటికి 3.97 లక్షల మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారంటే ఏ స్థాయిలో ఉద్యోగ కల్పన జరిగిందో ఇట్టే తెలుస్తోంది. తాను అధికారంలోకి వస్తే కోటి ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు 1999 మేనిఫెస్టోలో చెప్పారు. 2014లో ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం.. ఉద్యోగం రాకపోతే ఒక్కొక్కరికి నెలకు రూ.2,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి, ఇవ్వకుండా మోసం చేశారు. ఈ పరిస్థితిలో 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్.. రాష్ట్రంలో చదువుకున్న యువత ఇక్కడే ఉద్యోగం చేయాలన్న ఏకైక లక్ష్యం దిశగా వేగంగా అడుగులు వేశారు. అందుకే ప్రభుత్వ రంగం కంటే నాలుగు రెట్లు అధికంగా ప్రైవేటు రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించగలిగారు.

నైపుణ్య శిక్షణతో ఉద్యోగాలు

- రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకే ఉద్యోగావకాశాలు ఇవ్వాలన్న చట్టం తీసుకురావడమే కాకుండా దానికి అనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నైపుణ్య శిక్షణలో సంస్కరణలను అమలు చేస్తున్నారు. అంతర్జాతీయంగా నైపుణ్య శిక్షణ అంటే ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
- వృత్తి, సాంకేతిక విద్యలను ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) పరిధిలోకి తీసుకొస్తూ నైపుణ్య శిక్షణను అందిస్తోంది. ఎంఎస్ఎంఈలకు అవసరమైన నైపుణ్య శిక్షణ దగ్గర నుంచి అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమైన నిపుణులైన మానవ వనరులు అందించేందుకు వీలుగా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసింది. ఎంఎస్ఎంఈలకు అవసరమైన నైపుణ్య శిక్షణను అందించడానికి ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో స్కిల్ హబ్స్.. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడానికి ప్రతీ పార్లమెంట్ పరిధిలో స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది.
- 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం ఒకటి ఉండే విధంగా మొత్తం 192 స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ లెవల్–4 లోపు కోర్సుల్లో శిక్షణనిస్తారు. అలాగే, ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటికి తక్కువ కాకుండా మొత్తం 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది. హై ఎండ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వడానికి తిరుపతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు అందుకునే విధంగా స్కిల్ ఇంటర్నేషనల్ పేరుతో ప్రత్యేక శిక్షణనిస్తోంది. ఇందుకోసం పలు పరిశ్రమలు, విదేశీ సంస్థలతో ఒప్పందం చేసుకుని నైపుణ్య శిక్షణ కోర్సులను ఏపీఎస్ఎస్‌డీసీ అందిస్తోంది. ఈ చర్యలతో నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులు 4.51 లక్షల మందికి పలు కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ లభించాయి.

వైఎస్సార్ చేయూతతో స్వయం ఉపాధి

- దేశంలోనే ఇప్పటిదాకా ఏ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టని విధంగా మధ్య వయస్సు ఉండే పేదింటి మహిళలకు చేయూతను అందించడం ద్వారా కుటుంబ భారం భరించడంలో కొంత అనుభవం ఉండే ఆ మహిళలు ప్రభుత్వం అందజేసే ప్రతి రూపాయి సద్వినియోగం చేసుకుంటారనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్.. వైఎస్సార్ చేయూత పేరుతో వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నారు. 45–60 ఏళ్ల మధ్య వయస్సు ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు వరుసగా నాలుగేళ్ల పాటు ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున ఈ పథకం ద్వారా రూ.75 వేలు అందజేసింది.
- ఈ మహిళలు ప్రభుత్వం అందించిన లబ్ధి ద్వారా శాశ్వత జీవనోపాధి కల్పించుకుంటూ వివిధ వ్యాపార, వృత్తులలో పెట్టుబడులు పెట్టుకునేలా హిందూస్థాన్ యూనీ లీవర్, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్, ఐటీసీ, రిలయెన్స్, అమూల్, అజియో వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.
- ఆయా కంపెనీలు ఆ పేద మహిళలకు అవసరమైన శాశ్వత జీవనోపాధుల కల్పనలో తమ వంతు తోడ్పాటు అందించాయి. ప్రభుత్వ లక్ష్యం కూడా ఆశించిన దానికన్నా గొప్పగానే నెరవేరింది. గత నాలుగేళ్ల కాలంలో ఏకంగా రాష్ట్ర వ్యాప్తంగా 18.34 లక్షల పేద కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రతి నెలా కచ్చితమైన ఆదాయం పొందేలా శాశ్వత జీవనోపాధులు ఏర్పాటు చేసుకోగలిగాయి.

పారిశ్రామిక రంగం ద్వారా 28.92 లక్షల ఉద్యోగాలు

- గతంలో ఎన్నడూ లేని విధంగా పారిశ్రామిక దిగ్గజ గ్రూపులు టాటాలు, బిర్లాలు, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్‌లతో పాటు విదేశీ సంస్థలు సైతం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. దీనికితోడు సీఎం వైఎస్ జగన్ అత్యధికంగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగానికి పెద్ద పీట వేశారు. ఫలితంగా గడచిన ఐదేళ్లలో పారిశ్రామిక రంగంలో 28.92 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయి. ఇందులో భారీ పరిశ్రమల ద్వారా 6.85 లక్షల ఉద్యోగాలు వస్తే ఎంఎస్ఎంఈల ద్వారా 22.07 లక్షల ఉపాధి కల్పన లభించింది.
- ఉత్తరాంధ్రలోని అచ్యుతాపురం వద్ద జపాన్‌కు చెందిన యకహోమా టైర్స్ (అలయన్స్ టైర్స్ గ్రూపు), అదానీ డేటా సెంటర్, ఇన్ఫోసిస్, రాండ్‌స్టాడ్, లారస్ ల్యాబ్ వంటి దిగ్గజ సంస్థలు, విజయనగరంలో శారదా మెటల్స్ ఉత్పత్తిని ప్రారంభించాయి. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోస్తాంధ్రలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బలభద్రపురంలో ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిం ఇండస్ట్రీస్, కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద పెన్సులిన్ తయారీ సంస్థ లూపిస్ ఫార్మా, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఐటీసీ స్పైసెస్ పార్కు, పిడుగురాళ్ల వద్ద శ్రీ సిమెంట్స్, నెల్లూరు జిల్లాలో ఇండోసోల్ సోలార్ ప్యానల్స్ తయారీ, క్రిభ్‌కో ఇథనాల్, గ్రీన్‌లామ్ సొల్యూషన్స్, గోకుల్ ఆగ్రో ప్రారంభం అయ్యాయి.
- రాయలసీమలోని చిత్తూరులో బ్లూస్టార్, డైకిన్, హావెల్స్, యాంబర్, ఎస్‌జీసీ ట్రాన్స్‌మిషన్స్, టీసీఎల్, వైఎస్సార్ జిల్లాలో డిక్సన్, సెంచురీ ప్లైవుడ్స్, బిర్లా గార్మెంట్స్, కర్నూలు జిల్లాలో రాంకో సిమెంట్స్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్ వంటి భారీ పెట్టుబడులు వచ్చాయి.
- గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల సంఖ్య 1,93,530గా ఉంటే అది ఇప్పుడు ఏడు లక్షలు దాటింది. ఈ ఐదేళ్లలో కొత్తగా ఏర్పడిన ఎంఎస్ఎంఈల ద్వారా 22.07 లక్షల మందికి ఉపాధి లభించింది. ఐటీ రంగంలో ఇన్ఫోసిస్, రాండ్‌స్టాడ్ బీఈఎల్, విప్రో వంటి దిగ్గజ ఐటీ కంపెనీలను రాష్ట్రం ఆకర్షించింది. చంద్రబాబు దిగిపోయేనాటికి 27,643 మంది ఐటీ ఉద్యోగులు ఉంటే గత ఐదేళ్లలో ఈ సంఖ్య 75,551 దాటిందంటే ఏ స్థాయిలో ఉద్యోగ కల్పన జరిగిందో ఇట్టే తెలుస్తోంది.

పెరిగిన పీఎఫ్ ఖాతాలే సాక్ష్యం

- రాష్ట్రంలో భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయనడానికి భారీగా పెరిగిన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ ఖాతాలే సజీవ సాక్ష్యం. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 2018–19లో రాష్ట్రంలో 44,85,974 పీఎఫ్ ఖాతాలు ఉంటే అవి 2022–23 నాటికి 60.73 లక్షలకు చేరుకున్నాయి. అంటే నాలుగేళ్లలోనే రాష్ట్రంలో పీఎఫ్ ఖాతాల సంఖ్య 15.88 లక్షలకు పెరిగాయి.
- 2023–24 గణాంకాలు కూడా అందుబాటులోకి వస్తే ఈ సంఖ్య మరింత పెరగనుంది. ఇదే సమయంలో జాతీయ స్థాయిలో 2018–19లో 22.91 కోట్లుగా ఉన్న పీఎఫ్ ఖాతాలు 2022–23 నాటికి 29.88 కోట్లకు చేరుకున్నాయి. జాతీయ స్థాయిలో ఐదేళ్లలో 30.38 శాతం ఖాతాలు పెరిగితే మన రాష్ట్రంలో 35 శాతం పైన పెరిగాయి. అంటే జాతీయ స్థాయి కన్నా మన దగ్గరే పీఎఫ్ ఖాతాల పెరుగుదల ఎక్కువగా ఉంది.
- ఇదే సమయంలో పక్కనున్న తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్లలో 31 శాతం, కర్ణాటకలో 32 శాతం, తమిళనాడు, పుదుచ్చేరిలో 27 శాతం మేర ఖాతాలు పెరిగాయి. ఓ వైపు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల భర్తీ చేపడుతూనే మరో వైపు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమల ఏర్పాటుకు సీఎం జగన్ ప్రభుత్వం పెద్ద పీట వేయడమే ఈ వృద్ధికి కారణం. ఈ గణాంకాలు రాజ్యసభ సాక్షిగా కేంద్ర కార్మిక శాఖ మంత్రి ఇచ్చినవే.

గుసగుస

పులుసు కారుతోంది



ఫేస్ ఈజ్ ద ఇండెక్స్ ఆఫ్ మైండ్.. అని ఆంగ్ల నానుడి. నాలుగైదు రోజులుగా పిఠాపురం కూటమి అభ్యర్థి పవన్‌కల్యాణ్ ముఖాన్ని చూస్తే.. ఆయన పరిస్థితి ఏంటన్నది తెలిసిపోతోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓటమి భయం పవన్‌ను నిలువెల్లా వణికిస్తోందట. టీడీపీ నేత వర్మ అనుచరులు పవన్‌కు సహకరించేది లేదని ఇప్పటికే వీడియోల ద్వారా సోషల్ మీడియాలో మోతెక్కిస్తున్నారు. మరోవైపు మహాసేన రాజేష్ కూడా జనసేన ఓటమే లక్ష్యంగా తమ సామాజికవర్గానికి పిలుపునిచ్చారు. ఇదంతా టీడీపీ అధినేత చంద్రబాబు ఆడిస్తున్న నాటకమని పవన్ అభిమానుల ఆరోపణ. పవన్‌ను ఎదగనిస్తే లోకేశం రాజకీయ భవిష్యత్తుకు గుదిబండలా మారతారన్న భయంతోనే ఇదంతా చేస్తున్నట్లు ఆక్రోశిస్తున్నారు. అందుకే చిరంజీవితో సహా పవన్ తన కుటుంబాన్ని, బుల్లితెర, సినీ పరిశ్రమలో తన అనుయాయుల్ని బతిమాలి మరీ ఎన్నికల ప్రచారంలోకి దించారట.

గ్లాస్ గుచ్చుకుంది



విశాఖ ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజుకు గ్లాసు గుర్తు గట్టిగానే గుచ్చుకుంటోందట. ఇప్పటికే జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ తన ఓట్లనే చీల్చుతారని తెగ ఇదైపోతున్నారట. దీనికి గ్లాసు గుర్తు తోడు కావడంతో భయపడ్డ ఆయన, గ్లాస్ గుర్తు దక్కిన స్వతంత్ర అభ్యర్థి ఇంటికెళ్లి మరీ బతిమాలుకున్నారట. తను గెలిచాక అధిక మొత్తం ముట్టజెప్తానని హామీ ఇచ్చారట. అయి తే 2014లో ఆయన తీరు గుర్తుకొచ్చి, తక్షణ బేరం మాట్లాడుకున్నారట. కాస్త 'భారీ'స్థాయిలో బతిమాలుకున్నాకే ఆ అభ్యర్థి వెనక్కి తగ్గినట్లు పార్టీ శ్రేణులు చెప్తున్నాయి. ఏది ఏమైనా ఈసారి పరువు తప్ప, అధికారం మాత్రం దక్కదన్న నమ్మకానికొచ్చేశారట..!

మరిన్ని కథనాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బాబు–మోదీ ఇద్దరూ తోడు దొంగలే



- రూ.22,400 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. ఏడాదికి రూ.50 కోట్లు కేటాయింపు
- ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ సీమ, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసిన బాబు
- 'ప్యాకేజీ' అంటూ మాటమార్చి రాయలసీమ అభివృద్ధిని బలిచేసిన వైనం
- ఇవన్నీ మరిచి ఇప్పుడు మళ్లీ జట్టు కట్టిన బాబు, మోదీ
- హోదాపై ఒక్క మాట మాట్లాడకుండా ప్రధాని రాష్ట్ర పర్యటన

ఎన్నికల సాక్షిగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ప్రధాని మోదీ ఇద్దరూ తోడు దొంగలేనని స్పష్టమైంది. ప్రత్యేక హోదా ఇస్తామని 2014లో టీడీపీ, బీజేపీలు జట్టుకట్టి.. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజల్ని మోసగించారు. హోదాను అటకెక్కించారు. హోదా వస్తే రాయలసీమ భవిత బంగారం అవుతుందనుకున్న ఆ ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. ప్రత్యేక ప్యాకేజీ అంటూ కొత్త రాగం అందుకున్న చంద్రబాబు హోదాను మోదీకి తాకట్టు పెట్టారు. 2019 ఎన్నికల ముందు కేంద్రం మోసం చేసిందంటూ దొంగ ఏడుపులు ఏడ్చారు.

ఇప్పుడు మళ్లీ ఎన్డీఏ కూటమిగా జట్టుకట్టిన ఆ రెండు పార్టీలు మళ్లీ రాయలసీమ ప్రజల్ని మోసగిస్తున్నాయి. ప్రధాని బుధవారం రాయలసీమలో ఎన్నికల ప్రచారానికి వచ్చి, ఆ ప్రాంత అభివృద్ధి గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ప్రత్యేక హోదాపై, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీపై మోదీని బాబు కనీసం ప్రశ్నించలేదు. హోదా ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందని అప్పుడు గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. ఇప్పుడు మోదీతో కలిసి ప్రచారానికి ఎలా వచ్చారని రాయలసీమ వాసులు ప్రశ్నిస్తున్నారు.

హోదాను తాకట్టు పెట్టి..రాయలసీమకు బాబు తీరని ద్రోహం
బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అమలులోనూ మోసం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించారు. గుండెకాయ లాంటి రాజధాని పోయింది. హైదరాబాద్‌ను కోల్పోవడంతో కనీసం ప్రత్యేక హోదా ఇస్తే పరిశ్రమల స్థాపన వేగం పుంజుకుని రాష్ట్రం గాడిన పడుతుందని రాష్ట్ర ప్రజలు భావించారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయంపై మొరపెట్టుకుంటే ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని ఆనాడు పార్లమెంటు సాక్షిగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ హామీనిచ్చారు. ప్రత్యేక హోదా వస్తే.. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలో పరిశ్రమలు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే రాష్ట్ర ప్రజల ఆశల్ని చంద్రబాబు.. కేంద్రం వద్ద తాకట్టుపెట్టి తన స్వార్థం చూసుకున్నాడు. చివరికి ప్రత్యేక ప్యాకేజీ కూడా లేకుండా చేసి రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలను మోసగించారు. 'ప్రత్యేక హోదా సంజీవని కాదు. హోదాతో ఏం మేలు జరుగుతుంది. అంతకంటే ప్యాకేజీతోనే మేలు.. అవగాహన లేనివాళ్లే హోదా గురించి మాట్లాడుతున్నారు' అని 2017లో అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు, చంద్రబాబు వ్యాఖ్యానించడం అందరికీ గుర్తుండే ఉంటుంది. 2014లో కేంద్రంలో టీడీపీ మిత్రపక్షం బీజేపీ అధికారంలో ఉండడంతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని అంతా ఆశపడ్డారు. ఆ సమయంలో కేంద్రంపై ప్రత్యేక హోదా కోసం ఒత్తిడి తేవాల్సిన చంద్రబాబు పూర్తిగా కేంద్రానికి లొంగిపోయారు. హోదాతో ఒరిగేదేమీ లేదని, ప్యాకేజీతో అంతకంటే మేలు జరుగుతుందని కొత్తపల్లవి ఆలపించారు. అతన్ని వ్యతిరేకించిన వారిని జైల్లో పెడతానని బెదిరించారు.

సీమకు తీరని అన్యాయం

రాయలసీమలో 69 శాతం భూమి సాగు ప్రాంతం కాగా.. మిగతా 31 శాతం భూమి పరిశ్రమల స్థాపనకు అనుకూలం.

1. పరిశ్రమల స్థాపనకు తక్కువ ధరలో భూములు అందుబాటులో ఉన్నాయి. 2. సమీపంలో బెంగళూరు, కర్నూలు, కడప, తిరుపతి ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. 3. ఎగుమతులు, దిగుమతులకు చెన్నై, గోవా, కృష్ణపట్నం పోర్టులు అందుబాటులో ఉన్నాయి. 4. కృష్ణా, తుంగభద్ర నదుల్లో పుష్కలంగా నీరు ఉంది. హంద్రీ–నీవాతో వైఎస్సార్ రిజర్వాయర్లు నిర్మించారు.

పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో అనుకూల పరిస్థితులు ఉన్నాయి. 'హోదా' వచ్చుంటే 'సీమ' రూపురేఖలే మారిపోయేవి. 'సీమ' అభివృద్ధితో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కేవి. నిజానికి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలో కొన్ని సిమెంట్ ఫ్యాక్టరీలు, గరుడ స్టీల్స్, కియా మినహా పరిశ్రమల జాడ లేదు. ఇవి మినహా 2019 వరకూ వెయ్యి మంది ఉద్యోగులు పనిచేసే ఒక్క పరిశ్రమ కూడా లేదు. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో గ్రీన్‌కో రూ.15 వేల కోట్ల పెట్టుబడితో ప్రపంచంలోనే అతి పెద్ద రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంటు నిర్మిస్తోంది. దీంతో 25 వేల ఉద్యోగాలు రానున్నాయి.

బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలోనూ మోసమే..

విభజన చట్టంలో రాయలసీమతో పాటు వెనుకబడిన ఉత్తరాంధ్రలోని 3 జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని విభజన చట్టంలో 46(ఏ), 46(బి)లో పేర్కొన్నారు. ఈ లెక్కన రూ.22,400 కోట్లు ఈ ప్రాంతాలకు 2014–19లో మంజూరు చేయాలి. సెక్షన్ 46లో బుందేల్‌ఖండ్ అనే మాట తీసేసి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ పేరుతో జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున ఏటా రూ.350 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఈ విషయంలో కూడా బాబు కేంద్రంతో రాజీపడ్డారు.

అపారమైన ఖనిజం 'సీమ' సొంతం

రాయలసీమలో డోలమైట్, ఐరన్‌ఓర్, గ్రానైట్, యురేనియం, సిలికా, బెరైటీస్, లైమ్‌స్టోన్, క్వార్ట్జ్‌తో పాటు ఎన్నో విలువైన ఖనిజ నిక్షేపాలున్నాయి. రామగిరి, జొన్నగిరి ప్రాంతంలో గోల్డ్ మైన్స్, వజ్రకరూర్, తుగ్గలి మండలాల్లో వజ్ర నిక్షేపాలున్నాయి. ప్రత్యేక హోదా వచ్చి ఉంటే సీమలో ఖనిజ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటయ్యేవి. తాడిపత్రి, బేతంచెర్ల, కొలిమిగుండ్లలో నాపరాయి గనులు ఉండడంతో సిమెంట్ పరిశ్రమల స్థాపన పెరిగేది.

హోదాతో వ్యవసాయ పరిశ్రమలకూ ఊతం

'సీమ'కు హంద్రీ–నీవాతో ఏటా 40 టీఎంసీల జలాలు వస్తాయి. దీంతో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఎక్కువ స్థాపించే అవకాశం ఉంది. వేరుశనగ, పత్తి, పొద్దుతిరుగుడుతో పాటు హార్టికల్చర్ అభివృద్ధి చెందిన ప్రాంతం ఇది. ఆపిల్ మినహా అన్ని రకాల పంటలు పండిస్తున్నారు. దీంతో ప్రాసెసింగ్ ప్లాంటు, కాటన్ పరిశ్రమలు, చీనీ జ్యూస్ తయారీ పరిశ్రమ, వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లతో పాటు వ్యవసాయ, ఉద్యానపంటల ఆధారిత పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉంది.

మానవ వనరులు పుష్కలం

రాయలసీమలో జేఎన్‌టీయూతో పాటు ఎస్కేయూ, ఎస్వీ, రాయలసీమ, యోగి వేమన విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటితో పాటు పుట్టపర్తి సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఉంది. ఈ వర్సిటీల ద్వారా ఏటా వేలాదిమంది విద్యార్థులు ఉద్యోగాల వేటలో ఉంటున్నారు. వీరికి వృత్తినైపుణ్య శిక్షణ ఇస్తే పరిశ్రమలకు అవసరమైన మానవవనరులకు ఇబ్బంది ఉండదు.

రాయలసీమకు బాబు ద్రోహం

2014–19 మధ్య కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉంది. చంద్రబాబుతో పాటు టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఏ ఒక్కరు కూడా ఆ ఐదేళ్లలో ప్రత్యేక హోదా వాణి విన్పించలేదు. చంద్రబాబు ఏం చెబితే దానికి సీమకు చెందిన ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తలూపారు. 'సీమ' భవిష్యత్తును బలిపెట్టారు. హోదా వస్తే పరిశ్రమలు స్థాపించిన వారికి మేలు జరుగుతుంది, నిధుల స్వాహాకు అవకాశం తక్కువ! ప్యాకేజీ వస్తే అంతా స్వాహా చేయొచ్చు! ఇదే సూత్రాన్ని చంద్రబాబు నమ్మి హోదాను కేంద్రం ముందు తాకట్టుపెట్టి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు.

ఆ నా కొడుకులకు జీతాలివ్వడానికా జనం ట్యాక్సులు కట్టేది?

నువ్వు చెప్పేవన్నీ ముమ్మాటికీ నిజాలే

2019 ఎన్నికల సమయంలో ఏబీఎన్ రాధాకృష్ణ, చంద్రబాబుల సంభాషణ

- ఉద్యోగుల గురించి నీచంగా మాట్లాడిన రాధాకృష్ణ
- సీఎం హోదాలో సమర్థించిన చంద్రబాబు.. ఉద్యోగులకు చంద్రబాబు ఎప్పుడూ వ్యతిరేకమే



సాక్షి, అమరావతి : ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఇప్పుడు ఎనలేని ప్రేమ ఉన్నట్లు నటిస్తున్న చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వారిని ముప్పు తిప్పలు పెట్టారు. 2019 ఎన్నికల సమయంలో ఒక ఇంటర్వ్యూ సందర్భంగా ఏబీఎన్ చానల్ ఎండీ వేమూరి రాధాకృష్ణ, సీఎంగా ఉన్న చంద్రబాబు అవమానకరంగా మాట్లాడుకుంటున్న వీడియో ఒకటి అప్పట్లో లీకైంది. ఉద్యోగులకు కల్పించాల్సిన ప్రయోజనాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు రాధాకృష్ణ బూతు పురాణం మొదలు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను అవమానించేలా, కించపరుస్తూ మాట్లాడుతుంటే.. చంద్రబాబు ఆస్వాదిస్తూ ఉండిపోయారు. పైగా రాధాకృష్ణ చెప్పినవన్నీ నిజాలేనని కితాబిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగులపై తనకున్న కక్షను పరోక్షంగా చాటుకున్నారు.

లీకైన వీడియోలో వారి సంభాషణ ఇలా..

చంద్రబాబు : ఉద్యోగులకు సెంట్రల్ పీఆర్సీ ఇస్తామని చెప్పాంగానీ...
రాధాకృష్ణ : ఏంది? ఉద్యోగులకు సెంట్రల్ పీఆర్సీనా? మీరందరూ కలిసి రాష్ట్రాన్ని ఎక్కడకు తీసుకెళదామనుకుంటున్నారు? నాన్ ప్లాన్ (ప్రణాళికేతర వ్యయం) ఇప్పటికే తడిసి మోపెడవుతోంది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అంతే. ఇది అంతే. రెండూ ఒకటే. ఆ నా కొడుకులకు (ఉద్యోగులకు) జీతాలివ్వడానికా.. జనం ట్యాక్సులు కట్టేది? అది వద్దు. వద్దే వద్దు. తీసేయండి.
చంద్రబాబు : అదేం కాదు. వాళ్లను కూడా లాగాలి కదా?
రాధాకృష్ణ: సరే అది మీ ఇష్టమనుకోండి. అది వేరే విషయం.
బాబు : కాదు కాదు. నేను చెబుతాను వింటావా? మీరు చెప్పినవన్నీ కరెక్టు. కానీ అధికారం లేకపోతే మనమేమీ చేయలేం. దాని కోసం.. ఇంట్రెస్టింగ్ అంశం చెబుతా. నేను ఎప్పుడూ ప్రజలకు డబ్బులు ఇచ్చేవాడిని కాదు. ఇది నా వ్యక్తిత్వానికి విరుద్ధం. కానీ ఇవ్వకపోతే చేతకానివాణ్ని అనుకుంటారు. ఇటీవల కాలంలో ఏమి చేశానంటే బిగినింగ్లో మరీ డిజాస్టర్స్‌గా ఉన్నప్పుడు (హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చేటప్పుడు) పది వేలిచ్చాను. ఆ తర్వాత అంతెందుకులే అనుకుని రూ.5 వేలిచ్చా. ఆ తర్వాత దాన్ని రూ.2,000 వేలకు తగ్గించా. ఇలా ఇచ్చింది 1,300 మందికే. నేనేమంటానంటే నాలాంటి వాడు కాస్త లిబరల్‌గా కనబడకపోతే చాలా ప్రాబ్లమ్స్ వస్తాయి. ఆ తర్వాత మేనేజ్ చేయడం, ఎడ్యుకేట్ చేయడం ఈజీగా వచ్చేస్తాయి.
రాధాకృష్ణ: ఇప్పుడు అడ్రస్ చేయగలిగింది కూడా ఏమీ లేదులే..
చంద్రబాబు: రుణమాఫీ చేస్తానన్నాను. ఎంత చేస్తాను.. ఎంత మందికి అన్నది తర్వాత డిసైడ్ చేసుకోవచ్చు. ముందు అట్లా చేయాలి.

మహిళలు, వృద్ధులపై దాడులు..

ఘోర పరాజయం ముంగిట బాబు - పవన్ ఆఖరి యత్నాలు.. ప్రశాంతంగా ప్రచారం చేస్తున్న మహిళలపైనా పచ్చమూకల దాడులు

- మంచి చేసిన పార్టీకే ఓటేస్తానన్న వృద్ధుడికి ముప్పాళ్లలో బెదిరింపులు
- నీ అమ్మ మొగుడు..! నీ అమ్మమ్మ మొగుడు..! జగన్‌ను చంపితే ఏమవుతుంది..?
- సీఎం జగన్‌పై అనకాపల్లి, బుచ్చిరెడ్డిపాలెం సభల్లో బాబు బూతు పురాణం
- అదే భాషను అనుకరిస్తూ రెచ్చగొడుతున్న పవన్ కల్యాణ్
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్న టీడీపీ, జనసేన రౌడీలు
- మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి భార్యపై రాళ్లు, సీసాలతో టీడీపీ గూండాల దాడి
- విధుల్లో ఉన్న ఎస్‌ఐపైనా దాడి.. తలకు తీవ్ర గాయం
- నల్లజర్లలో హోంమంత్రి తానేటి వనితపై హత్యాయత్నం
- బనగానపల్లెలో కాటసాని రామిరెడ్డి భార్య, కుమారుడిపై టీడీపీ గూండాల దాడి
- అనంతపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నగేశ్‌పై హత్యాయత్నం



నల్లజర్లలో హోం మంత్రి తానేటి వనిత ఉన్న ఇంటిపై టీడీపీ గూండాలతో కలిసి దాడి చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రాజు



టీడీపీ గూండాల దాడిలో గాయపడిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి, మాజీ ఎంపీపీ చౌడేశ్వరి

సాక్షి, అమరావతి/వెల్దుర్తి/ముప్పాళ్ల/సాక్షి, నరసరావుపేట: రూ.కోట్ల కట్టలు వెదజల్లుతున్నా.. అక్రమ మద్యాన్ని ఏరులై పారిస్తున్నా.. కళ్ల ముందు మరోసారి ఘోర పరాజయం స్పష్టంగా కనిపిస్తుండటంతో కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లో ఫ్రస్టేషన్ (నిరాశ, నిస్పృహ) తార స్థాయికి చేరుకుంది. చివరకు అధికార పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మహిళలపై సైతం దాడులు చేసే స్థాయికి దిగజారిపోవడం వారిద్దరినీ ఆవరించిన నైరాశ్యాన్ని రుజువు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి నీ అమ్మ మొగుడు..! నీ అమ్మమ్మ మొగుడు..! అంటూ ఈనెల 6న అనకాపల్లి సభలో చంద్రబాబు బూతు పురాణం లంకించుకోవడంతో మహిళలంతా నివ్వెరపోయారు. అంతకుముందు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన సభలో.. జగన్‌ను చంపితే ఏమవుతుందంటూ టీడీపీ కార్యకర్తలను చంద్రబాబు రెచ్చగొట్టారు. ఒకపక్క ముఖ్యమంత్రి జగన్ తన ఐదేళ్ల పాలనలో తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలు, మార్పులను ప్రజలకు వివరిస్తూ, వారినుంచే జవాబులు రాబడుతూ ప్రచారం నిర్వహిస్తుండగా మరోపక్క కూటమి నేతలు చంద్రబాబు, పవన్ దాడులు, దుర్భాషలనే నమ్ముకోవడం వారి వ్యక్తిత్వాలకు ప్రతీకగా నిలుస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. పవన్ కళ్యాణ్ సైతం బాబు శైలిని అనుకరిస్తూ వ్యక్తిత్వ హననం, దుర్భాషలకు దిగడం తెలిసిందే. దీంతో టీడీపీ, జనసేన రౌడీ మూకలు పేట్రేగుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలపై ఇనుపరాడ్లు, రాళ్లు, కర్రలతో దాడులకు దిగుతూ హత్యాయత్నాలకు పాల్పడుతున్నాయి.

నల్లజర్ల, మాచర్లలో ముళ్లపూడి, జూలకంటి గూండాయిజం

తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో మంగళవారం రాత్రి ప్రచారం ముగించుకుని పార్టీ నేత వెల్లంకి సుబ్రమణ్యం ఇంట్లో భోజనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనితపై టీడీపీ నేత, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు నేతృత్వంలో టీడీపీ గూండాలు దాడిచేసి హత్యాయత్నానికి తెగబడ్డారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం సిరిగిరిపాడులో బుధవారం ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమాదేవిపై టీడీపీ గూండాలు రాళ్లతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పలువురు మహిళలు సైతం గాయపడ్డారు. ఏడు హత్య కేసుల్లో నిందితుడైన మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఓటమి భయంతో టీడీపీ గూండాలను దాడులకు పురిగొల్పారు.

పచ్చి అవకాశవాదం..

ఎన్నికల్లో సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కోనే సత్తాలేక జనసేనతో జట్టు కట్టి బీజేపీతో కాళ్ల బేరానికి దిగిన చంద్రబాబు దాడులు, హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఇదే కూటమి అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా దగా చేయడం, ఇప్పుడు మళ్లీ జత కట్టటాన్ని ప్రజలు పచ్చి అవకాశవాదంగా గుర్తించారు. మళ్లీ కూటమి ముసుగులో చంద్రబాబు మోసం చేస్తారనే అభిప్రాయం బలంగా నాటుకుపోయింది. దీంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారానికి జన స్పందన కరువైంది. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షాను రప్పించినా ప్రయోజనం కానరాకపోవడంతో ఓటర్లపై ధనాస్త్రాన్ని ఎక్కుపెట్టారు.

నోట్ల కట్టలతో ప్రైవేట్ సైన్యాలు

విదేశాల్లోని తన సామాజిక వర్గానికి చెందిన ఆరు వేల మంది ఎన్నారైలను రప్పించిన చంద్రబాబు వారిని గ్రామాల్లో మోహరించి నోట్ల కట్టలు వెదజల్లుతున్నారు. నెల్లూరు సిటీలో టీడీపీ అభ్యర్థి నారాయణ, విజయవాడ పశ్చిమలో బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, నరసరావుపేట లోక్‌సభ స్థానంలో టీడీపీ అభ్యర్థి కృష్ణదేవరాయలు, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తదితరుల ద్వారా నోట్ల కట్టలతో ప్రైవేట్ సైన్యాలను సమాయత్తం చేశారు. ఎన్నికల అధికారులకు భారీ ఎత్తున పట్టుబడుతున్న కోట్ల కట్టలన్నీ టీడీపీ నేతలవే కావడం గమనార్హం. కర్ణాటక, గోవా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, తెలంగాణ నుంచి భారీ ఎత్తున మద్యాన్ని తరలించి ఏరులై పారిస్తున్నారు. ఎన్నికల అధికారులు సీజ్ చేస్తున్న మద్యం డంపులే అందుకు నిదర్శనం. కోట్ల కట్టలను వెదజల్లుతున్నా.. మద్యాన్ని ఏరులై పారిస్తున్నా.. ఎలాంటి ప్రభావం చూపలేకపోవడం, ఘోర పరాజయం కళ్ల ముందు కానరావడంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫ్రస్టేషన్ తారస్థాయికి చేరుకుంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వెంటాడి, వేటాడి రక్తపుటేరులు పారించి భయోత్పాతం సృష్టించడం ద్వారా ఉనికి చాటుకోవాలని ఎత్తు వేశారు. ఈ క్రమంలో టీడీపీ, జనసేన గూండాలను దాడులు, హత్యాకాండకు పురిగొలిపారు.

"ఫ్యాన్"కి ఓటేశాడని..!

పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ ప్రక్రియలో భాగంగా పరిమి పెద్దభూషయ్య అనే వృద్ధుడు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసేందుకు సుముఖత చూపటాన్ని జీర్ణించుకోలేక బెదిరిస్తూ వాదనకు దిగాయి. తనకు కులాలతో పనిలేదని, మంచి చేసిన పార్టీకే ఓటు వేస్తానని పెద్దభూషయ్య తేల్చి చెప్పడంతో వాగ్వాదం నెలకొంది. టీడీపీ సానుభూతిపరుడు రావిపాటి నాగేశ్వరరావు కర్రతో దాడి చేయడంతో వైఎస్సార్ సీపీకి చెందిన కానాల పుల్లారెడ్డి తలకు తీవ్ర గాయమైంది. వైఎస్సార్ సీపీకి చెందిన షేక్ దమ్మాలపాటి బాజికి కూడా ఘటనలో గాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.





గాయపడిన షేక్ దమ్మాలపాటి బాజి, కానాల పుల్లారెడ్డి

దౌర్జన్యాలు.. హత్యాయత్నాలు

- నంద్యాల జిల్లా బనగానపల్లె మార్కెట్ వద్ద మంగళవారం ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భార్య కాటసాని జయమ్మపై దాడికి టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి గూండాలను పురిగొల్పారు. ఈ విషయం తెలియడంతో అక్కడకు చేరుకున్న ఆమె తనయుడు ఓబుళరెడ్డిపై కూడా టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కోనేటి దుర్గ, సయ్యద్ అబ్బాస్, ఇంతియాజ్, ఖాజా హుస్సేన్, జమీర్, గురప్ప తీవ్రంగా గాయపడ్డారు.
- అనంతపురం నియోజకవర్గంలో గత నెల 30న ఎన్నికల ప్రచారం నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుజ్జుల నగేష్‌పై టీడీపీ గూండాలు కళ్లల్లో కారం చల్లి కర్రలు, ఇనుపరాడ్లతో హత్యాయత్నానికి పాల్పడ్డారు.
- శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పిచ్చిరెడ్డికొట్టాల గ్రామంలో గత నెల 27న ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సోదరుడు తోపుదుర్తి రాజశేఖర రెడ్డి వాహనాలపై టీడీపీ మాజీ మంత్రి పరిటాల సునీత నేతృత్వంలో టీడీపీ గూండాలు దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నేత కురుబ ముత్యాలు వాహనంతో పాటు పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.
- ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో మిట్టమీదిపల్లి, మాల్యవంతునిపాడు గ్రామాల మధ్య వైఎస్సార్‌సీపీకి చెందిన మూడు ప్రచార రథాలపై టీడీపీ గూండాలు దాడులకు పాల్పడ్డారు. డ్రైవర్లు వీరాంజనేయులు, ఆంథోని, రాజును రాడ్లు, కర్రలతో తీవ్రంగా కొట్టారు.
- శ్రీకాకుళం జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లా వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఇదే రీతిలో టీడీపీ, జనసేన రౌడీ మూకలు వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు తెగబడుతూ భయోత్పాతం సృష్టిస్తున్నాయి.

మాచర్ల ఘటనపై ఈసీ సీరియస్

ముగ్గురు పోలీసు అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: మాచర్ల నియోజకవర్గంలో ప్రశాంతంగా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణితో పాటు పలువురు మహిళలపై టీడీపీ మూకలు దాడులకు తెగబడిన ఘటనను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. మాచర్ల టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శరత్‌బాబు, వెల్దుర్తి ఎస్సై వంగా శ్రీహరి, కారంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్న మల్లయ్యను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురూ తక్షణమే విధుల నుంచి రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

మాచర్ల ఎమ్మెల్యే పీఆర్కే సతీమణిపై దాడి

ఎన్నికల వేళ టీడీపీ అరాచకాలు ఏ స్థాయికి దిగజారాయంటే ఇప్పటివరకు పల్నాడు ప్రాంతంలో మహిళలు, పిల్లలపై దాడులు చేసిన సంస్కృతి లేదు. అలాంటిది మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రోద్బలంతో పచ్చమూకలు బరి తెగించాయి. ఎన్నికల ప్రచారం చేస్తున్న మాచర్ల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవితో పాటు పలువురు మహిళలపై బుధవారం రాళ్లు, సీసాలతో దాడులకు దిగి హత్యాయత్నానికి పాల్పడ్డాయి. వెల్దుర్తి మండం శిరిగిరిపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న రమాదేవిపై టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కుర్రి పున్నారెడ్డి కుమారుడు శివారెడ్డి, కల్లం రామాంజిరెడ్డి తమ అనుచరులతో కలసి రాళ్ల దాడికి పాల్పడ్డారు. పీఆర్కే సతీమణి రమాదేవి, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, కౌన్సిలర్ గట్ల అరుణ కుమారి, కో ఆప్షన్ సభ్యురాలు అన్నెం అనంతరావమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. మాజీ ఎంపీపీ చౌడేశ్వరికి చెందిన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేశారు. అడ్డుకునే యత్నం చేసిన ఎస్ఐ శ్రీహరిపై సైతం పచ్చమూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రశాంత వాతావరణంలో ప్రచారం చేస్తున్న మహిళలపై దాడులకు దిగటాన్ని ప్రజలు ఛీదరించుకుంటున్నారు. ప్రజాక్షేత్రంలో గెలవలేక టీడీపీ హింసకు పాల్పడుతోందని మండిపడుతున్నారు. ఏడుగురి హత్య కేసులో నిందితుడైన జూలకంటి బ్రహ్మారెడ్డిని చంద్రబాబు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో ఫ్యాక్షన్ రాజకీయాలు తిరిగి మొదలయ్యాయని పేర్కొంటున్నారు.

జూలకంటి శిఖండి రాజకీయాలు: రమాదేవి

రాళ్ల దాడిలో రమాదేవికి నుదుట తీవ్ర గాయాలయ్యాయి. కౌన్సిలర్ అరుణకుమారికి చెయ్యి విరిగింది. ఇలాంటి శిఖండి రాజకీయాలను తామెన్నడూ చూడలేదని అనంతరం రమాదేవి మీడియాతో పేర్కొన్నారు. తమ ఇంటి ముందు ప్రచారం చేసినప్పుడు సైతం సంయమనం పాటించామని గుర్తు చేశారు. గెలుపు మీద నమ్మకం లేక బ్రహ్మారెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దమ్ముంటే పీఆర్కేను ఢీ కొట్టి చూడాలని, మహిళలపై నీ ప్రతాపం ఏమిటని ప్రశ్నించారు. మహిళల రక్తాన్ని కళ్ల చూసిన జూలకంటికి అదే శాపంగా మారుతుందని హెచ్చరించారు.

మా పిల్లల చదువులపై కుట్రలొద్దు బాబూ

పిల్లల ఉన్నత భవిష్యత్‌కు ఇంగ్లిష్ మీడియం తప్పనిసరి అంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- రాష్ట్రంలోని 15,784 ప్రైవేటు స్కూల్స్‌లోనూ ఇంగ్లిష్‌లోనే బోధన
- వీటికి లేని భాషాభిమానం ప్రభుత్వ స్కూళ్లకే వచ్చిందా అని నిలదీత
- ఇప్పుడు పిల్లలకు ఇంగ్లిష్ చదువులు అందించలేకపోతే భవిష్యత్ అంధకారమేనని ఆందోళన
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంస్కరణలను స్వాగతిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు
- ఇంగ్లిష్‌లోనే పరీక్షలు రాస్తున్న 93% పైగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- కేంద్రం సర్వేలోనూ 90 శాతం పైగా ఇంగ్లిష్ మాధ్యమాన్నే కోరుకున్న వైనం
- తాము ఇంగ్లిష్ చదువుల్లేకే ఎదగలేకపోయామని ఆవేదన



సాక్షి, అమరావతి: పేదింటి పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుకుని తమ పెత్తందారుల పిల్లలకు ఎక్కడ పోటీకు వస్తారోనని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఎత్తేయడానికి చంద్రబాబు కుట్రలు పన్నుతుండటంపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పిల్లలకు ఉన్నత భవిష్యత్ దక్కాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు ఉండాల్సిందేనని వారంతా డిమాండ్ చేస్తున్నారు. తాము ఇంగ్లిష్ చదువుల్లేక జీవితంలో ఎదగలేకపోయామని.. తమ పిల్లలకు ఇలాంటి దుస్థితి తలెత్తకూడదని కోరుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్ తమ పిల్లలకు మేనమామలా ఉంటూ అనేక విప్లవాత్మక సంస్కరణలు, పథకాలు ప్రవేశపెట్టి అత్యుత్తమ విద్యను అందిస్తున్నారని ఘంటాపథంగా చెబుతున్నారు. రాష్ట్రంలోని 15,784 ప్రైవేటు స్కూల్స్‌లోనూ ఇంగ్లిష్‌లోనే బోధన ఉందని గుర్తు చేస్తున్నారు. వాటికి లేని తెలుగు భాషాభిమానం ప్రభుత్వ స్కూళ్ల విషయంలోనే వచ్చిందా.. అంటూ నిలదీస్తున్నారు. తమ పిల్లలకు ఇప్పుడు ఇంగ్లిష్ చదువులు అందకపోతే వారి జీవితం అంధకారమైనట్టేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తన మేనిఫెస్టోలో 'కేజీ టు పీజీ సిలబస్ రివ్యూ' అనే అంశాన్ని చేర్చడం వెనుక ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ఎత్తేసే కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు.

నిరుపేదల పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారికి సీఎం వైఎస్ జగన్ ఉత్తమ బోధన, ఇంగ్లిష్ మీడియం చదువులను ఉచితంగా అందిస్తుంటే చంద్రబాబు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడుతున్నారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం బోధిస్తే మాతృభాష మరుగున పడిపోతుందంటూ మొసలికన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

ఉన్నత విద్యకు ఇంగ్లిష్ తప్పనిసరి

పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు చదవాలంటే ఇంగ్లిష్‌పై గట్టి పట్టు ఉంటే తప్ప సాధ్యం కాదు. పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియం లేనివారు ఉన్నత విద్యలో వెనుకబడుతున్నారు. మరికొందరు అర్థం చేసుకోలేక డ్రాపవుట్ కావడమో లేదా సాధారణ డిగ్రీ కోర్సులకు మారిపోవడమో చేస్తున్నారు. వీరిలో ప్రతిభ ఉన్నా ఇంగ్లిష్ భాషపై పట్టులేకపోవడంతో వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులు ఉన్నత విద్యలోనూ అద్భుతంగా రాణిస్తారని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రభుత్వ పాఠశాలలకు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. దీంతో 2019లో అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్ సర్కారు ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 2020లో రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించగా.. 97 శాతం మంది ఇంగ్లిష్ మీడియం బోధన తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను 2020–21 విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టింది. విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని పెంచేందుకు ద్విభాషా పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలను కూడా అందించింది. ఇటీవల ముగిసిన పరీక్షలను దాదాపు 93 శాతం పైగా విద్యార్థులు ఇంగ్లిష్‌లోనే రాశారు. పదో తరగతిలో ఇంగ్లిష్ మీడియం అమలు చేయకున్నా 2.23 లక్షల మంది విద్యార్థులు ఇందులోనే పరీక్షలు రాసిన సంగతి తెలిసిందే. వీరిలో 1.96 లక్షల మందికి పైగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. దీన్ని బట్టి ఇంగ్లిష్ బోధనను ఎంత బలంగా కోరుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలోనూ 90 శాతం పైగా ఇంగ్లిష్ మీడియం చదువులనే కోరుకున్నారు.

షర్మిల, సునీత, బీటెక్ రవిలకు కడప జిల్లా కోర్టు షాక్

వివేకా హత్యకేసు గురించి మాట్లాడొద్దన్న మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతకు నో

- ఆ ఉత్తర్వుల ఎత్తివేత కోసం వేసిన పిటిషన్లు కొట్టివేత

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, కడప: అడ్డగోలు ఆరోపణలు, దుష్ప్రచారంతో మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, టీడీపీ పులివెందుల అభ్యర్థి బీటెక్ రవిలకు కడప జిల్లా కోర్టు మరోసారి గట్టి షాక్ ఇచ్చింది. వివేకా హత్యకేసు సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఆ కేసు గురించి మాట్లాడొద్దని, దుష్ప్రచారం చేయవద్దని చంద్రబాబునాయుడు, లోకేశ్, షర్మిల, సునీత, బీటెక్ రవి, పవన్‌కళ్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో పాటు ఆ పార్టీల కేడర్‌ను ఆదేశిస్తూ ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసేందుకు కోర్టు నిరాకరించింది. మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ షర్మిల, సునీత, బీటెక్ రవి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న వివేకా హత్యకేసు గురించి మాట్లాడటానికి వీల్లేదని పునరుద్ఘాటించింది. షర్మిల, సునీత, బీటెక్ రవిలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు ఖర్చుల కింద విధించింది. ఆ మొత్తాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని వారిని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా జడ్జి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. విచారణను జూన్ 19కి వాయిదా వేశారు.

దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ న్యాయపోరాటం

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రోద్బలంతో వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై షర్మిల, పురందేశ్వరి, పవన్‌కళ్యాణ్, లోకేశ్, వివేకా కుమార్తె సునీతారెడ్డి తదితరులు చేస్తున్న దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ కడప జిల్లా కోర్టులో దావా వేసింది. వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన జిల్లా కోర్టు.. వైఎస్ వివేకా హత్యకేసు విచారణ హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నందున వైఎస్ అవినాశ్‌రెడ్డిని హంతకుడిగా ఆరోపిస్తూ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని చంద్రబాబు, షర్మిల, సునీత, పవన్‌కళ్యాణ్, పురందేశ్వరి, బీటెక్ రవి తదితరులను ఆదేశిస్తూ గతనెలలో తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అవినాశ్‌రెడ్డిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షిస్తున్నారంటూ చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా ఆపాలని తేల్చిచెప్పింది. జగన్‌మోహన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిలపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల నుంచి తక్షణమే తొలగించాలని ఆదేశించింది.

కడప కోర్టులోనే తేల్చుకోవాలన్న హైకోర్టు

జిల్లా కోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాలంటూ షర్మిల, సునీత, బీటెక్ రవి హైకోర్టును ఆశ్రయించారు. అదే సమయంలో మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ కడప జిల్లా కోర్టులో వేర్వేరుగా అనుబంధ పిటిషన్లు వేశారు. షర్మిల తదితరుల వ్యాజ్యాలపై విచారించిన హైకోర్టు ధర్మాసనం కడప కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేత కోసం కడప కోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో అక్కడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది.

అక్కడో మాట.. ఇక్కడో మాట

రాజధానిపై కూటమి ద్విపాత్రాభినయం

- ఉత్తరాంధ్రలో ఒకలా.. బెజవాడలో మరోలా
- ప్రాంతాల వారీగా మభ్యపుచ్చే ప్రకటనలు
- అమరావతి అనేది 20 ఏళ్ల తర్వాత మాట..
- టీడీపీ పాలనలో రాష్ట్ర అప్పులు రూ.3.5 లక్షల కోట్లకు చేరాయి
- విశాఖే రాజధాని గ్రోత్ ఇంజన్ అని ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి: ఏ ఎండకు ఆ గొడుగు!.. ఏ రోటికాడ ఆ రోటి పాట! ఏరు దాటాక తెప్ప తగలేయడమే తన ఆనవాయితీ అని టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి మరోసారి విస్పష్టంగా చెప్పింది! ప్రజాక్షేత్రంలో మరోసారి ఘోర పరాజయం ఖాయమని నిర్ధారణకు రావడంతో ఉనికి కోసం ఒక్కో ప్రాంతంలో ఒక్కో డ్రామాలాడుతోంది. రాజధానిపై బుధవారం దినపత్రికల్లో కూటమి ఇచ్చిన ప్రకటనలే ఇందుకు తార్కాణం. ప్రజలను మభ్యపుచ్చి ఓట్లు పొందేందుకు రాజధానిపై ప్రాంతాల వారీగా రెండు రకాల ప్రకటనలు ఇచ్చే స్థాయికి దిగజారింది.

సాధ్యం కాదన్న బాలయ్య అల్లుడు

విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.శ్రీభరత్ ఓట్ల కోసం విశాఖే రాజధాని గ్రోత్ ఇంజన్ అని పేర్కొన్నారు. అమరావతి రాజధాని కాదని స్పష్టం చేస్తూ.. అమరావతిని అభివృద్ధి చేయాలంటే చాలా పెట్టుబడి అవసరమని ఓ ప్రైవేట్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భరత్ తేల్చి చెప్పారు. అన్ని డబ్బులు వెచ్చించే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. అదే విశాఖ అయితే వేగంగా అభివృద్ధి చెందుతుందని, గ్రోత్ ఇంజన్ ఏమిటనేది చూడాలని వ్యాఖ్యానించారు. గ్రోత్ ఇంజన్ విశాఖతో రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందంటూ ఓట్ల కోసం రెండు నాలుకల ధోరణితో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనలో రాష్ట్ర అప్పులు మూడున్నర లక్షల కోట్ల రూపాయలకు చేరుకోగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో రూ.వేల కోట్లు పెట్టుబడి పెట్టే స్థితిలో లేదని భరత్ చెప్పారు. అమరావతి అనేది 20 సంవత్సరాల తరువాత మాట అని, అదే విశాఖ మనకు వెంటనే గ్రోత్ ఇంజన్ లాంటిదని బాలకృష్ణ అల్లుడు భరత్ తెలిపారు. టీడీపీతో పాటు బీజేపీ, పవన్ అమరావతే రాజధాని అని చెబుతుండగా విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న భరత్ మాత్రం విశాఖ రాజధాని గ్రోత్ ఇంజన్ అని పేర్కొనటాన్ని బట్టి కూటమి లక్ష్యం ప్రజలను మభ్యపుచ్చి ఓట్లు పొందడమేనని స్పష్టమవుతోంది.

ఓ విధానం లేకుండా..

జాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్న పార్టీలు రాజధాని విషయంలో ఒక విధానం లేకుండా ప్రాంతానికో రకంగా వ్యవహరించడం అంటే ఓటర్లను మోసం చేయడమేనని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఓటమి భయంతోనే ప్రాంతాలవారీగా మభ్యపెడుతున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అమరావతిని రాజధాని చేయాలంటే రూ.లక్షల కోట్లు అవసరమని, అంత ఖర్చు చేసినా చాలా సంవత్సరాలు పడుతుందని తొలి నుంచీ వైఎస్సార్‌సీపీ వాస్తవిక దృక్పథంతో చెబుతోంది. అదే విషయాన్ని ఇప్పుడు ఓట్ల కోసం భరత్ వల్లె వేయడం గమనార్హం. రాజధాని అమరావతి సాధ్యం కాదని పేర్కొనడం విశేషం. విజయవాడ రాష్ట్రంలో భాగమైనప్పటికీ ఉత్తరాంధ్ర ఎడిషన్లలో మాత్రం అమరావతి ప్రస్తావన లేకుండా ప్రచార ప్రకటనలు జారీ చేయటాన్ని బట్టి ఇదంతా ఓట్ల రాజకీయమేనని స్పష్టమవుతోంది.



ఈనాడు విజయవాడ ఎడిషన్‌లో మన కలల రాజధాని అమరావతిని కాపాడుకోవడానికి అంటూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రకటన



విశాఖపట్నం ఎడిషన్‌లో మాత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వికాసం కోసం అంటూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఇచ్చిన ప్రకటన

రెండు ప్రాంతాలు.. రెండు నాలుకలు!

తాజాగా ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా విజయవాడ, విశాఖపట్నం ఎడిషన్లలో ఆయా ప్రాంతాల ప్రజలను మభ్యపుచ్చేలా కూటమి వేర్వేరు ప్రకటనలు ఇవ్వడం గమనార్హం. ఈమేరకు విజయవాడ, విశాఖలో ఈనాడు, హిందూ దినపత్రికల తొలి పేజీల్లో కూటమి ప్రచార ప్రకటనలు జారీ చేసింది. వీటిలో ప్రధాని మోదీతో పాటు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఫొటోలున్నాయి. విజయవాడ ఎడిషన్‌లో మన కలల రాజధాని అమరావతిని కాపాడుకోవడానికి అంటూ పత్రికల్లో ప్రకటన ఇవ్వగా విశాఖలో మాత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వికాసం కోసం అంటూ ముగ్గురి ఫొటోలతో ప్రకటన విడుదల చేయడం గమనార్హం.



రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సామ్సన్‌పై జరిమానా

ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించినందుకు రాజస్తాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ సంజూ సామ్సన్‌పై మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానాగా విధించారు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సామ్సన్ తాను అవుటయ్యాక అంపైర్‌తో వాగ్వాదం చేశాడు. సామ్సన్ కొట్టిన షాట్‌ను బౌండరీ లైన్ వద్ద ఢిల్లీ ఫీల్డర్ షై హోప్ క్యాచ్ తీసుకున్నాడు. క్యాచ్ పట్టిన క్రమంలో షై హోప్ పాదం బౌండరీ లైన్‌ను తాకినట్లు భావించిన సామ్సన్ కొద్దిసేపు మైదానంలో ఉండి అంపైర్‌తో వాదించి వెళ్లిపోయాడు.

మూడేళ్ల తర్వాత స్వదేశంలో నీరజ్ చోప్రా బరిలోకి


ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ చాంపియన్ అయిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మూడేళ్ల తర్వాత స్వదేశంలో పోటీపడనున్నాడు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగే ఫెడరేషన్ కప్ టోర్నీలో నీరజ్ బరిలోకి దిగుతాడు. ఈనెల 10న దోహాలో జరిగే డైమండ్ లీగ్ మీట్‌తో నీరజ్ కొత్త సీజన్‌ను మొదలు పెట్టనున్నాడు. డైమండ్ లీగ్ మీట్ ముగిశాక అతను నేరుగా దోహా నుంచి భారత్ చేరుకుంటాడు. చివరిసారి నీరజ్ భారత గడ్డపై 2021 మార్చి 17న జరిగిన ఫెడరేషన్ కప్‌లో పోటీపడి స్వర్ణ పతకం నెగ్గాడు.



సన్‌రైజర్స్ విధ్వంసం


58 బంతుల్లోనే 166 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్ ● 10 వికెట్లతో ఘనవిజయం

హెడ్, అభిషేక్ విశ్వరూపం ● 16 ఫోర్లు, 14 సిక్స్‌లతో ఊచకోత ● చిత్తుగా ఓడిన లక్నో ● ప్లే ఆఫ్స్ రేసు నుంచి ముంబై అవుట్



ట్రావిస్ హెడ్

250 పరుగుల లక్ష్యమైనా సన్‌రైజర్స్ ఛేదించేదేమో? ఓటమి తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ రాహుల్ వ్యాఖ్య... ప్రత్యర్థి బ్యాటర్ల వీర బాదుడుకు మైదానంలో మొదటి బాధితుడిగా అతను చెప్పిన మాట అక్షరసత్యం. తొలుత బ్యాటింగ్ చేస్తూ సీజన్‌లో రికార్డు స్కోర్లు సాధించిన హైదరాబాద్ ఇప్పుడు ఛేదనలోనూ విధ్వంసం సృష్టించింది. వీడియోగేమ్ తరహాలో ట్రవిస్ హెడ్, అభిషేక్ శర్మ విరుచుకుపడుతుంటే స్టేడియంలో పరుగుల ఉప్పెన వచ్చింది. 16 ఫోర్లు, 14 సిక్స్‌లంటే 148 పరుగులు బౌండరీలతోనే... లక్నో విధించిన 166 పరుగుల లక్ష్యం మరీ చిన్నదేమీ కాదు. కానీ 10 ఓవర్లకు ముందే కేవలం 52 నిమిషాల్లో రైజర్స్ ఛేదించి పడేసింది. రైజర్స్ ఛేజింగ్ రాత్రి 9 గంటల 23 నిమిషాలకు మొదలై 10 గంటల 15 నిమిషాలకు ముగిసింది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. లక్నో పరాజయంతో ముంబై ఇండియన్స్ జట్టు ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.


భువనేశ్వర్

సాక్షి, హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ బ్యాటింగ్ పవర్‌ను మరోసారి చూపించింది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 10 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తుగా ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లక్నో 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. ఆయుశ్ బదోని (30 బంతుల్లో 55 నాటౌట్; 9 ఫోర్లు), నికోలస్ పూరన్ (26 బంతుల్లో 48 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం హైదరాబాద్ కేవలం 9.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 167 పరుగులు సాధించి గెలిచింది. ఓపెనర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రవిస్ హెడ్ (30 బంతుల్లో 89 నాటౌట్; 8 ఫోర్లు, 8 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (28 బంతుల్లో 75 నాటౌట్; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) మరో అవకాశం ఇవ్వకుండా చెలరేగి కేవలం 58 బంతుల్లోనే మ్యాచ్‌ను ముగించారు. లక్నో ఓటమితో ముంబై ఇండియన్స్ జట్టు ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ముంబై తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గినా 12 పాయింట్లతో టాప్-4లో స్థానాన్ని దక్కించుకునే అవకాశం లేదు.

రాహుల్ విఫలం...

భువనేశ్వర్ చక్కటి బౌలింగ్ వల్ల లక్నో ఇన్నింగ్స్ పేలవంగా ప్రారంభమైంది. భువీ తన వరుస ఓవర్లలో డికాక్ (2), స్టొయినిస్ (3)లను పెవిలియన్ పంపించాడు. ఈ రెండు సందర్భాల్లో ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి, సన్వీర్ సింగ్ అద్భుత క్యాచ్‌లు కారణంగా నిలిచాయి. పవర్‌ప్లే ముగిసేసరికి లక్నో 27 పరుగులకే పరిమితమైంది. ఈ దశలో రాహుల్, కృనాల్ ఆదుకునే ప్రయత్నం చేసినా వీరిద్దరూ నెమ్మదిగా ఆడటంతో పరుగులు రావడం మందగించింది. పదో ఓవర్ చివరి బంతికి రాహుల్ అవుట్ కాగా... లక్నో స్కోరు 57 పరుగులకు చేరింది. అవుటయ్యే వరకు కూడా ఏ దశలోనూ రాహుల్ స్ట్రయిక్‌రేట్ కనీసం 100 కూడా లేకపోవడం జట్టు అవకాశాలను దెబ్బ తీసింది. ఆ తర్వాత కొద్ది సేపటికే కృనాల్ రనౌట్ కావడంతో స్కోరు 66/4గా మారింది. ఇలాంటి స్థితిలో పూరన్, బదోని బ్యాటింగ్ లక్నో కాస్త గౌరవప్రదమైన స్కోరును అందించింది. చివరి 5 ఓవర్లలో 63 పరుగులు రాగా... వీరిద్దరు 52 బంతుల్లోనే అభేద్యంగా 99 పరుగులు జోడించారు.

మెరుపు వేగంతో...

8, 17, 22, 17, 23, 20, 19, 17, 14, 10... ఛేదనలో సన్‌రైజర్స్ ఒక్కో ఓవర్‌లో చేసిన పరుగులు ఇవి. తొలి ఓవర్ మినహాయిస్తే ఎక్కడా తగ్గకుండా హెడ్, అభిషేక్ చెలరేగిపోయారు. యశ్ ఓవర్లో అభిషేక్ 4 ఫోర్లు కొట్టగా, గౌతమ్ ఓవర్లో హెడ్ 3 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. నవీనుల్ ఓవర్లో వరుసగా 4, 4, 6, 4, 4 బాదిన హెడ్... ఈ క్రమంలో 16 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. యశ్ ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టిన అభిషేక్ హాఫ్ సెంచరీ 19 బంతులకు పూర్తయింది. పవర్‌ప్లేలో 107 పరుగులు చేసిన రైజర్స్ ఆట ముగించేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. యశ్ వేసిన పదో ఓవర్ నాలుగో బంతిని అభిషేక్ సిక్స్‌గా మలచడంతో ఉప్పల్ స్టేడియంలో సంబరాలు మొదలయ్యాయి.


అభిషేక్ శర్మ

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: కేఎల్ రాహుల్ (సి) నటరాజన్ (బి) కమిన్స్ 29; డికాక్ (సి) నితీశ్ (బి) భువనేశ్వర్ 2; స్టొయినిస్ (సి) సన్వీర్ (బి) భువనేశ్వర్ 3; కృనాల్ పాండ్యా (రనౌట్) 24; పూరన్ (నాటౌట్) 48; బదోని (నాటౌట్) 55; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1-13, 2-21, 3-57, 4-66. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-12-2, కమిన్స్ 4-0-47-1, షహబాజ్ 2-0-9-0, విజయకాంత్ 4-0-27-0, ఉనాద్కట్ 2-0-19-0, నటరాజన్ 4-0-50-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (నాటౌట్) 75; హెడ్ (నాటౌట్) 89; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (9.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 167. బౌలింగ్:** గౌతమ్ 2-0-29-0, యశ్ ఠాకూర్ 2.4-0-47-0, బిష్ణోయ్ 2-0-34-0, నవీనుల్ హక్ 2-0-37-0, బదోని 1-0-19-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	11	8	3	16	0.476
హైదరాబాద్	12	7	5	14	0.406
చెన్నై	11	6	5	12	0.700
ఢిల్లీ	12	6	6	12	-0.316
లక్నో	12	6	6	12	-0.769
బెంగళూరు	11	4	7	8	-0.049
పంజాబ్	11	4	7	8	-0.187
ముంబై	12	4	8	8	-0.212
గుజరాత్	11	4	7	8	-1.320

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X బెంగళూరు
వేదిక: ధర్మశాల
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

క్వార్టర్ ఫైనల్లో మనిక



జిద్దా: సౌదీ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్ మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ మనిక బత్రా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో మనిక 11-6, 11-9, 11-7తో ప్రపంచ 14వ ర్యాంకర్ నీనా మిటెల్‌హమ్ (జర్మనీ)పై విజయం సాధించింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో హీనా హయాటా (జపాన్)తో మనిక తలపడుతుంది.

అర్జున్ మూడు గేమ్‌లు 'డ్రా'



వార్సా (పోలాండ్): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సూపర్‌బెట్ ర్యాపిడ్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తన తొలి మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌తో జరిగిన తొలి గేమ్‌ను అర్జున్ 50 ఎత్తుల్లో... అనీశ్ గిరి (నెదర్లాండ్స్)తో జరిగిన రెండో గేమ్‌ను 56 ఎత్తుల్లో... వె యి (చైనా)తో జరిగిన మూడో గేమ్‌ను 47 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ రెండు గేముల్లో ఓడి, ఒక గేమ్‌ను 'డ్రా' చేసుకోగా... ప్రజ్ఞానంద ఒక గేమ్‌లో నెగ్గి, ఒక గేమ్‌ను 'డ్రా'గా ముగించి, మరో గేమ్‌లో ఓడిపోయాడు.

భారత రెజ్లర్లకు ఆఖరి అవకాశం

ఇస్తాంబుల్: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు భారత రెజ్లర్లు ఆఖరి ప్రయత్నం చేయనున్నారు. నేటి నుంచి ఇస్తాంబుల్‌లో జరిగే వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత రెజ్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో 6 బెర్త్‌లు, గ్రీకో రోమన్ విభాగంలో 6 బెర్త్‌లు ఉన్నాయి. ఈ రెండు కేటగిరీల్లో ఇప్పటి వరకు భారత రెజ్లర్లకు ఒక్క బెర్త్ కూడా దక్కలేదు. మహిళల విభాగంలో 6 బెర్త్‌లకు గాను నాలుగు బెర్త్‌లు (అంతిమ్-53 కేజీలు, వినేశ్ ఫొగాట్-50 కేజీలు, అన్షు మలిక్-57 కేజీలు, రీతిక-76 కేజీలు) భారత రెజ్లర్లు సంపాదించారు.

సినిమా

అలాంటి సినిమాలు చేయాలన్నదే నా కల - సత్యదేవ్



"నటుడిగా వైవిధ్యమైన పాత్రలు చేయాలి. 'నాయగన్' సినిమాలో కమల్‌హాసన్‌గారిలా కొత్త గెటప్ ట్రై చేయాలని ఉంది. చిరంజీవిగారి 'ఆపద్బాంధవుడు' చిత్రం అంటే ఇష్టం. అలాగే 'బాహుబలి' కూడా. అలాంటి సినిమాలు చేయాలన్నదే నా కల. కొత్త తరహా కథతో రూపొందిన 'కృష్ణమ్మ' సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది" అని హీరో సత్యదేవ్ అన్నారు. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వంలో సత్యదేవ్, అతీరా రాజ్ జంటగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మాలపాటి నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు ఈ నెల 10న 'కృష్ణమ్మ'ని రిలీజ్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా సత్యదేవ్ చెప్పిన విశేషాలు.

● 'కృష్ణమ్మ' సినిమాకి నటీనటులు, సాంకేతిక నిపుణులందరూ ఓకే అయ్యాక నేను చివర్లో ఈ ప్రాజెక్టులోకి వచ్చాను. గోపాలకృష్ణగారు చెప్పిన కథ నిర్మాత కృష్ణగారికి నచ్చింది. ఆ తర్వాత ఈ కథను కొరటాల శివగారు విన్నారు. ఆయనకు బాగా నచ్చడంతో సమర్పకుడిగా మారారు. కొరటాలగారు కథలో ఒక్క మార్పు కూడా చెప్పలేదు. అంత పెద్ద డైరెక్టర్ అయిన కొరటాలగారు స్క్రిప్ట్‌లో మార్పు చెప్పకుండా సినిమాకు సపోర్ట్ చేయడం సంతోషం. ● విజయవాడ పేరు చెప్పగానే రాజకీయం, రౌడీయిజం గురించి చెబుతుంటారు. కానీ, విజయవాడ అంటే అవి మాత్రమే కాదని చెప్పే కథే 'కృష్ణమ్మ'. ముగ్గురు స్నేహితుల కథే ఈ మూవీ. మంచి ఫ్యామిలీ ఉండాలి, జీవితంలో బాగా సెటిల్ కావాలనుకునే ముగ్గురు ఫ్రెండ్స్ కల చెదిరిపోతుంది. అప్పుడు వాళ్లేం చేశారు? అనే కథాంశంతో ఈ సినిమా ఉంటుంది. ఈ చిత్రంలో వించిపేట భద్ర అనే పాత్ర చేశాను. విజయవాడ యాస, పొగరు, పగ.. ఇలాంటివన్నీ ఆ పాత్రలో చూపించడం సవాల్‌గా అనిపించింది. ● నిర్మాత కృష్ణగారికి సినిమా అంటే ప్యాషన్. ఆయన ఖర్చుకి వెనకాడకుండా షూటింగ్ అంతా విజయవాడలోనే చేయడానికి సపోర్ట్ చేశారు. కాలభైరవ చాలా ఇంటెన్స్ ఉన్న సంగీతం ఇచ్చాడు. 'కృష్ణమ్మ' మూవీతో సత్యదేవ్ స్టార్ అవుతాడనే నమ్మకం ఉందని రాజమౌళిగారు అనడం హ్యాపీగా అనిపించింది. ఈ మూవీ హిట్ అయి స్టార్‌డమ్ వచ్చినా నేను ఇప్పటిలాగే ఉంటాను. చిరంజీవిగారి 'గాడ్ ఫాదర్', అక్షయ్ కుమార్‌గారి 'రామసేతు' చిత్రాలతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఉత్తరాదిలోనూ నాకు మంచి గుర్తింపు వచ్చింది. మళ్లీ ఆ రేంజ్ పాత్రలు రాకపోవడంతో చేయడంలేదు. తమిళ్‌లో ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి.


● సాయి పల్లవి

ప్రేమ కబుర్లు

మొబైల్‌లో ప్రేమ కబుర్లు చెబుతున్నారు సాయి పల్లవి. 'లవ్‌స్టోరీ' చిత్రం తర్వాత హీరో నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. ఈ రూరల్ బ్యాక్‌డ్రాప్ లవ్‌స్టోరీ ఫిల్మ్‌కు చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, సత్యభామ పాత్రలో సాయి పల్లవి నటిస్తున్నారని తెలిసింది. కాగా నేడు (మే 9) సాయి పల్లవి బర్త్ డే. ఈ సందర్భంగా 'తండేల్' సినిమాలోని ఆమె కొత్త ఫొటోను బుధవారం విడుదల చేశారు మేకర్స్. సత్యభామ ఎవరితోనో ఫోన్‌లో నవ్వుతూ మాట్లాడుతున్నట్లు ఫొటోలో కనిపిస్తోంది. బహుశా రాజుతో ప్రేమ కబుర్లు చెబుతుందేమో! ఇక ఈ పాత్ర తాలూకు వీడియోను నేడు విడుదల చేయనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.


● మహేశ్‌బాబు

భైరవకి వాయిస్ ఓవర్?

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమాలో మహేశ్‌బాబు భాగం కానున్నారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. కానీ ఈ సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్‌లో మహేశ్‌బాబు నటించరట. ఈ సినిమాలోని ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఓ ఎపిసోడ్‌కి మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో 'జల్సా', 'బాద్‌షా', 'ఆచార్య' వంటి చిత్రాలకు మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. మరి.. 'కల్కి 2898 ఏడీ' సినిమాలో మహేశ్ వాయిస్ వినిపిస్తుందా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ సినిమాలో భైరవ పాత్రలో ప్రభాస్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ బచ్చన్ కనిపిస్తారు. కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్.


● కార్తికేయ

సెట్ అయ్యిందే...!

కార్తికేయ హీరోగా నటించిన 'భజే వాయు వేగం' చిత్రం విడుదల తేదీ ఖరారు అయింది. ప్రశాంత్ రెడ్డి చంద్రపు దర్శకత్వంలో ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. అలాగే ఈ సినిమాలోని 'సెట్ అయ్యిందే...' పాట లిరికల్ వీడియో నేడు విడుదల కానుంది. బుధవారం ఈ విషయాలను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించింది. రాహుల్ టైసన్, తనికెళ్ల భరణి, రవిశంకర్, శరత్ లోహితస్వ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: రధన్, సహ-నిర్మాత: అజయ్ కుమార్ రాజు .పి.

● రాజా గౌతమ్, బ్రహ్మానందం


తాత... మనవడు

నిజ జీవితంలో తండ్రీ కొడుకులైన బ్రహ్మానందం, రాజా గౌతమ్ 'బ్రహ్మ ఆనందం' అనే చిత్రంలో తాత, మనవడిగా నటించనున్నారు. ఈ చిత్రానికి నూతన దర్శకుడు ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించనున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్లుగా నటించనున్న ఈ చిత్రంలో 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సావిత్రి, శ్రీ ఉమేష్ యాదవ్ సమర్పణలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించనున్న ఈ సినిమాని ప్రీ-లుక్ పోస్టర్, వీడియోతో ప్రకటించారు. ''బ్రహ్మ ఆనందం' సినిమా పూర్తి స్థాయి వినోదాత్మకంగా ఉంటుంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఈ ఏడాది డిసెంబర్ 6న చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మితేష్ పర్వతనేని, సంగీతం: శాండిల్య పిసపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పి. దయాకర్ రావు.

పర్‌ఫెక్ట్ పార్ట్‌నర్‌షిప్

రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా నటించిన స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. క్రికెట్ నేపథ్యంలోని ఈ సినిమాకు శరణ్ శర్మ దర్శకత్వం వహించారు. ''యాన్ ఇంపర్‌ఫెక్ట్‌లీ పర్‌ఫెక్ట్ పార్ట్‌నర్‌షిప్' అనే క్యాప్షన్‌తో ఈ సినిమాకు సంబంధించిన కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. అలాగే ''క్రికెట్టే తమ జీవితంగా భావించే మిస్టర్ మహి అండ్ మిసెస్ మహిలను కలిసేందుకు సిద్ధంగా ఉండండి. క్రికెట్ తర్వాత మహి ఆ స్థాయిలో ప్రేమించేది ఒక్క తన భార్యను మాత్రమే'' అని చెబుతూ, ఈ సినిమాను ఈ నెల 31న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ ఇన్‌స్టా వేదికగా వెల్లడించారు. ఈ చిత్రంలో మహేంద్ర పాత్రలో రాజ్‌కుమార్ రావ్, మహిమా పాత్రలో జాన్వీ కపూర్ నటించారు. కరణ్ జోహార్, జీ స్టూడియోస్, యశ్ జోహార్, అపూర్వా మెహతా ఈ సినిమాను నిర్మించారు.



● జాన్వీ కపూర్, రాజ్‌కుమార్

కొత్త థగ్


● శింబు

'థగ్ లైఫ్' టీమ్‌లో జాయిన్ అయ్యారు శింబు. 'నాయగన్' (1987) సినిమా తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'థగ్ లైఫ్'. ఈ చిత్రంలో త్రిష, శింబు, ఐశ్వర్యా లక్ష్మి, జోజూ జార్జ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బుధవారం 'థగ్ లైఫ్' సినిమా టీమ్‌లోకి శింబు జాయిన్ అయినట్లుగా ఓ వీడియోను విడుదల చేసి, వెల్లడించారు మేకర్స్. కారును వేగంగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చి, గన్‌తో ఎవరిపైనో గురి పెట్టి శింబు కాల్చుతున్నట్లుగా ఈ వీడియోలో కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఢిల్లీలో జరుగుతోంది. కమల్‌హాసన్, శింబులతో పాటు కీలక తారాగణం పాల్గొంటుండగా ముఖ్య సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మణిరత్నం. ఈ ఢిల్లీ షూటింగ్ షెడ్యూల్ పూర్తవగానే 'థగ్ లైఫ్' టీమ్ లండన్ వెళుతుందని కోలీవుడ్ సమాచారం. రెడ్ జెయింట్ మూవీస్, మద్రాస్ టాకీస్ పతాకాలపై కమల్‌హాసన్, మణిరత్నం నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుందని సమాచారం. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ డైరెక్టర్. ఈ సంగతి ఇలా ఉంచితే... 'థగ్ లైఫ్' సినిమా నుంచి దుల్కర్ సల్మాన్ తప్పుకున్నారని, ఈ ప్లేస్‌లోనే శింబును ఎంపిక చేశారని టాక్. అలాగే 'జయం' రవి కూడా ఈ చిత్రం నుంచి తప్పుకోగా ఈ పాత్రను అశోక్ సెల్వన్ చేస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.


● అలేఖ్య, జీవన్ రెడ్డి

గోమాతపై...

''మా నాన్న జయప్రకాశ్ రెడ్డిగారి జయంతి (మే 8) సందర్భంగా 'వృషభ' సినిమా ట్రైలర్‌ని, ఓ పాటని రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. ఇలాంటి మంచి చిత్రంలో నేను భాగమవడం సంతోషంగా ఉంది'' అని నటుడు జయప్రకాశ్ రెడ్డి కుమార్తె మల్లికా రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి, అలేఖ్య జంటగా అశ్విన్ కామరాజ్ కొప్పాల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'వృషభ'. గోమాత ప్రధానాంశంగా ఉమా శంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. మల్లికా రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్, లిరికల్ సాంగ్ లాంచ్ వేడుకలో దర్శకులు రేలంగి నరసింహారావు, వి. సముద్ర, నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, సాయి వెంకట్ అతిథులుగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు ''నాలుగేళ్ల పాటు ఈ చిత్రకథ రాసుకున్నాం. 85 శాతం షూటింగ్ పూర్తయింది'' అన్నారు ఉమా శంకర్ రెడ్డి, అశ్విన్ కామరాజ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 45	నిఫ్టీ 0
73,466	22,303

విదేశీ సూచీలు (బుధ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,279	▽	53
డోజోన్స్	38,934	△	50
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,354	△	40
డాక్స్	18,498	△	68
షాంఘై	3,128	▽	19
నికాయ్	38,202	▽	633

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారెట్) 70,490	▽	100
బంగారం (22 క్యారెట్) 67,130	▽	100
వెండి (కేజీ) 88,500		0

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.14	105.68
€	యూరో	ఎస్‌బీఐ	91.01	88.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.30	54.48
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.99	55.91
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.28	63.95
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.44	12.51

బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు

• లాభ, నష్టాల మధ్య ట్రేడింగ్
• ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం లాభ, నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు బుధవారం ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ 45 పాయింట్లు నష్టపోయి 73,466 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఎలాంటి లాభ, నష్టాలు లేకుండా ఫ్లాట్‌గా అక్కడక్కడే 22,303 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ప్రైవేటు రంగ బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాల తలెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 438 పాయింట్లు పతనమై 73,074 వద్ద, నిఫ్టీ 71 పాయింట్లు క్షీణించి 22,231 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. తదుపరి ఇంధన, పారిశ్రామికోత్పత్తి, యుటిలిటీ, ఆటో, మెటల్, విద్యుత్, సర్వీసెస్ షేర్లకు కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కోలుకున్నాయి.

బ్యాంక్ ఆఫ్ బరోడాకు ఆర్‌బీఐ ఊరట



న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)పై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తూ ఆర్‌బీఐ ఊరట కలిగించింది. బీవోబీ వరల్డ్ మొబైల్ యాప్ ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకునేందుకు తాజాగా బీవోబీకు అనుమతినిచ్చింది. బీవోబీ వరల్డ్ యాప్ ద్వారా వినియోగదార్లను చేర్చుకోరాదంటూ 2023 అక్టోబర్ 10న ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. వర్తించే మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా వినియోగదార్లను చేర్చుకుంటామని బీవోబీ తెలిపింది.

భారత్‌లో గూగుల్ వాలెట్



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ తాజాగా భారత్‌లో తమ గూగుల్ వాలెట్ యాప్‌ను ప్రవేశపెట్టింది. బోర్డింగ్ పాస్‌లు, లాయల్టీ కార్డులు, ఈవెంట్ టికెట్లు, గిఫ్ట్ కార్డులు, మెట్రో వంటి ప్రజా రవాణా పాస్‌లు మొదలైనవన్నీ ఒకే చోట డిజిటల్ రూపంలో భద్రపర్చుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రస్తుతం గూగుల్ వాలెట్ 80 పైగా దేశాల్లో అందుబాటులో ఉంది. దేశీయంగా ఇది చెల్లింపుయేతర లావాదేవీల కోసం గూగుల్ పే (చెల్లింపుల యాప్) నకు అనుబంధంగా ఉంటుందని ఆండ్రాయిడ్ ఎట్ గూగుల్ జీఎం రామ్ పాపట్ల తెలిపారు.


జోస్ ఆలుక్కాస్ అక్షయ తృతీయ ఆఫర్లు



త్రిస్సూర్: ప్రముఖ జ్యువెలరీ రిటైల్ చైన్ జోస్ ఆలుక్కాస్ షోరూముల్లో అక్షయ తృతీయ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కస్టమర్లకు అత్యుత్తమ ఆఫర్లు ప్రకటించింది. ఉచితంగా బంగారు నాణేలు పొందేందుకు ముందస్తు బుకింగ్ అందిస్తోంది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులతో కొనుగోలుపై రూ.5000 క్యాష్ బ్యాక్ పొందవచ్చు. గిఫ్ట్ కార్డులు అందిస్తుంది. వినియోగదారులు ఆకర్షణీయమైన ఈ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ జోస్ ఆలుక్కా కోరారు.

కెనరా బ్యాంక్ లాభం 18 శాతం అప్

• క్యూ4లో రూ. 3,757 కోట్లు
• రూ. 16.10 డివిడెండు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంకు గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 3,757 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో నమోదైన రూ. 3,175 కోట్లతో పోలిస్తే ఇది 18 శాతం అధికం. ఆదాయం మెరుగుపడటం, మొండిబాకీలు తగ్గడం వంటి సానుకూలాంశాలు ఇందుకు తోడ్పడినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో కె. సత్యనారాయణ రాజు తెలిపారు. సమీక్షాకాలంలో బ్యాంకు మొత్తం ఆదాయం రూ. 28,685 కోట్ల నుంచి రూ. 34,025 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ. 23,910 కోట్ల నుంచి రూ. 28,807 కోట్లకు ఎగిసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం 37 శాతం పెరిగి రూ. 10,604 కోట్ల నుంచి రూ. 14,554 కోట్లకు ఎగిసింది. 2023–24కి గాను రూ. 10 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ. 16.10 డివిడెండ్ ఇవ్వాలని బ్యాంకు బోర్డు సిఫార్సు చేసింది. గతేడాది మార్చి ఆఖరు నాటికి స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 5.35 శాతంగా ఉండగా, ఈ ఏడాది మార్చిలో 4.23 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 1.73% నుంచి 1.27 శాతానికి తగ్గాయి.

భారత్‌కు మనవాళ్ల డబ్బేడబ్బు



• 2022లో 111 బిలియన్ డాలర్లు
• ఈ స్థాయిని అందుకున్న మొదటి దేశంగా రికార్డు

ఐక్యరాజ్యసమితి: విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు స్వదేశానికి తమ సంపాదనను పంపడంలో (రెమిటెన్స్) రికార్డు సృష్టించారు. భారత్‌కు ఈ తరహా నిధులు 2022లో 111.22 బిలియన్ డాలర్లు వచ్చాయి. దీనితో ఇంత భారీ స్థాయిని అందుకున్న తొలి దేశంగా భారత్ రికార్డులకు ఎక్కింది. నిజానికి రెమిటెన్సులు 100 బిలియన్ డాలర్లు దాటిన తొలి దేశంగా కూడా భారత్ నిలిచింది. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) ఈ మేరకు విడుదల చేసిన వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్ 2024లో కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...

• రెమిటెన్సులకు సంబంధించి భారత్ తరువాతి నాలుగు స్థానాల్లో మెక్సికో(61 బిలియన్ డాలర్లు), చైనా (51 బిలియన్ డాలర్లు), ఫిలిప్పైన్స్, ఫ్రాన్స్ నిలిచాయి. 2021లో చైనా స్థానాన్ని 2022లో మెక్సికో అధిగమించింది.

భారత్ పయనమిలా... (అంకెలు బిలియన్ డాలర్లలో)

2010	53.48
2015	68.91
2020	83.15
2022	111.22

• దక్షిణాసియా నుంచి చాలా పెద్ద సంఖ్యలో వలస కార్మికులు ఉన్నందున ఈ ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా రెమిటెన్స్‌కు సంబంధించి అతిపెద్ద మొత్తాలను పొందుతోంది. దక్షిణాసియాలో భారత్‌తోపాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు రెమిటెన్సులకు సంబంధించి టాప్–10 దేశాల్లో ఉన్నాయి. అంతర్జాతీయంగా పాకిస్తాన్ 30 బిలియన్ డాలర్లతో ఆరవ స్థానంలో ఉండగా, బంగ్లాదేశ్ 21.5 బిలియన్ డాలర్లతో ఎనిమిదవ స్థానంలో నిలుస్తోంది.

• 44.8 లక్షల మంది వలసదారుల గమ్యస్థాన దేశంగా భారతదేశం 13వ స్థానంలో నిలిచింది.

• విద్యార్థులను ఆకర్షించడంలో తొలి దేశంగా అమెరికా (8,33,000) ఉంది. తరువాతి స్థానాల్లో బ్రిటన్ (దాదాపు 6,01,000), ఆస్ట్రేలియా (దాదాపు 3,78,000), జర్మనీ (3,76,000 పైగా), కెనడా (దాదాపు 3,18,000) ఉన్నాయి.

ఎల్‌అండ్‌టీ దూకుడు

• రూ. 4,396 కోట్లు లాభం
• షేరుకి రూ. 28 డివిడెండ్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ ఇంజినీరింగ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్‌అండ్‌టీ) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం పుంజుకుని రూ. 4,396 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 3,987 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 59,076 కోట్ల నుంచి రూ. 68,120 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 28 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. గతేడాదిని పటిష్ట ఫలితాలతో ముగించినట్లు ఎల్‌అండ్‌టీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. ఈ కాలంలో 31% అధికంగా రూ. 3 లక్షల కోట్లకుపైగా కాంట్రాక్టులను పొందినట్లు తెలియజేశారు. వీటిలో 54 శాతం(రూ. 1,63,112 కోట్లు) అంతర్జాతీయ ఆర్డర్లుగా వెల్లడించారు. వెరసి ఆర్డర్ బుక్ విలువ రూ. 4.75 లక్షల కోట్లను తాకినట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు ఎన్ఎస్ఈలో 1.5% బలపడి రూ. 3,485 వద్ద ముగిసింది.

బిర్లా ఫెర్టిలిటీ చేతికి ఏఆర్ఎంసీ ఐవీఎఫ్



న్యూఢిల్లీ: సీకే బిర్లా గ్రూప్‌లో భాగమైన బిర్లా ఫెర్టిలిటీ అండ్ ఐవీఎఫ్ సంస్థ దక్షిణాది మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఏఆర్ఎంసీ ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్‌ను కొనుగోలు చేసింది. దీనితో కేరళ, కర్నాటక, తమిళనాడులో తమ కార్యకలాపాలు విస్తరించనుంది. క్లినిక్‌లను 100కు పెంచుకునేందుకు రూ. 500 కోట్లు వెచ్చించనున్నట్లు బిర్లా ఫెర్టిలిటీ వెల్లడించింది. ఏఆర్ఎంసీ ఐవీఎఫ్ 2009లో ఏర్పాటైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	500-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

భారత్ ఫోర్జ్ లాభం హైజంప్



న్యూఢిల్లీ: భారత్ ఫోర్జ్ చివరి త్రైమాసికం కన్సాలిడేటెడ్ నికర లాభం 78% దూసుకెళ్లి రూ. 227 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,629 కోట్ల నుంచి రూ. 4,164 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,469 కోట్ల నుంచి రూ. 3,844 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు షేరుకి రూ. 6.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి భారత్ ఫోర్జ్ నికర లాభం రూ. 508 కోట్ల నుంచి రూ. 910 కోట్లకు దూసుకెళ్లింది.

టాటా పవర్.. ప్లస్



న్యూఢిల్లీ: టాటా పవర్ చివరి త్రైమాసికం కన్సాలిడేటెడ్ నికర లాభం 11% పుంజుకుని రూ. 1,046 కోట్ల ను తాకింది. మొత్తం ఆదాయం రూ. 13,325 కోట్ల నుంచి రూ. 16,464 కోట్లకు జంప్‌చేసింది. షేరుకి రూ. 2 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు జులై 4 రికార్డ్ డేట్. పూర్తి ఏడాదికి టాటా పవర్ నికర లాభం రూ. 3,810 కోట్ల నుంచి రూ. 4,280 కోట్లకు బలపడింది. ఆదాయం సైతం రూ. 56,547 కోట్ల నుంచి రూ. 63,272 కోట్లకు ఎగసింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికం.

టీవీఎస్ మోటర్స్ స్పీడ్



న్యూఢిల్లీ: భారీ అమ్మకాల దన్నుతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో టీవీఎస్ మోటర్ కంపెనీ నికర లాభాలు 15 శాతం పెరిగి రూ. 387 కోట్లకు చేరాయి. ఆదాయం రూ. 8,031 కోట్ల నుంచి రూ. 10,042 కోట్లకు చేరింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాలు 22% పెరిగి రూ. 8.68 లక్షల యూనిట్ల నుంచి 10.63 లక్షల యూనిట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 1,686 కోట్ల లాభం, రూ. 39,145 కోట్ల ఆదాయం ప్రకటించింది.

హీరో మోటోకార్ప్.. పటిష్టం

• క్యూ4లో రూ. 943 కోట్లు
• షేరుకి రూ. 40 డివిడెండ్



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 943 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 811 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,434 కోట్ల నుంచి రూ. 9,617 కోట్లకు జంప్‌చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 40 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. అంతక్రితం మధ్యంతర డివిడెండ్ రూ. 100 చెల్లించిన సంగతి తెలిసిందే. మొత్తం వ్యయాలు సైతం రూ. 7,509 కోట్ల నుంచి రూ. 8,427 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో 13.92 లక్షల వాహనాలను విక్రయించింది. 2022–23 క్యూ4లో 12.7 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. కాగా.. పూర్తి ఏడాదికి హీరో మోటో నికర లాభం రూ. 2,800 కోట్ల నుంచి రూ. 3,742 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 34,158 కోట్ల నుంచి రూ. 37,789 కోట్లకు జంప్‌చేసింది. ఈ కాలంలో 56.21 లక్షల వాహనాలను విక్రయించింది. 2022–23లో 53.29 లక్షల యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఎన్ఎస్ఈలో హీరో మోటో షేరు 2.5% ఎగసి రూ. 4,588 వద్ద ముగిసింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఎమ్ఎస్ఆర్‌బీలో 158 ట్యూటర్ పోస్టులు

గుంటూరు జిల్లా మంగళగిరిలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎమ్ఎస్ఆర్‌బీ).. ప్రభుత్వ మెడికల్ కాలేజెస్ అండ్ టీచింగ్ హాస్పిటల్స్‌లో ఒప్పంద ప్రాతిపదికన ట్యూటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 158
» **డిపార్ట్‌మెంట్‌లు:** అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్.
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** నెలకు రూ.70,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.05.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024
» **వెబ్‌సైట్:** https://apmsrb.ap.gov.in/msrb

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఎగ్జామినేషన్ జూన్-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే జేఆర్‌ఎఫ్‌తోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) జూన్–2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **సబ్జెక్టులు:** కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ సబ్జెక్టుల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ తత్సమాన ఉత్తీర్ణులు/నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్ఎంఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ, ఎస్టీ, థర్డ్ జెండర్, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు సాధించాలి.
» **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు జూన్ 2024 నాటికి 30 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళా అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ(నాన్ క్రిమిలేయర్)లకు మూడేళ్ల గరిష్ట వయోసడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ /పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.
» **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రంలో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.05.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.05.2024
» **ఫీజు చెల్లింపు చివరితేది:** 23.05.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 25.05.2024 నుంచి 27.05.2024 వరకు.
» **పరీక్షల తేదీలు:** 25.06.2024, 26.06.2024, 27.06.2024.
» **వెబ్‌సైట్:** https://csirnet.nta.ac.in

డీఎమ్ఈపీ, విజయవాడలో 241 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, జనరల్ హాస్పిటల్ క్యాంపస్, విజయవాడ.. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 241
» **విభాగాలు:** అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డీవీఎల్, సైకియాట్రీ, జనరల్ సర్జరీ,ఆర్థోపెడిక్స్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, ఎండీతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 44 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.70,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.05.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.05.2024
» **వెబ్‌సైట్:** https://dme.ap.nic.in

ఇండియన్ ఆర్మీలో 30 డెంటల్ కార్ప్స్ పోస్టులు

ఇండియన్ ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ద్వారా డెంటల్ కార్ప్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **అర్హత:** బీడీఎస్/ఎండీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి గరిష్ట వయో పరిమితి 45 ఏళ్లకు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.61,300 నుంచి రూ.1,20,900.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ స్క్రీనింగ్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.06.2024
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

నేరాల గుట్టువిప్పే.. ఫోరెన్సిక్ సైన్స్!

నేరాల నిర్ధారణలో.. ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు పెరుగుతున్న తరుణంలో.. నేరస్తులను గుర్తించే ఫోరెన్సిక్ నిపుణులకు డిమాండ్ నెలకొంది. ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు పూర్తి చేసుకుంటే.. నేరాల గుట్టు విప్పే నైపుణ్యం సొంతమవుతుంది. దీంతో విస్తృత కెరీర్ అవకాశాలు లభిస్తాయి. ఈ కోర్సులను నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ అందిస్తోంది. నేషనల్ ఫోరెన్సిక్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తోంది. ఇటీవల 2024 సంవత్సరానికి సంబంధించి ఎన్ఎఫ్ఏటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎన్ఎఫ్ఏటీ 2024 వివరాలు, అందిస్తున్న కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..



» నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల
» కొనసాగుతున్న ఎన్ఎఫ్ఏటీ–2024 దరఖాస్తు ప్రక్రియ
» బ్యాచిలర్, పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో పలు కోర్సులు
» ఈ కోర్సులతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొలువులు

ఎన్ఎఫ్ఎస్‌యూ

ఫోరెన్సిక్ సైన్స్ విభాగానికి అవసరమైన నిపుణులను తీర్చిదిద్దే ఉద్దేశంతో.. కేంద్ర హోంశాఖ పరిధిలో ప్రత్యేకంగా నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీని నెలకొల్పారు. ఫోరెన్సిక్ సైన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్రిమినాలజీ, సైకాలజీ, బిహేవియరల్ సైన్స్ తదితర విభాగాల్లో స్కిల్స్‌ను అందించేలా పలు కోర్సులు అందుబాటులోకి తెచ్చారు.

9 క్యాంపస్‌లు.. 2,462 సీట్లు

మూడేళ్ల క్రితం ఏర్పాటైన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీకి తొమ్మిది (గుజరాత్, ఢిల్లీ, గోవా, త్రిపుర, భోపాల్, పుణె, గువహటి, మణిపూర్, ధర్వాడ్) క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిద్వారా పీహెచ్‌డీ, పీజీ, బీటెక్, బీఎస్సీ, బీఏ, ఎంబీఏ, లా, క్రిమినాలజీ, సైకాలజీ తదితర వినూత్న కోర్సులు అందిస్తున్నారు. పీహెచ్‌డీ మొదలు పీజీ డిప్లొమా వరకూ.. పలు కోర్సుల్లో 2,462 సీట్లు ఉన్నాయి.

కోర్సులు

- బీటెక్,ఎంటెక్, ఎమ్మెస్సీ,ఎంఏ,బీబీఏ–ఎంబీఏ, ఎంబీఏ,ఎల్ఎల్‌బీ,ఎల్ఎల్ఎం,ఎం.ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ తదితర కోర్సుల్లో నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ ప్రవేశాలు కల్పిస్తోంది.
- **అర్హతలు:** ఆయా కోర్సులను అనుసరించి ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత ఉండాలి.

ఎన్ఎఫ్ఏటీ ప్రవేశం

ఎన్ఎఫ్ఎస్‌యూలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నేషనల్ ఫోరెన్సిక్ అడ్మిషన్ టెస్ట్‌లో స్కోర్‌ను ప్రాతిపదికగా తీసుకుంటారు. ఈ ఎంట్రన్స్ టెస్ట్‌ను ఆయా కోర్సులను అనుసరించి సంబంధిత సబ్జెక్ట్‌లలో వంద ప్రశ్నలు–వంద మార్కులకు నిర్వహిస్తారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. ఈ పరీక్షకు లభించే వ్యవధి గంటన్నర. పీజీ డిప్లొమా కోర్సులకు నిర్దేశిత విద్యార్హతల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. ఈ కోర్సుల అభ్యర్థులు ఎన్ఎఫ్ఏటీకి హాజరవ్వాల్సిన అవసరం లేదు. ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులకు ఎంట్రన్స్ టెస్ట్‌తోపాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు.

యూనివర్సిటీల స్థాయి

ఆయా రాష్ట్రాల్లో యూనివర్సిటీల అనుబంధ కళాశాలల్లోనూ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌ను పలు ఇన్‌స్టిట్యూట్‌లు అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి తెలంగాణలో టీఎస్‌సీపీగెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీపీజీఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. నల్సార్ హైదరాబాద్‌లో ఎంఏలో క్రిమినల్ లా అండ్ ఫోరెన్సిక్ సైన్స్ స్పెషలైజేషన్ అందుబాటులో ఉంది.

సర్కారీ ఉద్యోగాలు!

- ప్రస్తుతం ఎన్ఎఫ్ఎస్‌యూ అందిస్తున్న కోర్సులను పూర్తి చేసుకున్న వారు కార్పొరేట్ రంగంలో, ప్రభుత్వ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలలో కొలువులు సొంతం చేసుకునే అవకాశముంది.
- ప్రభుత్వ రంగంలో సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ఫింగర్ ప్రింట్ బ్యూరోలు, ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, సీబీఐ, ఐబీ వంటి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు దక్కించుకునే వీలుంది.
- ప్రైవేట్ రంగంలో ఫార్మాస్యుటికల్ సంస్థలు, ఆస్పత్రులు, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. వీటితో పాటు విద్యా రంగంలోనూ అధ్యాపకులుగా కెరీర్ ప్రారంభించొచ్చు.

జాబ్ ప్రొఫైల్స్ ఇవే

- **క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్:** ఏదైనా నేరం జరిగినప్పుడు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగం ఇది. దీనిలో భాగంగా ఘటనా స్థలంలో ఆధారాల సేకరణ, నేరం జరిగిన తీరును అంచనా వేయడం, ఆధారాలను ల్యాబరేటొరీల్లో శాస్త్రీయంగా విశ్లేషించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్:** నేరస్తులు లేదా నిందితుల మానసిక పరిస్థితిని విశ్లేషించడం, వాటి ఆధారంగా విచారణ విషయంలో వారికున్న మానసిక సన్నద్ధతకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారు. దీని ఆధారంగా సదరు విచారణ చేపట్టే విషయంలో నిర్దిష్ట చర్యలు తీసుకుంటారు.
- **ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్:** హత్యలు జరిగినప్పుడు ముఖ్యంగా ఎలాంటి భౌతిక దాడుల ఉనికి లేని సందర్భాల్లో హతులు ఏదైనా విష ప్రయోగంతో చనిపోయారా? లేదంటే ఇతర డ్రగ్స్ వినియోగం కారణంగా మరణించారా? వంటి విషయాలను పరిశీలిస్తారు.
- **ఫోరెన్సిక్ స్పీచ్ ఎక్స్‌పర్ట్స్:** ఏదైనా నేరం జరిగినప్పుడు.. సదరు ఘటనా స్థలంలో లభించిన పత్రాలు, కెమెరా ఫుటేజ్‌లు, ఆడియో టేప్‌లను పరిశీలించడం, వాటి ఆధారంగా రాసిన వారిని, మాట్లాడిన వారిని గుర్తించడం వంటి విధులు నిర్వర్తిస్తారు. దీని ద్వారా అసలు, నకిలీలను గుర్తించి వాటికి సంబంధించి నివేదికలు రూపొందించడం ప్రధాన విధులుగా ఉంటాయి.
- **పాథాలజిస్ట్:** అనుమానాస్పద మృతుల విషయంలో పోస్ట్‌మార్టం ఆధారంగా సహజ మరణమా? లేదా హత్యకు గురయ్యారా లేదా ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనా? అనే విషయాలను పాథాలజిస్టులు గుర్తిస్తారు.
- **ఫోరెన్సిక్ ఆడిటింగ్:** ఇటీవల కాలంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో కీలకంగా నిలుస్తున్న మరో హోదా.. ఫోరెన్సిక్ ఆడిటింగ్. ఆర్థిక అవకతవకలకు పాల్పడిన సంస్థలకు సంబంధించిన పత్రాలను విశ్లేషించడం, అవకవతకలు జరిగిన విభాగాలను లేదా వ్యక్తులను గుర్తించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

వేతనాలు

ఫోరెన్సిక్ విభాగంలో కొలువులు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ రంగంలో అడుగుపెట్టిన వారికి నెలకు రూ.50 వేల వరకు వేతనం లభిస్తోంది. పీజీ, పీహెచ్‌డీ పట్టాలతో ఫోరెన్సిక్ లేబొరేటరీల్లో పని చేసే వారికి రూ.లక్ష వరకు వేతనాన్ని అందిస్తున్నారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 10
- విద్యార్హతల అప్‌లోడ్ చివరి తేదీ: 2024, జూన్ 1
- ఎన్ఎఫ్ఏటీ పరీక్ష తేదీ: 2024, జూన్ 15, 16
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://nfsu.ac.in/admission



ఎండిపోయిన 'సముద్రం'

కనగల్ (నల్లగొండ): 1300 ఎకరాల విస్తీర్ణం.. 91 గ్రామాలకు తాగునీరు.. 1600 ఎకరాలకు సాగునీరు అందించేది. చుట్టూ 10 కిలోమీటర్ల మేర భూగర్భ జలాల పెంపునకు దోహద పడేది.. వేలాది మంది మత్స్యకారులకు ఉపాధి కల్పించేది. అదే నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలోని మైల సముద్రం చెరువు. ఇప్పుడీ చెరువు ప్రస్తుత ఎండలకు పూర్తిగా ఎండిపోయి నెర్రెలు వారింది. 20 ఏళ్ల తర్వాత చెరువు ఎండిపోయిందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. పూడికను తొలగిస్తే చెరువు సామర్థ్యం పెరుగుతుందని చెబుతున్నారు.

జూన్ 15 వరకు 'టీఎస్ విద్యాధన్ స్కాలర్‌షిప్' దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల ఉన్నత విద్యకు సహకారం అందించడం కోసం రూపొందించిన 'టీఎస్ విద్యాధన్ స్కాలర్‌షిప్–2024'కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ తరగతిలో 90 శాతం మార్కులు లేదా 9 సీజీపీఏ పొందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించడానికి జూన్ 15 చివరి తేదీ అని, ఈ అవకాశం పొందాలనుకునే ఇంటర్, డిప్లొమా విద్యార్థులు www.vidyadhan.org లేదా విద్యాధన్ హెల్ప్‌డెస్క్ 91 9663517131 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ సొసైటీలో చేరాలి

- ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో చేరి సమాజానికి సేవలందించాలని రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులకు, వలంటీర్లకు ఆయన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా బుధవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సమయాభావంతో పాల్గొనలేకపోయిన సీపీ రాధాకృష్ణన్ తన సందేశాన్ని వీడియో రూపంలో పంపించారు. ఆయన జార్ఖండ్ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది రెడ్‌క్రాస్ డే థీమ్ 'మానవ త్వాన్ని సజీవంగా ఉంచడం'అని, సమాజ సేవ మానవత్వాన్ని పెంపొందిస్తుందని గవర్నర్ పేర్కొ న్నారు. గవర్నర్ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్‌పర్సన్ అజయ్ మిశ్రాలు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ప్రతినిధులకు, వలంటీర్లకు ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మిల్లెట్ స్నాక్స్ ఔట్

- ఈనెల 15 నుంచి టీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సుల్లో నిలిపివేత..
- టికెట్ చార్జీలో రూ.30 తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: టీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు మిల్లెట్ స్నాక్స్ అందించొద్దని సంస్థ నిర్ణయించింది. గత సంవత్సరం అక్టోబరు పదో తేదీ నుంచి మిల్లెట్స్‌తో రూపొందించిన స్నాక్స్ ప్యాకెట్ రాజధాని, గరుడ, లహరి ఏసీ బస్సుల్లో అందిస్తున్నారు. ఈమేరకు మిల్లెట్స్‌తో స్నాక్స్ తయారుచేసే సంస్థతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పుడు ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈనెల 15వ తేదీ తొలి సర్వీసు నుంచి ఇక ఏసీ బస్సు ప్రయాణికులకు మిల్లెట్ స్నాక్స్ పంపిణీ నిలిపివేయనున్నారు. ఆ రూపంలో ప్రతి టికెట్‌పై రూ.30 చొప్పున అదనంగా వసూలు చేయటాన్ని కూడా ఆపేయనున్నారు. దీంతో ఏసీ బస్సుల్లో టికెట్ ధరలు రూ.30 చొప్పున తగ్గుతాయి.

రుచి లేకపోవటం.. బస్సుల్లో అపరిశుభ్రత పెరగటం

ఏసీ బస్సుల్లో అందిస్తున్న మిల్లెట్ స్నాక్స్ ఏమాత్రం రుచిగా ఉండటం లేదంటూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులున్నాయి. వాటి పేరుతో తమ నుంచి రూ.30 చొప్పున అనవసరంగా వసూలు చేస్తున్నారని, రుచి లేని వాటి కోసం తాము చెల్లించే డబ్బులు దండగ ఖర్చుగానే పరిగణిస్తున్నామని వారి నుంచి ఫిర్యాదులున్నాయి. రుచిలేకపోవంతో ఆ స్నాక్స్‌ను బస్సుల్లోనే పడేస్తున్నారు. ఒక పెద్ద ప్లాస్టిక్ కవర్‌లో మూడు చిన్న కవర్లుంటాయి. అందులో ఒకదానిలో కారపూస, మరో దానిలో మిల్లెట్ స్టిక్స్, మరో దానిలో చిక్కి(పల్లీపట్టి) ఉంటాయి. ఏసీ బస్సులకు కిటికీ అద్దాలు తెరిచే వీలు లేకపోవటంతో, ఈ నాలుగు కవర్లను బస్సుల్లోనే పడేస్తున్నారు. స్నాక్స్ రుచిగా లేకపోవటంతో వాటిని పూర్తిగా తినకుండా అలాగే పడేస్తుండటంతో, అవి బస్సంతా చిందర వందరగా విస్తరిస్తున్నాయి. ప్రయాణికులు తొక్కు తుండటంతో అవి పొడిపొడిగా మారి ఫ్లోర్‌పై ఉండే కార్పెట్‌లో చిక్కుకుంటున్నాయి. కొన్ని సీటు సందుల్లో ఉండిపోతున్నాయి. దీంతో వాటిని శుభ్ర పరచటం కూడా ఇబ్బందిగా మారింది. ఏసీ ప్రభా వంతో ఆ పొడిలో క్రమంగా ఫంగస్ ఉద్భవించే ప్రమాదముందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక స్నాక్స్ ప్యాకెట్లు పంపిణీ చేయడానికి ప్రత్యేకంగా అటెండర్లు కూడా లేకపోవటంతో డ్రైవర్లే ఇవ్వాల్సి వస్తోంది. వీటన్నింటిని గమనించిన అధికారులు ఇటీవల ఎండీకి నివేదిక అందజేశారు. దానిని పరిశీలించి ఆయన స్నాక్స్ పంపిణీ నిలిపివేతకు నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికుల ఆదరణ పెంచుకునేందుకు ప్రారంభించిన ఈ విధానం, చివరకు ప్రయాణికుల వ్యతిరేకతతో కేవలం ఏడు నెలలకే ఆగిపోవాల్సి వచ్చింది.

టీఎస్ ఐసెట్‌కు 78,920 దరఖాస్తులు

కేయూక్యాంపస్: టీఎస్ ఐసెట్‌కు బుధవారం వరకు 78,920 దరఖాస్తులు వచ్చాయని ఐసెట్ కన్వీనర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. గత ఏడాది 75,530 దరఖాస్తులు రాగా ఇప్పటికే గత ఏడాదికంటే 3,390 దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని చెప్పారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024–2025లో ప్రవేశాలకు టీఎస్ ఐసెట్‌కు అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు గడువు ఈనెల 7వ తేదీతో ముగిసిందన్నారు. బుధవారం నుంచి రూ.250 అపరాధ రుసుముతో ఆన్‌లైన్‌లో ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 27వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే ఆన్‌లైన్‌లో ఈ నెల 17 నుంచి 20వరకు సరిచేసు కునే అవకాశం ఉందని కన్వీనర్ తెలిపారు. ఈనెల 28 నుంచి అభ్య ర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

రెండ్రోజులు మోస్తరు వానలు!

వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్

- అత్యధికంగా బాచుపల్లిలో 10.8 సెంటీమీటర్ల వర్షం
- బుధవారం సగటున 1.24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- రాష్ట్రంలో తగ్గిన గరిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. ఈ మేరకు రాష్ట్రానికి ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోందని తెలిపింది. దీని ప్రభావంతో గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని వివరించింది. బుధవారం రాష్ట్రంలో చాలాచోట్ల మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.24 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైందని ప్రణాళికా విభాగం వివరించింది. అత్యధికంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సగటున 4.54 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, హైదరాబాద్ జిల్లాలో సగటున 4.42 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, కరీంనగర్, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నల్లగొండ, ములుగు జిల్లాల్లో సగటున 2 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బాచుపల్లిలో 10.8 సెంటీమీటర్లు, ఆ తర్వాత శేరిలింగంపల్లిలో 8.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జకొరలో 42.9 డిగ్రీల సెల్సియస్

మంగళవారం, బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వానలు కురవడంతో గరిష్ట ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. చాలాచోట్ల సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మేర తక్కువగా నమోదయ్యాయి. అధికంగా నిజామాబాద్ జిల్లా జకొరలో 42.9 డిగ్రీల సెల్సియస్, కొరట్‌పల్లిలో 42.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం నుంచి కాస్త తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, కొన్నిచోట్ల సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ సూచించింది.

రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సెం.మీ.లలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
హైదరాబాద్	షేక్‌పేట్	8.12
నల్లగొండ	చండూరు	6.52
హైదరాబాద్	అంబర్‌పేట	6.44
యాదాద్రి భువనగిరి	భువనగిరి	6.28
మంచిర్యాల	వేమనపల్లి	6.0
మహబూబ్‌నగర్	బాలానగర్	5.64
ఆసిఫాబాద్	వాంకిడి	5.44

ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	41.1	మెదక్	38.2
ఆదిలాబాద్	41.0	నల్లగొండ	38.0
ఖమ్మం	39.0	విశాఖపట్నం	37.2
భద్రాచలం	38.8	విజయవాడ	37.0
మహబూబ్‌నగర్	38.8	హైదరాబాద్	36.8
రామగుండం	38.6	హనుమకొండ	36.0

దలైలామాకు పీవీ మెమోరియల్ అవార్డు



సాక్షి, న్యూఢిల్లీ: ప్ర ముఖ బౌద్ధ గురువు దలైలా మాకు ప్రతి ష్టాత్మక పీవీ నరసింహారావు మెమోరియల్ అవార్డును అందించారు. బుధవారం ధర్మశాలలోని దలైలామా నివాసంలో పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం జరిగింది. పీవీ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఆల్ ఇండియా యాంటీ టెర్ర రిస్ట్ ఫ్రంట్ చైర్మన్ మణీందర్‌జీత్ సింగ్ బిట్టా, పీవీ మనవడు పీవీఆర్ కశ్యప్, పీవీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీవీ స్మారక అవార్డును అందుకోవడంపై దలైలామా హర్షం వ్యక్తం చేశారు. శాంతి ద్వారానే ప్రపంచం మనుగడ సాగించగలదని ఈ సందర్భంగా దలైలామా అన్నారు. భారతరత్న పీవీ నరసింహారావు ప్రపంచశాంతి కోసం చేసిన సేవలను ఆయన కొనియాడారు.

క్రికెట్ మ్యాచ్ వీక్షించిన అనాథలు

- దగ్గరుండి తీసుకెళ్లిన సీఎం కుమార్తె నైమిషా



సాక్షి, హైదరాబాద్: లక్నో సూపర్ జెయింట్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆడిన ఐపీఎల్–టీ20 మ్యాచ్‌ను 30 మంది అనాథలు వీక్షించారు. బీఎన్‌రెడ్డి నగర్‌లోని సేవ్ చారిట బుల్ ఫౌండేషన్, ఎల్బీనగర్ అనాథ విద్యార్థి గృహానికి చెందిన 30 మంది పిల్లలకు ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ వీక్షించే అవకాశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కల్పించారు. ఆయన సూచన మేరకు కుమార్తె నైమిషా వారిని క్రికెట్‌మ్యాచ్‌కు తీసుకెళ్లే కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు.

అక్రమ వ్యాపారులపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉక్కుపాదం

రూ.1.73 కోట్ల విలువైన నల్లమందు స్వాధీనం

నాలుగు నెలల్లో నాటుసారాపై 9,145 కేసులు ● అక్రమ మద్యంపై 302 కేసులు

సాక్షి, హైదరాబాద్: గంజాయి, ఇతర మత్తుపదార్థాలను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఉక్కుపాదం మోపుతోంది. గత నాలుగు నెలల్లో రూ.7.20 కోట్లు విలువ చేసే మత్తుపదార్థాలను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నాటుసారాకు సంబంధించి 9,145 కేసులు నమోదు చేసి 4,010 మందిని నిందితులుగా చేర్చామని తెలిపారు. ఈ దాడుల్లో మొత్తం రూ.39 కోట్ల విలువైన నాటుసారా, తయారీ సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు సుమారు 47,640 లీటర్ల గుడుంబాను సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అక్రమ మద్యం సరఫరా చేస్తున్న వారిపై దాడులు చేసి 302 కేసులు నమోదు చేసి 35 వాహనాలను సీజ్ చేశామని, 3,740 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నా మని తెలిపారు. కల్తీకల్లు స్థావరాలపై దాడులు చేసి ఆల్ప్రాజోలోమ్, డైజోఫామ్, గంజాయి చాక్లెట్లు, డ్రై గంజాయి, ఎండీఎంఏ, హెరాయిన్, ఛరస్, ఓపీఎంలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 133 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు.

నల్లమందు, గుట్కా తయారీ ప్రాంతాలపై దాడులు

శంషాబాద్‌లో రెండు రోజుల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిర్వహించిన దాడిలో రూ.1.73 కోట్ల విలువ చేసే నల్లమందు తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని కమలాసన్‌రెడ్డి చెప్పారు. బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో ఎలాంటి అనుమతులు లేకుండా తయారు చేస్తున్న గుట్కాలు, వాటి యంత్రాలను, కొన్ని మూలికలు, నల్లమందును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.